

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 276

శుక్రవారం
27-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మన్మోహన్ అస్తమయం



ఆర్థిక సంస్కరణల సారథి

రెండుసార్లు దేశ ప్రధాని... మచ్చలేని రాజనీతిజ్ఞుడు

రాష్ట్రపతి, ప్రధాని తదితరుల దిగ్భ్రాంతి..

దేశవ్యాప్తంగా ఏడు రోజులు సంతాపం

న్యూఢిల్లీ: ఆర్థిక సంస్కరణల సారథి, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ (92) ఇక లేరు. వయో సంబంధిత సమస్యలతో గురువారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. కొన్నేళ్లుగా తీవ్ర అస్వస్థతతో ఉన్న ఆయన గురువారం ఢిల్లీలోని తన నివాసంలో చికిత్స పొందుతూ ఉన్నట్టుండి స్పృహ తప్పి పడిపోయారు. దాంతో అత్యంత విషమ స్థితిలో రాత్రి 8 గంటల వేళ హుటాహుటిగా ఎయిమ్స్ ఎమర్జెన్సీ విభాగానికి తరలించారు. ''అన్నిరకాలుగా అత్యవసర చికిత్స అందించినా లాభం లేకపోయింది. 9.51 గంటల ప్రాంతంలో మన్మోహన్ తుదిశ్వాస విడిచారు'' అని ఎయిమ్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. వివాదరహితునిగా, అత్యంత సౌమ్యునిగా, మృదుభాషిగా, మచ్చలేని రాజనీతిజ్ఞుడిగా పేరొందిన మన్మోహన్ మృతి పట్ల రాజకీయ తదితర రంగాల ప్రముఖులు దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు. మన్మోహన్ అస్వస్థత గురించి తెలియగానే సోనియా తన కుమార్తె ప్రియాంకతో కలిసి హుటాహుటిన ఎయిమ్స్‌కు చేరుకున్నారు. మన్మోహన్ పార్థివదేహాన్ని ఆయన నివాసానికి తరలించారు. ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయన మరణ వార్త తెలిసి సీడబ్ల్యూసీ భేటీ కోసం కర్ణాటకలోని బెల్గావీలో ఉన్న ఖర్గే, రాహుల్ తదితరులంతా హస్తిన బయల్దేరారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు రోజుల పాటు సంతాపం ప్రకటించింది. మన్మోహన్ అంత్యక్రియలను పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరపాలని ఆదేశించింది. కాంగ్రెస్ కూడా వారం పాటు పార్టీ కార్యక్రమాలన్నీ రద్దు చేసుకుంది. కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఉదయం సమావేశమై మన్మోహన్‌కు ఘనంగా నివాళులు అర్పించనుంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 దాకా మన్మోహన్ రెండుసార్లు ప్రధానిగా చేశారు. ఆయనకు భార్య గురుచరణ్ కౌర్, ముగ్గురు కుమార్తెలున్నారు.

> “శాంతి, శ్రేయస్సు విడదీయలేనివి. శాంతి లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. అదే సమయంలో అభివృద్ధి లేకుంటే శాంతి ఉండదు. భారతదేశ అసలైన భవితవ్యం దాని సహనశీలత, సమ్మిళిత, సమానత్వ సమాజంగా ఎదగగల సామర్థ్యంలో దాగి ఉంది.

> 1991లో మేం చేపట్టిన సంస్కరణలు ఎవరినీ సంతోషపరిచేందుకు కాదు. దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడంతోపాటు స్థిరమైన వృద్ధికి పునాది వేయడమే వాటి ఉద్దేశం.

> మన ప్రజల తలసరి ఆదాయం గురించి కంటే వారి ఆదాయాల్లోని అసమానతల గురించే నాకు ఎక్కువ ఆందోళన ఉంది.

> మన దేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. కానీ వాటిని ప్రతిసారీ మనం మరింత బలంగా, మరింత ఐక్యంగా, మరింత పట్టుదలతో ఎదుర్కొని బయటపడ్డాం. మన ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కానీ కష్టపడేతత్వం, చిత్తశుద్ధి, సరైన విధానాలతో మనం మనుగడ సాగించగలం.”

ఆర్థిక స్వేచ్ఛకు ఆద్యుడు

- 1972 నుంచే ఆర్థిక వ్యవస్థ సవాళ్లకు చికిత్స
- ప్రధాన ఆర్థిక సలహాదారుగా అధ్యాయం మొదలు
- ప్రణాళిక సంఘం, ఆర్‌బీఐతో పాటు మంత్రిగా... ప్రధానిగా
- అభివృద్ధిలో అందరినీ భాగం చెయ్యాలన్నదే సింగ్ సంకల్పం
- సంస్కరణల పితామహుడిగా దేశంపై చెరగని ముద్ర

మన్మోహన్ సింగ్ చేసిన వంద రోజుల మ్యాజిక్

ఆర్థిక చాణక్యుడి... అక్షర యానం

ప్రపంచం మెచ్చిన రాజనీతిజ్ఞుడు

మన్మోహన్ తెచ్చిన కీలక చట్టాలు

- వివరాలు 6, 12 పేజీల్లో

నేడు ప్రభుత్వ సెలవు

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు శుక్రవారం సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రాష్ట్రంలో వారం రోజులు సంతాప దినాలను పాటించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

జన గణనలో కులగణన చేపట్టాలి

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన
- ఏకగ్రీవంగా ఆమోదించిన సీడబ్ల్యూసీ

- వివరాలు 3లో

బీఆర్ నాయుడుపై సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు

టీవీ–5లో కోర్టు లైవ్ స్ట్రీమింగ్ వీడియోను ప్రదర్శించారన్న న్యాయవాది ఇమ్మానేని

2లో



సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరిస్తున్న సినీ నటుడు నాగార్జున. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు

మరోస్థాయికి టాలీవుడ్!

అంతర్జాతీయంగా బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని నిర్ణయం

సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి


- ఐటీ, ఫార్మాతో పాటు చిత్ర పరిశ్రమ కూడా మాకు ముఖ్యమే
- త్వరలో హైదరాబాద్‌లో అంతర్జాతీయ సినీ సదస్సు... చిత్ర పరిశ్రమ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం
- శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగినా సహించం... తెలుగు సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రి భేటీ
- గైర్హాజరైన అగ్ర నటుడు చిరంజీవి

సాక్షి, హైదరాబాద్: తెలుగు చలనచిత్ర పరిశ్రమను మరో స్థాయికి తీసుకెళ్లి అంతర్జాతీయంగా ఒక బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఐటీ, ఫార్మాతో పాటు చిత్ర పరిశ్రమ కూడా తమకు ముఖ్యమేనన్నారు. విశ్వనగరాల్లో హైదరాబాద్ అత్యుత్తమమైనదని, హాలీవుడ్, బాలీవుడ్‌లు హైదరాబాద్‌కు తరలివచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలో హైదరాబాద్‌లో భారీ అంతర్జాతీయ సినీ సదస్సు ఏర్పాటు చేసి ఇతర చిత్ర పరిశ్రమలను ఆకట్టుకునే ఏర్పాట్లు చేస్తామన్నారు. సంధ్య థియేటర్ ఘటన నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో ▶

గ్రూప్‌-1 మెయిన్స్ ఫలితాలకు లైన్‌క్లియర్

పరీక్షల నిర్వహణలో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు




- పిటిషన్లు ఆలస్యంగా వేయడాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- ప్రిలిమ్స్ ఫలితాలు వచ్చాక జీవోను సవాలు చేయడం సరికాదని వ్యాఖ్య....మొత్తం ఏడు పిటిషన్లు కొట్టివేత
- తీర్పు వెలువరించిన జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌–1 మెయిన్స్ ఫలితాల వెల్లడికి లైన్‌క్లియర్ అయ్యింది. రాష్ట్రంలో కీలక పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం చేపట్టిన పరీక్షల నిర్వహణలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. రిజర్వేషన్ల అంశం తేలేవరకు మెయిన్స్ పరీక్షల ఫలితాలు ప్రకటించవద్దని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీఎస్‌పీఎస్సీ)ను ఆదేశించాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చింది. పిటిషన్ల దాఖలులో ఆలస్యాన్ని ప్రస్తావించిన ధర్మాసనం.. ఫిబ్రవరిలో తాజా నోటిఫికేషన్ ఇస్తే ఇందుకు సంబంధించిన జీవో 29 ప్రతి అప్‌లోడ్ కాలేదన్న కారణంతో ఆలస్యంగా పిటిషన్లు దాఖలు చేయడాన్ని తప్పుబట్టింది. ప్రిలిమ్స్ ఫలితాలు వెల్లడించిన తర్వాత జీవోను సవాల్ చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 226 ప్రకారం తమకున్న విస్తృతాధికారాల మేరకు ఉత్తర్వులు వెలువరుస్తామని స్పష్టం చేసింది. రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి. గ్రూప్‌–1

మిగతా 3వ పేజీలో ▶

ఇన్‌సర్వీస్ డాక్టర్ల 'పీజీ' ఆశలు అడియాసలేనా?

ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదివి తెలంగాణలో ఇన్‌సర్వీస్ డాక్టర్లుగా ఉన్న వారి పరిస్థితి దోలాయమానంలో..



- 148, 149 జీవోలపై హైకోర్టు తీర్పు, సుప్రీంకోర్టులో అప్పీళ్లతో వారిలో ఆందోళన... తెలంగాణలో వైద్య విద్య అభ్యసించిన వారంతా పీజీకి అర్హులన్న హైకోర్టు
- ఇతర రాష్ట్రాల్లో వైద్య విద్య చదివిన తెలంగాణ వాళ్లు అనర్హులని వెల్లడి... న్యాయం చేయాలని సర్కార్‌ను కోరిన ఇన్ సర్వీస్ కోటా వైద్యులు

సాక్షి, హైదరాబాద్: నీట్‌– పీజీ వైద్య ప్రవేశాలకు సంబంధించిన గందరగోళానికి తెరపడడం లేదు. స్టేట్‌పూల్ కోటాలోని పీజీ సీట్లు పూర్తిస్థాయిలో తెలంగాణ వాళ్లకే చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తెచ్చిన జీవోలు 148, 149పై మొదలైన అలజడి ఆగడం లేదు. జీవో 148(అల్లోపతి), 149 (ఆయుర్వేదం, హోమియోపతి) ద్వారా మెడికల్ పీజీలో అడ్మిషన్లు పొందేందుకు నిర్ణయించిన స్థానికత అంశంపై పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 'తెలంగాణలో ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ చదివిన వారంతా ప్రెసిడెన్షియల్ ఆర్డర్–1974 ప్రకారం 'లోకల్ ఏరియా' పరిధిలోకి వస్తారని, వారు పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు అర్హులేనని హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, జనవరి 7న విచారణకు రానుంది. ఈ వివాదం కొనసాగుతుండగానే... తెలంగాణ స్థానికులుగా ఉండి ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదివి... ఇన్‌సర్వీస్ డాక్టర్లుగా రాష్ట్రంలో సేవలందిస్తున్న డాక్టర్ల అంశం తెరపైకి వచ్చింది. తెలంగాణలో పుట్టి పెరిగి ఇంటర్మీడియెట్ వరకు

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



వ్యతిరేక కార్యకలాపాలు సాగించినందుకు ఎలాగూ దేశ బహిష్కరణ చేద్దామనుకున్నాం కదా! చేశామని అనుకుంటే పోలా!

'పాలమూరు'పై నీలినీడలు



మళ్లీ తెరపైకి ప్రాజెక్టుకు నీటి కేటాయింపుల సమస్య

- డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ వెనక్కి పంపడంతో పరిస్థితి జటిలం
- కృష్ణా ట్రిబ్యునల్‌–2 నిర్ణయంపై ఆధారపడిన ప్రాజెక్టు భవితవ్యం
- ఇప్పటికే పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్:

ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు వరప్రదాయిని పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రాజెక్టుకి నీటి కేటాయింపులను ప్రశ్నిస్తూ తాజాగా డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తిప్పిపంపడంతో ప్రాజెక్టు సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. ఇప్పటికే తీవ్ర ఉల్లంఘనల ఆరోపణలతో పర్యావరణ అనుమతులిచ్చేందుకు కేంద్రం ససేమిరా నిరాకరిస్తుండగా, దీనికి నిధులు, పెండింగ్ బిల్లుల సమస్య తోడుకావడంతో ప్రాజెక్టు నిర్మాణం నీరసించిపోయింది. తాజాగా నీటి కేటాయింపుల అంశం తెరపైకి రావడంతో ప్రాజెక్టు భవితవ్యమే ప్రశ్నార్థకంగా మారింది.

ట్రిబ్యునల్ ఏమంటుందో..?

పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తే దానికి బదులుగా సాగర్ ఎగువ రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకునే అవకాశాన్ని దశాబ్దాల కిందట గోదావరి ట్రిబ్యునల్ కల్పించింది. ఈ 80 టీఎంసీల్లో మహారాష్ట్ర, కర్ణాటకలు 35 టీఎంసీలు వాడుకోగా, మిగిలి ఉన్న 45 టీఎంసీలు తమవేనని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కొట్లాడుకుంటున్నాయి. ఈ 45 టీఎంసీలకు తోడుగా మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు చేసిన మరో 45 టీఎంసీలను కలిపి మొత్తం 90 టీఎంసీల జలాలను

మిగతా 5వ పేజీలో ▶

కాంగ్రెస్ ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీ



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తమ పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ధ్వజం


సాక్షి, హైదరాబాద్: రేవంత్ పాలనలో ఇందిరమ్మ రాజ్యం పేరిట ఇచ్చిన ఆరు గ్యారంటీలను అటకెక్కించి.. ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల్లో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్‌ఎస్ తరఫున ప్రశ్నిస్తున్నందునే ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై కక్షతో అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న ప్రభుత్వ వ్యతిరేకతను తట్టుకోలేక నిర్బంధం, అణచివేతతో బీఆర్‌ఎస్ గొంతునొక్కేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కనీసం నోటీసు ఇవ్వకుండా గురువారం తెల్లవారు జామున పోలీసులు ఎర్రోళ్ల శ్రీనివాస్ ఇంటికి వెళ్లి భయభ్రాంతులకు గురి చేశారని ధ్వజమెత్తారు. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలనే విష సంస్కృతికి

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

నా వల్ల తప్పు జరిగితే హోంగార్డుకైనా సారీ చెబుతా

సీవీ ఆనంద్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఇటీవల జాతీయ మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. సంధ్య థియేటర్ ఘటనకు నేషనల్ మీడియా సంస్థలు మద్దతిస్తున్నట్టుగా ఉందని ఆయన అసహనం వెలిబుచ్చారు. అయితే తన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు రావడంతో ఆయన క్షమాపణ చెప్పారు. దీనిపై ఓ నెటిజన్ స్పందిస్తూ... 'చేసిన తప్పును అంగీకరించడం గొప్ప విషయమని, అదే మిమ్మల్ని ప్రత్యేకమైన వ్యక్తిగా నిలబెట్టింది'అంటూ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి ట్వీట్ చేశారు. నరేశ్ అనే వ్యక్తి చేసిన ఆ ట్వీట్‌ను సీవీ ఆనంద్ రీట్వీట్ చేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఎప్పుడైనా నేను తప్పుచేశానని భావిస్తే నా హోంగార్డుకైనా సరే క్షమాపణ చెప్పేందుకు వెనుకాడను. ఈ గుణం నాలో చిన్నప్పటి నుంచి ఉంది. బహుశా క్రికెట్ ఆడడం వల్ల వచ్చి ఉంటుంది. క్రికెట్ ఆడడం అనేది నన్ను మెరుగైన వ్యక్తిగా మలిచింది. నా అహాన్ని వదిలేయడం ద్వారా నేను అందరిలో ఒకడిగా ఉండాలనుకుంటాను. ఓ వ్యక్తిని పరిపూర్ణ మానవుడిగా మలిచేందుకు జట్టుగా ఆడే క్రీడలు చాలా ముఖ్యమని భావిస్తాను. కానీ కార్పొరేట్ తరహా విద్యా వ్యవస్థలో ఇటువంటి అవకాశం లేకుండా పోవడం దురదృష్టకరం' అని సీవీ ఆనంద్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోంది

మాజీ మంత్రి హరీశ్‌రావు



రాంగోపాల్‌పేట్: సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం ఆయన ఈ ఘటనలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, బండారు లక్ష్మారెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఘటనను ప్రభుత్వం కావాలనే రాజకీయం చేస్తోందని, సినిమా వాళ్లను భయపెట్టి మంచి చేసుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే గురుకులాల్లో మరణించిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించాలని హితవు పలికారు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని హరీశ్ ఆకాంక్షించారు. మృతి చెందిన రేవతి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓ సర్పంచ్ ఆత్మహత్య చేసుకుంటే అందుకు కారణమైన సీఎం తమ్ముడిని ఎందుకు అరెస్టు చేయలేదని, చట్టం అందరికీ సమానమన్న సీఎం వాళ్ల తమ్ముడిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

ప్రభుత్వంతో ఫలవంతమైన అనుబంధం కోసం ఎదురుచూస్తున్నాం

'మా' అధ్యక్షుడు మంచు విష్ణు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వంతో ఫలవంతమైన అనుబంధం కోసం ఎదురుచూస్తున్నామని 'మా'అధ్యక్షుడు మంచు విష్ణు గురువారం 'ఎక్స్'వేదికగా తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో సినీ ప్రముఖులు భేటీ అయిన సందర్భంగా మంచు విష్ణు స్పందించారు.

సీఎం రేవంత్‌ది బ్లాక్‌మెయిల్ కల్చర్ కాదు: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిది బ్లాక్ మెయిల్ కల్చర్ కాదని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సినీ హీరో అల్లు అర్జున్‌ను రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో రాజ్యాంగం రాసిన అంబేడ్కర్‌ను అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు.

నాన్నకు ఎంతో ఇష్టమైన వ్యక్తి మన్మోహన్

పీవీ వాణీదేవి



మన్మోహన్‌తో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, వాణీదేవి, పీవీ కుటుంబ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: 'నాన్నకు అత్యంత ఇష్టమైన వ్యక్తి మన్మోహన్ సింగ్. తొలుత ఆర్థిక మంత్రిగా, ఆపై దేశానికి రెండు సార్లు ప్రధాన మంత్రిగా పనిచేసినా.. అత్యంత సాధారణ జీవితం గడిపిన మహోన్నత వ్యక్తి మన్మోహన్. నాన్న ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాలు ఆయనతో కలిసే అవకాశం వచ్చింది. ఆయన మన మధ్య లేరన్న వార్తతో దుఃఖం ఆపులేకపోతున్నా'అని ఎమ్మెల్సీ పీవీ వాణీదేవి పేర్కొన్నారు.

ఏటీఎంల సంఖ్య కుదింపు!

నిర్వహణ భారం తగ్గించుకోవడానికి క్రమంగా ఎత్తేస్తున్న బ్యాంకులు	గతేడాది మార్చిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏటీఎంలు 9,660	ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ఉన్నవి 9,205 మాత్రమే	మరో ఏడాదిలో కనీసం 10 శాతం తగ్గించేలా కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: నిర్వహణ భారాన్ని తగ్గించుకొనే క్రమంలో ఏటీఎంల సంఖ్యను మరింతగా తగ్గించుకోవాలని రాష్ట్రంలోని బ్యాంకులు నిర్ణయించాయి. ఏడాది కాలంలో 5 శాతం ఏటీఎంలను తొలగించిన బ్యాంకులు... వచ్చే ఏడాదిలో మరో 10 శాతం వరకు ఏటీఎంలను తగ్గించుకోనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 50 బ్యాంకులకు సంబంధించి ప్రస్తుతం 9,205 ఏటీఎంలు పనిచేస్తున్నాయి. గతేడాది మార్చి నాటికి 9,660 ఏటీఎంలుండగా ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 455 ఏటీఎంలను బ్యాంకులు ఎత్తేసినట్లు రాష్ట్రస్థాయి బ్యాంకుల సమితి గణాంకాలు చెబుతున్నాయి.

డిజిటల్ లావాదేవీలతో..: ఒక్కో ఏటీఎంపై నెలకు సగటున రూ. 2.5 లక్షల వరకు ప్రాథమికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని బ్యాంకులు చెబుతున్నాయి. ప్రతి 8 గంటలకు ఒక సెక్యూరిటీ గార్డు చొప్పున ముగ్గురు గార్డుల జీతాలు, ఏటీఎంను ఉంచే షాప్/షట్టర్ అద్దె, విద్యుత్ బిల్లుతోపాటు సాంకేతిక నిర్వహణ ఖర్చులు ఉంటున్నాయని వివరిస్తున్నాయి. అయితే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు భారీగా జరుగుతుండటం వల్ల ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణ తగ్గుతున్నట్లు బ్యాంకుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో క్యాష్ విత్‌డ్రాయల్స్ తక్కువగా ఉన్న ఏటీఎంలను బ్యాంకులు ఎత్తేస్తున్నాయి. ఇకపై కేవలం బ్రాంచి పరిధిలోనే వాటిని పరిమితం చేసేలా బ్యాంకులు ప్రణాళికను అమలు చేయనున్నట్లు సమాచారం. వచ్చే రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఏటీఎంల సంఖ్య 6 వేలకు పడిపోనుందని సమాచారం.



పీఓఎస్‌ల జోరు...

ఏటీఎంల సంఖ్యను ప్రాధాన్యత క్రమంలో తగ్గించాలని భావిస్తున్న బ్యాంకులు.. పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) మెషిన్ల వాడకాన్ని మాత్రం ప్రోత్సహిస్తున్నాయి. వాటి ద్వారా బ్యాంకులకు అదనపు రాబడి ఉండటమే ప్రధాన కారణం. గతేడాది మార్చిలో రాష్ట్రవ్యాప్తంగా 2,09,116 పీఓఎస్ మెషిన్లు ఉండగా... ప్రస్తుతం వాటి సంఖ్య 2,74,602కు చేరింది. భవిష్యత్తులో వాటి సంఖ్యను మరింత పెంచేందుకు బ్యాంకులు చర్యలు చేపట్టాయి.

	31.03.2023	31.03.2024	31.06.2024	30.09.2024
ఏటీఎంలు	9,660	9,397	9,356	9,205
పీఓఎస్‌లు	2,09,116	2,20,692	2,71,774	2,74,602

మరోస్థాయికి టాలీవుడ్!



గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయిన తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో తెలుగు సినీ ప్రముఖులతో సీఎం సమావేశమయ్యారు. పుష్ప–2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా నటుడు అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు రాగా అభిమానులు ఎగబడడంతో జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మరణించగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో కోలుకుంటున్న విషయం తెలిసిందే. కాగా సీఎం రేవంత్ జరిపిన ఈ భేటీకి టాలీవుడ్ అగ్ర నటుడు చిరంజీవి గైర్హాజరు కావడం విశేషం. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

తొక్కిసలాటలకు చిత్ర యూనిట్‌దే బాధ్యత

'తెలుగు సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన రాయితీలు, ప్రోత్సాహకాలపై సినీ ప్రముఖులతో చర్చించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తాం. చిత్ర పరిశ్రమ తరఫున కూడా ఓ కమిటీ ఏర్పాటు చేసుకోవాలి. సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమాల్లో ఎలాంటి తొక్కిసలాట జరిగినా అందుకు సంబంధిత చిత్ర యూనిట్‌దే పూర్తి బాధ్యత. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగినా సహించేది లేదు. అలా చేసే వారెవరికీ మినహాయింపులుండవు. రాష్ట్రంలో షూటింగ్‌లకు అనుమతులిస్తాం. తెలంగాణలో ప్రకృతి, ధార్మిక పర్యాటకాన్ని టాలీవుడ్ ప్రోత్సహించాలి. ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య అనుసంధానకర్తగా ఉండేందుకే దిల్ రాజును ఎఫ్‌డీసీ చైర్మన్‌గా నియమించాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

అల్లు అర్జున్‌పై నాకెందుకు కోపం?

'నాకు వ్యక్తిగతంగా ఇష్టాయిష్టాలు లేవు. సీఎంగా చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. సినీ పరిశ్రమ కూడా బాధ్యతాయుతంగా మెలగాలి. అల్లు అర్జున్‌పై నాకెందుకు కోపం ఉంటుంది? బన్నీ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. వ్యక్తిగత అభిప్రాయాలు ఎలా ఉన్నా, చట్టం ప్రకారం వ్యవహరించాలన్నది నా విధానం. సినీ ప్రముఖులు ఏర్పాటు చేసుకుంటున్న బౌన్సర్ల దౌర్జన్యాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోము. అభిమానులను నియంత్రణలో పెట్టుకోవాల్సింది నటులే. గంజాయి, డ్రగ్స్‌ను రూపుమాపేందుకు ప్రభుత్వం చేస్తున్న యత్నాలకు కూడా నటీనటులు సహకరించాలి. డ్రగ్స్, మహిళల భద్రత విషయంలో యువతకు అవగాహన కల్పించేలా లఘు చిత్రాలు చిత్రీకరించి సినిమాకు ముందు విధిగా థియేటర్లలో ప్రదర్శించాలి. సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతగా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధిలో భాగస్వాములు కావాలి..' అని సీఎం ఆకాంక్షించారు.

సినీ పరిశ్రమకు కాంగ్రెస్ ప్రభుత్వాలు మేలు చేశాయి..

'సినీ పరిశ్రమకు ఏది చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. సినీ స్టూడియోలకు స్థలాలు, నిర్మాణాలకు అనుమతులు, ఇళ్ల స్థలాలు, ఫిల్మ్‌నగర్, చిత్రపురి కాలనీల ఏర్పాటు, కార్మికులకు ఇళ్లు, ఇతర సౌకర్యాలను కాంగ్రెస్ ప్రభుత్వాలే ఇచ్చాయి. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తాం. సినీ పరిశ్రమకు అండగా ఉండి ప్రోత్సహించాలన్నది మా ఉద్దేశం. 8 సినిమాలకు మా ప్రభుత్వం ప్రత్యేక అనుమతులతో జీవో ఇచ్చింది. పుష్ప సినిమాకు పోలీస్ గ్రౌండ్ ఇచ్చాం. తెలుగు సినీ పరిశ్రమ తెలుగు సినిమాలకే పరిమితం కాకుండా అన్ని భాషల సినిమాల నిర్మాణం చేపట్టేలా అందరం కలిసి అభివృద్ధి చేద్దాం..' అని రేవంత్ అన్నారు.

సినిమా టికెట్లపై సెస్: డిప్యూటీ సీఎం భట్టి

'రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నాం. ఒక్కో పాఠశాల పూర్తికి రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్లు పెట్టుబడి పెడుతున్నాం. దీనికోసం సినీ పరిశ్రమ నుంచి కొంత టికెట్లపై సెస్ రూపంలో ఆర్థిక వనరులు సమకూర్చాలని అనుకుంటున్నాం. ఇదో బృహత్తర కార్యక్రమం. ఇందుకు సినీ పరిశ్రమ సహకరించాలి..' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. సామాజిక బాధ్యతలో భాగంగా రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు సినీ పరిశ్రమ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలి..' అని విజ్ఞప్తి చేశారు. పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ సందర్భంగా మాట్లాడారు.

సంక్రాంతి సినిమాల సంగతేంటి?

బెనిఫిట్ షోలకు, టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతించని పక్షంలో వచ్చే సంక్రాంతికి రానున్న సినిమాల పరిస్థితి ఏంటనేది చర్చనీయాంశంగా మారింది. గురువారం సీఎం వద్ద జరిగిన సమావేశంలో ఈ అంశం చర్చకు రాలేదని సినీ, ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సంక్రాంతికి రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' (జనవరి 10), వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' (జనవరి 14), బాలకృష్ణ 'డాకు మహరాజ్' (జనవరి 12) వంటి చిత్రాలు విడుదల కానున్నాయి. పండగ బరిలో ఉన్న 'గేమ్ ఛేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలకు 'దిల్' రాజు నిర్మాత. అలాగే 'డాకు మహరాజ్'ని ఓ ఏరియాలో 'దిల్'రాజు పంపిణీ చేస్తారని టాక్. ఆ విధంగా చూస్తే సంక్రాంతి 'దిల్' రాజుకు కీలకమైంది. త్వరలో మరోసారి సమావేశం అంటున్నందున అప్పుడు బెనిఫిట్ షోలు, టికెట్ల ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రపంచ సినీ రంగానికి హైదరాబాద్ రాజధాని కావాలి

హైదరాబాద్ ప్రపంచ సినీ రంగానికి రాజధాని కావాలన్నది మా కోరిక. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీలిస్తే సినీ పరిశ్రమ ప్రపంచ స్థాయికి ఎదుగుతుంది. నగరంలో ప్రపంచ స్థాయి స్టూడియో సెటప్ ఉండాలి.

- నటుడు అక్కినేని నాగార్జున

ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉంది

ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉంది. ప్రభుత్వ సహాయంతోనే అప్పట్లో తెలుగు సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్‌కు తరలివచ్చింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ సహా అన్ని ఏజెన్సీలకు హైదరాబాద్ చిరునామాగా ఉండాలి.

- నిర్మాత డి.సురేష్‌బాబు

సంధ్య థియేటర్ ఘటన మమ్మల్ని బాధించింది

సంధ్య థియేటర్ ఘటన మమ్మల్ని బాధించింది. సినిమా విడుదలలో పోటీ పెరగడంతో ప్రమోషన్ కీలకంగా మారింది. ఎన్నికల ఫలితాల తరహాలోనే సినిమా ఫలితం తొలిరోజే తేలిపోతుంది.

- నటుడు మురళీమోహన్

ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించాలి

పరిశ్రమను ప్రభుత్వం కూడా బాగా చూసుకుంటోంది. అప్పట్లో చంద్రబాబు బాలల చలన చిత్రోత్సవం నిర్వహించారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించాలని కోరుతున్నాం.

- సినీ దర్శకుడు రాఘవేంద్రరావు

టాలీవుడ్‌కు మద్దతుగా ఉండాలి

మర్రి చెన్నారెడ్డి, అక్కినేని నాగేశ్వర్‌రావు వల్లే తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలివచ్చింది. ప్రభుత్వం టాలీవుడ్‌కు మద్దతుగా ఉంటుందని భావిస్తున్నాం.

- సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్

పరిశ్రమలో మహిళలే లేరా?

ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ఒక్క మహిళ కూడా లేకపోవడం శోచనీయం. చిత్ర పరిశ్రమలో మహిళలకు సమస్యలే లేవన్నట్టుగా వ్యవహరించారు.

- 'ఎక్స్' వేదికగా నటి పూనమ్ కౌర్

దేశం గొప్ప భూమిపుత్రున్ని కోల్పోయింది: సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఈ మేరకు గురువారం రాత్రి 'ఎక్స్'వేదికగా ఆయన ట్వీట్ చేశారు. 'దేశంలోనే గొప్ప ఆర్థిక వేత్త, నాయకుడు, సంస్కరణవాది, అన్నిటికంటే మించి మానవతావాది మన్మోహన్ సింగ్ ఇకలేరు. ధర్మానికి ప్రతీకగా, నిష్కలంకమైన సమగ్రత కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన మన్మోహన్ నవభారత నిర్మాతల్లో ఒకరు. తన రాజకీయ, ప్రజా జీవితంలో ఔన్నత్యాన్ని ప్రదర్శించిన భూమి పుత్రుడిని దేశం కోల్పోయింది. మన్మోహన్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను'అని ట్వీట్‌లో రేవంత్ పేర్కొన్నారు.

దేశానికి తీరని లోటు: డిప్యూటీ సీఎం భట్టి

మన్మోహన్ సింగ్ మరణం పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతాపం తెలిపారు. దూరదృష్టి గల నాయకుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, భారతదేశ పురోగతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. దేశానికి మన్మోహన్ చేసిన కృషి, అభివృద్ధిలో ఆయన పాత్ర ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు.

ఉద్యమాన్ని అర్థం చేసుకున్నారు: కేసీఆర్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రశేఖర్‌రావు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. 'పీవీ మనసు గెలిచిన మన్మోహన్ సింగ్ అనేక ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దుబిడ్డ. భారత ప్రధానిగా మన్మోహన్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడం చారిత్రక సందర్భం. తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మన్మోహన్ సింగ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి'అని కేసీఆర్ పేర్కొన్నారు.

మన్మోహన్ పాత్రను దేశం మర్చిపోదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మన్మోహన్ సింగ్ మృతి పట్ల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర సంతాపాన్ని తెలిపారు. 'ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రణాళికా సంఘంలో కీలక బాధ్యతల్లో, యూజీసీ చైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక శాఖమంత్రిగా మన్మోహన్ దేశానికి వన్నెతీసుకొచ్చారు. పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు, దేశ ఆర్థిక మంత్రిగా దేశంలో సంస్కరణలు తీసుకురావడంలో మన్మోహన్ పోషించిన పాత్రను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. ఆయన మరణం దేశానికి తీరని లోటు'అని పేర్కొన్నారు.

ఆధునిక భారత నిశ్శబ్ద నిర్మాత : కేటీఆర్

'ఆధునిక భారత నిశ్శబ్ద నిర్మాత, దూర దృష్టి గల నేత, మేధావి, అద్భుతమైన మానవతావాది మన్మోహన్ సింగ్. చరిత్ర పుటల్లో వారి కీర్తి ఎల్లప్పుడూ అజరామరంగా నిలిచిపోతుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులు, మిత్రులకు నా ప్రగాఢ సానుభూతి'

దేశ ప్రగతిలో కీలక భూమిక: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

గొప్ప ఆర్థికవేత్త అయిన మన్మోహన్ సింగ్ మొదట పీవీ నరసింహారావు మంత్రివర్గంలో ఆర్థికశాఖ మంత్రిగా సంస్కరణలను అమలుచేసి దేశం అభివృద్ధి పథంలో నడవడానికి పునాదులు వేశారు. 2004 నుంచి 2014 వరకు భారతదేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ భారతదేశ ప్రగతికి తోడ్పడ్డారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు. మన్మోహన్ సింగ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

పలువురు నేతల సంతాపం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు సంతాపాన్ని తెలియజేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, శ్రీధర్ బాబు, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

బీఆర్ నాయుడుపై సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు

టీవీ5లో కోర్టు లైవ్ స్ట్రీమింగ్ వీడియోను ప్రదర్శించారన్న న్యాయవాది ఇమ్మానేని



సాక్షి, హైదరాబాద్: న్యాయస్థానాల్లో జరిగే వాదోపవాదాల లైవ్ స్ట్రీమింగ్ వీడియోను ప్రదర్శించడం చట్టవిరుద్ధమని తెలిసినా ప్రసారం చేశారని టీవీ 5 చైర్మన్ బీఆర్ నాయుడు, ఎండీ రవీంద్రనాథ్‌తో పాటు యాంకర్ సింధూర శివపై న్యాయవాది ఇమ్మానేని రామారావు నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఆ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఈ నెల 17న ఓ కార్యక్రమం ప్రసారం సందర్భంగా న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు, న్యాయవాదులపై తీవ్ర స్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. న్యాయవ్యవస్థ, న్యాయవాదుల అస్తిత్వాన్ని కించపరిచేలా విద్వేషపూరితంగా, వ్యంగ్యంగా వ్యాఖ్యలు ప్రసారం చేశారని ఆరోపించారు. ఉన్నత న్యాయస్థానం వెబ్‌సైట్‌లోకి చొరబడి వార్తాసంస్థల ముసుగులో న్యాయప్రక్రియ, వాదనలను కాపీరైట్‌ను ఉల్లంఘించి ప్రసారం చేశారని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా సింధూర శివ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారన్నారు. లైవ్ స్ట్రీమింగ్‌ను రికార్డు చేయొద్దని, సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దని.. అలాంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైకోర్టు చెప్పినా ధిక్కరిస్తూ ప్రసారం చేశారని వెల్లడించారు. ఇది కోర్టు ధిక్కరణేకాక, సైబర్ క్రైమ్ కిందకు వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని, ధిక్కరణలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

టీజీబీలో విలీనం కానున్న ఏపీజీవీబీ తెలంగాణ శాఖలు

- ఏపీజీవీబీ బ్యాంకు 493 శాఖలు జనవరి 1 నుంచి టీజీబీలోకి
- రూ.30 వేల కోట్ల నుంచి 70 వేల కోట్లకు చేరనున్న బ్యాంకు టర్నోవర్
- 928 శాఖలతో దేశంలో అతిపెద్ద గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా టీజీబీ: చైర్‌పర్సన్ వై.శోభ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సేవలందిస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) శాఖలన్నీ జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ)లోకి విలీనం కాబోతున్నాయి. 'ఒక రాష్ట్రం – ఒక గ్రామీణ బ్యాంకు'అనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు అనుగుణంగా తెలంగాణలోని వివిధ జిల్లాల్లో కొనసాగుతున్న ఏపీజీవీబీ 493 శాఖలను విలీనం చేయనున్నారు. 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన ఏపీజీవీబీ 771 శాఖలతో సేవలు అందిస్తోంది. అప్పటికే తెలంగాణలో ఉన్న దక్కన్ గ్రామీణ బ్యాంకును రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పుచేసి శాఖలను విస్తరించారు. ప్రస్తుతం తెలంగాణ గ్రామీణ బ్యాంకు 435 శాఖలతో 18 జిల్లాల్లో సేవలు అందిస్తోంది. ఏపీజీవీబీ తెలంగాణ శాఖల విలీనం తరువాత తెలంగాణలోని 33 జిల్లాల్లో 928 శాఖలుగా టీజీబీ రూపాంతరం చెందనుంది.

అతిపెద్ద గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా..

ఏపీజీవీబీ తెలంగాణ శాఖల విలీనం తరువాత టీజీబీ దేశంలోనే అతిపెద్ద గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా అవతరించనున్నదని బ్యాంక్ చైర్‌పర్సన్ వై.శోభ తెలిపారు. విలీన ప్రక్రియ తుదిదశకు చేరిన సందర్భంగా టీజీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం రూ.30 వేల కోట్ల టర్నోవర్‌తో ఉన్న టీజీబీ... విలీనం తరువాత రూ.70 వేల కోట్ల టర్నోవర్‌కు చేరుతుందన్నారు. విలీన ప్రక్రియలో భాగంగా ఆస్తులు, అప్పుల పంపకాలు, ఉద్యోగుల ఆప్షన్ల ప్రక్రియ వంటివన్నీ కొలిక్కివచ్చినట్లు తెలిపారు. విలీనం నేపథ్యంలో ఈనెల 28 నుంచి 31 వరకు బ్యాంకు సేవల్లో కొంతమేర అంతరాయం కలుగుతుందని, అయితే ఖాతాదారుల అత్యవసర సేవల కోసం 30, 31 తేదీల్లో వారి ఖాతాల నుంచి రూ.5 వేల వరకు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. జనవరి 1 నుంచి ఖాతాదారులకు సేవలన్నీ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇక ఏపీజీవీబీ శాఖలకు చెందిన ఖాతాదారులు వారి ఏటీఎం కార్డులు మార్చుకునేందుకు, యూపీఐ, మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను తిరిగి పొందేందుకు ఒకటో తేదీ నుంచి మారిన టీజీబీ శాఖల్లో సంప్రదించాలని కోరారు. అలాగే ఏపీజీవీబీ ఖాతాదారుల వద్ద ఇప్పటికే ఉన్న పాత చెక్కులు, డీడీలు వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు చెల్లింపులకు, క్లియరింగ్ సేవలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. మీడియా సమావేశంలో బ్యాంకు జీఎంలు సుధాకర్, చంద్రశేఖర్, లక్ష్మి, భారతి, రమేష్, ఏజీఎం సుశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

టాలీవుడ్ అభివృద్ధే లక్ష్యం

ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత దిల్ రాజు



బంజారాహిల్స్ (హైదరాబాద్): చిత్ర పరిశ్రమ అభివృద్ధి లక్ష్యంగానే సీఎంతో తెలుగు సినీ ప్రముఖులు సమావేశమైనట్లు రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి మండలి (ఎఫ్‌డీసీ) చైర్మన్, నిర్మాత 'దిల్'రాజు తెలిపారు. ఇటీవలి కాలంలో సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య కొంత గ్యాప్ ఏర్పడిందనే ప్రచారం జరిగిందని, అదంతా కేవలం అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు.

సీఎంతో మరోసారి భేటీ అవుతాం..

సీఎం చేసిన సూచనల నేపథ్యంలో తెలుగు సినిమా స్థాయిని దశదిశలా విస్తరించేందుకు ఏమేమి చేయాలనే దానిపై తామంతా కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేసుకుంటామని 'దిల్'రాజు చెప్పారు. ఆ తర్వాత మరోసారి ముఖ్యమంత్రితో సమావేశమవుతామని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమ విషయంలో తనకున్న గొప్ప విజన్‌ను రేవంత్‌రెడ్డి తమతో పంచుకున్నారని, పరిశ్రమలో సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని భరోసా కూడా ఇచ్చారని వెల్లడించారు.

బెనిఫిట్ షోలు చిన్న విషయం

భారతీయ సినిమాలే కాకుండా హాలీవుడ్ సినిమాలు కూడా హైదరాబాద్‌లో షూటింగ్‌లు చేసుకునేందుకు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నా ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం చెప్పారని 'దిల్'రాజు వెల్లడించారు. తాము కూడా హైదరాబాద్‌ను సినిమా ఇండస్ట్రీకి ఇంటర్నేషనల్ హబ్‌గా మార్చే దిశగా అడుగులు వేస్తామన్నారు. డ్రగ్స్ నిరోధం విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తామని తెలిపారు. పరిశ్రమ అభివృద్ధి మాత్రమే ఇక్కడ ప్రధాన విషయమని, బెనిఫిట్ షోలు, టికెట్ రేట్లు అనేవి చాలా చిన్న విషయమని వ్యాఖ్యానించారు. సీఎంతో సమావేశంలో బెనిఫిట్ షోలు, టికెట్ల రేట్లు చర్చకు రాలేదని పేర్కొన్నారు. నిర్మాత అల్లు అరవింద్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితరులు ఆయనతో ఉన్నారు.

తెలంగాణ ఏర్పాటైంది మన్మోహన్ హయాంలోనే

ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం



తెలంగాణ ఏర్పాటైన అనంతరం మన్మోహన్‌ను కలిసి కృతజ్ఞతలు చెబుతున్న రాష్ట్ర కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాకారమైంది మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలోనే. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ బిల్లు ఉభయ సభల ఆమోదం పొందింది. తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు, రాజకీయ నిర్ణయాలు జరిగినప్పటికీ మన్మోహన్ ప్రధానిగా ఉన్న సభలోనే రాష్ట్ర ఏర్పాటు బిల్లు ఆమోదం పొందడం గమనార్హం. హైదరాబాద్ మెట్రో రైలు మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే మంజూరు కావడమే కాక, వయబిలిటీ గ్యాప్ ఫండ్‌ను ఇవ్వడంలో ఆయన కృషి ఉంది. కాగా, మన్మోహన్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన జీవితం దేశానికి ఆదర్శమని, ఆయన మరణం దేశ ప్రజలకు తీరనిలోటని పేర్కొన్నారు. మన్మోహన్ ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా...


రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో వీర్ బాల్ దివస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

వీర్ బలిదానాల చరిత్రను తెలుసుకోవాలి: కిషన్‌రెడ్డి

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 'వీర్ బాల్ దివస్'

సాక్షి,హైదరాబాద్: భారత్ ధర్మాన్ని, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు గురుగోవింద్‌సింగ్ కుమారులు (సాహిబ్‌జాదాస్ బాబా జోరావర్ సింగ్ జీ, బాబా ఫతే సింగ్ జీ) చేసిన బలిదానానికి గుర్తుగా డిసెంబర్ 26న 'వీర్ బాల్ దివస్'గా పాటిస్తున్నట్లు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చెప్పారు. గురువారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో వీర్ బాల్ దివస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, దేశం కోసం బలిదానాలు చేసిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నామన్నారు. 2022లో సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మోదీ ఆదేశాల మేరకు తొలిసారిగా వీర్ బాల్ దివస్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ప్రతి జిల్లా, పాఠశాలల్లో వీర్ బాల్ దివస్‌ను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలందాయని తెలిపారు. ఈ దివస్‌ను పాఠ్య పుస్తకాల్లో సిలబస్‌లాగా పెట్టాలని డిమాండ్లు ఉన్నాయని, తప్పకుండా సిలబస్‌లో వీర్ బాల్ దివస్‌ను పెట్టడంపై ప్రధాని మోదీతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

బీసీ కులగణనపై బీజేపీ వైఖరి చెప్పాలి: కవిత



సాక్షి, హైదరాబాద్: బీసీ కులగణనపై బీజేపీ తన వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం బీజేపీ ఎందుకు నిలదీయడం లేదని ఆమె ప్రశ్నించారు. రాష్ట్ర కుమ్మరి సంఘం నేతలు గురువారం ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో కలిసి బీసీ లు, కులవృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బీసీలకు ఇచ్చిన హామీ ల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కవిత వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రభు త్వం బీసీలు, కులవృత్తులను అన్నివిధాలుగా ప్రోత్సహించిందని, రేవంత్ ప్రభుత్వం బీసీ సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసిందన్నా రు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామనే హామీని ఉల్లంఘిస్తున్నా బీజేపీ స్పందించడం లేదన్నారు. ఎమ్మె ల్సీ కవితను కలిసిన వారిలో యునైటెడ్ ఫూలే ఫ్రంట్ నాయకులు బొల్ల శివ శంకర్, తెలంగా ణ రాష్ట్ర శాలివాహన సంఘ నాయకులు, తెలంగాణ ఆరెకటిక సంఘం నాయకులు ఉన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా జానారెడ్డి

సాక్షి, సిద్దిపేట/హైదరాబాద్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.జానారెడ్డి ఎన్నికయ్యారు. ఈనెల 23 నుంచి 25 వరకు సిద్దిపేటలో జరిగిన 43వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ ఎన్నిక జరిగినట్లు ఏబీవీపీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాన కార్యదర్శిగా రాంబాబు (కాకతీయ యూనివర్సిటీ), ఉపాధ్యక్షులుగా కరుణాకర్ రెడ్డి (గద్వాల), శ్యాం (ఎన్ఐటీ, వరంగల్), వినోద్ (నిర్మల్), సహాయ కార్యదర్శులుగా రాకేశ్ (కరీంనగర్), కల్యాణి (విద్యానగర్), నరేశ్ (మహబూబ్‌నగర్), రాజు (ఉస్మానియా యూనివర్సిటీ), ఛత్రపతి చౌహాన్ (మహాత్మాగాంధీ యూనివర్సిటీ), సాయిరామ్ (ఇబ్రహీంపట్నం)లను ఎన్నుకున్నారు. తనపైన నమ్మకం ఉంచి మరోసారి ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించినందుకు ఏబీవీపీ అఖిలభారత నాయకత్వానికి జానారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంగ్రెస్ ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీ

▶ మొదటి పేజీ తరువాయి

చరమగీతం పాడాలన్నారు.

ఇందిరమ్మ రాజ్యమా? పోలీస్ రాజ్యమా?: హరీశ్‌రావు

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన పేరిట డబ్బా కొడుతూ, సీఎం రేవంత్ రాక్షస పాలన కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేస్తూ సీఎం నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ పిట్ట బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడేది లేదని, తెలంగాణ సమాజమే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెపుతుందని హరీశ్‌రావు హెచ్చరించారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, మేడే రాజీవ్ సాగర్, డాక్టర్ వాసుదేవరెడ్డి తదితరులు వేర్వేరు ప్రకటనల్లో ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టును ఖండించారు.

ప్రజల గొంతుకగా ప్రశ్నిద్దాం


వైఎస్సార్ జిల్లా పులివెందులలో అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

- ఈ దుర్మార్గ ప్రభుత్వ తీరును నిలదీద్దాం
- ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధమవ్వండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వైఎస్ జగన్‌పిలుపు
- పులివెందుల క్యాంప్ కార్యాలయానికి పోటెత్తిన అభిమాన జనం

సాక్షి ప్రతినిధి, కడప: 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. సూపర్ సిక్స్ లేదు.. సూపర్ సెవెన్ లేదు.. ఆరు నెలల్లోనే ఇదివరకెన్నడూ లేనంతగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. ప్రశ్నించిన వారిని ఇక్కట్ల పాలు చేస్తోంది. అందువల్ల ప్రజల గొంతుకగా మనం ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దాం.. నిలదీద్దాం. ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటానికి సిద్ధమవ్వండి. ధైర్యంగా ఎదుర్కొందాం. కష్టాలు ఎల్లకాలం ఉండవు' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల భాకరాపురంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. వారి బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ.. 'నేనున్నాను..'అని భరోసా ఇచ్చారు. కష్టాలు కొద్ది కాలమేనని.. ఆ తర్వాత మన టైమ్ వస్తుందని ధైర్యం చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పోరాట పంథా ఎంచుకుని ముందుకు సాగాలని చెప్పారు.

కిక్కిరిసిన క్యాంపు కార్యాలయం

పులివెందులలోని క్యాంపు కార్యాలయం గురువారం పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసింది. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు నేతలు అండగా నిలబడాలని ఈ సందర్భంగా వైఎస్ జగన్ సూచించారు. వివిధ సమస్యలతో బాధ పడుతున్న పలువురు జగన్‌ను కలిసి విన్నవించుకున్నారు. స్వయంగా పరిష్కరించగల వాటికి తక్షణమే స్పందించారు. వారి సమస్య పరిష్కారానికి ఏమి చెయ్యాలో పక్కనే ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి సూచించారు.

జన గణనలో కులగణన చేపట్టాలి

- సీఎం రేవంత్ ప్రతిపాదన.. సీడబ్ల్యూసీ ఆమోదం
- కులగణన డిమాండ్‌తో పార్టీ పోరాటం చేయాలన్న ముఖ్యమంత్రి


బెల్గాంలో జరిగిన సీడబ్ల్యూసీ భేటీలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది దేశవ్యాప్తంగా చేయబోతున్న జన గణనలో భాగంగా కులగణన కూడా చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానించింది. కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాంలో గురువారం ప్రారంభమైన సీడబ్ల్యూసీ రెండురోజుల భేటీలో భాగంగా తొలిరోజు సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన ఈ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా ఆమోదించింది. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జనగణనలో కులగణన కూడా చేపట్టాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ పోరాటం చేయాలని అన్నారు. కులగణన విషయంలో దేశంలోనే తెలంగాణ మార్గదర్శిగా ఉందని చెప్పారు.

పునర్విభజనపై జాగ్రత్త పడాలి

త్వరలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశాలున్నాయని, జనాభా ప్రాతిపదికన జరిగితే దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల పెంపు తక్కువగా ఉండి కాంగ్రెస్ నష్టపోయే పరిస్థితి ఉంటుందని రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ విషయంలో ఏఐసీసీ వ్యూహాత్మకంగా ఆలోచించాలని, అత్యంత జాగ్రత్తగా ముందడుగు వేయాలని సూచించారు. మహిళా బిల్లును కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చట్ట సభల్లో ప్రవేశపెట్టి ఒక కొలిక్కి తెచ్చిన నేపథ్యంలో ఆ బిల్లుపై పార్టీ పక్షాన ఎక్కువ ప్రచారం జరగాలని చెప్పారు. బీజేపీకి అనుకూలంగా రిజర్వేషన్లు చేసుకునే అవకాశాలు ఉంటాయని, ఈ విషయంలోనూ పార్టీ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. సరిగ్గా వందేళ్ళ క్రితం ఇదే బెల్గాంలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో మహాత్మాగాంధీని ఏఐసీసీ అధ్యక్షులుగా ఎన్నుకున్న విషయం గుర్తు చేశారు. కులాలు, మతాల పేరిట రాజకీయాలు చేస్తూ, దేశాన్ని విభజించి పాలిస్తూ, రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ కుటిల రాజకీయ ఎత్తుగడలకు కులగణన చెంపపెట్టు లాంటిదని అన్నారు. తెలంగాణలో ఇప్పటికే 90 శాతం కులగణన పూర్తయిందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు, మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు.

ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్, బెయిల్

- మాసాబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత
- పీఎస్‌లో శ్రీనివాస్‌ను పరామర్శించిన హరీశ్


ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న హరీశ్ రావు

నాంపల్లి/సిటీ కోర్టులు: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో బీఆర్ఎస్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను మాసాబ్‌ట్యాంక్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గతంలో బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో శ్రీనివాస్‌తోపాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరి కొందరిపై పోలీసులను అడ్డుకున్న ఘటనలో కేసు నమోదైన విషయం తెలిసిందే. శ్రీనివాస్ కేసు విచారణకు హాజరుకాకపోవడంతో ఉదయాన్నే 6.30 గంటలకు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు మారేడ్‌పల్లిలోని శ్రీనివాస్ ఇంటికి చేరుకున్నారు. అయితే, ఎంతకీ ఇంటి తలుపులు తెరవలేదు. దీంతో ఉదయం 9.45 గంటలకు శ్రీనివాస్ తన ఇంట్లో నుంచి బయటకు రాగానే భారీ బందోబస్తు నడుమ అదుపులోకి తీసుకుని మాసాబ్‌ట్యాంక్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ విచారణ పూర్తయ్యాక శ్రీనివాస్‌ను వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నేతలు పోలీసు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరగడంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అంతకుముందు బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, వివేక్, ఎర్రబెల్లి దయాకర్ రావు మాసాబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించారు.

రెండు పూచీకత్తులతో బెయిల్: పోలీసులు మధ్యాహ్నం 3.55 గంటలకు శ్రీనివాస్‌ను నాంపల్లిలోని 3వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపర్చారు. దీనిపై విచారణ చేపట్టిన జడ్జి కుమారస్వామి బెయిల్ మంజూరు చేస్తూ.. పర్సనల్‌బాండ్‌తోపాటు రూ.5 వేలతో రెండు పూచీకత్తులు శుక్రవారంలోపు సమర్పించాలని ఆదేశించారు. ప్రతీ విచారణకు నిందితుడు నేరుగా కోర్టుకు హాజరుకావాలని పేర్కొన్నారు.

నరేందర్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతాం

- ఆయన ప్రెస్‌మీట్ వివరాలను న్యాయస్థానానికి నివేదిస్తాం
- కండీషనల్ బెయిల్‌పై ఉన్న వ్యక్తి విలేకరుల సమావేశం పెట్టడం ఏమిటి?: ఐజీ సత్యనారాయణ



పరిగి: కండీషనల్ బెయిల్‌పై ఉన్న నరేందర్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లు పెట్టి మాట్లాడటం సరికాదని, కేసు విచారణలో ఉండగా ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం ఏమిటని.. ఐజీ సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ విషయాలను కోర్టుకు నివేదించి, బెయిల్ రద్దు చేయాలని కోరుతామన్నారు. వికారాబాద్ జిల్లా పరిగి సీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందస్తు ప్రణాళికతోనే లగచర్ల దాడి జరిగిందని, ఈ ఘటనతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమేయం ఉండటంతోనే నరేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని తెలిపారు. దాడి ఘటనలో పోలీసులు, నిఘా వైఫల్యం ఉందనడంలో వాస్తవం లేదన్నారు. సురేశ్ అనే వ్యక్తి కలెక్టర్‌కు మాయమాటలు చెప్పి, అక్కడికి తీసుకెళ్లారని స్పష్టంచేశారు. పోలీసులు వెంటవస్తామని చెప్పినా కలెక్టర్ వద్దనడంతోనే ఆగిపోయారని వివరించారు. ఇలా జరుగుతుందని కలెక్టర్ ఊహించలేదని, ఆయన మంచితనం పనిచేయలేదని తెలిపారు. పక్కా ప్లాన్ ప్రకారమే సురేశ్, అతని అనుచరులు రాళ్లు, కర్రలతో కలెక్టర్‌తో పాటు అధికారులపై దాడి చేశారన్నారు. అంతకు ముందే రోటిబండతండాలో జరిగిన ఘటనను ఉద్దేశించి మాట్లాడుతూ.. అంతకన్నా నాలుగింతల పెద్ద ఘటనలు జరుగుతాయని ముందుగానే హెచ్చరించారని స్పష్టం చేశారు. కలెక్టర్‌పై దాడిలో పాల్గొన్న నిందితులెవరినీ పోలీసులు కొట్టలేదన్నారు. నరేందర్‌రెడ్డి, సురేశ్ పోలీసు విచారణకు సహకరించడం లేదని, కనీసం ఫోన్ పాస్‌వర్డ్ కూడా చెప్పడం లేదని ఐజీ వెల్లడించారు. సమాచార లోపం కారణంగానే నిందితులకు బేడీలు వేశారని, ఇందుకు కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని ప్రకటించారు. లగచర్ల దాడి ఘటనలో మాట్లాడుకున్న వీడియోలు తమ వద్ద ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు బయట పెడతామని స్పష్టం చేశారు.

పోలీసుల వేధింపులతో చనిపోతున్నా

వీడియో రికార్డు చేసి పీహెచ్‌డీ విద్యార్థిని ఆత్మహత్య


దీప్తి (ఫైల్)

మల్లాపూర్: ఏ తప్పూ చేయకున్నా పోలీసులు తనను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తూ ఓ పీహెచ్‌డీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్‌లోని నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. నాచారం సరస్వతి నగర్ కాలనీకి చెందిన పులివర్తి సంగీత్‌రావు కుమార్తె దీప్తి (29) ఐఐసీటీలో పీహెచ్‌డీ చేస్తోంది. వీరి ఇంటి ఎదురుగా ఉండే కానిస్టేబుల్ అనిల్.. తన భార్యకు ఐఐసీటీలో ఉద్యోగం ఇప్పిస్తానని సంగీత్‌రావు 2022లో రూ.15 లక్షలు తీసుకొని మోసం చేశాడని నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో అనిల్‌కు రూ.8 లక్షలు తిరిగి ఇచ్చినట్లు దీప్తి కుటుంబ సభ్యులు తెలిపారు. అయినప్పటికీ డబ్బుల కోసం తన కూతురు దీప్తిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి తప్పుడు కేసులు పెట్టారని సంగీత్‌రావు ఆరోపించారు. కేసు విత్ డ్రా చేసుకోవాలంటే రూ.35 లక్షలివ్వాలని అనిల్ మామ సోమయ్య, భార్య అనిత, అనిత సోదరుడు సైదులు దీప్తిని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని ఆమె ఎంత చెప్పినా వినకుండా పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు పిలిచి బెదిరించారు. దీంతో మనోవేదనకు గురైన దీప్తి గురువారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తాను ఇంత కఠిన నిర్ణయం తీసుకోవటానికి పోలీసుల వేధింపులే కారణమని ఆరోపిస్తూ మొబైల్‌లో వీడియో రికార్డు చేసింది. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఏసీపీ చక్రధర్, నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

మతోన్మాద విధానాలపై ఐక్య పోరు

- సీపీఐ వందేళ్ల ఉత్సవాల్లో పార్టీ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా
- రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శత వసంతోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేసేవరకు కలిసికట్టుగా ఉద్యమించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా పిలుపునిచ్చారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో కొనసాగుతున్న అప్రజాస్వామిక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, వామపక్షవాదులు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నప్పటికీ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు ఇప్పటికీ అమలుకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస్‌రెడ్డి, పల్లా వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. 5 వేల గ్రామ శాఖల్లో పార్టీ పతాకాలను ఎగురవేశారు. శతాబ్ది ఉత్సవాల ప్రారంభ సభ ఈ నెల 30న నల్లగొండలోని ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. 2025, డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభతో ఉత్సవాలు ముగుస్తాయి.

విప్లవ స్ఫూర్తికి ప్రతీక సీపీఐ: సురవరం

సాక్షి, హైదరాబాద్: విప్లవ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచి భారత స్వాతంత్య్ర పోరాటంలో కీలకపాత్ర పోషించిన పార్టీ సీపీఐ అని ఆ పార్టీ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వందేళ్ల ప్రస్థానంలో ప్రపంచ కమ్యూనిస్ట్ ఉమ్మడి ఉద్యమాలకు బలమైన పునాదిగా సీపీఐ నిలిచిందని ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ మార్పు కోసం ఎర్ర జెండాను ఎగరవేసి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులందరికీ వందనాలు తెలిపారు. వామపక్షాలు ఐక్యతగా ప్రజల కోసం ఉద్యమించాలని అభిలషించారు.

గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలకు లైన్‌క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

పోస్టుల భర్తీ కోసం 2022లో ప్రభుత్వం జీవో 55 జారీ చేసింది. రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చింది. అయితే పేపర్ లీకేజీ కారణంగా ప్రిలిమ్స్ పరీక్ష రద్దు కాగా, ఆ తర్వాత ప్రభుత్వం పోస్టుల సంఖ్య పెంచుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి నోటిఫికేషన్ ఇస్తూ జీవో 29 జారీ చేసింది. ఫిబ్రవరిలో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం టీజీఎస్‌పీఎస్సీ రూల్ ఆఫ్ లాను పాటించేలా, ప్రిలిమ్స్, మెయిన్స్.. అన్నింటా రిజర్వేషన్లు అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ నల్లగొండ జిల్లా శాలిగౌరారానికి చెందిన పోగుల రాంబాబు సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2019లో జారీ చేసిన జీఓ 96ను కూడా సవాల్ చేశారు. ఇలా మొత్తం ఏడు పిటిషన్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది.

వాదనలు సాగాయిలా...

పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'మెయిన్స్‌కు ఎంపిక చేసిన 1:50లో కూడా సమాంతర రిజర్వేషన్లు పాటించేలా ఆదేశాలు జారీ చేయాలి. ఇందిరా సహానీ కేసులో సుప్రీం తీర్పును ప్రభుత్వం అమలు చేయడం లేదు. 1:50 మేరకు రిజర్వేషన్లు పాటిస్తూ అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండగా, అంతకు మించి మెయిన్స్‌కు ఎంపిక చేశారు. రీ నోటిఫికేషన్ ఇస్తూ జారీ చేసిన జీవో 29 కూడా చట్ట విరుద్ధం. రిజర్వేషన్ల అంశం తేలేదాకా మెయిన్స్ ఫలితాలు వెల్లడించకుండా టీజీఎస్‌పీఎస్సీకి ఆదేశాలు జారీ చేయాలి..'అని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఇప్పటికే రెండు సార్లు ప్రిలిమ్స్ పరీక్షలు రద్దయ్యాయి. ఈసారి ప్రిలిమ్స్, మెయిన్స్ లోటుపాట్లు లేకుండా నిర్వహించాం. పిటిషన్లను అనుమతించవద్దు. మెయిన్స్ ఫలితాల వెల్లడిని అడ్డుకోవద్దు..'అని కోరారు. ఈ నెల 17న తుది వాదనలు విన్న ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది.

జీవో 55..

➤ గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం 2022, ఏప్రిల్ 25న గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 503 పోస్టులు భర్తీ చేసేందుకు జీవో 55ను జారీ చేసింది. పోస్టుల సంఖ్యకు అనుగుణంగా 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాలని తెలిపింది. తెలంగాణ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 22, 22 ఏ నిబంధనల ప్రకారం రిజర్వ్‌డ్ కేటగిరీ, జెండర్, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, స్పోర్ట్స్ రిజర్వేషన్లు పాటించాలని స్పష్టం చేసింది. ఓపెన్ మెరిట్‌లో చోటు సంపాదించిన రిజర్వ్‌డ్ అభ్యర్థులు ఓపెన్ మెరిట్‌తో పాటు సంబంధిత రిజర్వ్‌డ్ కేటగిరీ పోస్టులకు కూడా పోటీ పడవచ్చని తెలిపింది.

జీవో 29..

➤ ప్రస్తుత ప్రభుత్వం 2024, ఫిబ్రవరి 19న మరో నోటిఫికేషన్ జారీ చేసింది. పోస్టుల సంఖ్యను 503 నుంచి 563కు పెంచుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు జీవో 29ని జారీ చేసింది. రిజర్వ్‌డ్ కేటగిరీతో సంబంధం లేకుండా పోస్టుల సంఖ్య మేరకు 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఇందులో ఒకవేళ రిజర్వ్‌డ్ కేటగిరీకి అనుగుణంగా ఆ వర్గాల అభ్యర్థులు లేకుంటే.. ఆ కేటగిరీలోని తదు పరి మెరిట్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. 1:50 మేరకు రిజర్వ్‌డ్ అభ్యర్థుల సంఖ్య ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మెయిన్స్‌కు ఎంపికైన రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులంతా ఓపెన్ కేటగిరీ పోస్టులకు పోటీ పడవచ్చు.

ఓ విశ్వాసులారా... శుక్రవారం నమాజ్ కొరకు పిలుపు ఇవ్వబడినప్పుడు మీరు మీ వ్యాపారాలను విడిచి అల్లాహ్ స్మరణ వైపునకు పరుగెత్తండి. మీరు తెలుసుకొనగలిగితే ఇది మీకు ఎంతో ఉత్తమమైనది.

– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 27 డిసెంబర్ 2024

బెళగావి దోవ చూపుతుందా?

ఎన్నికలొచ్చినప్పుడల్లా భంగపాటు రివాజైన కాంగ్రెస్‌కు ఈసారి ఢిల్లీ ఎన్నికలకు రెండు నెలల ముందే అవమానం ఎదురైంది. 'ఇండియా' కూటమి నుంచి ఆ పార్టీని తక్షణం సాగనంపాలని ఆప్ పిలుపునివ్వటం వర్తమాన రాజకీయాల్లో కాంగ్రెస్ దయనీయస్థితిని వెల్లడిస్తోంది. వాస్తవానికి పార్టీ అధ్యక్ష హోదాలో గాంధీ మహాత్ముడు బెల్గాం (ప్రస్తుతం బెళగావి) కాంగ్రెస్ సమావేశాలకు అధ్యక్షత వహించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గురువారంనాడు రెండురోజుల శత వార్షిక వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ విస్తృత స్థాయి సమావేశాలు జరుగుతున్నాయి. సైద్ధాంతిక వైరుద్ధ్యాలతో పరస్పరం కలహించుకునే పక్షాలు ఒక దరి చేరి కూటమిగా చెప్పుకున్నంత మాత్రాన అవి కలిసి కాపురం చేస్తాయన్న నమ్మకం ఎవరికీ ఉండదు. అందువల్లే ఇండియా కూటమికి ప్రారంభంలోనే పగుళ్లొచ్చాయి. కూటమిలో ఉంటాను గానీ బెంగాల్ వరకూ ఎవరికీ ఒక్కటంటే ఒక్క సీటివ్వనని తొలుతే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెగేసి చెప్పారు. అనంతరకాలంలో ఆమె దూరం జరిగారు. ఢిల్లీ వరకూ ఆప్ సైతం ఇంచుమించు అదే వైఖరి తీసుకుంది. పార్లమెంటు ఎన్నికల్లో పొత్తుకు అంగీకరించినా ఈ ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరుకు వెళ్తామన్నది. ఆప్, కాంగ్రెస్ పార్టీలు రెండూ అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యాయి. ఈలోగా ఆప్‌పై రాజకీయంగా పైచేయి సాధించటం కోసం కాంగ్రెస్ విరుచుకుపడుతోంది. తాము గెలిస్తే మహిళా సమ్మాన్ పేరుతో ఇప్పటికే ఇస్తున్న రూ. 1,000ని రూ. 2,100కు పెంచుతామని ఆప్ వాగ్దానం చేయడాన్ని కాంగ్రెస్ ప్రధానంగా తప్పుబడుతోంది. ఆప్ ఇస్తున్న సంక్షేమ హామీలు ప్రజలను మోసగించడమేనని, ఇది శిక్షార్హమైన నేరమని ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై, ముఖ్యమంత్రి అతిశిపై కాంగ్రెస్ కేసులు పెట్టింది. ఆయన్ను జాతి వ్యతిరేకిగా అభివర్ణించింది. ఆప్ వైఫల్యాలపై శ్వేతపత్రం కూడా విడుదల చేసింది. ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీ చేసినా ఇంతగా వైషమ్యాలు లేవు.

బెళగావి సమావేశాల్లో కాంగ్రెస్ కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేయాలని పార్టీ భావిస్తోంది. అయితే దేనిపైనా తనకంటూ స్పష్టమైన వైఖరి లేకుండా గాలివాటుకు కొట్టుకుపోయే విధానాలను అవలంబించినంత కాలమూ ఇలాంటి కార్యాచరణలు ఎంతవరకూ సత్ఫలితాలిస్తాయన్నది సందేహమే. ఆర్నెల్లక్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పొత్తుపెట్టుకున్న ఆప్‌పై ఇప్పుడు జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం హఠాత్తుగా స్వరం మార్చి విమర్శలు లంకించుకోవటం వెనకున్న అంతరార్థాన్ని జనం గ్రహించలేరని కాంగ్రెస్ భావిస్తున్నదా అన్న సందేహం వస్తుంది. ఢిల్లీని వరసగా మూడు దఫాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ అక్కడ తనకెదురవుతున్న చేదు అనుభవాలకు కారణమేమిటో లోతైన అధ్యయనం చేస్తే ఎంతో కొంత ఫలితం ఉంటుంది. దానికి బదులు బీజేపీ మాదిరే ఆప్‌పై విమర్శలు చేస్తే చాలన్నట్టు కాంగ్రెస్ పోకడ ఉంది. మూడు దశాబ్దాల క్రితం ఢిల్లీ కాంగ్రెస్ హెచ్‌కేఎల్ భగత్, జగదీష్ టైట్లర్ గ్రూపులుగా విడిపోయి అంతర్గత కలహాలతో సతమతమవుతున్న తరుణంలో దాదాపు బయటి వ్యక్తిగా ముద్రపడిన షీలా దీక్షిత్‌కు ఢిల్లీ పీసీసీ చీఫ్ పదవి అప్పగించారు. ఆ తర్వాతే అక్కడ కాంగ్రెస్ గట్టెక్కింది. ఇప్పుడు ఆ మాదిరి వ్యూహం ఉన్నట్టు కనబడదు. ఈసారి మౌలికస్థాయిలో పార్టీ పునర్నిర్మాణానికి నడుం బిగించామని, ఢిల్లీలో తమకు మంచి స్పందన ఉన్నదని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు. అదే నిజమైతే బస్తీలు ఎదుర్కొంటున్న సమస్యలపై, ముఖ్యంగా కాలుష్యంపై ఆ పార్టీ దృష్టి సారించాలి. పార్టీ అంతర్గత నిర్మాణం చక్కదిద్దుకోవాలి. కానీ జరుగుతున్నది వేరు. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ పొరపాటే చేసింది. ఆ ఎన్నికల్లో ఆప్–కాంగ్రెస్ పొత్తు మెరుగైన ఫలితాలనిస్తుందని అందరూ భావించారు. కానీ అప్పటి పీసీసీ అధ్యక్షుడు అరవింద్ సింగ్ లవ్‌లీతోసహా కీలక నేతలు పార్టీ విజయావకాశాలను దెబ్బతీశారన్నది విశ్లేషకుల అంచనా. అరవింద్ సింగ్ ఇప్పుడు బీజేపీలో చేరారు.

పేరుకు ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్నా భాగస్వామ్య పక్షాల నుంచి కాంగ్రెస్‌కు సూటిపోటి మాటలు తప్పడం లేదు. ఇప్పటికే సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ, ఎన్సీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పక్షాలు కాంగ్రెస్ సామర్థ్యంపై సందేహం వ్యక్తం చేస్తున్నాయి. వీరితో ఆప్ సైతం గొంతు కలపటం కాంగ్రెస్ దయనీయ స్థితిని తెలియజేస్తున్నాయి. కార్యాచరణ మాట అటుంచి ముందు మిత్రులతో కలిసి ప్రయాణించలేని పరిస్థితులు ఎందుకేర్పడ్డాయో ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం కనబడుతోంది. ఒక విపక్షంగా ఎటూ సమస్యలు వచ్చిపడుతుంటాయి. కానీ తెచ్చిపెట్టుకుంటున్న సమస్యలు కోకొల్లలని ఆ పార్టీ గ్రహించలేకపోతున్నది. ఎంతసేపూ పార్టీ వైఫల్యాలకు స్థానికంగా ఉండే నేతలను వేలెత్తి చూపటం మినహా తమ వ్యవహార శైలి ఎలా ఉంటున్నదన్న స్పృహ అగ్ర నాయకత్వానికి కరువైంది. స్థానికంగా పార్టీని బలోపేతం చేస్తున్న వారిని అనుమానదృక్కులతో చూడటం, చురుగ్గా పనిచేస్తున్నవారికి వ్యతిరేకంగా ముఠాలను ప్రోత్సహించటం, విశ్వాసపాత్రులనుకున్న నాయకులకే అంతా కట్టబెట్టడం ఇంకా తగ్గలేదు. హరియాణాలో ఓటమికి ఇలాంటి పోకడలు కూడా కారణం. ఇప్పుడు ఢిల్లీ పార్టీలో ఉన్న అంతర్గత లోటుపాట్లను సవరించి బలోపేతం చేయటంపై దృష్టి సారించక ఆప్‌పై ఆరోపణతో కాలక్షేపం చేయటం కాంగ్రెస్ బలహీనతను సూచిస్తుంది. బెళగావిలోనైనా ఆ పార్టీకి జ్ఞానోదయమవుతుందా?

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.1.24 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** విశాఖ రా.8.05 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.12.26 నుండి 2.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.44 నుండి 9.32 వరకు తదుపరి ప.12.26 నుండి 1.14 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.18 నుండి 12.03 వరకు.

సూర్యోదయం : 6.32
సూర్యాస్తమయం: 5.29
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

మన అడుగులు ఎటువైపు?!

విశ్లేషణ



రాజ్‌మోహన్ గాంధీ

భారత రాజ్యాంగానికి శతాబ్దాల ముందు.. ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు, యూదులను భారతదేశపు మట్టిలో చట్టబద్ధమైన భాగస్వాములుగా మన దేశ మూలవాసులు అంగీకరించారు. మన పూర్వీకులు మానవత్వాన్ని ఒకే కుటుంబంగా అర్థం చేసుకున్నారు. ప్రాచీన సంస్కృత పదబంధమైన 'వసుధైక కుటుంబం', ప్రాచీన తమిళ పద్యమైన 'యాదుం ఊరే యావరం కేళిర్' అర్థం కూడా ఇదే! కానీ ఇప్పటి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. సహజీవనంతో భాగస్వామ్యాన్ని నిర్మించుకోవడం కంటే నిన్నటి రోజుని పునర్నిర్మించడానికే ప్రయత్నాలు జరుగుతున్నట్లనిపిస్తోంది. గతాన్ని మార్చలేము. గతం నుంచి కేవలం నేర్చుకోగలం. గతాన్ని పునర్వ్యవస్థీకరించే ప్రచారాలు వర్తమానాన్ని గాయపరుస్తాయనేది చరిత్ర నేర్పిన పాఠం.

భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్‌లు 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టంతో ముడిపడిన పిటిషన్‌లను తిరిగి విచారించినప్పుడు, మీడియా మరోసారి పిటిషనర్లను 'హిందూ' లేదా 'ముస్లిం' అనే రెండు పక్షాలుగా పేర్కొంటుంది. సీజేఐ, ఆయన తోటి న్యాయమూర్తులు తమ తీర్పును ఇచ్చిన తర్వాత, మీడియా 'విజయం సాధించిన పక్షం' అనే శీర్షికను పెడుతుంది. నిజానికి, ఆ తీర్పు విజయాన్ని మించి మరింత ప్రాముఖ్యం కలిగినది. ఇది రెండు సంఘర్షణాత్మక దృక్పథాల మధ్య ప్రభావం చూపుతుంది, ఒకటి భారతదేశంలో సమానత్వంతో కూడిన ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటుంది, మరొకటి మెజారిటీ ఆధిపత్యాన్ని వాగ్దానం చేస్తుంది. ఆ తీర్పు హిందూ మతంపై ప్రపంచ అవగాహనను కూడా ప్రభావితం చేస్తుంది.

చికాగోలో 1893లో జరిగిన ప్రపంచ సర్వ మత మహాసభ ముందు స్వామి వివేకానంద పేర్కొన్న ప్రఖ్యాతిగాంచిన మాటలు హిందూ మతానికి ప్రపంచవ్యాప్త ప్రతిష్ఠ తేవడంలో సాయపడ్డాయి: ''సహనం, సార్వత్రిక అంగీకారం రెండింటినీ ప్రపంచానికి బోధించిన మతానికి చెందినందుకు నేను గర్విస్తున్నాను. మేము విశ్వవ్యాప్త సహనాన్ని మాత్రమే నమ్ముతాము, మేము అన్ని మతాలూ నిజమని అంగీకరిస్తాం'' అన్నారు. తిరిగి 1896లో లండన్‌లో... ''భారతీయులు ప్రజాస్వామ్యాన్ని హత్తుకుంటారు. ఐక్యతను, సమానత్వాన్ని ప్రతిష్ఠిస్తారు'' అని పునరుద్ఘాటించారు.

భారతదేశం ఆలింగనం చేసుకోవాలని వివేకానంద ఆశించిన ప్రజాస్వామ్యం, భారత గడ్డపై ప్రతిష్ఠించాలని ఆయన కోరుకున్న ఐక్యత, నాటాలనుకున్న సమానత్వపు మొక్కలు.. భారత రాజ్యాంగం ఆమోదం పొందిన 1949 నాటి నుండి కనిపించాయి. దాని పీఠిక సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం; ఆలోచన, వ్యక్తీకరణ, నమ్మకం, విశ్వాసం, ఆరాధనా స్వేచ్ఛ; హోదా, అవకాశాల సమానత్వం; అలాగే... సోదరత్వం, వ్యక్తి గౌరవం, దేశ ఐక్యత, సమగ్రతలకు హామీ ఇస్తోంది.

తదుపరి 75 సంవత్సరాలలో, కొన్ని తీవ్రమైన మినహాయింపులను పక్కన పెడితే, భారతదేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఆదేశాలను ఉల్లంఘించకుండా చాలా వరకు దూరంగా ఉన్నాయి. అయితే, ఆగ్రహం పెద్ద సంఖ్యలో ప్రజలను ఉత్తేజపరిచినప్పుడు, హింసను నియంత్రించడానికి అధికారులు నిరాకరించినప్పుడు రాజ్యాంగ వాగ్దానాలు మృతప్రాయంగా మారటం తెలిసిందే. సుప్రీం కోర్టు తన 2019 నాటి అయోధ్య తీర్పులో పేర్కొన్నట్లుగా, 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో ఇదే జరిగింది. 2019 నాటి ఆ తీర్పులో, మసీదు ఉన్న మైదానంలో రామమందిరాన్ని నిర్మించడానికి సుప్రీంకోర్టు అధికారం ఇచ్చింది. ఆ మసీదును



ప్రార్థనా స్థలాల చట్టం–1991 నుండి జాగ్రత్తగా మినహాయించారు. ఇప్పుడు సుప్రీంకోర్టు ఇతర మసీదుల పునాదులపైన కూడా మునుపటి హిందూ పుణ్యక్షేత్రాల చిహ్నాల కోసం శోధించడాన్ని అనుమతిస్తే, ఆ చట్టానికి అర్థమే లేకుండా పోతుంది. పైగా, అటువంటి తీర్పు... హిందూ మతం అసహనంతో, ఆగ్రహంతో కూడుకున్నదనీ; వివేకానంద, ఆయనతో ఏకీభవించిన నాలుగు తరాల హిందూ ఆలోచనాపరులు ఆనాడు వాస్తవాన్ని గ్రహించలేకపోయారనీ ప్రపంచానికి చాటి చెబుతుంది.

అతని లేదా ఆమె పూర్వీకుడు నా పూర్వీకుడికి హాని కలిగించినందున నేను ఎవరినైనా గాయపరచడం చట్టబద్ధం కాదని ఆధునిక ప్రపంచం అంగీకరిస్తుంది. మూలవాస ఆఫ్రికన్‌లు, అమెరికన్లు, కెనడియన్లు, ఇంకా ఆస్ట్రేలియన్లు స్వదేశీ అనుమతి లేకుండా తమ భూమిలో స్థిరపడిన బయటివారి (భారతదేశం నుండి వచ్చిన వ్యక్తులు సహా) వారసులను బహిష్కరించాలని డిమాండ్ చేయరు. ఈ 'అంగీకారాన్ని' మనం మానవత్వం, ఇంగితజ్ఞానం, వ్యావహారిక సత్తావాదం లేదా మరొకదాని ఘనతగా పేర్కొన్నప్పటికీ, అది మన ప్రపంచ పురోగతి గాథను గుర్తించింది.

భారత రాజ్యాంగానికి శతాబ్దాల ముందు.. ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు, యూదులను భారతదేశపు మట్టిలో చట్టబద్ధమైన భాగస్వాములుగా మన దేశ మూలవాసులు అంగీకరించారు. మన పూర్వీకులు మానవత్వాన్ని ఒకే కుటుంబంగా అర్థం చేసుకున్నారు. ప్రాచీన సంస్కృత పదబంధమైన 'వసుధైక కుటుంబం', ప్రాచీన తమిళ పద్యమైన 'యాదుం ఊరే యావరం కేళిర్' అర్థం కూడా ఇదే.

నేను 1999లో రాసిన పుస్తకం, 'రివెంజ్ అండ్ రీకన్సిలియేషన్: అండర్‌స్టాండింగ్ సౌత్ ఏషియన్ హిస్టరీ'లో పేర్కొన్నట్లుగా, బుద్ధుడు ప్రబోధించిన సోదరభావానికీ, మహా భారత కథలో ఆధిపత్యం వహించిన ప్రతీకారానికీ మధ్య ఏదో ఒక దానిని మన ఉపఖండంలోని ప్రజలు ఎంచుకోవాల్సి వచ్చింది.

ప్రతీకారం సూత్రంగా, సర్వత్రా సంహారమే పరాకాష్ఠగా కనిపించే మహాభారతంలో కూడా, సయోధ్య స్ఫూర్తి, పాఠకుల హృదయాన్ని సాంత్వనపరిచే శక్తిమంతమైన మినహాయింపులు ఉండటం కనిపిస్తుంది. భారత ఇతిహాసంలోని అత్యంత నాటకీయ సన్నివేశాలలో, యుద్ధం ముగిసిన తర్వాత, దాదాపు ప్రతి కథానాయకుడు మరణానికి గురైన తరువాత, దుఃఖంలో ఉన్న స్త్రీలను, జీవించి ఉన్న కొంతమంది యువరాజులను పురాణకర్త వ్యాసుడు ఓదార్చాడు. వ్యాసుడు అప్పుడప్పుడు కథా సన్నివేశాలలోకి ప్రవేశిస్తాడు. 'నేను మీ దుఃఖాన్ని పోగొడతాను' అని దుఃఖిస్తున్న వారితో చెబుతూ, వ్యాసుడు చనిపోయిన వారిని భాగీరథీ నదీ జలాల నుండి బయటకు వచ్చేలా చేశాడు: ద్వేషం అసూయ నుండి ప్రక్షాళన కాబడినది / తండ్రిని తల్లిని కొడుకు కలిసాడు / భార్య భర్తను కలుసుకున్నది / స్నేహితుడు స్నేహితుడిని పలకరించాడు/ పాండవులు కర్ణుడిని కలిశారు/ అతడిని కౌగిలించుకున్నారు/ అని రాశాడు. అది సయోధ్యకు సంబంధించిన దృశ్యం. అక్కడ దుఃఖం లేదు, భయం లేదు, అనుమానం లేదు, నిందలు లేవు. అది ప్రేమించే మనసుల కలయిక తప్ప మరేమీ కాదు. (పి లాల్ వ్యాఖ్యానం).

అయితే తెల్లవారుజాము నాటికి, ఆ కలయిక కల ముగిసింది. జీవం పోసుకున్న వారు భాగీరథీ నదీ జలాల లోతుల్లోకి తిరిగి వెళ్లిపోయారు. పాండవుల ఆధిపత్యాన్ని ప్రకటించడానికి అర్జునుడు సాగించిన యుద్ధానంతర ఉపఖండ దండయాత్ర సమయంలో మరొక సయోధ్య దృశ్యం మనకు కనిపిస్తుంది. సైంధవ భూభాగంలో (సింధ్‌లో) ఓడిపోయిన కౌరవుల సోదరి దుశ్శల, ఒక బిడ్డతో కలిసి అర్జునుడిని కలుస్తుంది. అర్జునుడు అన్యాయంగా చంపిన కౌరవ పక్ష యోధుడైన జయద్రథుడిని దుశ్శల వివాహం చేసుకుంది. అర్జునుడు ఆమె కొడుకు సురథుడి గురించి దుశ్శలను అడుగుతాడు. 'అతను చనిపోయాడు,' అని ఆమె చెబుతుంది, 'అతను విరిగిన హృదయంతో మరణించాడు, ఎందుకంటే నీవు అతని తండ్రిని చంపావని సురథునికి తెలుసు. నేను ఇప్పుడు సురథుడి కొడుకును నీ వద్దకు తీసుకువస్తాను. నేను నీ రక్షణను కోరుతున్నాను'' అంటుంది. అర్జునుడు దుశ్శలని అక్కున చేర్చుకుని తన రాజభవనానికి రావాలని ఆమెను కోరాడు. తర్వాత అర్జునుడు సైంధవులతో సంధి చేసుకున్నాడు.

మనం ఇప్పుడు ఒకటే ప్రశ్నించాలి. ఈరోజు భాగస్వామ్యాన్ని నిర్మించుకోవడం కంటే నిన్నటి రోజుని పునర్నిర్మించడానికి ప్రయత్నించడం ముఖ్యమా? అని. గతం ముగిసిపోయింది. మనం దానిని మార్చలేం. జరిగిపోయిన దాన్ని పునరుద్ధరించలేము. అవును, మనం చరిత్ర నుండి కేవలం నేర్చుకోగలం. గతాన్ని పునర్వ్యవస్థీకరించే ప్రచారాలు వర్తమానాన్ని గాయపరుస్తాయనేది చరిత్ర నేర్పే పాఠాలలో ఒకటి.

వ్యాసకర్త సంపాదకుడు, ప్రముఖ రచయిత

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా


రాజ్యాంగ ఉల్లంఘన



ప్రార్థనా స్థలాల చట్టం–1991ని వీలైనంత త్వరగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి. ఇది ఒక నల్ల చట్టం. చట్టం చేసే ముందర ఎలాంటి చర్చా జరగలేదు. ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఉల్లంఘిస్తోంది.

– విష్ణు శంకర్ జైన్, సుప్రీంకోర్టు న్యాయవాది

కూలి చీమలు



ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శక్తిమంతం చేయటంలో 90 శాతం శ్రమను అందిస్తున్నది దక్షిణార్ధ గోళంలోని అభివృద్ధి చెందుతున్న దేశాలే! అయినప్పటికీ ప్రపంచ ఆదాయంలో ఆ దేశాలు పొందుతున్నది 21 శాతం మాత్రమే.

– కోలిన్ బోడేల్, ఫిలాసఫీ ప్రొఫెసర్

గాంధీ మార్గం



కాంగ్రెస్ ఈ దేశాన్ని సమైక్యంగా ఉంచుతూ వస్తోంది. 100 సంవత్సరాల క్రితం ఈ రోజు (26 డిసెంబర్) మధ్యాహ్నం 3 గంటలకు గాంధీజీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నేడు ఇదే రోజు, అదే సమయానికి సి.డబ్ల్యు.సి సమావేశమై... గాంధీజీ, కాంగ్రెస్ పార్టీ నిర్దేశించిన భిన్నత్వంలో ఏకత్వ సందేశాన్ని పునరుద్ఘాటించింది.

– గౌతమ్ నౌటియల్, ఐ.ఎన్.సి. జాతీయ సమన్వయకర్త

న్యాయ నిరాకరణ



చెన్నై అన్నా యూనివర్సిటీ ఘటనలో రేపిస్టు వరుస నేరాలకు పాల్పడిన వ్యక్తి. అంతకంటే ఘోరమైన సంగతి... అధికార పార్టీ రక్షణలో శిక్షల్ని తప్పించుకొని తిరుగుతున్న కార్యకర్త. నేరస్థులను కాపాడటం అంటే బాధితులకు న్యాయాన్ని నిరాకరించటమే!

– నందు మౌర్య, బ్లాగర్

అవార్డుల అల్మరా!



ఈ లెక్కన చూస్తే మోదీజీకి వచ్చే అవార్డుల కోసం ప్రత్యేకంగా ఒక అల్మరా అవసరం. భారతీయ అవార్డులు, అంతర్జాతీయ అవార్డులు, చివరికి ఏదో ఒక రోజు నక్షత్ర మండలాల నుంచి కూడా ఆయనకు అవార్డులు రావచ్చు. (కువైట్ పర్యటనలో నరేంద్ర మోదీ ఆ దేశపు అత్యున్నత అవార్డును పొందటంపై)

– అమనా బేగం అన్సారీ, పాలసీ ఎనలిస్టు

మారని తీరు!



మొదట, చండీగఢ్ మునిసిపల్ ఎన్నికల సమయంలో బ్యాలెట్ ఓట్లను తారుమారు చేయటం ద్వారా అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని హతమార్చాడు. ఇప్పుడు అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ పెట్టిన తీర్మానానికి అంతరాయం కలిగించాడు. బీజేపీ కౌన్సిలర్ అయిన ఈ మనిషి పేరు గుర్తుందా? అనిల్ మాసిహ్!

– శంతను, గాంధేయవాది

సీనియర్.. జూనియర్



నేను మద్రాస్ ఐ.ఐ.టి.లో పోస్ట్‌డాక్‌గా ఉన్నప్పుడు సీనియర్, జూనియర్ అనే భేదం ఉండేది. పై నుంచి కిందికి – సీనియర్ ఫ్యాకల్టీ, సీనియర్ స్టాఫ్; జూనియర్ ఫ్యాకల్టీ, జూనియర్ స్టాఫ్; పోస్ట్‌డాక్స్, పీహెచ్‌డీ స్టూడెంట్... ఇలా ఉండేది. ఓసారి నేను సీనియర్స్‌తో కలిసి భోజనానికి కూర్చున్నప్పుడు వెంటనే వారు నన్ను అక్కడి నుంచి లేపేశారు.

– నిర్మాల్య కజూరి, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఇన్ బాక్స్

తెలుగు వేదిక... విశ్వ వీచిక

మాతృభాష పరిరక్షణే ధ్యేయంగా ప్రపంచ తెలుగు రచయితల సంఘం నడుం బిగించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా భాష, సాహిత్యాల్లో మార్పు రావాల్సిన ఆవశ్యకతను గుర్తెరిగి ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలోని కాకరపర్తి భావనారాయణ కళాశాల వేదికగా ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తోంది.



సంఘం స్వర్ణోత్సవ సంవత్సరానికి చేరువలో ఉండగా ఈ మహాసభలు జరగడం విశేషం. సామాజిక చైతన్యం నింపడంలో రచయితల పాత్ర ఎంతో ఉందని చెప్పడం, ప్రధానంగా యువతలో ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని నింపి కలం పట్టించడం ఈ సభల ఉద్దేశంగా చెప్పవచ్చు. రచయితలు కొత్త విషయాలు తెలుసుకోవడం, తెలిసిన వాటిని మరింత మెరుగుపరుచుకోవడం, ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడానికి దోహదం కానున్నాయి. ఇప్పటికే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న రచయితలకు ఇప్పుడు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అందుబాటులోకి వచ్చిన తరుణంలో ఈ సభలు మరింత ఉపకరిస్తాయనడంలో సందేహం లేదు.

మహాసభలు శని, ఆదివారాల్లో మూడు వేదికలపై జరగనున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి 1,300 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరితోపాటు 300 మంది విద్యార్థులు, 100 మంది అతిథులు పాల్గొంటారు. పలువురు సాహితీవేత్తలు, విద్యావేత్తలు, పత్రికా సంపాదకులు, కవులు, రచయితలు... సాహితీ సదస్సులు, చర్చాగోష్ఠులు, కవి సమ్మేళనాల్లో పాలుపంచుకోబోతున్నారు.

వివిధ సాహితీ ప్రక్రియల్లో కార్యశాల నిర్వహించనున్నారు. మినీ కవిత, వచన కవిత, పద్య రచన, కథ, నవల, గేయాలు, గజల్స్, వ్యాస రచన, పరిశోధన, బాల సాహిత్యం, అనువాద ప్రక్రియ, సోషల్ మీడియా వాడకం... ఇంకా అనేక అంశాల్లో శిక్షణ ఇస్తారు. అంతకు మించి ఆహూతులకు తెలుగింటి వంటకాలతో షడ్రసోపేతమైన విందు భోజనం ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు భాషపై మమకారం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలన్నది సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఆశ, ఆకాంక్ష!

– చెన్నాప్రగడ వీఎస్సెన్ శర్మ, సీనియర్ జర్నలిస్ట్

(విజయవాడలో రేపు, ఎల్లుండి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు)

జమిలి ఎన్నికలంటేే భయమెందుకు?


అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

మోదీ ప్రభుత్వం దేశానికి ఉపయోగపడే పని ఏది చేసినా ఈ దేశంలోని ప్రతిపక్షాలు అడ్డుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం జమిలి ఎన్నికల చట్టం విషయంలోనూ ఇదే జరుగుతోంది. పార్లమెంటు శీతకాల సమావేశాల్లో జమిలి ఎన్నికల నిర్వహణకు నిర్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర క్యాబినెట్ ఆమోదించి, పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ప్రవేశాన్ని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. ఈ బిల్లుపై విస్తృత చర్చ జరగాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచించి, బీజేపీ లోక్‌సభ సభ్యుడు పీపీ చౌదరి ఆధ్వర్యంలో 32 మంది పార్లమెంటు సభ్యులతో జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసింది. దీన్ని దేశహితాన్ని కోరే ప్రజలందరూ స్వాగతిస్తున్నారు.

పార్లమెంట్ తరహా విధానం నుండి దేశాన్ని అధ్యక్ష తరహా విధానంలోకి మార్చడానికీ, ప్రాంతీయ పార్టీల మనుగడను తుడిచి పెట్టడానికీ, దేశాన్ని నియంతృత్వం వైపు నడిపించడానికీ, ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చడానికీ జమిలి ఎన్నికల చట్టాన్ని తీసుకొచ్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని చేసే వాదనలలో పస లేదు. వివిధ రాష్ట్రాల్లో, వివిధ సమయాలలో ఎన్నికలు జరగడం వలన అధికారంలో ఉండే ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకతను సులభంగా గ్రహించవచ్చని ఈ చట్ట వ్యతిరేకులు చెప్పే వాదన సత్యదూరం. ఒక ప్రజా ప్రతినిధిని ఒకసారి ఎన్నుకుంటే ప్రత్యేక పరిస్థితులలో తప్ప అన్యథా తొలగించడానికి మన రాజ్యాంగంలో అవకాశం ఉండదు. ఈ విషయం తెలిసీ వితండవాదం ఎందుకు చేస్తున్నారు? చాలా మంది ఓటర్లు కేంద్రంలో జాతీయ విషయాలలో స్థిరంగా ఉండే ప్రభుత్వాలు ఉండాలని కోరుకుంటారు. అదే సమయంలో స్థానిక అవసరాలను, స్థానిక ప్రజల భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకునే ప్రభుత్వాలు ఉండాలని కూడా కోరుకుంటారు. 2014 నుండి కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, జార్ఖండ్, ఢిల్లీ వంటి ప్రాంతాలలో బీజేపీయేతర ప్రభుత్వాలు అధికారంలో కొనసాగడం వలన ప్రజలకు ఏమైనా నష్టం వచ్చిందా? కేంద్రంలో ఒక పార్టీ అధికారంలో ఉండి, రాష్ట్రంలో మరొక పార్టీ అధికారంలో ఉంటే... రాష్ట్రపతి పరిపాలన వినియోగించి, రాష్ట్రంలో అస్థిర పరిస్థితులను సృష్టించడానికి అవకాశం లేకుండా ఎస్సార్ బొమ్మై కేసు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్ ఉండనే ఉంది.




1952 నుంచి 1967 వరకు కేంద్ర, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. మూడవ పార్లమెంటు ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలను 356 నిబంధనను వినియోగించి, కూల్చడం; 1967లో జాతీయ కాంగ్రెస్‌లో చీలిక రావడం, ఇందిరా గాంధీ ప్రధాని కావడం, వాస్తవంగా 1972లో జరగవలసిన పార్లమెంటు ఎన్నికలను 1971లోనే జరపడం; 1975లో ఎమర్జెన్సీని విధించి, 1977లో పార్లమెంట్ ఎన్నికలు జరపడం వంటి కారణాల వల్ల కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు పార్లమెంట్ ఎన్నికలతో సమాంతరంగా జరగడానికి వీలు లేకుండా పోయింది. ఎన్నికల ఖర్చు, నిర్వహణ భారం, ఎన్నికల కోడ్ నియమాలతో దేశ అభివృద్ధి కార్యక్రమాలు ఆగడం ఇత్యాది విషయాలను అధిగమించడానికి జమిలి ఎన్నికలే మార్గం అని నిపుణులు అంటున్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఈ దేశంపై ఏ మాత్రం విశ్వాసం ఉన్నా, జమిలి ఎన్నికల నిర్వహణకు నిర్దేశించిన 129వ రాజ్యాంగ సవరణకు సహకరించేది. అది తన తప్పులను తెలుసుకుని హుందాగా, ఉన్నతమైన ప్రతిపక్షంగా, దేశ అభివృద్ధికి సంబంధించిన విషయాలలో ప్రభుత్వానికి సహకరించాలనేది ఈ దేశ హితైషుల ఆకాంక్ష!

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

గతం గతః

బలరామ కృష్ణులకు చెల్లెలు సుభద్ర. కుంతీదేవి వసుదేవుడికి చెల్లెలైన కారణంగా, వరసకు సుభద్ర అర్జునుడికి మరదలు అవుతుంది. శ్రీకృష్ణుడికి సుభద్రను అర్జునుడికి ఇచ్చి పెళ్ళిచేయడం ఇష్టం. బలరాముడికి దుర్యోధనుడంటే శిష్య వాత్సల్యం ఉన్న కారణంగా ఆ సంబంధమంటే ఇష్టపడడు. ఆ సంగతిని గ్రహించిన శ్రీకృష్ణుడు మాయోపాయం చేసి సుభద్రార్జునులను ఒకచోట చేర్చి, వారి మధ్య అనురాగం పెరిగి పెళ్ళికి దారి తీసేలా చేశాడు. బలరాముడు ద్వారకలో లేని రోజులను చూసి వారిద్దరికీ రహస్యంగా పెళ్ళి చేసి, సుభద్రను తీసుకెళ్ళమని అర్జునుడితో చెప్పాడు. అలా శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ఒకనాడు సుభద్రార్జునులు ఇరువురూ ద్వారకను వదిలి ఇంద్రప్రస్థానికి వెళ్ళిపోయారు.



ఇంటికి చేరాక విషయం తెలుసుకున్న బలరాముడు అగ్గి మీద గుగ్గిలమే అయ్యాడు. 'మేనత్త కొడుకులన్న బంధుత్వ భావనతో అన్ని విధాల సహాయపడుతూ ఆపదలలో ఆదుకుంటుంటే, ఆ సంగతి మరచి ఒళ్ళు కొవ్వెక్కి ఉచ్చనీచాలు గానక ఇంత పని చేశాడు అర్జునుడు. ఇటువంటి పని చేసిన తరువాత కూడా పూర్వంలా వారిని ఎలా గౌరవంగా చూడగలం?' అని బల రాముడి తృప్తి కోసంగా అర్జునుడిని దూషించి మాట్లాడాడు శ్రీకృష్ణుడు. అయితే ఆ మాటలతో సరిపోదు కదా! సుభద్రార్జునుల పెళ్ళికి అన్నను ఒప్పించి, ధర్మరాజు వద్దకు తీసుకు వెళ్ళి, అప్పటి వరకు జరిగినదాన్ని అందరికీ ఆమోదమైనదిగా చేసి, వివాహ బంధాన్ని స్థిర పరచాలి. అందుకోసమే, మరింత మాటల గారడీని ప్రయో గించి, శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు కూచిమంచి జగ్గకవి రచించిన 'సుభద్రా పరిణయం' కావ్యం షష్ఠాశ్వాసంలో...

ఆ. అయినగాని మించినట్టి కర్జమునకు / జింత యేల వట్టి పంతమేల
సంతసంబుపూని శాంతమూర్తివి గమ్ము / రమ్ము ధర్మజుని పురమ్మునకు

'మనకు ఇష్టం లేనిదే అయినప్పటికీ, జరిగిన కార్యమేదో జరిగిపోయింది. దానికి ఇప్పుడు బాధపడడం వలన ప్రయోజనం ఏముంటుంది? ఇప్పుడు మనం పంతం పట్టి ఏమి సాధించగలం? కనుక, కోపం తగ్గించుకుని, శాంతాన్ని అవలంబించి ధర్మజుని వద్దకు వెళదాం, పద అన్నయ్యా!' అని శ్రీకృష్ణుడు బలరాముడిని సమాధానపరిచి ప్రయాణం కట్టించాడు. ఇష్టం లేనిదైనా సరే జరిగిపోయిన దాని మీద చింతిస్తూ కూర్చోరాదని తెలిపే పాఠమిది.

– భట్టు వెంకటరావు

యువకుల ప్రాణం తీసిన ఫ్లెక్సీలు

- విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి
- సీఎం రాక సందర్భంగా ఏర్పాటు
- పొలాలకు సమీపంలో ఉండటంతో తీయబోయిన యువకులు
- మెదక్ జిల్లా కొల్చారం మండలంలో ఘటన


ప్రసాద్


నవీన్

కొల్చారం (నర్సాపూర్): విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలంలో చోటు చేసుకుంది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం ప్రకారం.. కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎక్కెం యాదగిరి కుమారుడు నవీన్ (21), పసుపుల చిన్న వెంకటేశం కుమారుడు పసుపుల ప్రసాద్ (20) వారి వ్యవసాయ పొలంలో నారు మడికి నీరు పెట్టి, అడవి పందులు రాకుండా మంటలు పెట్టడానికి వెళ్లారు. కాగా, బుధవారం మెదక్ జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా వీరి పొలాలకు సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలు విద్యుత్ హైటెన్షన్ వైర్‌కు ఆనుకొని ఉండటంతో వాటిని ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ తీయకుండా వదిలేశాడు. అయితే, ప్రసాద్, నవీన్ ఫ్లెక్సీలు తీయడానికి ప్రయత్నించగా విద్యుత్ సరఫరా కావడంతో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకొని నిర్లక్ష్యంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మెదక్–నర్సాపూర్ జాతీ య రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకొని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇవ్వడంతో శాంతించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఇద్దరు యువకులు ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతుల్లో ఒకరైన ప్రసాద్‌కి ఇటీవలే పెళ్లి కుదిరినట్లు గ్రామస్తులు తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మెదక్ చేరుకొని యువకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున అందజేశారు.

అది అంబేడ్కర్‌ను వ్యతిరేకించడమే

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



అల్వాల్: అంబేడ్కర్ కోరుకున్న సామాజిక న్యాయస్ఫూర్తికి ఎస్సీ వర్గీకరణ అద్దం పడుతుందని, ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడమంటే అంబేడ్కర్‌ని వ్యతిరేకించడమే అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వ్యాఖ్యానించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం లోతుకుంటలోని శుభశ్రీ గార్డెన్‌లో మాదిగ కళామండలి జాతీయ అధ్యక్షుడు అశోక్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని చారిత్రక తీర్పును ఇచ్చిందని తెలిపారు. అయితే వర్గీకరణను అడ్డుకోవడానికి మాల సామాజిక వర్గంలోని కొంతమంది స్వార్థపరులు కుట్రలకు తెరలేపుతున్నారని, ఆ కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత మాదిగ ప్రజల మీద ఉందని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకుల కుట్రలను ఎదుర్కోవడానికి మాదిగ కళానేతలతో నగరంలో వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజా యుద్ధనౌక ఏపూరి సోమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి జాజుల లేఖ



సాక్షి, హైదరాబాద్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే తీర్చాలని ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. గత 19 రోజులుగా జిల్లా కలెక్టరేట్ల ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని, ఎన్నికల సమయంలో ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత 20 ఏళ్లుగా 19,300 మంది ఉద్యోగులు విద్యాశాఖలో పనిచేస్తూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని వెల్లడించారు. ఉద్యోగుల సమ్మెను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ లు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లేఖలో జాజుల కోరారు.



తెల్ల బంగారమా.. మల్లెపూల వనమా!

తెల్ల బంగారం సాగుకు కేరాఫ్‌గా నిలిచే ఆదిలాబాద్ జిల్లాలో పత్తి పంటను సాగు చేస్తున్న అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. చేతికి అందివచ్చిన పత్తిపంటను తీసేందుకు కూలీలు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోకు రూ.10 చొప్పున చెల్లించడంతో పాటు కూలీల రాకపోకలకు వాహన డబ్బులు కూడా అందజేస్తున్నప్పటికీ కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. ఫలితంగా పంట చేలల్లో పూర్తిస్థాయిలో పత్తి విచ్చుకోవడంతో చేలన్నీ మల్లెతోటలను తలపిస్తున్నాయి. తలమడుగు మండలంలోని పలు గ్రామాల్లో ఎటు చూసినా పత్తివిచ్చుకున్న దృశ్యాలు కన్పిస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ – ఆదిలాబాద్

ఆత్మహత్యలా.. హత్యలా?

- కామారెడ్డి జిల్లా అడ్లూర్ చెరువు ఘటనలో భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్ మృతదేహం కూడా లభ్యం
- బుధవారం రాత్రే చెరువులోంచి కానిస్టేబుల్ శ్రుతి, నిఖిల్ శవాలు వెలికితీత
- ఒకేచోట, ఒకే సమయంలో 3 మరణాలు
- పోలీసులకు సవాల్‌గా మారిన దర్యాప్తు
- పోస్టుమార్టం నివేదిక తర్వాతే వివరాలు తెలిసే అవకాశం
- కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధుశర్మ వెల్లడి


సాయికుమార్


శ్రుతి


నిఖిల్


సాయికుమార్ మృతదేహం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం/భిక్కనూరు: ఒకే సమయంలో, ఒకేచోట ఒక ఎస్ఐ, కానిస్టేబుల్, మరో యువకుడు చనిపోవటం కామారెడ్డి జిల్లాలో కలకలం రేపుతోంది. భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్ (32), బీబీపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి (30), బీబీ పేటకే చెందిన నిఖిల్ (29) అనే యువకుడి మృతదేహాలు జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో లభ్యమయ్యాయి. శృతి, నిఖిల్ మృత దేహాలు బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత బయటకు తీయగా, గురువారం ఉదయం 8.30 గంటలకు సాయికుమార్ మృతదేహం కూడా అదే చెరువులో దొరికింది. దీంతో వీరు ఎలా చనిపోయారు? ఇక్కడికి ఎందుకు వచ్చారు? ఇవి ఆత్మహత్యలా? లేక ఈ మరణాల వెనుక ఇంకా ఏదైనా కారణం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన పోలీస్ శాఖను కూడా కుదిపేస్తోంది. మృతులు ముగ్గురికి చాలాకాలం నుంచి పరిచయం ఉండటంతో రకరకాల చర్చ జరుగుతోంది.

అనుకోకుండా బయటపడిన ఘటన..

ఈ మూడు మరణాల ఘటన కూడా అనుకోకుండా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సాయికుమార్ ఫోన్ స్విచాఫ్ వస్తోందని ఆయన కుటుంబ సభ్యులు బుధవారం పోలీస్ ఉన్నతాధికారులకు తెలపటంతో.. ఆయన మొబైల్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు గాలింపు చేపట్టారు. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద సాయికుమార్, నిఖిల్ చెప్పులు, సెల్‌ఫోన్లు.. శ్రుతి మొబైల్ కనిపించాయి. ఎస్ఐ కారు కూడా చెరువు సమీపంలో ఉండడంతో అనుమానం వచ్చిన పోలీసులు.. గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా మరణాల మిస్టరీ బయటపడింది. జిల్లా ఎస్పీ సింధుశర్మ, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి అక్కడే ఉండి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. దాదాపు 12 గంటల పాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. 3 మృతదేహాలకు ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం మధ్యాహ్నం పోస్టుమార్టం పూర్తిచేసి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంతుచిక్కని కారణాలు: ఈ ముగ్గురి మరణం వెనుక గల కారణాలు ఏమిటన్నది అంతుచిక్కడం లేదు. వీరు ఎలా చనిపోయారన్నది పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే తెలుస్తుందని ఎస్పీ సింధుశర్మ తెలిపారు. అయితే, వీరి మరణంపై జిల్లాలో తీవ్రంగా చర్చ సాగుతోంది. ఎస్సై సాయికుమార్ బీబీ పేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన సమయంలో శ్రుతితో సన్నిహితంగా ఉండేవారని ప్రచారం జరుగుతోంది. నిఖిల్ ఇటు సాయికుమార్‌తో అటు శ్రుతితో క్లోజ్‌గా ఉండేవాడని సమాచారం. ముగ్గురూ ఒకేసారి చనిపోవడంతో వారి మధ్య నడిచిన వ్యవహారం ఏమిటన్నది ఇప్పుడు కీలకంగా మారింది. సాయికుమార్ స్వస్థలం మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామం. 2018 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన.. 2022 ఏప్రిల్ 13న బీబీపేటలో ఎస్ఐగా చేరారు. గత ఏడాది ఆగస్టు 1న భిక్కనూరు ఎస్ఐగా బదిలీ అయ్యారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన శ్రుతి బీబీపేటలో 2021 నుంచి పనిచేస్తోంది. బీబీపేటకు చెందిన తోట నిఖిల్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూనే, కంప్యూటర్ల రిపేర్లు చేసేవాడు. పోలీస్‌స్టేషన్‌లో కంప్యూటర్లు మొరాయించినపుడు అతడే వచ్చి రిపేర్ చేసి వెళ్లేవాడని చెబుతున్నారు. ఈ క్రమంలో ఈ ముగ్గురికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కలిసి చనిపోయేదాకా ఎందుకు వచ్చిందన్నదానిపై పోలీసులు దృష్టి పెట్టారు.

నా కొడుకు పిరికివాడు కాదు: పోస్టుమార్టం నిర్వహించిన కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్దకు మృతులకుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున చేరుకొని బోరున విలపించారు. తన కొడుకు కష్టపడి చదివి ఉద్యోగం సాధించాడని, ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని ఎస్ఐ సాయికుమార్ తండ్రి అంజయ్యకన్నీరుమున్నీరయ్యాడు. ఎవరో ఒకరిని కాపాడే ప్రయత్నంలో చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తంచేశారు. శ్రుతి తండ్రి పుండరీకం మాట్లాడుతూ.. ఈ ఘటన ఎలా జరిగిందనేది పోలీసులు తేల్చాలని కోరారు. నిఖిల్ చనిపోయిన విషయం పోలీసులు చెబితే తెలిసిందని అతని కుటుంబ సభ్యులు తెలిపారు.

చదువులో టాపర్

ఎస్ఐ సాయికుమార్ చిన్నతనం నుంచి చదువు లో టాపర్. 2007–2008లో పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచాడు. ఇంటర్‌లోనూ మంచి మార్కులు సాధించారు. హైదరాబాద్‌లోని సీబీఐటీలో బీటెక్ కోర్సు పూర్తి చేశాడు. 2018లో పోస్టల్ డిపార్టుమెంట్, ఏఆర్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో ఎస్సైగా మొదటి పోస్టింగ్ సాధించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ, బీబీపేట, భిక్కనూరులో ఎస్సైగా చేశాడు. రెండు పర్యాయాలు ఎస్పీ సింధుశర్మ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నాడు. 2022లో కర్నూల్ జిల్లా నంద్యాలకు చెందిన మహాలక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. మహాలక్ష్మి ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి అని తెలిసింది.

పాలమూరుపై నీలినీడలు

▶ మొదటి పేజీ తరువాయి

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయిస్తూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దీనిని ఏపీ వ్యతిరేకిస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సాగర్ ఎగువన ఉమ్మడి ఏపీకి లభ్యతలోకి వచ్చిన 45 టీఎంసీల జలాల వినియోగంపై ఏ రాష్ట్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదని ఏపీ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి ఫిర్యాదు చేసింది. మరోవైపు ఉమ్మడి ఏపీకి కృష్ణా జలాల్లో ఉన్న 811 టీఎంసీల వాటాతో పాటు పోలవరం నిర్మాణంతో సాగర్ ఎగువన లభ్యతలోకి వచ్చిన 45 టీఎంసీల జలాలను ఏపీ, తెలంగాణ మధ్య పంపిణీ చేసే బాధ్యతను కృష్ణా ట్రిబ్యునల్–2కు గతేడాది కేంద్రం అప్పగించింది. ప్రస్తుతం కృష్ణా జలాల పంపిణీ వ్యవహారం కృష్ణా ట్రిబ్యునల్–2 పరిధిలో ఉన్నందున ప్రాజెక్టు డీపీఆర్‌ను పరిశీలించలేమని సీడబ్ల్యూసీ స్పష్టం చేయడంతో ట్రిబ్యునల్ తీసుకోనున్న నిర్ణయంపైనే ప్రాజెక్టు భవితవ్యం ఆధారపడి ఉంది.

పనులు నత్తనడక

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో 'పాలమూరు'ను చేర్చింది. ఏటా రూ.6 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేసి వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ప్రస్తుత ఏడాది (2024–25)లో రూ.6130 కోట్లు, వచ్చే ఏడాది (2025–26) రూ.6313 కోట్ల పనులు చేయాలని నిర్దేశించుకుంది. అయితే గత ఏడాది కాలంలో రూ.4743 కోట్లు విలువైన పనులు మాత్రమే జరగడంతో నిర్దేశిత గడువు నాలుగేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లుల్లో రూ.1500 కోట్లు చెల్లించినప్పటికీ మరో రూ.1437 కోట్ల మేర బిల్లులను చెల్లించాల్సి ఉంది.

ఒక్క ఎకరాకూ అందని నీరు

శ్రీశైలం జలాశయం నుంచి 90 టీఎంసీల జలాలను తరలించి నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో 12.3 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 1200 గ్రామాలకు తాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. రూ.35,200 కోట్ల అంచనాలతో 2015 జూన్ 10న ప్రాజెక్టుకు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిపాలనాపర అనుమతులు జారీ చేయగా, తర్వాత అంచనా రూ.55,086 కోట్లకు ఎగబాకింది. గత ప్రభుత్వం రూ.27,554 కోట్ల విలువైన పనులు చేయగా, మొత్తం రూ.32,297 కోట్లు విలువైన పనులు పూర్తిచేసినా, ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందలేదు. ప్రాజెక్టుకు మరో రూ.22,789 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.

ఉద్దండాపూర్ పనులను అడ్డుకుంటున్న రైతులు...

స్థానిక రైతులు, గ్రామస్తులు అడ్డుకోవడంతో ఈ ప్రాజెక్టు ఆరు రిజర్వాయర్లలో ఒకటైన ఉద్దండాపూర్ రిజర్వాయర్ పనులు 2023 నవంబర్ నుంచి నిలిచిపోయాయి.ముంపునకు గురైన ఉద్దండాపూర్, వల్లూరు, పోలేపల్లి గ్రామాలతో పాటు శామగడ్డ, ఒంటిగుడిసె, చిన్నగుట్ట, రాగడిగుట్ట తండాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. తక్షణం రూ.30 కోట్ల పరిహారంగా చెల్లిస్తేనే పనుల పునరుద్ధరణ జరగనుంది.

కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై మీమాంస

గత ప్రభుత్వం ఉద్దండాపూర్ సహా 5 రిజర్వాయర్ల పనులను మాత్రమే ప్రారంభించింది. చివరిదైన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని విరమించుకుని ప్రత్యామ్నాయ మార్గంలో ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయాలని నిర్ణయం తీసుకుంది. అయితే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చినా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

లభించని పర్యావరణ అనుమతులు

పర్యావరణ అనుమతుల్లేకుండానే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు చేపట్టి తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడినందుకు గాను పర్యావరణ పరిహారంగా రూ.528 కోట్లను చెల్లించాలని ఎన్జీటీ ఆదేశించింది. తమ ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందుకు మరో రూ.300 కోట్ల జరిమానా చెల్లించాలని స్పష్టం చేసింది. అయితే ఈ ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ తర్వాత కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలోని నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) ఈ ప్రాజెక్టుకు పలు షరతులతో పర్యావరణ అనుమతులు జారీ చేయాలని గతేడాది సిఫారసులు చేసింది. పర్యావరణ పునరుద్ధరణకు రూ.153 కోట్లతో కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడిన అధికారులపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు పీసీబీ కేసును ఫైల్ చేసింది. తీవ్ర పర్యావరణ ఉల్లంఘనల ఆరోపణ లుండడంతో, ఈఏసీ సిఫారసులు చేసినా కేంద్రం పర్యావరణ అనుమతులివ్వడం లేదు.

ఇన్‌సర్వీస్ డాక్టర్ల 'పీజీ' ఆశలు అడియాశలేనా?

▶ మొదటి పేజీ తరువాయి

సొంత ప్రాంతంలో చదివినప్పటికీ... ఎంసెట్ ర్యాంకు ద్వారా ఇతర రాష్ట్రాల్లోనో, వేరే దేశంలోనో వైద్యవిద్య అభ్యసించి, సొంత రాష్ట్రంలో పనిచేస్తున్న డాక్టర్లు పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు అనర్హులుగా మారడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు వరుసగా నాలుగేళ్లు చదివి, అనంతరం రాష్ట్రంలోనే ఎంబీబీఎస్/ బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్ చదివిన వారే పీజీ అడ్మిషన్లలో స్టేట్ పూల్‌లో రాష్ట్రంలో చదివేందుకు అర్హులని ప్రభుత్వం 148, 149 జీవోల్లో స్పష్టం చేసింది. ఈ అంశంపై హైకోర్టు తన తీర్పులో ప్రస్తావించలేదు. దీంతో ఇంటర్ వరకు ఏపీ లేదా ఇతర రాష్ట్రాల్లో చదివి తెలంగాణలో ఎంబీబీఎస్ చేసిన వారు ప్రెసిడెన్షియల్ ఆర్డర్–1974 ప్రకారం 'లోకల్ ఏరియా' కిందికి వచ్చి పీజీ కోర్సులకు అర్హులవుతుండగా... ఇంటర్ వరకు తెలంగాణలో చదివినప్పటికీ... వైద్య విద్యను ఇతర రాష్ట్రాల్లో అభ్యసించి సొంత రాష్ట్రంలో పనిచేస్తున్న వారు అనర్హులుగా మారారు. ప్రభుత్వం ఎంబీబీఎస్ తెలంగాణలో చదివిన వారంతా స్థానికులే అన్న హైకోర్టు తీర్పును మాత్రమే సవాల్ చేసిన నేపథ్యంలో.. ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదివి ఇన్‌సర్వీస్ డాక్టర్లుగా ఉన్న వారి పరిస్థితి ఎటూ తేలకుండా పోతోంది. దీంతో వారు తమ స్థానికత అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బలయ్యేది ఇన్‌సర్వీస్ డాక్టర్లే..

తెలంగాణ ఏర్పాటయ్యేంత వరకు ఎంసెట్‌లో వచ్చిన ర్యాంకును బట్టి నాన్‌లోకల్ కేటగిరీలో మెరిట్ ఆధారంగా ఆంధ్ర, రాయలసీమలోని కళాశాలల్లో ఎంబీబీఎస్ విద్యనభ్యసించిన రాష్ట్రానికి చెందిన వారు వందలాది మంది ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణేతర ప్రాంతాల్లో వైద్యవిద్య పూర్తి చేసినప్పటికీ... ప్రభుత్వ సర్వీసులో చేరి గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగం చేసి, స్టేట్ పూల్ కింద 15 శాతం నాన్‌లోకల్ కోటాలో పీజీ అడ్మిషన్లు పొందేవారు. 148, 149 జీవోల ప్రకారం తెలంగాణలో వైద్యవిద్య అభ్యసించిన స్థానికులకే స్టేట్‌పూల్‌లో పీజీలో అడ్మిషన్లకు అర్హులని ప్రభుత్వం స్పష్టం చేయడంతో... ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్, ఇతర కోర్సులు చదివి ఇన్‌సర్వీస్‌లో ఉన్న వైద్యులకు పీజీకి అర్హత లేకుండా పోయింది. ఈ సంవత్సరం కాళోజీ యూనివర్సిటీ విడుదల చేసిన నోటిఫికేషన్‌లోనూ వీరికి దరఖాస్తు చేసుకునే ఆప్షన్ కూడా ఇవ్వలేదు.

పట్టించుకోని ప్రభుత్వం

ఇన్‌సర్వీస్ కోటాలో తెలంగాణలో ఉద్యోగం చేస్తున్న వైద్యులు తమకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. కానీ హైకోర్టు ఇచ్చిన 106 పేజీల తీర్పులో ఇన్‌సర్వీస్ డాక్టర్ల అంశాన్ని ప్రస్తావించలేదు. దీంతో తమకు సర్వీస్ మొత్తం ఎంబీబీఎస్ అర్హతతోనే పదవీ విరమణ వరకు ఉద్యోగం చేసే పరిస్థితి తలెత్తిందని వైద్యులు వాపోతున్నారు. ఇన్‌సర్వీస్ డాక్టర్లకు న్యాయం జరిగేలా పీజీ అడ్మిషన్లలో అవకాశం లభించేలా కృషి చేయాలని, న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కత్తి జనార్దన్, డాక్టర్ పూర్ణచందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


యాదరుషి విగ్రహానికి పూజలు చేస్తున్న విప్ ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదరుషి, ప్రహ్లాదుడి విగ్రహాల ప్రతిష్ట

- యాదగిరిగుట్ట క్షేత్రంలో స్వాతి పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ మార్గంలో నూతనంగా నిర్మించిన మండపాల్లో గురువారం యాదరుషి, ప్రహ్లాదుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఏకాదశితో పాటు స్వాతి నక్షత్రం కలిసి రావడంతో తొలుత సంప్రదాయ పద్ధతిలో మండపాల వద్ద పూజలు చేసిన అర్చకులు, తర్వాత ఆయా మండపాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత గిరిప్రదక్షిణ ప్రారంభించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకొని గిరి ప్రదక్షిణ చేపట్టారు. కాగా, స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని వేకువజామునే తెరచి సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వాతి హోమాన్ని ముఖ మండపంలో చేపట్టారు. 108 కలశాల్లో సుగంధ పరిమళాలతో కూడిన పంచామృతాలకు, పుష్పాలకు పూజలు నిర్వహించారు.

భుజంగరావు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు (ఏ–3), మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. మార్చిలో భుజంగరావును అరెస్టు చేసిన విషయం తెలిసిందే. శస్త్ర చికిత్సల నిమిత్తం నాంపల్లి కోర్టు ఆగస్టులో మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అప్పటి నుంచి న్యాయస్థానాలు మధ్యంతర బెయిల్ పొడిగిస్తూ ఉండటంతో ఆయన బయటే ఉన్నారు. ఈ నేపథ్యంలో రెగ్యులర్ బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనలు గురువారం పూర్తికావడంతో తీర్పు రిజర్వు చేశారు. భుజంగరావు ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నందున రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. మళ్లీ జైలుకు పంపితే ఆరోగ్యం మరింత క్షీణించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ ఇంకా కొనసాగుతోందని, ఈ దశలో బెయిల్ ఇవ్వడం సరికాదని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు అభ్యంతరం చెప్పారు. జైలుకు వెళ్లకుండా తప్పించుకోవడానికే పిటిషనర్ అనారోగ్యాన్ని కారణంగా చూపిస్తున్నారన్నారు. ఇంకా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, భుజంగరావుకు సోమవారం వరకు మధ్యంతర బెయిల్ గడువు ఉంది.

भारत सरकार
कारपोरेट कार्य मंत्रालय
त्वरित कॉर्पोरेट समापन प्रसंस्करण केंद्र (सी-पेस),
आई.आई.सी.ए. बिल्डिंग, 7वीं मंज़िल,
प्लाट P-6,7,8, से.-5, आई.एम.टी. मानेसर, गुड़गाँव,
हरियाणा - 122050.
Email: roc.cpace@mca.gov.in

సత్యమేవ జయతే

భారత ప్రభుత్వం
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్ (C-PACE)
IICA బిల్డింగ్, 7వ అంతస్తు, ప్లాట్ పి-6, 7, 8, సెక్టార్-5, IMT మనేసర్, గుర్గావ్, హర్యానా - 122050
ఇమెయిల్: roc.cpace@mca.gov.in

ఫారం నం. STK-6
బహిరంగ ప్రకటన

[కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248లోని ఉప–సెక్షన్ (2) మరియు ఉప–సెక్షన్ (4) మరియు కంపెనీలు (కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్లు తొలగింపు) రూల్స్, 2016లోని రూల్ 7కు అనుగుణంగా]

బహిరంగ ప్రకటన నం. ROC/C-PACE/STK-2/248(2)/2024-25/1413 తేదీ: 09-12-2024

నిర్దేశం:

(1) దిగువ పేర్కొన్న కంపెనీలకు సంబంధించి కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 క్రింద హైదరాబాద్ రాష్ట్రంలోని (11) కంపెనీల పేర్లు కొట్టివేయడం లేదా తొలగింపు విషయంలో:

క్ర.సం.	పని ఐటం	CIN	కంపెనీ పేరు
1	AB1882328	U92132TG2011PTC074339	SIRANJALI MEDIA PRIVATE LIMITED
2	AB1865751	U64200TG2022PTC165903	DIGISTREAM BROADCASTING PRIVATE LIMITED
3	AB1861409	U72200TG2016PTC113476	CHEAP SMS DOT COM BULK MESSAGING SERVICES PRIVATE LIMITED
4	AB1858382	U01409TG2021PTC151464	GUPTAS SALES AND MARKETING PRIVATE LIMITED
5	AB1837091	U74110TG2020PTC141611	SWASTIK ONE PRIVATE LIMITED
6	AB1794417	U74999TG2018PTC121762	OVIYA INTERIORS SOLUTIONS PRIVATE LIMITED
7	AB1780197	U74994TG2018PTC121641	AQUILEGIA TRADING CONSULTANTS PRIVATE LIMITED
8	AB1779852	U52609TG2018PTC121575	RUDHMA TRADING PRIVATE LIMITED
9	AB1778943	U74999TG2018PTC121662	GAILLARDIA INDENT TRADERS PRIVATE LIMITED
10	AB1758386	U24230TG1995PLC020644	VERA PHARMA LIMITED
11	AB1757256	U74999TG2008PTC059636	ITECHMETHODS SOLUTIONS INDIA PRIVATE LIMITED

(2) పైన పేర్కొన్న కంపెనీలు ప్రారంభమైన ఒక సంవత్సరంలోగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడంలో విఫలమయ్యారని లేదా రెండు ఆర్థిక సంవత్సరాలకు ముందు కాలవ్యవధిలోగా సదరు కంపెనీ(లు) ఏవేని వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా మరియు ఎటువంటి దరఖాస్తులు చేయని కారణంగా కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 455 క్రింద నిద్రాణ స్థితిలో ఉన్న కంపెనీ స్థితిని పొందడం కోసం లేదా మెమోరాండంకు నిద్రాణ కంపెనీల కంపెనీ / సభ్యుల స్థాయిని పొందిన కంపెనీ(లు) కంపెనీ ప్రారంభ సమయంలో చెల్లించడానికి చేపట్టిన సభ్యత్వం చెల్లించని కారణంగా మరియు సెక్షన్ 10ఎ/లోని ఉప–సెక్షన్ (1) క్రింద కంపెనీ ప్రారంభం నుండి 180 రోజులలోగా ఈ ప్రభావానికి సంబంధించి డిక్లరేషన్ దాఖలు చేయని కారణంగా సెక్షన్ 12లోని ఉప–సెక్షన్ (9) క్రింద భౌతిక పరిశీలన తరువాత వెల్లడైనందున ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా తమ / వారి రిజిస్ట్రేషన్‌ను కంపెనీలుగా కొనసాగించడానికి ఇష్టం లేనివారు కంపెనీల నమోదు నుండి తమ / వారి పేర్లను తొలగించడానికి / కొట్టివేయడానికి అభ్యర్థించారు మరియు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 (2) క్రింద కంపెనీల నమోదు నుండి తమ / వారి పేరు(ల) తొలగింపు కోసం పైన పేర్కొన్న కంపెనీల నుండి రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ దరఖాస్తులు స్వీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.


(3) తదనుగుణంగా, పైన పేర్కొన్న కంపెనీ పేర్లను కంపెనీల నమోదు నుండి తొలగించడానికి లేదా కొట్టివేయడానికి కంపెనీల రిజిస్ట్రార్ ప్రతిపాదిస్తున్నారు.

(4) కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్ల తొలగింపు లేదా కొట్టివేయడం ప్రతిపాదనకు అభ్యంతరం తెలిపే ఎవరేని వ్యక్తి అతని లేదా ఆమె అభ్యంతరాన్ని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ముప్పై రోజులలోగా పైన తెలిపిన కార్యాలయ చిరునామాకు పంపగలరు.

ఇర్ఫాన్ టిర్కే
అసిస్టెంట్ రిజిస్ట్రార్
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్

CBC 07123/11/0642/2425


భార్య గురుచరణ్ కౌర్‌తో మన్మోహన్ సింగ్ (ఫైల్)


పీవీ నరసింహారావు, సోనియా గాంధీలతో మన్మోహన్ (ఫైల్)


2019లో కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభం సందర్భంగా గురుదాస్‌పూర్‌లో ప్రధాని మోదీతో మన్మోహన్

‘మన్మోహనాలు’

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ వివిధ అంశాలపై తన అంతరంగాన్ని ఆవిష్కరించే క్రమంలో పంచుకున్న మనసులోని భావాలు.

ఆర్థిక సంస్కరణలపై..

➡ సమయం వచ్చినప్పుడు ఒక ఆలోచనను ఈ భూమ్మీద ఏ శక్తీ ఆపలేదు.

గ్లోబలైజేషన్, ఆర్థిక వ్యవస్థపై:

➡ భారత్ ఇప్పుడు సమ్మిళిత, సమాన, స్థిరమైన వృద్ధి పథంలో సాగుతోందని నేను నమ్ముతున్నా

➡ ప్రపంచీకరణ ఒక వాస్తవం. దాన్ని అంగీకరించి అందుకు అనుగుణంగా మన విధానాలను రూపొందించుకోవాలి.

నాయకత్వం, పాలనపై..

➡ భారత్‌కు అపారమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయని నిజంగా విశ్వసిస్తున్నా. వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకొనేందుకు సుపరిపాలన అవసరం.

ప్రపంచంలో భారతదేశం పాత్రపై

➡ భారత్ పురాతన దేశమే అయినప్పటికీ అది యువదేశం. ఎటుచూసినా యువతరం కనిపిస్తున్న మాదిరిగానే మనం ఆత్రుతలో ఉన్నాం. కానీ భవిష్యత్తు మనదే అని నేను బలంగా నమ్ముతున్నా.

➡ మనం ఎదురుదాడి కాకుండా సహకారం, పోటీతత్వం అనే సరైన మార్గాన్ని ఎంచుకుంటే భారత్ ఎదిగేందుకు ఈ ప్రపంచం చోటు కల్పిస్తుంది.

ఆయనపై

➡ పెద్ద బాధ్యత అందుకున్న చిన్న వ్యక్తిని నేను.

ప్రధానిగా..

➡ వినయం, లక్ష్యానికితగ్గ పట్టుదల నాయకత్వానికి పునాదులని నేను ఎల్లప్పుడూ విశ్వసించా.

విద్య, యువతపై..

➡ భవిష్యత్తుకు విద్యే కీలకం. దేశ ప్రజలు, భవిత కోసం దేశం చేసే అత్యంత ముఖ్యమైన పెట్టుబడి అదే.

➡ దేశ యువత గొప్ప కలలు కనాలి. గొప్ప కలలు కంటేనే మనం గొప్ప విజయాలను సాధించగలమని నమ్మొచ్చు.


అమెరికాతో అణు ఒప్పందం సందర్భంగా జార్జి బుష్‌తో...

ప్రపంచం మెచ్చిన రాజనీతిజ్ఞుడు

యాక్సిడెంటల్ పీఎం. ఈ పదబంధం డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు అచ్చు గుద్దినట్టుగా సరిపోతుంది. నిజానికి ఆయనకున్న భుజకీర్తులు అన్నీ ఇన్నీ కావు. ప్రపంచమే మెచ్చిన ఆర్థికవేత్త. అనుకోకుండా వచ్చి పడ్డ ముళ్లకిరీటం వంటి ఆర్థిక మంత్రి బాధ్యతలను అత్యంత చాకచక్యంగా నిభాయించి దేశాన్ని సమస్యల సుడిగుండం నుంచి గట్టెక్కించిన మేధావి. ఏకంగా పదేళ్లపాటు ప్రధాని. ఆ ఘనత సాధించిన తొలి సిక్కు. నెహ్రూ, ఇందిర, మోదీ తర్వాత అత్యధిక కాలం ఆ పదవిలో కొనసాగిన నాయకుడు. సమాచార హక్కు వంటి కీలక చట్టాలు చేసిన సర్కారుకు సారథి. అయినా సరే, మన్మోహన్ పేరు చెప్పగానే ఎవరికైనా మదిలో మెదులేది ఆయన అనూహ్యంగా ప్రధాని అయిన తీరే! అందుకే ఆయనపై రాసిన పుస్తకానికి ప్రముఖ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకుడు సంజయ బారు కూడా ‘యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్’ అనే పేరు పెట్టారు. ‘పీఎం మన్మోహన్’కు మీడియా సలహాదారుగా నాలుగేళ్ల పాటు ఆయనను అతి దగ్గరగా చూసిన అనుభవాలన్నింటినీ అందులో నిర్మొహమాటంగా పొందుపరిచారు.

నిశ్శబ్ద సంస్కర్త

ప్రధానిగా మన్మోహన్ సారథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ మరింతగా పరుగులు పెట్టింది. మన దేశం అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, సమాచార హక్కు, విద్యా హక్కు వంటి చరిత్రాత్మక చట్టాలు పుట్టుకొచ్చాయి. వామపక్షాలు వ్యతిరేకించినా, ఎన్ని అభ్యంతరాలు ఎదురైనా వెరవక అమెరికాతో మన్మోహన్ కుదుర్చుకున్న పౌర అణు ఒప్పందం మరో మైలురాయి. దౌత్య రంగంలో కూడా పలు విజయాలకు ఆయన హయాం వేదికైంది. అమెరికా, రష్యా, చైనా వంటి పెద్ద దేశాలతో బంధాలను బలోపేతం చేశారు. ఫలితంగా 2008లో ప్రపంచమంతా పెను ఆర్థిక సంక్షోభం ఎదుర్కొన్నా మన్మోహన్ ముందుచూపు నిర్ణయాల వల్ల భారత ప్రస్థానం మాత్రం స్థిరంగా సాగింది. ఇన్ని చేసినా కృషికి తగ్గ పేరు రాని నిశ్శబ్ద సంస్కర్తగానే మిగిలిపోయారు మన్మోహన్.

> **చరిత్ర ఉదారంగానే చూస్తుంది...**
> **సమకాలీన మీడియా కంటే చరిత్ర నా పట్ల ఉదారంగానే వ్యవహరిస్తుంది – 2014 జనవరిలో ప్రధానిగా చివరి మీడియా సమావేశంలో మన్మోహన్ చేసిన వ్యాఖ్యలివి! మీడియా శరపరంపరగా ప్రశ్నలు సంధించడంతో అలా స్పందించారాయన. ‘సంకీర్ణ రాజకీయాల అనివార్యతకు లోబడి నేను చేయగలిగినంత చేశాను. దానిపై చరిత్రే తుది తీర్పరి’ అన్నారు.**

మీరు జోక్ చేస్తున్నారా?
ఆర్థిక శాఖ ఆఫర్‌పై మన్మోహన్

అది 1991. కేంద్రంలో పీవీ సారథ్యంలో కాంగ్రెస్ మైనారిటీ ప్రభుత్వ ఏర్పాటు దేశమంతటా హాట్ టాపిక్‌గా మారింది. మర్నాడే ప్రమాణస్వీకారం. మంత్రివర్గ కూర్పుపై పీవీ మల్లగుల్లాలు పడుతున్నారు. ఆ సమయాన మన్మోహన్ ఢిల్లీలో తన నివాసంలో కూర్చుని తాపీగా పేపర్ చదువుతున్నారు. అప్పుడు పీవీ ముఖ్య కార్యదర్శి ఆయన ఇంటికి వచ్చారు. ‘ప్రధాని మిమ్మల్ని కేబినెట్‌లోకి తీసుకోవాలని అనుకుంటున్నారు. ఆర్థిక శాఖ బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలి’ అని చెప్పారు. దాన్ని మన్మోహన్ నమ్మలేదు. ‘‘నేనా? కేబినెట్‌లోకా? మీరు జోక్ చేస్తున్నారా?’’ అంటూ నవ్వి ఊరుకున్నారు. తర్వాత ఆ విషయాన్ని పట్టించుకోలేదు. మర్నాడు ప్రమాణ స్వీకారానికి వేళవుతున్నా మన్మోహన్‌ రాష్ట్రపతి భవన్ చేరుకోకపోవడంతో పీవీ ముఖ్య కార్యదర్శి నేరుగా ఆయన ఇంటికి ఫోన్‌చేశారు. ‘ప్రమాణానికి టైం దగ్గర పడుతుంటే మీరింకా రాలేదేంటి?’ అంటూ హైరానా పడ్డారు. అప్పటికి గానీ తాను నిజంగానే మంత్రిని కాబోతున్నట్టు మన్మోహన్ నమ్మలేదు. దాంతో ఉన్నపళాన బయల్దేరి వెళ్లి ప్రమాణస్వీకారం చేశారు. ‘‘అలా నా రాజకీయ జీవితం హడావుడిగా మొదలైంది! కనీసం తయారయ్యే టైం కూడా లేకుండానే ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది’’ అంటూ 2005లో ఓ బ్రిటిష్ జర్నలిస్టుకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మన్మోహన్ గుర్తు చేసుకున్నారు.

అవార్డులు.. రివార్డులు

ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థల నుంచి మన్మోహన్ లెక్కలేనన్ని గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. ఎన్నోసార్లు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారు. 1987లో దేశ రెండో అతి పెద్ద పౌర పురస్కారం పద్మవిభూషణ్ లభించింది. ఎన్నో దేశాలు ఆయనకు తమ అత్యుత్తమ పౌర పురస్కారాలు ప్రదానం చేశాయి.

కష్టాల బాల్యం

మన్మోహన్ 1932 సెప్టెంబర్ 26న పంజాబ్‌లోని గహ్ గ్రామంలో జన్మించారు. ఇది ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది. చిన్నప్పుడే తల్లి చనిపోతే అమ్మమ్మే అన్నీ తానై పెంచింది. 1947లో దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం అమృత్‌సర్ వలస వచ్చింది. ఆర్థిక కష్టనష్టాలను ఓర్చుకుంటూనే ఆయన విద్యాభ్యాసం సాగించారు. అసాధారణ ప్రతిభతో స్కాలర్‌షిప్‌లు పొందుతూ ఉన్నత విద్య పూర్తి చేశారు. 1952లో పంజాబ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్, 1954లో మాస్టర్స్ పట్టా పొందారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించి ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ పొందారు. తర్వాత ఆక్స్‌ఫర్డ్‌లో నఫీల్డ్ కాలేజీలో పీహెచ్‌డీ చేశారు. ఆయన సమర్పించిన డాక్టోరల్ థీసిస్ ‘భారత ఎగుమతి ధోరణులు, స్వయం ఆధారిత వృద్ధి ప్రాతిపదికలు’ మన ఆర్థిక వ్యవస్థపై ఆయన లోతైన దృష్టికి తార్కాణం.

అధ్యాపకునిగా, బ్యూరోక్రాట్‌గా...

మన్మోహన్ కెరీర్ ఆర్థిక శాస్త్రంలో లెక్చరర్‌గా మొదలైంది. పంజాబ్ యూనివర్సిటీ ,ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో బోధించారు. ఆర్థికశాస్త్రం, విధానాలపై లోతైన అవగాహన ఆయనది. 1966–69 మధ్య ఐరాసలోనూ పని చేశారు. అనంతరం అనుకోకుండా బ్యూరోక్రాట్‌గా మారారు. తొలుత వాణిజ్య, పరిశ్రమల శాఖలో ఆర్థిక సలహాదారుగా చేశారు. అనంతరం 1972–1976 నడుమ కేంద్ర ఆర్థిక శాఖలో ప్రధాన ఆర్థిక సలహాదారుగావున్నారు. 1982–1985 మధ్య రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా రాణించారు. తర్వాత రెండేళ్లు ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్‌గా సేవలందించారు. ఆయా పదవుల్లో ఉండగా మన్మోహన్ రూపొందించిన పలు కీలక విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను ఆధునీకరణ బాట పట్టించడంలో ఎంతగానో దోహదపడ్డాయి.

మచ్చలేని వ్యక్తిత్వం

నిజాయితీకి, మచ్చలేని వ్యక్తిత్వానికి ప్రతీక మన్మోహన్. ప్రజా జీవితంలో నాయకులు పాటించాల్సిన విలువలకు బెంచ్‌మార్క్‌గా నిలిచారు. విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు. అతి నిరాడంబర జీవన శైలి, అన్ని అంశాల మీదా లోతైన అవగాహన సమకాలీన నాయకుల్లో ఆయన్ను అత్యంత విలక్షణంగా నిలిపాయి. నెహ్రూను కూడా కాదని మన్మోహన్‌ను అత్యుత్తమ ప్రధానిగా కుష్వంత్‌సింగ్ వంటి ప్రముఖులు కీర్తించారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రచారం నిమిత్తం తన వద్ద తీసుకున్న రూ.2 లక్షలను మన్మోహన్ గుర్తుతో తిరిగిచ్చిన వైనాన్ని కుష్వంత్ చాలాకాలం పాటు ఎందరితోనో చెప్పుకున్నారు.

పాలనపై విమర్శ...

వ్యక్తిగతంగా మన్మోహన్‌ది ఏ మచ్చాలేని జీవితమే అయినా పాలనపరంగా మాత్రం కొన్ని విమర్శలూ ఎదుర్కొన్నారు. యూపీఏ–2లో రెండోసారి ప్రధాని అయ్యాక కామన్వెల్త్ క్రీడలు, బొగ్గు, 2జీ స్పెక్ట్రం వంటి కుంభకోణాలు ఆయన ప్రతిష్టను మసకబార్చాయి. బొగ్గు కుంభకోణంపై ప్రశ్నల పరంపరకు, ‘వెయ్యి సమాధానాల కంటే మౌనమే మేలు’ అంటూ ఆయన బదులిచ్చారు. అవినీతి, నమ్మకద్రోహం, క్రిమినల్ కుట్ర తదితర ఆరోపణలపై బదులిచ్చేందుకు కోర్టుకు రావాల్సిందిగా అనంతర కాలంలో సమన్లు కూడా అందుకోవాల్సి వచ్చింది.

నాయకత్వ లక్షణాలను చాటిన పౌర అణు ఒప్పందం

ప్రధానిగా మన్మోహన్‌సింగ్ సాధించిన అతిపెద్ద విజయాల్లో అమెరికాతో కుదుర్చుకున్న పౌర అణు ఒప్పందం ప్రత్యేకమైంది. దేశ విదేశాంగ విధానంలో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోయింది. మన్మోహన్ దూరదృష్టికి, నాయకత్వ లక్షణాలకు అద్దంపట్టింది. అణ్వస్త్రపరంగా భారత్‌ను దశాబ్దాలపాటు ఏకాకిగా మిగిల్చిన ప్రపంచ దేశాలకు భారత్ ఈ చరిత్రాత్మక ఒప్పందంతో దీటుగా బదులిచ్చింది. అమెరికా నుంచి అణు ఇంధన లభ్యత, పౌర అణు సాంకేతికతలో సహకారం సహా ఎన్నో దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించే ఈ ఒప్పందం కార్యరూపం దాల్చేలా మన్మోహన్ అవిరళ కృషి చేశారు. నాటి అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యూ. బుష్‌తో కలిసి మన్మోహన్‌సింగ్ 2005 జూలై 18న పౌర అణు ఒప్పందానికి సంబంధించిన విధివిధానాలపై సంయుక్త ప్రకటన చేశారు. అయితే ఈ ఒప్పందాన్ని యూపీఏ–1 సంకీర్ణ ప్రభుత్వంలోని మిత్రపక్షమైన వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రభుత్వం కుప్పకూలే ప్రమాదం ఉన్నా లెక్కచేయకుండా మన్మోహన్ ముందడుగు వేశారు. విశ్వాస పరీక్ష ఎదుర్కొని మరీ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోగలిగారు. 2008 అక్టోబర్‌లో అణు ఒప్పందం కార్యరూపం దాల్చింది.

ఆ మలుపు...

1991లో మన్మోహన్ జీవితం అనూహ్యమైన మలుపు తిరిగింది. భారత్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయమది. విదేశీ మారక ద్రవ్యం దాదాపుగా నిండుకుంది. ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటింది. అలాంటి విపత్కర పరిస్థితుల్లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాలతో ఏ సంబంధమూ లేని మన్మోహన్‌ను ఎకాయెకిన కేంద్ర ఆర్థిక మంత్రిగా నియమించారు. దీనిపై అప్పట్లో పలువురు పెదవి విరిచినా ఆ నిర్ణయం మాస్టర్ స్ట్రోక్‌గా నిలిచింది. మన్మోహన్ విధానాలు, 1991 ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థనే సమూలంగా మార్చేశాయి. ఎగుమతులను ప్రోత్సహించడానికి రూపాయి విలువ తగ్గించినా, విదేశీ పెట్టుబడులకు బాటలు పరిచినా, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించినా అన్నీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన నిర్ణయాలే! పీవీ మార్గదర్శకత్వంలో ఆయన చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు దేశాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించి, నేలచూపులు చూస్తున్న మన ఆర్థిక వ్యవస్థ సగర్వంగా తలెత్తుకునేలా చేశాయి. ‘ఏ శక్తీ ఆపలేని ఆలోచనలు మనవి’ అంటూ 1991 బడ్జెట్ ప్రసంగంలో మన్మోహన్ చెప్పిన మాటలు అక్షర సత్యాలని అనంతర చరిత్ర నిరూపించింది.

ప్రధానిగా ప్రస్థానం

మన్మోహన్ జీవితంలో 1991ని కూడా మించిన అత్యంత అనూహ్య మలుపుకు 2004 వేదికైంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలో యూపీఏ మెజారిటీ సాధించినా సోనియాగాంధీ ప్రధాని కావడంపై అభ్యంతరాలు తలెత్తాయి. సొంత పార్టీ నేతలే ఆమె విదేశీయతను ప్రశ్నించిన పరిస్థితి! దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రధాని పదవిని సోనియా ‘త్యాగం’ చేశారు. ప్రణబ్ సహా కాంగ్రెస్ దిగ్గజాలెందరో ఆ పదవికి పోటీ పడ్డా సోనియా మాత్రంసామ్యుడైన మన్మోహన్‌కేసి మొగ్గారు. అలా అనుకోకుండా దేశ 13వ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినా, ఆ అత్యున్నత పదవిలో ఏకంగా పదేళ్లపాటు నిరాఘాటంగా కొనసాగి ఆయన మరో చరిత్ర సృష్టించారు!

రాహుల్ చించేసిన ఆ ఆర్డినెన్స్...

ప్రధానిగా తన పాలనా కాలం పొడవునా సోనియా నీడలోనే మిగిలిపోయారన్న అపప్రథ మూటగట్టుకున్నారు మన్మోహన్. జాతీయ సలహా మండలి చైర్‌పర్సన్ హోదాలో పదేళ్ల పాటు ఆమె బాధ్యత లేని అధికారాలు చలాయించినా చేష్టలుడిగి చూశారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ఇక 2013లో సోనియా తనయుడు రాహుల్‌గాంధీ చేసిన పని మన్మోహన్ గౌరవ ప్రతిష్టలను మరింత దిగజార్చింది. కళంకిత నేతలు దోషులుగా తేలినా మూడు నెలల పాటు పదవుల్లో కొనసాగవచ్చంటూ 2013లో కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను ‘నాన్సెన్స్’ అంటూ రాహుల్ కొట్టిపారేశారు. అంతటితో ఆగకుండా విలేకరుల సమావేశం సాక్షిగా ఆర్డినెన్స్ కాపీని చించేశారు. అది మన్మోహన్‌ను కూడా తీవ్రంగా కలచివేసిందని చెబుతారు. బహుశా వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే కాబోలు, మన్మోహన్‌ను ‘దేశ చరిత్రలోనే అత్యంత బలహీన ప్రధాని’గా బీజేపీ దిగ్గజం ఎల్‌కే అడ్వాణీ, ‘నైట్ వాచ్‌మన్’గా, ‘గాంధీల చేతుల్లో కీలుబొమ్మ’గా నరేంద్ర మోదీ అభివర్ణించారు! మన్మోహన్ తన రాజకీయ జీవితంలో ఒక్కసారి కూడా లోక్‌సభకు ఎన్నికవలేదు! ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం 2024 ఏప్రిల్‌తో రాజ్యసభ సభ్యుని హోదాలో ముగిసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్


2023 ఆగస్ట్ 7న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభకు చక్రాల కుర్చీలో వచ్చిన మన్మోహన్ సింగ్

నీ దూకుడు.. సాటెవ్వరూ..!


మన్మోహన్ ఎక్కువగా మాట్లాడరని, దూకుడుగా వ్యవహరించరని ప్రధానిగా ఉన్న సమయంలో ఆయనపై ప్రతిపక్షాలు విమర్శలు చేసేవి. ఆయన్ని మౌనమునిగా వర్ణించేవి. మన్మోహన్ కేవలం కీలుబొమ్మని, రిమోట్ సోనియా చేతిలో ఉందంటూ ఘాటైన వ్యాఖ్యలు చేసేవి. కానీ తాను మాటల మనిషి కాదు చేతల మనిషని ఎన్నోసార్లు మన్మోహన్ నిరూపించారు. ఆయన దూకుడు ఏంటనేది ఆర్థిక సంస్కరణలతోనే దేశానికి తెలిసొచ్చింది. నెహ్రూ ఆర్థిక విధానాలు, రష్యాతో అనుబంధం కారణంగా 90వ దశకం వరకు సోషలిజం నినాదమే దేశంలో బలంగా వినిపించేది. ఆ నినాదానికి ఎదురుగా వెళ్లి మాట్లాడే దమ్ము, ధైర్యం అప్పటి రాజకీయ నాయకులకు లేదు. సోషలిజంలో భాగంగా అప్పటి ప్రభుత్వాలు గుడ్డిగా విదేశీ దిగుమతులను తగ్గించేందుకు అడ్డగోలుగా పన్నులు విధించేవి. అదే సమయంలో విదేశాలకు చేసే ఎగుమతులకు అనేక ప్రోత్సాహకాలు అందించేవి. అయితే కాలానుగుణంగా ఇందులో మార్పులు చేయకపోవడంతో ఈ రెండు విధానాలు భ్రష్టుపట్టిపోయాయి.

తగ్గేదే లేదు

ఇక్కడి దిగుమతి సుంకాలకు భయపడి విదేశీయులు తమ వస్తువులు అమ్మేందుకు ఎక్కువగా ఆసక్తి చూపించేవారు కాదు. అదే సమయంలో కీలక విభాగాల్లో ప్రభుత్వ గుత్తాధిపత్యం , లైసెన్స్‌రాజ్ కారణంగా పరిమితంగానే ఇక్కడి పరిశ్రమల నుంచి ఉత్పత్తి జరిగేది. అంతర్జాతీయ మార్కెట్‌లో వీటికి డిమాండ్ లేకపోయినా సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందించే వారు. ఇవి మంచి ఫలితాలు ఇవ్వకపోయినా మార్చే సాహసం ఎవరూ చేయలేదు. కానీ మన్మోహన్ ఏ మాత్రం సంకోచం లేకుండా విదేశీ దిగుమతులపై ఉన్న పన్నులు తొలగించడంతో పాటు స్వదేశీ వస్తువులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను నిలిపేశారు. ఫలితాలు ఇవ్వకుంటే ఎలాంటి నిర్ణయం తీసుకోవడానికైనా వెనుకడానంటూ గట్టి సంకేతాలు పంపారు.

తెగింపునకు మరో పేరు

పీవీ నర్సింహారావు ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు దేశంలో రాజకీయ అస్థిరత నెలకొని ఉంది. అంతకు ముందు 11 నెలలకే వీపీ సింగ్ ప్రభుత్వం పడిపోగా, చంద్రశేఖర్ గవర్నమెంట్ పట్టుమని ఏడు నెలలు కూడా ఉండలేకపోయింది. ఇక పీవీది కూడా మైనార్టీ ప్రభుత్వమే అయినా ఇంతటి రాజకీయ అస్థిరతలో సైతం తెగించి ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు మన్మోహన్.



సాక్షి హైదరాబాద్

శుక్రవారం ׀ 27 ׀ డిసెంబర్ ׀ 2024



84వ నుమాయిష్‌కు సర్వం సిద్ధం

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (ఎగ్జిబిషన్)కు నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జనవరి 1న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రారంభం కానుంది. -8లో



యువ 'కల'ం

ఈతరం యువ రచయితలు రాణిస్తున్నారు. వినూత్న ఆలోచనలతో, సమకాలీన సామాజిక అంశాలను స్పృశిస్తూ రచనలు చేస్తున్నారు.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
23.0/19.0

నగరంలో శుక్రవారం ఆకాశం కారుమబ్బులతో కమ్ముకుని ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురవవచ్చు, గరిష్టంగా 23, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

కవాడిగూడ: సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఉపాధ్యాయినులు, గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఉపాధ్యాయినులు, గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఎమ్మెల్సీ కోదండరాం ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా, పరిరక్షణ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ, తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఎంపీఎఫ్ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి, సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ వద్ద సినీ అభిమాని హల్‌చల్



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని పోలీసు కమాండ్ కంట్రోల్‌లో గురువారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సినీ పరిశ్రమకు చెందిన దర్శక, నిర్మాతలు, నటులు సినీ పరిశ్రమ అభివృద్ధిపై చర్చలు జరిపారు. మధ్యాహ్నం సమావేశం ముగిసి సీఎంతో పాటు సినీ ప్రముఖులు వెళ్తున్న క్రమంలో రోడ్డు బయట ఓ సినీ అభిమాని ప్లకార్డు ప్రదర్శిస్తూ హల్‌చల్ సృష్టించాడు. సినిమా పెద్దలను తప్ప సామాన్యుల విషయాలను పట్టించుకోరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. సినిమా పెద్దలు కాదు.. గద్దలు అంటూ హల్‌చల్ సృష్టించాడు. కొద్దిసేపు ఈ ప్లకార్డుపై జనాలు చర్చించుకోవడం గమనార్హం.

అది మా అధికారిక వెబ్‌సైట్ ప్రకటన కాదు: అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టరేట్ నుంచి కొత్త మీ సేవ కేంద్రాల గురించి ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది అనధికార వ్యక్తులు 'మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం' అనే పేరుతో నకిలీ ప్రకటనను సృష్టించారన్నారని, https://meesevatelangana.in అనే నకిలీ వెబ్‌సైట్ ప్రారంభించారని తెలిపారు. ఇది తమ అధికారిక మీ సేవ వెబ్‌సైట్‌కు ప్రతిరూపంగా ఉందన్నారు. అక్రమార్కులు కొత్త మీ సేవ కేంద్రాల కేటాయింపుల కోసం డిపాజిట్లు కూడా సేకరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ప్రజలు ఇలాంటి నకిలీ ప్రకటనలు, వెబ్‌సైట్‌లను నమ్మవద్దని, జిల్లా పరిపాలన ద్వారా మాత్రమే జారీ చేసిన అధికారిక సమాచారాన్ని అనుసరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నకిలీ ప్రచారాన్ని నమ్మొద్దు

- ట్రాఫిక్ చలాన్లపై డిస్కౌంట్ అబద్ధం
- మోసపూరిత ప్రకటనగా పోలీసుల నిర్ధారణ

సాక్షి, సిటీబ్యూరో: పెండింగ్ ట్రాఫిక్ ఈ–చలాన్లపై రాయితీ ఇస్తున్నట్లు సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరుగుతున్న ప్రకటనలు నమ్మకూడదని హైదరాబాద్ పోలీసులు సూచించారు. ఎలాంటి డిస్కౌంట్లు, ఆఫర్లను ప్రకటించలేదని, అదంతా నకిలీ ప్రచారమని పోలీసులు స్పష్టం చేశారు. హెచ్‌టీటీపీఎస్://ఈచలాన్.టీఎస్‌పోలీస్.జీఓవీ.ఇన్/పబ్లిక్‌వ్యూ/ అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా వేదికల ద్వారా మాత్రమే ఎలాంటి ప్రకటనలైనా జారీ చేస్తామని తెలిపారు. నకిలీ ప్రకటనలను నమ్మకూడదని, అధికారికంగా నిర్ధారించుకోకుండా నకిలీ మెసేజ్‌లను ఇతరులకు ఫార్వర్డ్ చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. పెండింగ్ ఈ–చలాన్లు, ఇతరత్రా వివరాల కోసం 040–27852772, 27852721 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



హంగులు భళా.. సొబగుల కళ!

అత్యాధునికంగా చర్లపల్లి టెర్మినల్ నిర్మాణం

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులో విమానాశ్రయాన్ని తలపించేలా.. అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న చర్లపల్లి శాటిలైట్ రైల్వే టెర్మినల్ త్వరలో ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా టెర్మినల్‌తో పాటు రెండో ప్రవేశ ద్వారం కూడా ప్రయాణికులకు అందుబాటులోకి రానుందని సమాచారం. రూ. 413 కోట్ల వ్యయంతో చేపట్టిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్ల తర్వాత ఇది నాలుగో టెర్మినల్‌గా ప్రయాణికులకు త్వరలోనే సేవలందించనుంది.

ప్రయాణికుల ఒత్తిడిని తట్టుకునేందుకు..

- నగరంలో పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి జంట నగరానికి పడమటి వైపున ఇప్పటికే లింగంపల్లి స్టేషన్ ప్రధాన రైళ్ల హోల్టింగ్‌కు వినియోగిస్తున్నారు. ఇదే తరహాలో నగరానికి తూర్పు వైపున చర్లపల్లి వినియోగంలోకి రానుంది. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండడం వల్ల ప్రయాణికులు నగరంలో ఎక్కడి నుంచైనా ఈ స్టేషన్‌కు తేలిగ్గా చేరుకోవచ్చు. మరోవైపు సికింద్రాబాద్ స్టేషన్‌పై ప్రయాణికులు, రైళ్ల ఒత్తిడి గణనీయంగా తగ్గనుంది. ప్రయాణికుల రాకపోకలకు అనుగుణంగా ఆధునిక హంగులతో చర్లపల్లి రెండో ప్రవేశ ద్వారం, నూతన రైల్వే టెర్మినల్‌ను అభివృద్ధి చేశారు.
- స్టేషన్‌లో 6 టికెట్ బుకింగ్ కౌంటర్లు, మహిళలకు, పురుషులకు ప్రత్యేక విశ్రాంతి గదులు, ఉన్నత తరగతి ప్రయాణికుల కోసం ప్రత్యేక వెయిటింగ్ సదుపాయాలు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్, స్టేషన్ మొదటి అంతస్తులో కెఫెటేరియా, రెస్టారెంట్లు, విశ్రాంతి గదులు ఉంటాయి. విశాలమైన కాన్‌కోర్ ప్రాంతాలు, పూర్తిగా లైటింగ్ సదుపాయంతో ప్రవేశ ద్వారం ఏర్పాటు చేశారు. ప్రయాణికులను ఆకట్టుకొనేలా అద్భుతమైన ఎలివేషన్ ఉంటుంది. ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరో ప్లాట్‌ఫామ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగించవచ్చు. ఇందుకోసం 12 మీటర్ల వెడల్పుతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, 6 మీటర్ల వెడల్పుతో మరొకటి ఏర్పాటు చేశారు. మొత్తం 9 ప్లాట్‌ఫామ్‌లలో 7 లిఫ్టులు, 6 ఎస్కలేటర్లు ఉన్నాయి. రైళ్ల నిర్వహణకు అధునాతన పద్ధతిలో కోచ్ డిపోను నిర్మించారు.

15 జతల రైళ్లతో సేవలు...

- చర్లపల్లి నుంచి ప్రతిరోజూ 15 జతల రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ఇందుకోసం మెకానికల్, ఎలక్ట్రికల్, అండర్ గేర్ చెకింగ్, కోచ్‌లను శుభ్రపరచడం వంటి అన్ని సదుపాయాలు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న 5 ప్లాట్‌ఫామ్‌లతో పాటు 4 హైలెవల్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేశారు. అదనంగా 10 లైన్లు అందుబాటులోకి వస్తే మొత్తం 19 లైన్ల సామర్థ్యానికి స్టేషన్ చేరుకుంటుంది.





విమానాశ్రయాన్ని తలపించేలా..

- కొత్త శోభను సంతరించుకున్న రైల్వే స్టేషన్
- కెఫెటేరియాలు, రెస్టారెంట్‌లు, విశ్రాంతి గదులు సిద్ధం..



అదనపు సదుపాయాలు..

- బస్‌బేతో పాటు వాహనాల పార్కింగ్. కోచ్‌లను, రైళ్ల రాకపోకలను తెలిపేందుకు వేర్వేరుగా సూచిక బోర్డులు. పైకప్పుతో కూడిన ప్లాట్‌ఫామ్‌లు. అన్ని ప్లాట్‌ఫామ్‌లలో పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ వ్యవస్థ. రైళ్ల రాకపోకలతో పూర్తి వివరాల పట్టికలు. 24 గంటల సీసీటీవీ కెమెరాలతో నిఘా. స్టేషన్ ప్రాంగణం నుంచి అన్ని ప్లాట్‌ఫామ్‌లను అనుసంధానం చేస్తూ 12 మీటర్ల వెడల్పుతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి.

2 ఫ్లై ఓవర్లలో మార్పులు!

రెండు జంక్షన్లలో ప్రతిపాదనలకు..

- భవిష్యత్ అవసరాల దృష్ట్యా..
- ఆల్విన్ క్రాస్ రోడ్ కూకట్‌పల్లి జంక్షన్ల వద్ద..



సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వం ఇటీవల పరిపాలన అనుమతులు మంజూరు చేసిన భారీ ప్రాజెక్టుల్లో రెండింటి ప్రతిపాదనలు మార్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. శేరిలింగంపల్లి జోన్‌లోని ఆల్విన్ క్రాస్‌రోడ్స్, కూకట్‌పల్లి జోన్‌లోని జేఎన్‌టీయూ జంక్షన్ల వద్ద నిర్మించతలపెట్టిన ఫ్లై ఓవర్ల ప్రతిపాదనలు సమీక్షించి, అవసరమైన మార్పు చేర్పులు చేసేందుకు ఈ పనులు చేయనున్న జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం సిద్ధమైంది. ఇందుకుగాను తగిన అధ్యయనం కోసం కన్సల్టెన్సీ సర్వీసులను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ జంక్షన్ల వద్ద పనుల కోసం ఇప్పటికే రూపొందించిన ప్రతిపాదనల్లోని ఫ్లై ఓవర్లు, రైట్ ఆఫ్‌వేలు తదితరమైన వాటికి సంబంధించిన డిజైన్లు, డ్రాయింగ్స్, టెక్నికల్ స్పెసిఫికేషన్స్‌తో పాటు టోపోగ్రాఫికల్ సర్వే,జియో టెక్నికల్ సర్వే, ట్రాఫిక్ సర్వేల నివేదికలు తదితరమైనవి పరిశీలించి సానుకూల, వ్యతిరేక అంశాలను పరిగణనలోకి తీసుకొని.. వాటికంటే మెరుగైన ప్రత్యామ్నాయానికి అవకాశం ఉంటే ఆ మేరకు ప్రతిపాదనలు అందజేసేందుకు కన్సల్టెంట్లను ఆహ్వానించినట్లు తెలిపారు. ఒకవేళ అంతకంటే మెరుగైన ప్రత్యామ్నాయం లేని పక్షంలో ప్రస్తుత డిజైన్ల కనుగుణంగానే పనులు చేయనున్నారు.

ప్రజా భద్రత, భవిష్యత్ అవసరాలు లక్ష్యంగా..

ముఖ్యంగా ప్రజల ప్రజల భద్రత, ప్రయాణికులకు మెరుగైన సేవలందడం లక్ష్యంగా డిజైన్ల అధ్యయనం, సమీక్షకు సిద్ధమైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ జంక్షన్ల పరిసరాల్లో పురోగతిలో ఉన్న ఇతర పనులు, భూసేకరణ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ సమీక్షకు సిద్ధమయ్యారు. అన్నిటి కంటే ముఖ్యంగా భవిష్యత్‌లో వచ్చే మెట్రో రైలు,బీఆర్‌టీఎస్, సీటీఎస్ మాస్టర్‌ప్లాన్ లను పరిగణనలోకి తీసుకొని ఇందుకు సిద్ధమయ్యారు. ఇంకా, పనులు జరిగే సమయంలో ట్రాఫిక్‌కు ఎక్కువ ఇబ్బందులు లేకుండా, ఆధునికత సాంకేతికతతో త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు అందుబాటులో ఉన్న పద్ధతుల్ని కన్సల్టెంట్లు సూచించాలి. దీంతో పాటు వీలైనంత మేరకు ప్రాజెక్టుల వ్యయం పెరగకుండా ఉండాలి. ఇప్పటికే రూపొందించిన ప్రతిపాదనల మేరకు రెండు ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ. 710 కోట్లు. ఈ మేరకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది.

ఇరవయ్యేళ్ల వరకు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా..

మేజర్ జంక్షన్లు, బాటిల్‌నెక్స్, ప్రార్థనా మందిరాలు, శ్మశాన వాటికల వంటివాటిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పీపీఆర్(ప్రాజెక్ట్ ప్రిపరేషన్ రిపోర్ట్) రూపొందించాలి. రాబోయే ఇరవయ్యేళ్ల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ఫ్రీగా ప్రయాణం సజావుగా సాగేందుకు శాశ్వత పరిష్కారంగా పీపీఆర్ ఉండాలి.

వణుకు.. చినుకు

అటు చలిగాలులు.. ఇటు చిరు జల్లులు

- నగరంలో ఓ మోస్తరు వర్షం
- అత్యవసరమైతే తప్ప బయటికి రాని జనం



అమీర్‌పేటలో..

సాక్షి, సిటీబ్యూరో: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసింది. ఆకాశం నలువైపులా మేఘాలు కమ్ముకోవడంతో పగటి పూట సూరీడు మబ్బుల చాటుకే పరిమితమయ్యాడు. చల్లగాలులు, చిరుజల్లులతో నగర వాసులు గజగజ వణికారు. సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వివిధ పనులపై బయటికి వచ్చిన పాదచారులు, వాహనదారులు తడిసి ముద్దయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. చలి తీవ్రతతో పాటు ముసురు ఉండటంతో బయటికి రావడానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అత్యవసరంగా వచ్చిన వారు మాత్రం వర్షానికి తీవ్ర అవస్థలకు గురయ్యారు. కుత్బుల్లాపూర్‌లోని గాయత్రీ నగర్‌లో అత్యధికంగా 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోఠి, నాంపల్లి, హిమాయత్‌నగర్, సికింద్రాబాద్, తిరుమలగిరి, షేక్‌పేట, జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, అమీర్‌పేట, బోరబండ, కూకట్‌పల్లి, బాచుపల్లి, తార్నాక, మలక్‌పేట, సైదాబాద్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాలో సెంటీమీటర్ లోపు వర్షం కురిసింది.

పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు

రెండు రోజులుగా వాతావరణంలో మార్పులతో పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. సగటున గరిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 20 డిగ్రీలకు పడిపోయింది. పగలంతా వాతావరణం చల్లగా ఉండటంతో పలు ప్రాంతాల్లో చలి మంటలతో ఉపశమనం పొందుతున్న దృశ్యాలు కనిపించాయి. ఈ నెల 28 వరకు ఇదే పరిస్థితి ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

భారీగా తగ్గిన విద్యుత్ వినియోగం..

చలి కారణంగా నగర వాసులు ఇళ్లల్లోని ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఆఫ్ చేశారు. ఫలితంగా రోజువారీ విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. డిసెంబర్ 19న అత్యధికంగా 3,145 మెగావాట్ల (60.25 మిలియన్ యూనిట్లు) డిమాండ్ నమోదు కాగా, 25న అత్యల్పంగా 3,039 మెగావాట్లు (57.58 ఎంయూ)లు రికార్డు అయింది. తాజాగా గురువారం 2,940 మెగావాట్లు నమోదు కావడం గమనార్హం. అర్ధరాత్రి, మధ్యాహ్నంతో పోలిస్తే ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా నమోదవుతుండటం గమనార్హం. వేడినీళ్ల కోసం గీజర్లు, హీటర్లు వాడుతుండటమే ఇందుకు కారణమని ఇంజినీర్లు చెబుతున్నారు.



బేగంపేట వద్ద..

మహా నగరంలో మన్మోహన్!

సిటీతో మాజీ ప్రధానికి అనుబంధం



బయో డైవర్సిటీ సమ్మేళనంలో.. (ఫైల్)



సాక్షి, సిటీబ్యూరో: భాగ్య నగరంతో దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు అవినాభావ సంబంధం ఉంది. ఎన్నో కీలకమైన సందర్భాల్లో, ఆపదల్లో తాను ఉన్నానంటూ భరోసా ఇచ్చారు. దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల సమయంలో నేరుగా సందర్శించి నగరవాసులకు ధైర్యాన్ని అందించారు. ఆయనకు ఎంతో ప్రీతిపాత్రుడైన గురువు శ్రేయోభిలాషి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కన్నుమూసిన సమయంలో నగరానికి వచ్చి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. అప్పటినుంచి ఇప్పటివరకు పీవీ కుటుంబం అంటే ఆయనకు ఎంతో అభిమానం. ఆయన కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉండేవారు.

నేనున్నానని..

2013లో జరిగిన దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల సమయంలో 16 మంది మృత్యువాత పడ్డారు. దాదాపు 150 మందికి పైగా గాయపడ్డారు. నగరం దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు.. నాడు ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ ఇక్కడ పర్యటించారు. నేనున్నానంటూ నగరవాసులకు భరోసా కల్పించారు. అంతకు ముందు 2012లో హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అంతర్జాతీయ బయో డైవర్సిటీ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని పైలాన్‌ను ఆవిష్కరించారు. అంతేకాకుండా.. ఎన్నో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు నగరాన్ని వేదిక చేసేందుకు, నగర ఖ్యాతి పెంచేందుకు అవిరళమైన కృషి చేశారు. మెట్రో రైలు ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా... నేరుగా రావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల రాలేకపోయారు. చివరి నిమిషంలో తన పర్యటనను రద్దు చేసుకున్నందుకు ఎంతో బాధ పడ్డట్లు వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆధార్' పైలట్ ప్రాజెక్టును మహేశ్వరంలో ప్రారంభించేందుకు కృషి చేశారు. దీని కోసం ఆ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్న నందన్ నిలేఖన్‌తో ప్రత్యేకంగా చర్చించారు. చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని దివ్యాంగులకు భరోసానిచ్చారు.



దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల బాధితులను ఆస్పత్రిలో పరామర్శిస్తూ.. (ఫైల్)

ఓయూ గౌరవ డాక్టరేట్..

మన్మోహన్ సింగ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ 1996లో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అర్థశాస్త్రంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ చేసిన కృషిని గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు మన్మోహన్ సింగ్ శంకుస్థాపన చేశారు. నగర మణిహారమైన ఔటర్ రింగ్ రోడ్డుకు శంకుస్థాపన చేసింది కూడా మన్మోహన్ సింగే కావడం గమనార్హం.



మాజీ సీఎం రోశయ్యతో.. (ఫైల్)

84వ నుమాయిష్‌కు సర్వం సిద్ధం

- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ముమ్మర ఏర్పాట్లు
- జనవరి 1 నుంచి ప్రారంభం
- ఎంట్రీ టికెట్ ధర రూ. 10 పెంపు
- 160 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- సందర్శకులకు ఉచిత వైఫై సౌకర్యం
- 250 మందితో భద్రతా చర్యలు


ఎగ్జిబిషన్‌లో స్టాళ్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అబిడ్స్: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (ఎగ్జిబిషన్) ఏర్పాటుకు ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జనవరి 1న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో 84వ నుమాయిష్ ప్రారంభం కానుంది. 46 రోజుల పాటు 'ఫిబ్రవరి 15) వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. నిజాం కాలంలో 1938లో ప్రారంభమైన నుమాయిష్‌ను తిలకించేందుకు నగరవాసులే కాక తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున సందర్శకులు తరలి వస్తారు.

2200 స్టాల్స్ ఏర్పాటు

ఎగ్జిబిషన్‌లో 2200 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు జమ్మూకాశ్మీర్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన వివిధ రకాల ఉత్పత్తులు ఈ స్టాళ్లల్లో కొలువుదీరనున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వైద్య, ఆరోగ్య, కార్మిక, సమాచార, ఆర్‌బీఐ, అటవీశాఖ, జైళ్ల శాఖలతో పాటు పలు ప్రభుత్వ శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేసి సందర్శకులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తాయి. జనవరి 1న ప్రారంభమయ్యే ఈ ఎగ్జిబిషన్‌లో రౌండ్ స్టాళ్లను తొలగించి స్క్వేయర్ స్టాళ్లను కూడా అందుబాటులో ఉంచారు.

సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ..

ఎగ్జిబిషన్ నలుమూలలా 160 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు ప్రధాన గేట్ల వద్ద మెటల్ డిటెక్టర్లతో అందరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తారు. సందర్శకులను మధ్యాహ్నం 3 గంట నుండి రాత్రి 10.30 గంటల వరకు అనుమతిస్తారు. ఈ ఏడాది ఎంట్రీ ఫీజును రూ.10 పెంచారు. గతంలో రూ.40గా ఉన్న ప్రవేశ రుసుమును రూ.50 గా నిర్ణయించారు.

కమాండ్ కంట్రోల్, వైఫై టవర్ ఏర్పాటు



ఎగ్జిబిషన్‌లో కొత్తగా కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసి అందులో పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఫైర్, పోలీస్, జీహెచ్ఎంసీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉండటం ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా వేగవంతంగా పరిష్కారం అవుతాయి. సందర్శకులు పెద్ద ఎత్తున వస్తుండడంతో వారి ఫోన్లకు సిగ్నల్ సమస్య ఏర్పడకుండా వైఫై టవర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఎగ్జిబిషన్ లోపలికి వచ్చే వారికి ఉచితంగా వైఫై సౌకర్యం కల్పిస్తాం. 84వ ఎగ్జిబిషన్‌లో సందర్శకులు సునాయాసంగా తిరిగేలా విశాలమైన రోడ్లు ఏర్పాటు చేస్తున్నాం. మరుగుదొడ్లు, మంచి నీటి వసతులు కల్పిస్తాం. సందర్శకుల సౌకర్యార్థం అనౌన్స్‌మెంట్ రూమ్‌ను అందుబాటులో ఉంచుతాం.

–నిరంజన్ ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు

వలంటీర్లు, ప్రైవేట్ సెక్యూరిటీతో భద్రత



ఎగ్జిబిషన్‌కు దాదాపు 250 మంది వలంటీర్లు, ప్రైవేటు సెక్యూరిటీతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎగ్జిబిషన్ లోపల, బయట సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచుతాం. ఎగ్జిబిషన్ సందర్శకుల కోసం మెట్రోరైల్ సమయాన్ని రాత్రి వేళల్లో మరింత పొడిగించేందుకు కృషి చేస్తాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనవరి 1న ప్రదర్శనను ప్రారంభిస్తారు. కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షుడు, మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ హాజరవుతారు. 46 రోజుల పాటు కొనసాగే ఈ ప్రదర్శనలో వినోదాత్మక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

– సురేందర్ రెడ్డి
ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి

సందడిగా ధ్యాన మహాయాగం


ధ్యాన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పరిణీత పత్రీ తదితరులు


నృత్యం చేస్తున్న కళాకారిణి


హాజరైన ధ్యానులు


కళాకారిణుల నృత్య ప్రదర్శన

కడ్తాల్: మహేశ్వర మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగాలు సందడిగా సాగుతున్నాయి. గురువారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ధ్యాన గురువు పరిణీత పత్రీ మాట్లాడుతూ.. శాఖాహార జగత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇతర జీవులపై ప్రేమ, కరుణతో మెలగాలని సూచించారు. ప్రకృతి సహజ సిద్ధంగా లభించే మొక్కల ఆధారిత ఆహారం తీసుకోవాలన్నారు. ధ్యానం ద్వారా పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో ఆచరించకపోతే ప్రయోజనం శూన్యమని పేర్కొన్నారు. అనంతరం ధ్యాన పుస్తకాలను ఆవిష్కరించారు. గ్లోబల్ పిరమిడ్ మాస్టర్ ఆనంద్ తన ధ్యాన అనుభవాలను వివరించారు. ధ్యాన వేదికపై కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్యే చంపేసింది..

- గుర్తు తెలియని మృతదేహం కేసులో వీడిన మిస్టరీ
- వేధింపులు తాళలేక సోదరితో కలిసి మృతుడి భార్య ఘాతుకం


ముంతాజ్ ఆలం (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో మిస్టరీ వీడింది. తన సోదరితో కలిసి మృతుడి భార్య ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తించారు. గురువారం నిందితులను అరెస్ట్ చేసిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ చౌరస్తా వెళ్లే దారిలో హ్యాపీ వైన్స్ ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా వెళ్లిన పోలీసులు సంచిలో కుళ్లిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితమే ఎక్కడో హత్య చేసి ఇక్కడికి తీసుకువచ్చి పారవేసినట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఈ నెల 21న తెల్లవారుజామున ఇద్దరు మహిళలు మృతదేహంతో ఉన్న సంచిని తీసుకువచ్చి డ్రైనేజీలో పారవేసినట్లు వెల్లడైంది. దీని ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు.

నవారుతో ఉరి వేసి..

బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ముంతాజ్ ఆలం(40), రోషన్ ఖాతున్ దంపతులు నగరానికి వలస వచ్చి ఉడ్డెంగడ్డ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ముంతాజ్ ఆలం అదే ప్రాంతంలోని చికెన్ సెంటర్‌లో పని చేసేవాడు. మద్యానికి బానిసైన అతను తరచూ భార్యతో గొడవపడటమేగాక ఆమెను కొట్టేవాడు. ఈ విషయాన్ని ఆమె తన సోదరి అక్క రవీనా బీబీకి చెప్పింది. ఈ నెల 20న మద్యం తాగి ఇంటికి వచ్చిన ముంతాజ్ ఆలం నిద్రపోతుండగా రోషన్ ఖాతున్, రవినా బీబీ నవారు తాడుతో అతని గొంతుకు ఉరి బిగించి హత్య చేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా నవారు తాడుతో కాళ్లు, చేతులు కట్టి సంచిలో కుక్కి 21న తెల్లవారుజామున లక్ష్మిగూడ చౌరస్తాకు చేరుకున్నారు. ప్యాసింజర్ ఆటోలో ఎక్కి దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే దారిలో దిగిన వారు డ్రైనేజీలో సంచిని పారవేసి వెళ్లిపోయారన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఉదాసీనంగా ఉంటే ఊరుకోరు!

- రెసిడెన్షియల్ స్పేస్ కమర్షియల్‌కు వినియోగం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని కొందరు అధికారులు
- దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన హైడ్రా బృందాలు
- కూల్చివేతలతో పాటు బాధ్యులపై చర్యలకు సిఫార్సు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ట్రాఫిక్ ఇక్కట్లు నరకం చూపిస్తున్నాయి. గణనీయంగా పెరిగిపోతున్న వాహనాలతో పాటు వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్స్‌కు సరైన పార్కింగ్ వసతి లేకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణం. దీనిపై దృష్టి పెట్టిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఫిర్యాదుల ఆధారంగా కూల్చివేతలు ప్రారంభించింది. దీంతో పాటు ఆ సమస్యకు మూలమైన, ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారుల అంశాన్నీ తీవ్రంగా పరిగణిస్తోంది. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంబంధిత విభాగాలు, ప్రభుత్వంతో పాటు అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) సిఫార్సు చేయాలని నిర్ణయించింది. జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా నగరంలోని ట్రాఫిక్ స్థితిగతుల పైనా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలువురు డీఆర్‌ఎఫ్ సిబ్బంది ట్రాఫిక్ వలంటీర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనతో పాటు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్న అంశాలను హైడ్రా పరిగణలోకి తీసుకుంటోంది. నగరంలోని అనేక వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్స్ స్థితిగతుల్ని పరిశీలిస్తే... వాటిని లభించిన అనుమతులు, ప్రస్తుతం ఉన్న నిర్మాణాల మధ్య ఎన్నో వ్యత్యాసాలు ఉంటున్నాయి. ఆయా భవనాల నిర్మాణాలు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ), ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వచ్చే వరకు సవ్యంగానే ఉంటున్నాయి. ఈ సర్టిఫికెట్లు వచ్చిన తర్వాత మాత్రం పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నాయి. సామూహిక, గృహ అవసరాలకు, పార్కింగ్ తదితర సౌకర్యాలకు కేటాయించిన స్థలం కమర్షియల్ స్పేస్‌గా మారిపోతోంది. అక్కడ చిన్న చిన్న.. ఒక్కోసారి బ్యాంకులు వంటి పెద్ద పెద్ద వాణిజ్య, వ్యాపార సంస్థలకు పుట్టుకువస్తున్నాయి. దీనిపై కన్నేసి ఉంచాల్సిన ప్రభుత్వ విభాగాలు మిన్నకుండిపోతున్నాయి. అసోసియేషన్లు, ప్లాట్లు, ఫ్లాట్ల యజమానులు ఫిర్యాదు చేసినా కొందరు అధికారులు పట్టించుకోవట్లేదు. దీనికి ప్రలోభాలు సహా అనేక కారణాలు ఉంటున్నాయి. ఇలా రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌కు రూపుమారిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా దృష్టి పెట్టింది. వీటికి సంబంధించిన ఫిర్యాదులను ఈ విభాగం స్వీకరిస్తోంది. ఇలాంటి ఫిర్యాదుల వెనుక వ్యక్తిగత కారణాలు, కక్షలు, బెదిరింపు ధోరణులు వంటివి నిగూఢంగా ఉండే ఆస్కారం ఉందని హైడ్రా అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసింది. నేరుగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో పని చేసే ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పాటు రికార్డులను పరిశీలించడం ద్వారా అసలు విషయం తేలుస్తాయి. ఆపై హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ నేతృత్వంలో జరిగే సమావేశంలో ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు సైతం పాల్గొంటారు. దీని తర్వాత మాత్రమే తుది నిర్ణయం తీసుకుని స్థానిక అధికారుల ద్వారా హైడ్రా కూల్చివేతలు చేపడుతోంది. ఇలాంటి 'మార్పిడులు' కొనసాగకుండా, పునరావృతం కాకుండా ఉండాలంటే అధికారుల పైనా చర్యలు అనివార్యమని హైడ్రా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రికార్డుల ఆధారంగా ఈ వ్యవహారాలు చోటు చేసుకోవడానికి బాధ్యతులుగా తేలే అధికారుల పైనా చర్యలకు సిఫార్సు చేయాలని హైడ్రా అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కేపీహెచ్‌బీకాలనీ: అరటిపండ్లు కొనుక్కుని ఇంటికి వెళుతున్న మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని సాయి తేజ టవర్స్‌లో నివాసం ఉండే మేకమణి (54) తన స్నేహితురాలితో కలిసి బుధవారం సాయంత్రం స్థానిక విజేత సూపర్ మార్కెట్ సమీపంలో అరటిపండ్లు కొనుక్కుని ఇంటికి బయలుదేరింది. ఆమెను అనుసరిస్తూ వచ్చిన గుర్తు తెలియని యువకుడు సాయి బృందావన్ అపార్ట్‌మెంట్ సమీపంలో మణి మెడలోని బంగారు గొలుసు లాక్కుని పక్కనే ఉన్న పీవీ నరసింహారావు పార్కులోకి పరిగెత్తుకెళ్లాడు. పార్కు మరో వైపున ఉన్న గేటు ద్వారా తప్పించుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం


శివకుమార్ (ఫైల్)

కీసర: బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి –చర్లపల్లి రహదారిలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంపల్లికి చెందిన అంకర్ల శివకుమార్ ముదిరాజ్(29) చర్లపల్లిలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి డ్యూటీ నుంచి బైక్‌పై ఇంటికి తిరిగి వెళుతుండగా మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శివకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే తమ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడని ఆరోపిస్తూ గురువారం రాంపల్లి యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. రాంపల్లి –చర్లపల్లి రహదారి విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా సదరు కాంట్రాక్టర్ మృతుడి కుటుంబానికి రూ 6 లక్షలు పరిహారం చెల్లించేందుకు అంగీకరించినట్లు సమాచారం.

న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రజా ఉద్యమం


మాట్లాడుతున్న మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ఎంఏ.సిద్ధిఖీ తదితరులు

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధి, సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీ అజీజ్ పాషా అన్నారు. ముస్లింల సంక్షేమం కోసం 2024 –25 బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లను కేటాయించిన ప్రభుత్వం 30 నుంచి 40 శాతం మాత్రమే నిధులు ఖర్చు చేసిందని ఆయన ఆరోపించారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆలిండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం.ఏ.సిద్దిఖీ, సనాఉల్లా హుస్సేన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ముస్లిం శ్మశాన వాటికలు దాదాపు కనుమరుగయ్యాయన్నారు. ఇందుకు నగర శివారులో 125 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిని కేటాయించాలన్నారు. ఇల్లులేని పేద ముస్లింలకు 100 గజాల స్థలం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్‌బోర్డు భూముల పరిరక్షణలో పాలకులు విఫలమయ్యారన్నారు. వక్ఫ్‌బోర్డు కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలని, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఉర్దూ విద్యార్థులకు పోస్ట్ మెట్రో స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ముస్లింలకు ఇచ్చిన హామీల అమలుపై శ్రద్ధ చూపాలన్నారు. ముస్లిం సంక్షేమం, అభివృద్ధి కోసం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మునీర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు సర్వం సిద్ధం

గన్‌ఫౌండ్రీ: నగరంలోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సీఎం కప్- 2024 పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి జనవరి 2 వరకు రాష్ట్ర స్థాయి పోటీలను పండగ వాతావరణంలో నిర్వహించాలని స్పోర్ట్స్ అథారిటీ భావిస్తోంది. తెలంగాణ గ్రామీణ క్రీడారంగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో, పల్లెల నుంచి చాంపియన్లను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. సీఎం కప్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారుల సమాచారాన్ని గేమ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా సంక్షిప్తం చేయడంతో పాటు క్రీడాకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందజేసేలా స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోంది.

రెండు ఆటోలను ఢీకొట్టిన కారు

ఐదుగురికి గాయాలు


కారు ఢీకొట్టడంతో ధ్వంసమైన ఆటో

ఇబ్రహీంపట్నం: అతివేగంగా వస్తున్న కారు రెండు ఆటోలను ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన కథనం ప్రకారం.. గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం నుంచి గుమ్మడవెల్లికి వెళ్తున్న కారు గురునానక్ కాలేజ్ సమీపంలో ఎదురుగా వస్తున్న రెండు ఆటోలను ఢీకొట్టింది. మొదట ఢీకొట్టిన ఆటో మాడ్గుల మండలం ఫకీర్ తండా నుంచి వస్తోంది. అందులో ప్రయాణిస్తున్న కిషన్, బుజ్జి, నిరోషాకు గాయాలయ్యాయి. మీర్‌పేట్ జిల్లాలగూడలో నివసించే ఐదుగురు కూలీలను తీసుకొని కుర్మేండ్‌లో నిర్మాణ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా రెండో ఆటో ప్రమాదానికి గురైంది. ఆటోలోని వెంకటరతమ్మ, శ్రీనుకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను నగరంలోని ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రైవేట్ బస్సు ఢీ కొని యువకుడి మృతి


గణేష్ (ఫైల్)

శామీర్‌పేట్: బైక్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్ గ్రామానికి చెందిన గణేష్ (25) ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా కేశవరం గ్రామ సమీపంలో రాగానే ఎదురుగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో గణేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

స్వామివారికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని భవానీనగర్‌లో కొలువుదీరిన వేణుగోపాలస్వామి మందిరంలో ధనుర్మాస మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం 11వ రోజు వేణుగోపాలస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం తిరుమంజన సేవ, చామంతి తులసీ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. భక్తులుపెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

నిమ్స్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన యువకులను అభినందిస్తున్న వీరయ్య

పంజగుట్ట: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఒనగోని విక్రమ్‌గౌడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన యువకులను ప్రోత్సహించి వారికి సర్టిఫికెట్లు అందచేశారు. ప్రతీ ఒక్క యువత వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని వీరయ్య కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని అనాథ ఆశ్రమంలో అన్నదానం చేసి కేక్ కట్ చేశారు.

ఘనంగా వేం నరేందర్‌రెడ్డి పుట్టిన రోజు



బంజారాహిల్స్: ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పుట్టిన రోజు గురువారం ఘనంగా జరిగింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీగా ఆయన నివాసానికి చేరుకొని శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఖైరతాబాద్ నియోజకవర్గం, బంజారాహిల్స్ కాంగ్రెస్ నేత, ఏఐసీసీ కో-ఆర్డినేటర్ బి. నర్సింహారెడ్డి వేం నరేందర్‌రెడ్డిని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాదల్ వైస్ ప్రెసిడెంట్ దాసు మంకాల, ఖైరతాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ శేఖర్ యాదవ్, ఉపాధ్యక్షుడు పరమేష్ యాదవ్, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్వాహకులపై వేధింపులు మానుకోవాలి



నిర్వాహకులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రహమత్‌నగర్: మినీవాటర్ ప్లాంట్ నిర్వాహకులపై అధికారుల వేధింపులు మానుకోవాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని సీపీఎం కార్యాలయంలో మినీవాటర్ ప్లాంట్ నిర్వాహకులు గురువారం సీపీఎం నాయకులు స్వామి, శేషగిరిరావులను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు పూర్తిగా మధ్య తరగతికి చెందిన వారని, కేవలం జీవనోపాధి కోసం ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నారని వారు తెలిపారు. వీరిపై అధికారులు వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మినీ వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు బీరప్ప, మహేందర్, నదీమ్, లక్ష్మణ్‌రెడ్డి, ఫెరోజ్‌ఖాన్, ఫరూఖ్, ప్రభు, సొహైల్, సుధీర్, అశోక్‌యాదవ్, అలీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో ట్రాన్స్‌జెండర్లు..!



ట్రాన్స్‌జెండర్లకు సూచనలు ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

- వెస్ట్‌జోన్ పరిధిలో ఎనిమిది మంది కేటాయింపు
- ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలు
- ఇప్పటికే సేవలందిస్తున్న హైడ్రా సిబ్బంది
- ట్రాన్స్‌జెండర్లు, హైడ్రా సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది విధుల్లో

బంజారాహిల్స్: ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు (ట్రాఫిక్ అసిస్టెంట్లు) విధులు నిర్వర్తిస్తున్నారు. రెండురోజుల క్రితం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే ఎనిమిది మంది ట్రాఫిక్ అసిస్టెంట్లను కేటాయించారు. వీరు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ పోలీసులకు సహాయకులుగా పనిచేస్తున్నారు. ఒక్కో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు చొప్పున కేటాయించారు. పంజగుట్ట, జూబ్లీహిల్స్, కేబీఆర్ పార్కు, మైత్రీవనం చౌరస్తాల్లో ప్రస్తుతం వీరు విధులు నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌జెండర్ల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడమే కాకుండా వారిని గుర్తించి ఇటీవలే శిక్షణ కూడా ఇచ్చారు. ట్రాఫిక్ విధి విధానాలు, వాహనదారుల పట్ల వ్యవహరించాల్సిన తీరు, ట్రాఫిక్ పోలీసులు అంటే ఏమిటి, సేవలు ఎలా వినియోగించుకోవాలి అన్న దానిపై ఈ శిక్షణ పూర్తయ్యింది. ఒక్కో పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు చొప్పున ప్రధాన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు వీరిని కేటాయించారు. కూడళ్లలో సిగ్నల్ జంపింగ్‌లు, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, స్టాప్‌లైన్ దాటి ముందుకురావడం తదితర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వీరు దృష్టిపెడతారు. గత రెండు రోజులుగా ఆయా చౌరస్తాల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వీరు సేవలు అందిస్తున్నారు.

కొనసాగుతున్న హైడ్రా సిబ్బంది సేవలు...

ఒకవైపు ట్రాఫిక్ అసిస్టెంట్ల పేరుతో ట్రాన్స్‌జెండర్లు, మరోవైపు హైడ్రా సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో పనిచేస్తున్నారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 32 మంది హైడ్రా సిబ్బంది ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. వీరు కూడా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విధుల్లో ఉంటున్నారు. ఇటు ట్రాఫిక్ అసిస్టెంట్లు, అటు హైడ్రా సిబ్బంది కలిసి మొత్తం 40 మంది వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో విధులు నిర్వహిస్తుండడంతో ఇక్కడ ట్రాఫిక్ పోలీసుల కొరత చాలావరకు తీరింది. ఈ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతంలో స్టాప్‌లైన్ దాటి రాకుండా వాహనదారులను నియంత్రించడం, ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు సజావుగా సాగేందుకు తోడ్పడుతున్నారు. సిగ్నల్ జంపింగ్ చేస్తే వారిని గుర్తిస్తున్నారు. కేవలం ట్రాఫిక్ విధుల్లో అక్కడ ఉన్న ట్రాఫిక్ పోలీసులకు సహాయంగా ఉండాలని వీరికి ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.

సాయంత్రం కూడా కొనసాగితే బాగుంటుంది..

ట్రాఫిక్ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రద్దీగా ఉంటుంది. అన్ని కూడళ్లు, రహదారుల్లో ఈ నాలుగు గంటలు ట్రాఫిక్ స్తంభించిపోతుంది. అయితే హైడ్రా సిబ్బంది, ట్రాన్స్‌జెండర్లు ఉదయం వేళ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో హైడ్రా సిబ్బంది కొంత మందిని సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధుల్లో ఉంచితే ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని స్థానికులు అంటున్నారు. ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు నిలపడం, సిగ్నల్ జంపింగ్‌లు, స్టాప్‌లైన్లు దాటి రావడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు పంజగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పుడు ఉన్న ట్రాఫిక్ పోలీసులకు అసిస్టెంట్లుగా హైడ్రా సిబ్బందిని సాయంత్రం కూడా విధుల్లో ఉంచితే సమస్య కొంతమేర పరిష్కారం అవుతుందని ట్రాఫిక్ పోలీసులు కూడా భావిస్తున్నారు.





పంజగుట్ట చౌరస్తాలో విధుల్లో ఉన్న ట్రాన్స్‌జెండర్లు (ట్రాఫిక్ అసిస్టెంట్లు)

కాళోజీకి పీవీ నరసింహారావు స్మారక పురస్కారం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ టి.హనుమాన్ చౌదరి తదితరులు

కాచిగూడ: పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు స్మారక పురస్కారాన్ని స్వాతంత్ర్య సమరయోధులు ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావుకు అందిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి అనిల్‌కుమార్, ప్రతినిధులు పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ మల్లవరపు బాలలత, పోల విజయబాబు, సూర్య నాయక్, శ్రీకర్ శర్మ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన రవీంద్రభారతిలో పీవీ నరసింహారావు స్మారక పురస్కారాన్ని కాళోజీ నారాయణరావు తరపున కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. 15 మార్చి 2024న ముంబైలో పీవీ నరసింహారావు స్మారక పురస్కారాన్ని పద్మవిభూషణ్ రతన్ నావల్ టాటాకు, 8 మే 2024న హిమాచల్‌ప్రదేశ్‌లో 14వ దలైలామాకు అందజేయడం జరిగిందన్నారు. రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ టి.జీవన్ గౌడ్, ఆర్.కృష్ణయ్య, గడ్డం వివేక్ వెంకటస్వామి, సురభి వాణిదేవి, పివి ప్రభాకర్, డాక్టర్ వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

వైభవంగా నాగదేవత, నందీశ్వర విగ్రహ పున:ప్రతిష్ఠ మహోత్సవం



ప్రతిష్ఠ మహోత్సవంలో గూడూరి చెన్నారెడ్డి, దాతలు

శ్రీనగర్‌కాలనీ: వేదపండితుల మంత్రాలు, భక్తుల జయజయ ధ్వనుల మధ్య ఎర్రగడ్డ శాస్త్రీనగర్‌లోని శివ ఆంజనేయస్వామి దేవాలయంలో నాగదేవతల, నందీశ్వర పున:ప్రతిష్ఠ, నూతన దీపస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దాతలు చింతపల్లి వంశీరెడ్డి, చింతపల్లి శోభారెడ్డి, గూడూరి శ్రీధర్‌రెడ్డి, కళ్యాణిరెడ్డిలు భక్తులతో కలిసి హోమాల్లో, ప్రత్యేక పూజా మహోత్సవంలో పాల్గొన్నారు. సనాతన ధర్మాన్ని, హైందవ సంస్కృతిని ఐక్యతగా కాపాడుకోవాలని, మన దేవాలయాలకు మనమే రక్షణగా ఉండాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తెలంగాణా అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివయాదవ్, సత్యనారాయణగౌడ్, దుర్గరాజ్, మల్లేష్, దీపక్, రమేష్, శ్రీనివాస్, గూడూరి విజయలక్ష్మి, లేఖా రాజిరెడ్డి, జీవన్ రాజిరెడ్డి, చింతల బాలసూర్య, రమాదేవి, నర్సమ్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

పేదలు, కార్మిక వర్గానికి సీపీఐ అండ

కాచిగూడ: పేదలు, కార్మిక వర్గానికి సీపీఐ ఎప్పటికీ అండగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం హిమాయత్‌నగర్‌లో సీపీఐ సీనియర్ నాయకురాలు ప్రేమ్ పావని పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారులు కమ్యూనిస్ట్ పార్టీ చేసిన త్యాగాలను సాధించిన విజయాలను వివరిస్తూ పాడిన పాటలు ప్రజలను ఆకర్షించాయి. ఈ అనంతరం ఈటీ నరసింహ మాట్లాడుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక మిలిటెంట్ పోరాటలను నిర్వహించిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పేదలు, కార్మిక వర్గానికి నిస్వార్థంగా సేవలందించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, ఎస్.బాలరాజు, ఎస్.జ్యోతి, స్టాలిన్, కమతం యాదగిరి, బి.వెంకటేశం, చందునాయక్, పడాల నలిని, నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

పంజగుట్ట: చదువుతో పాటు పిల్లలకు క్రీడలు ఎంతో ముఖ్యమని, క్రీడలు క్రమశిక్షణతో ఎలా జీవనం గడపాలో నేర్పుతాయని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మాజీ సీఎల్‌పీ నాయకుడు పి.జనార్దన్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి నిర్వహిస్తున్న పీజేఆర్ మెమోరియల్ డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ గురువారం సాయంత్రం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.ఎస్.మక్తాలోని ఈద్గా మైదానంలో జరుగుతున్న పోటీలు ఈ నెల 26 నుంచి 28 వరకు జరుగుతాయని తెలిపారు. విజేతలకు ఈ నెల 28వ తేదీన ఖైరతాబాద్ కూడలి వద్ద నిర్వహిస్తున్న పీజేఆర్ వర్ధంతి వేడుకల్లో బహుమతులు అందిస్తామని తెలిపారు. మొదటి, రెండో బహుమతితోపాటు ఉత్తమ బ్యాట్స్‌మెన్, ఉత్తమ బౌలర్లకు కూడా నగదు, జ్ఞాపిక అందించనున్నట్లు ఆమె తెలిపారు.

కార్మికులు సంఘటితం కావాలి

లిబర్టీ: కార్మిక చట్టాల అమలు కోసం కార్మికులు సంఘటితంగా పోరాటం చేయాలని అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి పింగళి సంతప్ రెడ్డి అన్నారు. విడిపోతే పడిపోతామని, కార్మికులు ఐక్యంగా ఉంటే సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేష్‌ను ఆత్మీయ సత్కారం చేసి అభినందించారు. ఈ సందర్భంగా సంతప్‌రెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలు పూర్తి స్థాయిలో అమలు కాకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

శంకర్ దయాల్‌శర్మకు నివాళి



డాక్టర్ శంకర్ దయాల్‌శర్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వెన్న సదానందు

లిబర్టీ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ శంకర్ దయాల్‌శర్మ నిస్వార్థ రాజకీయ నాయకుడని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. జీవితాంతం విలువలతో కూడిన జీవితాన్ని సాగించారని గుర్తు చేశారు. గురువారం శంకర్ దయాల్‌శర్మ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. నిస్వార్థ రాజకీయ నాయకుడిగా శర్మ పేరుపొందారని పేర్కొన్నారు. భారత రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారని ఆయన కొనియాడారు.

డాక్టర్ భాస్కర్ మృతి నిమ్స్‌కు తీరనిలోటు

సంతాప సభలో డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: నిమ్స్ పల్మనాలజీ విభాగం అడిషినల్ ప్రొఫెసర్ డాక్టర్ కె. భాస్కర్ అకాల మృతి ఆస్పత్రికి తీరనిలోటని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. గురువారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో నిమ్స్ పల్మనాలజీ విభాగం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. తొలుత భాస్కర్ చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ భాస్కర్ మరణం యావత్తు ఆస్పత్రి వైద్యలోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. పల్మనాలజీ విభాగంలో భాస్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ పల్మనాలజీ విభాగం అధిపతి డాక్టర్ పరంజ్యోతి, నర్సింగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

గుడికట్టి.. గురుభక్తి చాటి..!

- పీజేఆర్‌పై అభిమానంతో ఆలయాన్ని నిర్మించిన యాదయ్య
- రేపు పీజేఆర్ వర్ధంతి




రహమత్‌నగర్: పీజేఆర్ అంటే అతనికి వల్లమానిన అభిమానం. తన గురువు పీజేఆర్ పేరు చరిత్రలో నిలిచిపోవాలని భావించాడతడు. ఇందుకోసం ఏకంగా ఆయనకు గుడి కట్టి గురుభక్తి చాటుకున్నాడు. దీని కోసం మూడు నెలలపాటు రాత్రీ పగలు శ్రమించాడు. చివరికి పీజేఆర్‌కు గుడికట్టి తన ఆశయాన్ని నెరవేర్చుకున్నాడు.

మూడు నెలల కాలం... రూ. పది లక్షల వ్యయం

ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు వేముల యాదయ్యకు మాజీ సీఎల్‌పీ నాయకుడు పి. జనార్దన్‌రెడ్డి అంటే ఎంతో అభిమానం. ఈ క్రమంలో డిసెంబర్ 28, 2007న పీజేఆర్ మృతి చెందారు. దీంతో కలత చెందిన యాదయ్య తన రాజకీయ గురువుకు గుడి కట్టాలని సంకల్పించాడు. దాతల సహకారంతో బస్తీలోని స్థానిక కనక దుర్గ అమ్మ వారి ఆలయ ఆవరణలో దాదాపు 35 గజాల విస్తీర్ణంలో నిర్మాణ పనులు మొదలు పెట్టాడు. ప్రముఖ శిల్పి కృష్ణాచారిచే ఆరడుగుల ఎత్తైన విగ్రహాన్ని తయారు చేయించాడు. ఫిబ్రవరి 28, 2008న వేద పండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా పీజేఆర్ ఆలయాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభించి, మహా అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశాడు. ఈ కార్యక్రమానికి పీజేఆర్ సతీమణి సులోచన (ఇందిరారెడ్డి), కూతుర్లు గాయత్రి, అనురాగిణి, విజయా రెడ్డి, పావని, కుమారుడు జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీజేఆర్ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం జాతీయ మీడియాలో ప్రసారం కావడం విశేషం. నేటికి దివంగత పీజేఆర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ఈ గుడి వద్ద కాంగ్రెస్ నాయకులు, ఆయన అభిమానులు వైభవంగా జరుపుకుంటారు. పార్టీలకు అతీతంగా నాయకులు పీజేఆర్‌కు ఇక్కడ నివాళులర్పిస్తుంటారు.

ట్యాంక్‌బండ్‌పై పీజేఆర్ విగ్రహం పెట్టాలి



హైదరాబాద్ బాద్‌షాగా పేరుపొంది, పేద ప్రజల పక్షాన ఎనలేని పోరాటం చేసిన పీజేఆర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి ఆయనను గౌరవించాలి. పీజేఆర్ గుడి కట్టి నా జన్మధన్యమైంది. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ నాయకులను కోరుతున్నా.

– వేముల యాదయ్య (ఆలయ నిర్మాణ కర్త)

అకాల వర్షం.. ట్రాఫిక్‌కు అంతరాయం



బంజారాహిల్స్: అల్పపీడన ప్రభావానికి గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమలమయ్యాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, అమీర్‌పేట్ ప్రాంతాల్లోని రహదారులన్నీ నీటమునిగాయి. సాయంత్రం అందరూ ఇళ్లకు చేరే సమయంలో ఒక్కసారిగా వాన కురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడగా, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వరద నీటికి పంజగుట్ట ప్రధాన రహదారిలోని చిరు దుకాణాలు నీటమునిగాయి.



శక్తిమంతం.. దాశరథి కలం

మహాకవి దాశరథి పుస్తకావిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ నందిని సిధారెడ్డి



మహాకవి దాశరథి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి, కవి యాకూబ్ తదితరులు

కవాడిగూడ: మహాకవి దాశరథి శతజయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో దాశరథి పై ప్రత్యేక పుస్తకాన్ని (మహాకవి దాశరథి) నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరుగుతున్న 37వ జాతీయ పుస్తక ప్రదర్శనలోని తోపుడు బండి సాధిక్ వేదికపై విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ నందిని సిధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నిజాం కాలంలో దాశరథి పోరాట ఘట్టాలను వివరించారు. జైలు గోడలపై ఆయన రాసిన కవిత్వాలు ఎంతో శక్తివంతమైనవని అన్నారు. ప్రముఖ కవి వట్టికోట అల్వార్ స్వామి దాశరథి మధ్య ఉండే ఉద్యమ మైత్రిని వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకూబ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎన్ బాలాచారి, దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షులు డాక్టర్ ఆర్ సూర్యప్రకాష్‌రావు, ప్రముఖ కవి విమర్శకులు గంటా మనోహర్‌రెడ్డి, నాగయ్య కళాపీఠం చైర్మన్ సరోజిని దేవి, గోల్కొండ సాహితీ కళాసమితి అధ్యక్షులు చంద్రప్రకాష్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

మందా జగన్నాథంను పరామర్శించిన హరీశ్‌రావు

లక్డీకాపూల్ : నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథంను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. గురువారం ఆయన నిమ్స్‌కు వచ్చి జగన్నాధం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం మందా ఆరోగ్య పరిస్థితి వివరాలను నెఫ్రాలజీ విభాగం అధిపతి డాక్టర్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. జగన్నాథంను పరామర్శించిన వారిలో ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, వివేకానంద గౌడ్, మాజీ మంత్రులు దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి ఉన్నారు.

గుండెపోటుకు గురైన మందా..

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జగన్నాధం రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురయ్యారు. దీంతో ఆయన్ని కుటుంబ సభ్యులు నిమ్స్‌కు తరలించారు. ఈ నెల 22 నుంచి ఆయన ఆర్ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. మూత్రపిండాల విభాగంలో వైద్యసేవలు పొందుతున్న జగన్నాధం గత కొంత కాలంగా కిడ్నీ డయాలసిస్ సేవలు పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన హిమో డయాలసిస్ సమస్యతో బాధపడుతున్నట్లు నిమ్స్ వైద్యులు పేర్కొన్నారు.



మందా జగన్నాథంను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు

పూలు, పండ్ల సాగుపై దృష్టి

- శివారు ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగుపై సర్కారు దృష్టి
- కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలతోటల పెంపకం

నగర శివారు రైతుకు చేయూత..!

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారును హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీంతో మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రస్తుతం సాగవుతున్న ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని మరింతగా పెంచే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నాయి. హైదరాబాద్ శివారుల్లో పండ్లు, కూరగాయలు, పూలను పండిస్తున్న రైతులకు చేయూతనందించటం ద్వారా మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు వ్యవసాయ, వ్యవసాయేతర సంస్థల స్థాపనకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రైతుల నుంచి కూరగాయలు, ఉద్యాన పంటలు, పండ్ల క్రయవిక్రయాలు నిర్వహించేందుకు పలు సంస్థలు అవసరమని ప్రభుత్వం నిర్ణయించగా అధికారులు కూడా ఈ మేరకు ఆ సంస్థల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో పండ్లు, కూరగాయలు, తీగ జాతి తోటలు, పూల పంటలను పండించే ప్రాంతాలన్నీ హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో రవాణా సౌకర్యం సులభంగా ఉంటుందని భావిస్తున్నారు. దీంతో ప్రభుత్వ యోచన మేరకు పలు సంస్థలను ఏర్పాటు చేసేందుకు చాలామంది ఆసక్తి కనబరుస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



నగరాలు లక్ష్యంగా...

- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయ్ తదితర నగరాలకు పలు సంస్థల ఏర్పాటుతో పండ్లు, కూరగాయలు, పూలను రవాణా చేసేందుకు నెట్‌వర్క్ ఏర్పాటు కానుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఫైవ్‌స్టార్ హోటళ్లు, కార్పొరేట్ సంస్థలు, ఇతర కంపెనీలకు పంపిణీ చేయనున్నారు.
- ప్రస్తుతం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 12 వేల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాల్లో 75వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలను రైతులు పండిస్తున్నారు. కూరగాయలు, ఉద్యాన పంటలను ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరు మార్కెట్లకు తరలిస్తున్నారు.
- కూరగాయలు సాగు చేస్తున్న రైతులు మాత్రం బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌తోసహా నగర సమీపంలోని రైతుబజార్లలో విక్రయిస్తున్నారు.
- పెట్టుబడి, రవాణా ఖర్చులు, కొంత లాభం వేసుకుని అమ్ముకుంటున్నారు. పలు సంస్థలు ఏర్పాటైతే ఈ పంటలకు మార్కెటింగ్‌తో పాటు వ్యవసాయేతర పనులు చేస్తున్న యువకులకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉండగలవని భావిస్తున్నారు.



హార్టికల్చర్ హబ్‌పై ప్రతిపాదనలివే

- నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రాజెక్టు నిర్వహణ కింద దశల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై సంబంధిత శాఖలు ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నారు.
- మేడ్చల్ జిల్లాలో 99 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, ఇందులో 12 వేల ఎకరాల్లో మాత్రమే ఉద్యానవన పంట సాగు చేస్తున్నారు. మరో 18 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు.
- దశల వారీగా అదనంగా 30 వేల ఎకరాల్లో ఉద్యానవన పంట సాగు చేయవచ్చునని సంబంధిత శాఖ అంచనా వేస్తోంది. ప్రతి ఏటా 8 నుంచి 10 వేల ఎకరాల చొప్పున 30 వేల ఎకరాల్లో హార్టికల్చర్ పంట సాగు పెంచవచ్చునని పేర్కొంటోంది.
- ఇందుకు గాను రూ.250 కోట్లు ఖర్చు కాగలదని అంచనా.

నగరంలో నేడు

- ఎన్టీఆర్ స్టేడియంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్
- మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫోటో ఫెస్టివల్
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళామేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వాల్మీకి హరికిషన్‌కు మయన్మార్ టూరిజం అవార్డ్



సాక్షి, సిటీబ్యూరో : తెలుగు రాష్ట్రాల నుంచి మయన్మార్‌కు విశేషమైన పర్యాటక సేవలను అందజేస్తున్న వాల్మీకి ట్రావెల్ అండ్ టూరిజం సొల్యూషన్స్ సంస్థ వ్యవస్థాపకులు వాల్మీకి హరికిషన్‌కు ఇండియన్ అసోసియేషన్ ట్రేడ్ కౌన్సిల్ టూరిజం అవార్డును అందజేసింది. గురువారం నగరంలో జరిగిన కార్యక్రమంలో మయన్మార్ రాయబారి ఝాఓ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించొద్దు



అబిడ్స్: గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించవద్దని గోషామహల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వినోద్ యాదవ్ కోటి శైలేష్ కురుమ, శీలంపల్లి సురేష్, బీ శ్రీనివాస్, రవి, శైలేందర్‌తో పాటు పలువురు నాయకులు 'గోషామహల్‌లో ఆసుపత్రి వద్దు.. పోలీస్‌గ్రౌండ్ ఉండాలని' గోషామహల్ ఆర్య సమాజ్ వద్ద గురువారం ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అఫ్జల్‌గంజ్‌లో ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోనే నూతన ఆసుపత్రిని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సంధ్యారాణి, లక్ష్మి, నిర్మల, లడ్డూతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీనివాస్ గూడూరుకు అవార్డు ప్రదానం



చిక్కడపల్లి: విదేశాల్లో స్థిర పడిన తెలుగు వారు భాషా సంస్కృతులను పరిరక్షణలో చేస్తున్న కృషి అమోఘమని వంశీ ఇంటర్నేషనల్ స్థాపకుడు వంశీ రామరాజు అన్నారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లిలోని శ్రీ ముఖీ కాంప్లెక్స్‌లో స్థిరపడిన అమెరికాలో ఎస్‌పిబీ మ్యూజిక్ ఇంటర్నేషల్(యుఎస్ఎ) చైర్మన్ శ్రీనివాస్ గూడూరుకు ప్రవాస భారతీయ వంశీ గ్లోబల్ అవార్డు ప్రదానోత్సవం సభ జరిగింది. ప్రఖ్యాత గాయకుడు బాల సుబ్రహ్మణ్యం పేరిట సంగీత సంస్థను స్థాపించి ఆయన పాడిన పాటలు అక్కడి వారికి ప్రచారం చేస్తున్న పాటల ప్రియుడు శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్భంగా గాయనీగాయకులు పాడిన పాటలు అలరించాయి.

'పాఠ్యాంశంగా వీర్ బాల్ దివస్'

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

సనత్‌నగర్: వీర్ బాల్ దివస్‌ను పాఠ్యాంశంగా చేర్చడంపై ప్రధాని మోదీతో చర్చిస్తానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భారతీయ సాహస యోధులైన సాహిబ్‌జాదా జొరావర్‌సింగ్, సాహెబ్ జాదా ఫతేసింగ్‌ల బలిదాన రోజును పురస్కరించుకుని వీర్ బాల్ దివస్‌ను అమీర్‌పేట గురుద్వారాలో నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాహస యోధులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 350 ఏళ్ల క్రితం వీర్ సాహెబ్ బలిదానం డిసెంబర్ 26న జరిగిందన్నారు. భారత్ ధర్మాన్ని, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు గురుగోవింద్‌సింగ్ ఆదేశానుసారం బలిదానం చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్ సరళ, గురుద్వారా అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ దర్శన్‌సింగ్, సురేందర్‌సింగ్ పాల్గొన్నారు.



అమీర్‌పేట గురుద్వారాలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

టిబెటియన్లకు స్వాతంత్య్రం కావాలంటూ బైక్ ర్యాలీ

రాంగోపాల్‌పేట్: చైనా నుంచి టిబెటియన్లకు స్వాతంత్య్రం లభించాలని కోరుతూ టిబెటియన్ యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం సికింద్రాబాద్ గాంధీ విగ్రహం వద్ద ప్రముఖ మెజీషియన్ సామల వేణు, ప్రొఫెసర్ ప్రసాద్ ఈ ర్యాలీని ప్రారంభించారు. గత నవందర్ 22న అరుణాచల్ ప్రదేశ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ 36వ రోజు హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత దేశం నుంచి టిబెట్‌కు కొన్ని దశాబ్దాల నుంచి మద్దతు లభిస్తోందని, చైనా దురాక్రమణ నుంచి టిబెట్‌కు రక్షణ కల్పించాలని వారు కోరారు. ఈ బైక్ ర్యాలీ 11 మంది సభ్యులతో 20 వేల కిలో మీటర్లు తిరిగి ఢిల్లీలో ముగుస్తుందని తెలిపారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న వారిని సత్కరిస్తున్న దృశ్యం

ఆ యూనివర్సిటీలపై ఎంతో గౌరవం

ప్రొఫెసర్ కంచ ఐలయ్య

పంజగుట్ట: వెంకటేశ్వరా యూనివర్సిటీ, పద్మావతి యూనివర్సిటీలపై తనకు ఎంతో గౌరవం ఉందని ఆయా యూనివర్సిటీల నుంచి ఎంతోమంది మేధావులు బయటకు వచ్చారని, దేవుళ్ల పేరుతో యూనివర్సిటీలు ఉండడం వల్ల తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూర్ మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ సభలో తాను చాకలి ఐలమ్మ యూనివర్సిటీ గూర్చి ప్రస్తావిస్తూ మాట్లాడిన మాటలను కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించి చూపించాయన్నారు. అందులో చూపించినవి అన్ని అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువురాని చాకలి ఐలమ్మ పేరు కోఠి ఉమెన్స్ యూనివర్సిటీకి పెడితే యూనివర్సిటీలో చదువుకునే విద్యార్థులకు చదువు ఎలా వస్తుందని కొంతమంది ప్రశ్నిస్తున్నారని, వెంకటేశ్వరా, పద్మావతి అని యూనివర్సిటీలకు పేర్లు పెట్టామని వారు ఎంతవకు చదువకున్నారో ఎవరికి తెలుసు అని మాత్రమే తాను అన్నానని తెలిపారు. త్వరలోనే అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోఠి చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో ఆరు అడుగుల ఐలమ్మ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వీసీకి ఈ విషయమై వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

తెలుగు వికీపీడియాపై అవగాహన అవసరం

కవాడిగూడ: తెలుగు వికీపీడియాపై అందరికీ అవగాహన అవసరమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. తెలుగు వికీపీడియాలో లక్ష వ్యాసాలు దాటిన సందర్భంగా హైదరాబాద్ బుక్‌ఫెయిర్ వేదికగా లక్ష వ్యాసాల ప్రస్థానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వికీపీడియా గురించి మీకు తెలుసా..? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ... తెలుగు వికీపీడియా వేగంగా అభివృద్ధి చెందుతూ లక్ష వ్యాసాలను దాటి భారతీయ భాషల్లో ఎక్కువ వ్యాసాలను కలిగి ఉన్న జాబితాలోకి చేరడం గర్వించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో బుక్‌ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, వికీపీడియన్‌లు కృపాల్, కష్యప్, వి.జే.సుశీల, జి. రామేశం, ప్రణయ్‌రాజ్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



వికీపీడియా వ్యాసాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

ఓపెన్ వర్సిటీ బ్యాగ్‌లాగ్ విద్యార్థులకు అవకాశం

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2015, 2016లో డిగ్రీ కోర్సులు చదివి వివిధ కారణాలతో చదువును మధ్యలో ఆపివేసిన బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఆ కోర్సులను తిరిగి పూర్తి చేయడానికి మరో అవకాశాన్ని కల్పించినట్లు బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ మారోజు రామాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరి ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరపు పరీక్షలు రాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. రీ అడ్మిషన్ పొందడానికి, బ్యాగ్‌లాగ్ పరీక్షలు రాయడానికి ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు. వచ్చే జనవరి 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు తృతీయ సంవత్సరం విద్యార్థులకు, ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని ఆయన చెప్పారు. అలాగే జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మొదటి సంవత్సరం పరీక్షలు ఉంటాయని తెలిపారు. తృతీయ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు, మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని బ్యాక్‌లాగ్ విద్యార్థులు వినియోగించుకుని తమ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో గానీ, 98854 94588 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

3న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ తదితరులు

కాచిగూడ: రాష్ట్రంలో 16 లక్షలా 75వేల మంది విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జనవరి 3న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాలు, ఆర్‌డీఓ, మండల తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి చేపడుతున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్యక్షతన గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చలో కలెక్టరేట్ ముట్టడి పోస్టర్‌ను ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉద్యమం మరింత ఉధృతమై జరగరాని సంఘటనలు ఎవైనా జరిగితే అందుకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని అన్నారు. ఫీజుల రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయిలు రూ.4వేల కోట్లు తక్షణమే చెల్లించాలని కోరారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు ఫీజుల బకాయిలు చెల్లించకపోవడం పట్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనతో ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్స్‌ను రూ.5500 నుంచి రూ.20వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, సి.రాజేందర్, జిల్లా పెల్లి అంజి, నిమ్మల వీరన్న, రాందేవ్ మోదీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులే లక్ష్యం..

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి యూజీ కోర్సులు
- సాక్షితో 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

ఎస్కీలో కొత్త కోర్సుల అమలుకు శ్రీకారం



గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్ ప్రధాన భవనం



'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో కొత్తగా 14 స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రారంభించనున్నట్లు 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీని ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను కూడా ఎస్కీలో ప్రారంభించాలని తలపెట్టామని పేర్కొన్నారు. అందులో భాగంగా మూడు కోర్సులు అమలు చేస్తున్నామని, అందులో స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్ వేర్‌హౌజ్ ఎగ్జిక్యూటివ్స్ అండ్ కీ కన్‌సైనర్ ఎగ్జిక్యూటివ్స్, అండర్ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ఫార్మసీ అసోసియేట్స్, అండర్ స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్ నర్స్ కోర్సు వంటి వాటిని ప్రారంభిస్తామన్నారు. గురువారం ఆయన 'సాక్షి'తో పలు విషయాలపై మాట్లాడారు.

◆ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు

ఎస్కీలోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ (ఎస్‌పీజీఎస్) రెండు పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులను అమలు చేస్తున్నాం. అందులో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ , జనరల్ మేనేజ్‌మెంట్ కోర్సులున్నాయి. ఈ ఏడాది పీజీ డిప్లొమో ఇన్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, వెంచర్ డెవలప్‌మెంట్ కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చాం.అలాగే 2025–26 విద్యా సంవత్సరం నుంచి రెండు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందుబాటులోకి తెస్తున్నాం. అందులో బ్యాచులర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బ్యాచులర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ అనే కోర్సులను అందుబాటులోకి తెస్తాం.

◆ ఉపాధి ఆధారిత కోర్సులు

'ఎస్కీ'లోని 'ఎస్‌పీజీఎస్'లో ప్రస్తుతం 240 మంది చదువుకుంటున్నారు.ఈ సంఖ్యను రాబోయే కాలంలో గణనీయంగా పెంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. అవసరమైతే కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టి ఎక్కువ మంది నాణ్యమైన ఉపాధి అధారిత కోర్సులు ఏర్పాటు చేస్తాం.

◆ ఎస్‌పీజీఎస్'లో ప్లేస్‌మెంట్ల పరిస్థితి ఎలా ఉందంటే..

'ఎస్‌పీజీఎస్' ఏర్పాటు చేయడమే ఉపాధి కల్పనే లక్ష్యంగా ఏర్పాటు చేసినవే. ప్రస్తుతం ఇందులో చదువుకున్న వారిలో 90 శాతం మంది ఉద్యోగాలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలలో పొందుతున్నారు. మిగతా 10 శాతం వారు సొంతంగా వ్యాపారాలు, పరిశ్రమల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాం.

◆ జనవరిలో స్నాతకోత్సవం

'ఎస్‌పీజీఎస్' సాత్నకోత్సవాన్ని 2025 జనవరి 3వ తేదీన నిర్వహించాలని తలపెట్టాం. గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మను ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఆహ్వానించాం. ఎస్కీలో స్నాతకోత్సవం నిర్వహించడం దీంతో మూడవ సారి. ఇప్పటికే 2012లో మొదటిసారి, 2015లో రెండవ సారి నిర్వహించాం, పదేళ్ల తర్వాత ప్రస్తుతం నిర్వహించేది మూడవది.

రచన, సాహిత్యాన్ని అభిరుచిగా మలుచుకుంటే చాలు.. మన భవిష్యత్ ప్రయాణ మార్గాన్ని, అత్యుత్తమ లక్ష్యాలకు అదే చేర్చుతుందని ప్రముఖ సాహిత్యకారులు చెప్పే మాట. ఆనాటి తరం యువ రచయితలకు సాహిత్యాభిలాష ఎంత వరకూ తోడ్పాటునందించిందో అటుంచితే.. ఈ తరం యువ రచయితలకు మాత్రం గౌరవ ప్రస్థానాన్ని ప్రసాదిస్తోంది. ఈ తరం యువత సాహిత్యంలో విశేషంగా రాణించడమే దీనికి నిదర్శనం. అధునా తన పంథాతో, వినూత్న ఆలోచనలతో, సామాజిక అంశాలను ప్రస్తుత భాషా అనుకరణ పరిమితుల్లో రచిస్తూ.. తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. యువ రచనలకు ఈ దశాబ్ద కాలాన్ని స్వర్ణయుగంగా చెప్పకోవచ్చు. ప్రతి ఏడాదీ యువ రచయితల కొత్త పుస్తకాలు, నవలలు, కథానికలు, కవిత్వ సంపుటిలు విరివిగా ప్రచురితమవుతున్నాయి. ఇందులోనూ వినూతనత్వం ఏంటంటే.. ఈ అభిరుచి ఉన్న యువ ఔత్సాహికులకు అటు సినిమా రంగంలో, ఇటు కంటెంట్ డెవలప్‌మెంట్ వేదికల్లో ప్రధాన్యత పెరగడం. ఈ సందర్భంగా వీరంతా సోషల్ సెలబ్రిటీలుగా మారుతున్నారు. నగరం వేదికగా కొనసాగుతున్న నేషనల్ బుక్ ఫెయిర్ నేపథ్యంలో అటువంటి యువ సాహిత్య కారులను 'సాక్షి' ప్రత్యేకంగా పలకరించింది. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే తెలుసుకుందాం.

- సాక్షి, సిటీబ్యూరో

యువ కలం..

సాహిత్యం వైపు యువత అడుగులు

దశాబ్ద కాలంగా వెల్లువెత్తుతున్న రచనలు | అనూహ్యంగా పెరిగిన యువ సాహిత్యం | వినూత్న రచనలతో సోషల్ సెలబ్రెటీ గుర్తింపు

ట్రెండ్ సెట్టర్స్‌గా మారిన యంగ్ రైటర్స్ | బుక్ ఫెయిర్ వేదికగా రచయితలపై ప్రత్యేక కథనం



ప్రశ్నించే గొంతుకగా ఉండాలని..

రచన, సాహిత్యం అనేది నా ఆలోచనలను ప్రతిబింబించే సామాజిక వేదికలుగా భావిస్తాను. రాసే కథ అయినా, నవల అయినా సమాజహితమై, అసమానతలను ప్రశ్నించే గొంతుకగా ఉండాలని భావిస్తాను. అందులో భాగంగానే ఎర్రమల్లెలు అనే పుస్తకం రాశాను. మ్యారిటల్ రేప్‌ల పై ఈ రచన రాశాను. సాధారణంగా మల్లెలు తెల్లగా ఉంటాయి. కానీ అవి ఎందుకు ఎర్రగా మారాయనే నిజజీవిత సామాజిక అంశాన్ని ప్రస్తావించాను. సాధారణంగా పెళ్లి జరిగిన తరువాత అందరి ఆడవారి జీవితాలూ ఒకేలా ఉండవు. ముఖ్యంగా సెక్స్ ఎడ్యుకేషన్‌పై అవగాహన లేకపోవడం దీనికి కారణం. నా పుస్తకానికి అన్ని వయసుల ఆడవారు, ముఖ్యంగా మగవారి నుంచి స్పందన లభిస్తోంది. నిజ జీవితంలో భార్యల విషయంలో భర్తలు ఎలా ప్రవర్తిస్తున్నారనే అంశంలో చాలా మంది రియలైజ్ అయ్యామని స్పందించడం చాలా సంతోషాన్నిచ్చింది. నేను సినిమాలకు రచనా సహకారం అందిస్తున్నాను. ఆల్ ఇండియా రేడియోలో డ్రామాలు రాస్తున్నాను. భవిష్యత్తులో మరిన్ని కథలు, నవలలు రాయనున్నాను.

- రోజా రాణి దాసరి



మహిళా సాధికారత దిశగా..

నా వృత్తి ప్రభుత్వ రంగ సంస్థలో మహిళా సాధికారత కోసం కృషి చేయడం. నా వృత్తిలో ఎదురైన అనుభవాలను ప్రవృత్తి అయినటువంటి రచనల ద్వారా సమాజానికి చేరువ చేస్తున్నాను. మొదటి సామాజిక సమస్యలపై కథలు రాస్తున్నాను. నా మొదటి పుస్తకం ఇసుక అద్దం. ఇది నా ప్రయాణానికి మంచి బాట వేసింది. ఈ మధ్యనే విడుదల చేసిన 2వ కథల పుస్తకం బల్కాప్ కూడా నా సామాజిక బాధ్యతను అక్షరాలుగా, పదాలుగా వివరిస్తుంది. ఒక సామాజిక అంశంపై లోతుగా పరిశోధించాకే, అందులోని నిజాలను నిక్కచ్చిగా చెప్పడానికే నా కలాన్ని వాడతాను. నా రచనలు నాకు సంతృప్తితో పాటు గౌరవాన్ని, గుర్తింపును ఇచ్చాయి. యండమూరి వీరేంద్రనాథ్ ఉగాది పురస్కారంతో పాటు, వాయిస్ ఆఫ్ తెలంగాణ వంటి అవార్డులు సైతం లభించాయి. ముఖ్యంగా 50 ఇన్స్‌పైరింగ్ ఉమెన్స్‌లో నాకు అవార్డు రావడం, దీని కోసం ప్రత్యేకంగా ప్రచురించిన పుస్తకంలో నా గురించి ప్రచురించారు. మరికొన్ని అద్భుతమైన కథలతో రానున్నాను.


- శ్రీ ఊహ

స్క్రీన్ రైటర్ అవ్వాలనే లక్ష్యంతో..



మనుషుల్లోని సున్నితమైన భావోద్వేగాలైన ప్రేమ, అనురాగం, అభిమానం, ఆప్యాయత వంటి అంశాల్ని స్పృశిస్తూ రచనలు చేయడం నాకు ఇష్టం. ప్రస్తుతం ఈ ప్రపంచానికి వీటి అవసరం ఎంతో ఉందని నేను భావిస్తున్నాను. ఇందులో భాగంగానే 'సరిజోడి' అనే స్వచ్ఛమైన అచ్చ తెలుగులో ఒక నవల రాశాను. సిటీలో కొనసాగుతున్న బుక్ ఫెయిర్‌లో ఈ పుస్తకానికి మంచి ఆదరణ లభిస్తోంది. ఇది పాకిస్తానీ ముస్లిం అమ్మాయికి, హైదరాబాదీ వ్యాపారవేత్తకి మధ్య జరిగిన హృద్యమైన ప్రేమ కావ్యం. ఇది నా మొదటి నవల. భవిష్యత్తులో స్క్రీన్ రైటర్ అవ్వాలనే లక్ష్యంతో ఉన్నాను. ప్రస్తుతం నగరంలోని ఇఫ్లూ యూనివర్సిటీలో ఫిల్మ్ స్టడీస్ పై పీహెచ్‌డీ చేస్తున్నాను. ఈ మధ్య కాలంలో యువ రచయితల పుస్తకాలు పెరగడం సంతోషాన్ని ఇవ్వడంతో పాటు, పోటీతత్వాన్ని పెంచుతోంది. ఇందులో బాధ్యతాయుతమైన రచనలు, భాషను, సామాజిక, మానసిక విలువలను స్పృశించే రచనలు కూడా ఉండటం శుభపరిణామం.

- దిలీప్.





స్నేహితుల సహకారంతో..

రచనల పరంగా 2012లో మొదలైన నా ప్రయాణం కేంద్ర యువ సాహిత్య అకాడమీ అవార్డు పొందే వరకూ సాగింది. మొదట్లో ఈ రచనా రంగంలోని స్నేహితుల సహకారంతో మొదటి పుస్తకాన్ని ప్రచురించాను. ఆ తరువాత ఆ కష్టాలను దాటుకుని అస్థిత్వం, కుల వృత్తులను, సామాజిక అంశాలను ప్రతిబింబించే కవిత్వం, కథలు రాశాను. నా రచనలు హిందీ, తమిళం, అస్సామీ, బంగ్లా వంటి భాషలతో పాటు ఫ్రెంచ్, స్పెయిన్ వంటి భాషల్లోకి తర్జుమా చేయడం గొప్ప గౌరవంగా భావిస్తాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల కోసం సిలబస్ చేర్చడం కూడా మరింత సంతృప్తినిచ్చింది. ఈ ప్రయాణంలో వివిధ రాష్ట్రాల్లో దాదాపు 13 లిటరరీ ఫెస్టివల్స్‌లో వేదిక పంచుకోవడం, ఈ వేదికల పైన జాతీయ, అంతర్జాతీయ సాహిత్యకారులను కలుసుకోవడం, వారి అనుభవాలను ఆలోచనలను పంచుకోవడం నా విజయాలుగా భావిస్తాను. మరి కొద్ది రోజుల్లో ఇంగ్లిష్ కవిత్వం, కవిత్వ అనువాదం, మరో సంపాదకత్వంతో రానున్నాను.

- రమేష్ కార్తీక్

ఆహా.. ఏమి రుచి..

- పండగ రుచులు.. చూసొద్దామా..
- పలు హోటల్స్ ప్రత్యేకంగా 'ఫుడ్ ఫెస్టివల్స్'
- సంప్రదాయ వంటకాలకు ప్రత్యేక స్థానం
- న్యూ రెసిపీలను పరిచయం చేస్తున్న చెఫ్‌లు



సాక్షి, సిటీబ్యూరో: వచ్చేది ఏడాది ముగింపు సెలబ్రేషన్స్.. ఆ తర్వాత వచ్చేది సంక్రాంతి పండగ.. ఆహార ప్రియులను ఆకట్టుకునేందుకు వివిధ హోటల్ యాజమాన్యాలు ప్రత్యేక రుచులను సిద్ధం చేస్తున్నాయి. సాధారణ రెసిపీలకు భిన్నంగా సంప్రదాయ, గ్రామీణ, స్థానిక, అంతర్జాతీయ వంటకాలను మరోమారు పరిచయం చేస్తున్నాయి. క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకు ఆహారం వేగంగా తినడం, పానీయాలు త్వరగా తాగడం, ఇతర వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నాయి. ఈ సెలవుల్లో కుటుంబ సభ్యులతో కలిసి జ్ఞాపకాలను సొంతం చేసుకోవాలనుకునే వారికి ఇదో మంచి అవకాశం.


ఒక్కో హోటల్‌లో ఒక్కో రకం..

మినీ భారత దేశంగా ఖ్యాతిగాంచిన భాగ్యనగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 1.5 కోట్ల మంది జనాభా నివాసం ఉంటున్నారు. ఆయా ప్రాంతాలకు అనుగుణంగా విభిన్నమైన ఆహారపు అలవాట్లు వారి సొంతం. ఒక్కో ప్రాంతంలో ఫెస్టివల్ సెలబ్రేషన్స్ ఒక్కో విధంగా ఉంటాయి. దీనికి అనుగుణంగానే నగరంలోని పలు హోటల్స్ సైతం ప్రాంతీయ అభిరుచులకు తగ్గట్లుగా ప్రత్యేకించి చెఫ్‌లను తెప్పించి వంటకాలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో హోటల్‌లో ఒక్కో రకమైన మెనూ ప్రత్యక్షం అవుతోంది. సంక్రాంతి సందర్భంగా ప్రత్యేకించి బర్గర్ ఈటింగ్, పానీపూరీ, జూస్ స్పీడ్ డ్రింకింగ్ వంటి పోటీలను నిర్వహిస్తున్నారు.

బలశాలి.. వెలిశాల హృతిక్..



- ✦ కరాటేలో రాణిస్తూ.. పతకాలు సాధిస్తూ..
- ✦ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణింపు
- ✦ లాంగ్ టెన్నిస్, అబాకస్, సిమ్మింగ్‌లోనూ ప్రతిభ
- ✦ బ్లాక్ బెల్ట్ లెవెల్‌లో ఆడుతూ..30కు పైగా పతకాలు



రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొంటూ 30కు పైగా పతకాలు సాధించాడు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. లాంగ్ టెన్నిస్, అబాకస్, సిమ్మింగ్‌లో సైతం ప్రతిభను చాటుతున్నాడు. ప్రతి టోర్నమెంట్‌లో పాల్గొంటూ పతకాలు, ట్రోఫీలు సాధిస్తూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు నిరంతరం సాధన చేస్తున్నాడు. అతడే బోడుప్పల్‌కు చెందిన వెలిశాల హృతిక్ కుమార్.

- బోడుప్పల్

బోడుప్పల్ రాజలింగం కాలనీ ఫేజ్–1లో నివాసం ఉండే వెలిశాల లోకేష్, ఝాన్సీరాణి కుమారుడు హృతిక్ కుమార్ (12). స్థానికంగా ఉన్న అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. చదువుతోపాటు ఏదో ఒక యాక్టివిటీస్‌లో ఉండాలనే ఉద్దేశంతో తొలుత కరాటే నేర్పించారు. టైక్వాండో బోర్డ్ ఆఫ్ తెలంగాణలో శిక్షణ పొందాడు. అనంతరం రియాస్‌జూకీ షోటోకర్ స్పోర్ట్స్ కరాటే అకాడమీలో గురువు లావణ్య వద్ద శిక్షణ పొందుతున్నాడు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకూ సాధన చేస్తున్నాడు. ఇప్పటికే కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు–12, సిల్వర్ పతకాలు–10, బ్రాంజ్ పతకాలు–8 సాధించాడు.

పతకాలు..పోటీలు..

- రెంజుకీ స్టేట్ లెవెల్ కరాటే చాంఫియన్ షిప్ పోటీలు
- నేషనల్ లెవెల్‌లో ఒపెన్ టు ఆల్ స్టైల్ కరాటే, కుంగ్ ఫూ చాంఫియన్ షిప్–2024
- 1వ ఇంటర్నేషనల్ ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంఫియన్ షిప్–2022
- 2వ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంఫియన్ షిప్–2022
- 1వ నేషనల్ లెవెల్ కరాటే చాంఫియన్ షిప్ డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కప్–2023
- 1వ ఇంటర్నేషల్ ఒపెన్ కరాటే చాంఫియన్ షిప్ సీఎం కప్–2023
- 3వ ఏషియన్ ఇంటర్నేషనల్ కరాటే చాంఫియన్ షిప్–2023
- 1వ నేషనల్ లెవెల్ కరాటే, కుంగ్ ఫూ చాంఫియన్ షిప్–2024
- తెలంగాణ స్టేట్ లెవెల్ ఒపెన్ కరాటే చాంఫియన్ షిప్–2022
- టైక్వాండో బోర్డు ఆఫ్ తెలంగాణ పోటీల్లో పతకాలు, ట్రోఫీలు పొందారు.
- బోడుప్పల్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో బోర్న్ టు విన్‌లో నిర్వహించిన పోటీల్లో రూ–5వేలు ప్రైజ్ మనీ సాధించారు. దీంతోపాటు 19వ నేషనల్ ఎస్‌ఐపీ అబాకస్ కాంపిటేషన్స్, అడ్వాన్స్‌డ్ లెవెల్, ఫౌండేషన్ లెవెల్‌లో ప్రతిభ చాటుతున్నాడు.



హ్యుందయ్ ఎలక్ట్రిక్ 'గిన్నిస్' రికార్డ్స్..

సాక్షి, సిటీబ్యూరో : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ హ్యుందయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎమ్ఐఎల్)కి చెందిన ఎలక్ట్రిక్ ఎస్‌యువీ కార్ ఐక్యుఎన్ ఐక్యు 5 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైంది. ఈ విషయాన్ని బ్రాండ్ నగర ప్రతినిధులు గురువారం తెలిపారు. 'గ్రేటెస్ట్ యాటిట్యూడ్ ఛేంజ్ బై యాన్ ఎలక్ట్రిక్ కార్' పేరిట సముద్రపు మట్టం నుంచి 5799 మీటర్ల ఎత్తులోని కాశ్మీర్‌లోని లేహ్, లడఖ్, ఉమ్లింగ్ లాకు చేరి అక్కడ నుంచి సముద్రపు మట్టం నుంచి 3 మీటర్ల దిగువకు ఉన్నఅ కేరళలోని కుట్టానాడ్ వరకూ కార్ నడిపి తమ ఇవో ఇండియా బృందం రికార్డ్ సృష్టించిందని, అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో 14 రోజుల పాటు సాగిన 4900 కి.మీ ప్రయాణానికి గిన్నిస్ గుర్తింపు లభించిందని వివరించారు.





సాగర్‌లో సెయిలింగ్..

తెలంగాణ స్టేట్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం | పోటీలో 15 జిల్లాల నుంచి 131 మంది క్రీడాకారులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హుస్సేన్ సాగర్ వేదికగా మరోసారి సెయిలింగ్ సందడి మొదలైంది. సాగర్ వేదికగా గురువారం తెలంగాణ స్టేట్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ ఎనిమిదో ఎడిషన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ పోటీల్లో ఆరు విభాగాల్లో 15 జిల్లాల నుంచి 131 మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారు. తొలి రోజు ప్రతికూల వాతావరణంలోనూ సాగర్ జలాల్లో సెయిలర్లు రంగు రంగుల బోట్లలో ప్రాక్టీస్‌తో అలరించారు. తెలంగాణ సెయిలింగ్ సంఘం, యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిర్వహిస్తున్న ఈ టోర్నీ దేశంలోనే అతిపెద్ద ఛాంపియన్‌షిప్‌లో ఒకటి కావడం విశేషం. యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ సుహేమ్ షేక్ మాట్లాడుతూ.. ఈ సారి 29 ఈఆర్ స్కిఫ్, 420 డబుల్ హ్యాండర్స్ విభాగాలను జోడించడంతో అన్ని కేటగిరీల్లో రికార్డు ఎంట్రీలు నమోదయ్యాయని తెలిపారు. తెలంగాణలో ప్రతిభావంతులను గుర్తించి తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం, ముఖ్యంగా చైనాలో జరిగే 2026 ఆసియా క్రీడలు, లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌పై దృష్టి సారించామని తెలిపారు.

శిల్పారామంలో ఆలిండియా క్రాఫ్ట్ మేళా



మాదాపూర్ : మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ చేనేత హస్తకళా మేళలో భాగంగా గురువారం మద్దాలి ఉషాగాయత్రి శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి అలరించారు. ఇందులో జతిస్వరం, బాలాకనకమయ, పదవర్ణం, చక్కనితల్లికి, తిల్లాన, నగుమోము కలవని, అలరులు, మంగళం తదితర అంశాలను కళాకారులు వాసవి, నీరజ, సహస్ర, వాత్సల్య, రసజ్ఞ, భవాని, దీక్షిత తదితరులు పాల్గొన్నారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా అలరించాయి. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ సంయుక్త నిర్వహణలో రూప్ చంద్ బృందం పురూలియా చౌ ఆకట్టుకుంది. మేళాలో చేనేత హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేశారు. పట్టుచీరలు, డ్రస్‌మెటీరియల్స్, కొండపల్లి బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



ఆర్థిక స్వేచ్ఛకు ఆద్యుడు



1972 నుంచే ఆర్థిక వ్యవస్థ సవాళ్లకు చికిత్స ● ప్రధాన ఆర్థిక సలహాదారుగా అధ్యాయం మొదలు

ప్రణాళిక సంఘం, ఆర్‌బీఐతో పాటు మంత్రిగా... ప్రధానిగా ● అభివృద్ధిలో అందరినీ భాగం చెయ్యాలన్నదే సింగ్ సంకల్పం ● సంస్కరణల పితామహుడిగా దేశంపై చెరగని ముద్ర

(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)

ప్రధానిగా పదేళ్లు. కానీ ఆర్థికవేత్తగా డాక్టర్ మన్మోహన్ సింగ్ భారత ఎకానమీపై వేసిన ముద్ర ఎన్నటికీ చెరగనిది. ప్రధానిగా పగ్గాలు చేపట్టడానికి దశాబ్దానికి ముందే 1991లో ఆయన భారత ఆర్థిక మంత్రి హోదాలో భారత ఎకానమీ పగ్గాలు అందుకున్నారు. ఆయన ఆర్థిక మంత్రి అయ్యేనాటికి దేశంలో లైసెన్స్ రాజ్ నడుస్తోంది. గ్యాస్ సిలెండర్ కావాలన్నా, టెలిఫోన్ కావాలన్నా, ఆఖరికి ఓ స్కూటరు కొనాలన్నా ఏళ్ల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఇక ఆర్థిక వ్యవస్థను చూస్తే ఎగుమతులను దిగుమతులు దాటేశాయి. విదేశీ రుణాలు తలకు మించిన భారమయ్యాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోయి, విదేశీ మారక నిల్వలు తరిగిపోయి... ఆర్థిక వ్యవస్థ దాదాపుగా కుప్పకూలే పరిస్థితికి చేరింది. నాటి ప్రధాని పీవీ నరసింహారావు తగిన స్వేచ్ఛనివ్వటంతో... మన్మోహన్ దృఢ చిత్తంతో ఆర్థిక సంస్కరణలకు అంకురార్పణ చేశారు. అప్పటి దాకా సోషలిస్టు చట్రంలో ఇమిడిపోయిన భారత ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛనిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి పరిశ్రమలను లైసెన్స్‌రాజ్ నుంచి తొలగించటమే కాక.. ప్రభుత్వ రంగ సంస్థల సామర్థ్యాన్ని పెంచడానికి ప్రైవేటీకరణకూ శ్రీకారం చుట్టారు. విదేశాల నుంచి రకరకాల పరిశ్రమల్లోకి పెట్టుబడులు వచ్చేలా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) ద్వారాలు తెరిచారు. దిగుమతి సుంకాలను తగ్గించి విదేశీ దిగుమతులకు ఆస్కారమివ్వటమే కాకుండా... కఠిన వాణిజ్య నిబంధనలను సడలించారు. రూపాయి విలువను తగ్గించుకుని... ఎగుమతులకూ పచ్చజెండా ఊపారు. ఈ సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను కుప్పకూలే దశ నుంచి బయటపడేయటమే కాకుండా... దశాబ్దాల ఆర్థిక వృద్ధికి పునాది వేశాయి. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక దిగ్గజంగా మార్చాయి. మన్మోహన్‌ను భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా నిపుణులు వర్ణించేది ఇందుకే.

40 ఏళ్ల వయసులో తొలి ముద్ర...

కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో చదివిన డాక్టర్ మన్మోహన్ సింగ్... 40 ఏళ్ల వయసులో ప్రధాని ఆర్థిక సలహాదారుగా దేశ ఆర్థిక వ్యవస్థలో తొలిసారి పదవీ బాధ్యతలు తీసుకున్నారు. 1972 నుంచి నాలుగేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగి... ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడానికి, అంతకంతకూ పెరిగిపోతున్న ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి తగిన విధానాలు రూపొందించడంలో కీలకపాత్ర పోషించారు. ఆ తరవాత ఆరేళ్లకు.. అంటే 1982లో రిజర్వు బ్యాంకు గవర్నరుగా పగ్గాలు స్వీకరించారు. అప్పటికీ ప్రధాన సమస్యగానే ఉన్న ద్రవ్యోల్బణంపై దృష్టి సారించి... నియంత్రణకు రకరకాల చర్యలు తీసుకున్నారు. దాంతోపాటే తొలిసారిగా దేశంలో ప్రభుత్వ సెక్యూరిటీల క్రయ విక్రయాలను బహిరంగంగా నిర్వహించే ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్‌కు దేశంలో శ్రీకారం చుట్టారు. మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగాకా... 1985లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అక్కడున్న రెండేళ్లూ... సత్వర ఆర్థిక వృద్ధిని కాంక్షిస్తూ... ప్రణాళిక- ఆచరణల మధ్యనున్న తేడాల్ని పూడ్చటానికి ప్రయత్నించారు. ఆ తరవాత ఆర్థిక మంత్రిగా సంస్కరణలకు తెరతీశాక... 2004లో దేశ ప్రధానిగా అత్యున్నత స్థానాన్ని అధిష్ఠించి... పదేళ్ల పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేశారు. ఈ సమయంలోనే అభివృద్ధిలో అన్ని వర్గాలూ భాగస్వాములు కావాలన్న ఆశయంతో సంక్షేమంపై దృష్టిపెట్టారు. ఇందులో భాగమే... కోట్ల మంది పేదలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకం. ఆకలిని తప్పించుకోలేని పేదల స్థితిగతులను ఈ పథకం ఎంతలా మార్చిందే దేశమంతటికీ తెలిసినదే. సమాచార హక్కు, విద్యా హక్కు వంటి విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టిన డాక్టర్ మన్మోహన్ సింగ్.. తన హయాంలో పదేళ్లూ సగటున 7 శాతం ఆర్థిక వృద్ధిని సాధించి చూపించారు. అంతేకాదు. అమెరికాలో సబ్‌ప్రైమ్ పేరిట హౌసింగ్ రుణాల బుడగ బద్దలై ఆ సంక్షోభం యావత్తు ప్రపంచాన్నీ చుట్టుముట్టేసిన 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో సైతం దేశాన్ని సమర్థంగా ముందుకు నడిపించగలిగారు. దటీజ్ మన్మోహన్.

దేశ ప్రయోజనాలకు లోబడే గ్లోబలైజేషన్

గ్లోబలైజేషన్‌ను డాక్టర్ మన్మోహన్ సింగ్ గట్టిగా సమర్థించేవారు. కానీ అదే సమయంలో దేశ ప్రయోజనాల విషయంలో మాత్రం రాజీ ఉండకూడదనేవారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమైతే భారతదేశం అపారమైన అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నది డాక్టర్ సింగ్ ఆలోచన. కాకపోతే దేశ ప్రయోజనాలు దెబ్బతినకుండా తగిన నియంత్రణలూ ఉండాలనేవారు. వృద్ధిలో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం ఉండాలనేవారు. పేదరికం తగ్గాలని, పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరం కూడా ఉండకూడదని చెప్పేవారు. అందుకే ఆక్స్‌ఫర్డ్‌లో తాను పూర్తిచేసిన థీసిస్‌లో కూడా భారత ఆర్థిక వ్యవస్థ ఎగుమతులనే ఎంచుకున్నారు. 'భారత ఆర్థిక ఎగుమతి ధోరణులు - స్వయం సమృద్ధ ఆర్థిక వృద్ధి' అనే అంశంపై థీసిస్ పూర్తి చేసి... దాన్లో భారత ఆర్థిక వ్యవస్థలోని నిర్మాణాత్మకమైన సవాళ్లను నిశితంగా విశ్లేషించారు. అంతేకాదు. పౌర అవసరాల కోసం అణు ఇంధనాన్ని వినియోగించుకునేలా భారత్- అమెరికా మధ్య కుదిరిన ఒప్పందంలో మన్మోహన్‌ది కీలక పాత్ర. ఈ ఒప్పందంతో భారతదేశానికి ఇంధన భద్రతతో పాటు సాంకేతిక సహకారం అందివచ్చింది. పైపెచ్చు ప్రధానిగా ఉన్న సమయంలో ఆయన గ్రామీణ అభివృద్ధిపై ఫోకస్ పెట్టి విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులకు ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కుండాలంటూ రైట్ టు ఎడ్యుకేషన్ కూడా తెచ్చారంటే ఆయన విధానం చెప్పకనే తెలుస్తుంది. అందుకే మన్మోహన్‌ను ప్రపంచమంతా దిగ్గజ ఆర్థికవేత్తగా గుర్తించింది. అంతర్జాతీయ నాయకులతో పాటు దిగ్గజ సంస్థలూ ఆయన్ను ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చిన శిల్పిగా కొనియాడాయి.

మన్మోహన్ సింగ్ చేసిన వంద రోజుల మ్యాజిక్

రెండేళ్ల కిందట శ్రీలంకలో లీటర్ పాల ధర రూ.1,100. గ్యాస్ ధర రూ.2,657కి చేరుకుందనే వార్తలు వచ్చాయి. కోవిడ్ కారణంగా ఆ దేశం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. ఈ స్థాయిలో కాకపోయినా భారత్‌కూ ఇదే తరహా పరిస్థితి దాపురించేదే. కానీ 30 ఏళ్ల కిందట అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలు భారత్‌ను ఒడ్డున పడేశాయి.

1991 సాధారణ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మైనార్టీ ప్రభుత్వం ఏర్పడింది. ప్రధానిగా పీవీ నరసింహారావు, ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్‌లు జూన్ 25న పదవీ బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే భారత ఆర్థిక వ్యవస్థ అంపశయ్య మీద ఉంది. విదేశీ దిగుమతుల కోసం ఇండియా దగ్గరున్న మారకద్రవ్యం విలువ ఒక బిలియన్ డాలర్లకే పరిమితమైంది. ఈ నగదు రెండు వారాలకు మించి సరిపోదు. అప్పుడు రావ్ - సింగ్‌ల జోడీ బరిలో దిగింది. కేవలం వంద రోజుల్లోనే ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకుంది

పరపతి పెంచారు

ఆర్థిక మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వారం రోజులకే సంచలన నిర్ణయం తీసుకున్నారు మన్మోహన్‌సింగ్. భారత ఆర్థిక వ్యవస్థ కుదేలైపోయిందనే వార్తలు బయటకు రాగానే ఎన్నారైలు తమ పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం ప్రారంభించారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు జూలై 1న డాలరుతో రూపాయి మారకం విలువను 9.5 శాతం తగ్గించారు. దీంతో వెనక్కి మళ్లుతున్న ఎన్నారైల సంపదకు బ్రేకులు పడ్డాయి. దీన్ని శుభసూచకంగా భావించిన మన్మోహన్.. రెండు రోజుల తర్వాత రెండోసారి రూపాయి విలువను 12 శాతం తగ్గించారు. ఒక్కసారిగా రూపాయి విలువ 20 శాతానికి పైగా పడిపోవడంతో ఎన్నారైలు తమ దగ్గరున్న డాలర్లను ఇండియాలోకి పంప్ చేశారు. దీంతో విదేశీ మారకద్రవ్యం లోటుకు తాత్కాలిక అడ్డుకట్ట పడింది

పరువు కాపాడారు

రూపాయి విలువను తగ్గించినా సరే విదేశీ మారక ద్రవ్యం కొరత దేశాన్ని వేధిస్తూనే ఉంది. ఈ సమస్యను తీర్చేలేక స్విస్ బ్యాంకులో 20 టన్నుల బంగారం తాకట్టు పెట్టి 240 మిలియన్ డాలర్లను అప్పుగా తెచ్చేందుకు అంతకు ముందు ఉన్న చంద్రశేఖర్ ప్రభుత్వం అప్పటికే ఐఎంఎఫ్‌తో చర్చలు జరిపింది. కానీ పీవీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అంతర్జాతీయ వాణిజ్యంలో అప్పటికే దిట్టగా పేరున్న మన్మోహన్ పూర్తిగా వేరే ప్రణాళిక అమలు చేశారు. 20 టన్నుల బంగారాన్ని రిజర్వ్ బ్యాంక్ ఇండియా దగ్గరే ఉంచి, దాన్ని గ్యారెంటీగా చూపిస్తూ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నుంచి 600 మిలియన్ డాలర్లు అప్పుగా వచ్చేలా వ్యూహం రచించారు.

నగదు వచ్చేలా..

బ్యాంకుల జాతీయీకరణతో రెడ్ టేపిజం పెరిగిపోయింది. కొత్త పరిశ్రమలకు పెట్టుబడులు సమకూర్చేందుకు బ్యాంకులు సతాయించేవి. ప్రభుత్వ ఆర్థిక సంస్థలు లేనిపోని నిబంధనలతో మోకాలడ్డేవి. ఈ రెండింటికీ చెక్ పెడుతూ ప్రైవేటు బ్యాంకులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు మన్మోహన్‌సింగ్. ప్రభుత్వ ఆర్థిక సంస్థల పెత్తనానికి చెక్ పెట్టారు. కీలకరంగాల్లో విదేశీ పెట్టుబడులను 51 శాతం వరకు అనుమతి ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా ప్రైవేటు రంగం ఊపందుకుంది. పరిశ్రమలు విరివిగా వెలిశాయి. దేశ యువతకు ఉపాధి లభించడం మొదలైంది. మొత్తంగా మోకాళ్లపై నడుస్తున్న దేశ ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా లేచి దౌడు తీసేందుకు ఈ చర్యలు ఎంతగానో దోహదపడ్డాయి.

లైసెన్స్ రాజ్‌ని బద్దలు కొట్టారు

ఆర్థికమంత్రి హోదాలో 1991 జూలై 25న మన్మోహన్‌సింగ్ పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్ చరిత్రాత్మకంగా నిలిచిపోయింది. లైసెన్స్ రాజ్ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించడంతో పాటు ఎగుమతులపై ఉన్న సబ్సిడీలను ఎత్తి వేయడం, దిగుమతులపై ఉన్న అధిక పన్నులను తగ్గించడం వంటి నిర్ణయాలను ధైర్యంగా తీసుకున్నారు. అంతేకాదు కీలక రంగాల్లో ప్రభుత్వ పెత్తనానికి గుడ్‌బై చెప్పి, ప్రైవేటుకు రెడ్ కార్పెట్ వేశారు. ప్రత్యక్ష పన్నుల విధానాన్ని సరళీకరించారు. దీంతో బ్లాక్‌మనీకి చాలా వరకు అడ్డుకట్ట పడింది.


'సెంచరీ' ఫలితాలు

మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రి అవక ముందు 1990 అక్టోబర్‌లో కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్ (సీపీఐ, ఇండస్ట్రియల్ వర్కర్స్) డబుల్ డిజిట్ క్రాస్ చేసింది. 1991 జూలైలో మన్మోహన్‌సింగ్ బడ్జెట్‌లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి, రూపాయి విలువ తగ్గించి, లైసెన్స్ రాజ్‌కు చెక్ పెట్టారు. వీటి ఫలితాలు కనిపించేందుకు ఏడాది సమయం పట్టింది. ఫలితంగా 1992 సెప్టెంబర్ నుంచి వేజ్ ప్రైస్ లెవల్ 10కి దిగువకు పడిపోవడం మొదలైంది. ఆ తర్వాత వచ్చిన ఆర్థిక ఫలాలను మనం ఈ రోజు అనుభవిస్తున్నాం.



2010లో ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల్లో ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీతో మాట్లాడుతున్న ప్రధాని మన్మోహన్ సింగ్

ఆర్థిక చాణక్యుడి... అక్షర యానం



ఆర్థిక వేత్తగా ఇవాళ ప్రపంచమంతటా కీర్తినందుకున్న మన్మోహన్‌సింగ్ గురించి చాలామందికి తెలియనిదేమిటంటే, ఆయన మంచి రచయిత. ఆర్థిక శాస్త్రంలో స్కాలర్‌గా ఉన్న రోజుల్లోనే 1950ల చివరి నాటికే పత్రికలకు ఆయన వ్యాసాలు రాసేవారు. 1963 ప్రాంతంలోనే ప్రతిష్ఠాత్మక 'ఎకనామిక్ వీక్లీ'(ఇప్పటి 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ') పత్రిక ప్రత్యేక సంచికలో ఆయన వ్యాసం ప్రచురితమైందంటే, ఎంచుకున్న రంగంలో అప్పటికే ఆయన ఎంతటి దిట్టో, ఎంతగా అధ్యయనం చేసేవారో అర్థం చేసుకోవచ్చు. ఆ రోజుల నుంచే ఆయన భారతదేశ ఎగుమతుల వ్యూహం తదితర అంశాలపై ఆలోచనాత్మక వ్యాసాలు రాస్తూ వచ్చారు. 1964లోనే మన్మోహన్ సింగ్ 'ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ ట్రెండ్స్ అండ్ ది ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్ - సస్టైన్డ్ గ్రోత్' పుస్తకం రాశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని డి.ఫిల్ ఆధారంగా ఆయన ప్రచురించారు. ఆ రచనకు ఆయన రాసిన ముందుమాట ఆయన విషయ అవగాహన, పాండిత్యాలకు దర్పణం. దశాబ్దాల కాలంలో మన దేశ అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు ఏ రకంగా పురోగమించాయన్న దానిపై సంపూర్ణ అవగాహన ఆ రచన చదివితే అర్థమవుతుంది.

తొమ్మిది పదుల సుదీర్ఘ జీవితంలో..

ఆర్థిక శాఖలో ప్రధాన సలహాదారుగా, రిజర్వ్ బ్యాంక్ డైరెక్టర్‌గా, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డైరెక్టర్‌గా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళికా సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, యూజీసీ ఛైర్మన్‌గా, ఆర్థిక మంత్రిగా... ఇలా విభిన్న బాధ్యతలు మన్మోహన్ పోషించారు. ఆయా సందర్భాలకు అనుగుణంగా ఆర్థిక అంశాలపై విస్తృతంగా రచనలు చేశారు. మన్మోహన్ రచనల్లో అయిదు సంపుటాల సెట్‌గా వచ్చిన 'ఛేంజింగ్ ఇండియా' ముఖ్యమైనది. వీటిలో ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ ట్రెండ్స్ అండ్ ది ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్ సస్టైన్డ్ గ్రోత్ (మొదటి సంపుటి)తో పాటు ఎర్లీ థాట్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (రెండవది), ద ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఆర్డర్ అండ్ ద క్వెస్ట్ ఫర్ ఈక్విటీ ఇన్ డెవలప్‌మెంట్ (మూడోది), ఎకనామిక్ రిఫార్మ్స్ 1991 అండ్ బియాండ్ (నాలుగోది), ద ప్రైమ్ మినిస్టర్ స్పీక్స్ (ఐదు-1, 2) ఉన్నాయి. 1950ల నాటి నుంచి 2014 వరకు స్వతంత్ర భారతావని సుదీర్ఘ చరిత్రను ఈ సంపుటాలు ప్రతిబింబిస్తాయి. ఈ ఆర్థిక చాణక్యుడు వివిధ సందర్భాల్లో ప్రచురించిన రచనలు, చేసిన ప్రసంగాలు, పత్రికల వారితో జరిపిన సంభాషణలు 2019లో వచ్చిన ఈ సంపుటాల్లో గుదిగుచ్చారు.



ఢిల్లీలో 2006, నవంబర్ 3న నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో ముచ్చటిస్తున్న నాటి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి

ఆయన దార్శనికత ఎప్పటికీ ఆదర్శప్రాయం

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్

అమరావతి: భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం పట్ల మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం దేశానికి తీరని లోటన్నారు. పదేళ్లపాటు దేశ ప్రధానిగా గొప్ప సేవలందించారని ప్రశంసించారు. ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా ఆర్థిక సంస్కరణలతో దేశ పురోభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ సలహాదారుగా, ఆర్థికశాఖ ప్రధాన సలహాదారుగా, ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా, ప్రణాళిక సంఘం చైర్మన్‌గా, ప్రధాని సలహాదారుగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ చైర్మన్‌గా ఇలా ఎన్నో బాధ్యతలు నిర్వహించిన మన్మోహన్ సింగ్ గొప్ప మేధావి అని కొనియాడారు. దేశంలో పేదరికాన్ని పారదోలేందు కు డాక్టర్ మన్మోహన్ సింగ్ అసమాన సేవలందించారని, ఆయన కలకాలం ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. ఏ బాధ్యత నిర్వహించినా ప్రతి చోటా తనదైన ముద్ర కనబరిచారని గుర్తు చేశారు. ఆయన దార్శనికత ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ మృతితో దేశం ఒక మహా నాయకుడిని కోల్పోయిందన్న వైఎస్ జగన్, ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విశిష్ట నాయకుడు: మోదీ

మన్మోహన్ సింగ్ మృతికి జాతి యావత్తు నివాళులర్పిస్తోంది. విజ్ఞానం, వినయం కలిగిన అత్యంత విశిష్ట నాయకులలో ఒకరిని దేశం కోల్పోయింది. నిరాడంబరత కలిగిన వ్యక్తిగా ఆయన గౌరవనీయమైన ఆర్థికవేత్తగా ఎదిగారు. ఆర్థిక మంత్రితోపాటు ఎన్నో ప్రభుత్వం పదవుల్లో సేవలందించారు. ఆర్థిక విధానాల్లో తనదంటూ గట్టి ముద్ర వేశారు. మన ప్రధానిగా ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఎనలేని కృషి చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ నా సానుభూతి.

భరతమాత గొప్ప బిడ్డ: రాష్ట్రపతి ముర్ము

భరతమాత గొప్ప బిడ్డల్లో మన్మోహన్ ఒకరు. భారత ఆర్థిక సంస్కరణలకు ఆయన సేవలు మర్చిపోలేనివి. దేశానికి ఆయన సేవలు అమూల్యం. మచ్చలేని రాజకీయ నేత. మనందరికీ తీరని నష్టం.

ఆర్థిక సంస్కరణలకు బాటలు: ధన్‌ఖడ్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులు. దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ఆయన సమూలంగా మార్చేశారు.

ముందుచూపున్న నేత: ఖర్గే

మన్మోహన్ సింగ్ ముందు చూపున్న నేతను కోల్పోయాం. అసమానమైన పాండిత్యమున్న ఆర్థికవేత్త, దేశ అభివృద్ధి, సంక్షేమం, సమ్మిళిత విధానాలకు దారితీసే ఆయన విధానాలు ఎప్పటికీ గౌరవించబడతాయి. చరిత్రలో మీకు తగు స్థానం దక్కుతుంది.

అరుదైన నేత: ప్రియాంకాగాంధీ

రాజకీయాల్లో సర్దార్ మన్మోహన్ సింగ్ మాదిరిగా గౌరవం పొందేవారు చాలా తక్కువ మంది మాత్రమే ఉంటారు. ఆయన నిజాయతీ మనందరికీ స్ఫూర్తిదాయకం. నమ్మిన వాటికి ఎన్ని అడ్డంకులెదురైనా కట్టుబడి ఉండే అరుదైన నేత.

మార్గదర్శిని కోల్పోయా: రాహుల్

మాజీ ప్రధాని మన్మోహన్ మృతితో గొప్ప మార్గదర్శిని కోల్పోయా. మన్మోహన్ జీ తన అపారమైన విజ్ఞానం, వివేచనతో దేశాన్ని ముందుకు నడిపించారు. ఆయన వినయం, ఆర్థిక శాస్త్రంపై లోతైన అవగాహన స్ఫూర్తిగా నిలుస్తాయి.

దార్శనికత కలిగిన ఆర్థికవేత్త: శరద్ పవార్

మన్మోహన్ మరణ వార్త విని ఎంతో విచారంలో మునిగిపోయాను. ఆయన కన్నుమూతతో దేశం గొప్ప ఆర్థిక వేత్తను, దార్శనికత కలిగిన సంస్కరణవాది, ప్రపంచ నాయకుడిని కోల్పోయింది.

దిగ్భ్రాంతి కలిగించింది: మమత

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హఠాన్మరణం వార్త విని షాక్‌కు గురయ్యాను. ఆయన విజ్ఞానం అపారం. దేశం ఆయన నాయకత్వాన్ని కోల్పోయింది. నేను ఆయన ఆప్యాయతను కోల్పోయాను.

తరతరాలకు స్ఫూర్తి: నడ్డా

మన్మోహన్ దార్శనికత కలిగిన నేత. దేశ రాజకీయాల్లో అగ్రగణ్యుడు. సుదీర్ఘ కాలం ప్రజా సేవలో కొనసాగిన ఆయన అణగారిన వర్గాల సంక్షేమం తరపున నిలిచారు. పార్టీలతో ప్రమేయం లేకుండా ఆయన నాయకత్వం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆయన వారసత్వం దేశ నిర్మాణ సాధనలో తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

మన్మోహన్ తెచ్చిన కీలక చట్టాలు

ప్రధానిగా మన్మోహన్‌సింగ్ హయాంలో (2004 నుంచి 2014 వరకు) రూపొందిన కీలక చట్టాలు

1. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-2005
- 18 ఏళ్లు పైబడిన గ్రామీణ ప్రాంత ప్రజలకు జీవన భద్రత కల్పించేందుకు ఈ చట్టానికి రూపకల్పన చేశారు.
- ప్రతి ఆర్థిక సంవత్సరంలో రోజువారీ కూలీతో కూడిన 100 రోజుల పనిదినాలను కచ్చితంగా కల్పించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం.
- 2005 ఆగస్టులో పార్లమెంటు ఆమోదించిన ఈ చట్టం 2006 ఫిబ్రవరి నుంచి దశలవారీగా దేశ వ్యాప్తంగా అమల్లోకి వచ్చింది.

2. గృహహింస నిరోధక చట్టం-2005
- రాజ్యాంగం కల్పించిన హక్కులను కుటుంబాల్లోని మహిళలకు మరింత సమర్థంగా అందించేందుకు ఈ చట్టాన్ని చేశారు.
- అత్తారింట్లో వేధింపులు, భౌతిక దాడులను నివారించడమే ఈ చట్టం లక్ష్యం.
- 2005 సెప్టెంబర్ 13న పార్లమెంటు ఈ చట్టాన్ని ఆమోదించింది. 2006 అక్టోబర్ 26 నుంచి ఇది దేశంలో అమల్లోకి వచ్చింది.

3. స్పెషల్ ఎకనామిక్ జోన్స్ (సెజ్) చట్టం-2005
- పరిశ్రమలకు అవసరమైన మౌలికవసతుల కల్పన, సింగిల్ విండో పద్ధతిలో అనుమతులతోపాటు ఎగుమతులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ చట్టాన్ని రూపొందించారు.
- 2005 మేలో పార్లమెంటు ఆమోదం తెలిపిన ఈ చట్టం 2006 ఫిబ్రవరి 10 నుంచి అమలవుతోంది.

4. సమాచార హక్కు చట్టం-2005
- ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు దీన్ని రూపొందించారు.
- ప్రభుత్వ అధికారుల నుంచి వివిధ రకాల సమాచారాన్ని దేశ పౌరులంతా చట్టబద్ధంగా పొందేందుకు వీలు కల్పించడం ఈ చట్టం ఉద్దేశం.
- 2005 జూన్ 15న పార్లమెంటు ఈ చట్టాన్ని ఆమోదించగా 120 రోజుల తర్వాత అంటే 2005 అక్టోబర్ 12న ఇది అమల్లోకి వచ్చింది.

5. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం-2008
- 26/11 ముంబై ఉగ్రదాడుల అనంతరం దేశంలో కౌంటర్ టెర్రరిజం చర్యల్లో భాగంగా ఈ చట్టం రూపొందింది.
- ఈ చట్టం కింద దేశంలో ఎక్కడైనా ఉగ్ర దాడులకు సంబంధించిన సమగ్ర దర్యాప్తు కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను నెలకొల్పారు.
- 2008 డిసెంబర్ 31న ఈ చట్టానికి పార్లమెంటులో ఆమోదం లభించింది.

6. విద్యా హక్కు చట్టం-2009
- దేశంలో పిల్లలందరికీ చదువును ప్రాథమిక హక్కుగా కల్పిస్తూ ఈ చట్టం చేశారు.
- 6 నుంచి 14 ఏళ్ల వయసు పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అందించడం ఈ చట్టం ఉద్దేశం.
- 2009 ఆగస్టు 9న ఈ చట్టానికి పార్లమెంటు ఆమోదముద్ర వేసింది. 2010 ఏప్రిల్ 1 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది.

7. భూసేకరణ చట్టం-2013
- ప్రభుత్వాలు చేపట్టే భూసేకరణ పరిమితంగా ఉండేలా చూడటంతోపాటు నిర్వాసితులకు తగిన పరిహారం, పునరావాసం కోసం ఉద్దేశించింది.
- 2013 సెప్టెంబర్ 4న పార్లమెంటు దీనికి ఆమోదముద్ర వేసింది. 2014 జనవరి 1 నుంచి ఇది కార్యరూపం దాల్చింది.

మన్మోహన్ తీసుకున్న కీలక నిర్ణయాలు
- 2008లో రూ. 60 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు.
- 2010 సెప్టెంబర్ 29న ఆధార్ ప్రాజెక్టుకు శ్రీకారం.
- సంక్షేమ పథకాల లబ్ధిదారులకు నేరుగా, వేగంగా ఆర్థిక సాయం అందించేందుకు 2013 జనవరి 1న ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) అమలు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 27-12-2024

2024 ఉమెన్ పవర్

కాలం పరుగులు తీస్తూనే ఉంది.
ఆధునికత మనకు ఎన్నింటినో పరిచయం చేస్తుంది.
కానీ, ఫ్యాషన్‌లో మాత్రం రాబోయే రోజుల్లో
హిస్టరీ రిపీట్ కాబోతోంది.
వింటేజ్ హుందాగా విచ్చేస్తోంది
ముదురు రంగులు విదిల్చికొని
లేత రంగులు కొత్త భాష్యం చెబుతున్నాయి.
పవర్‌లూమ్స్ ఎంత పెరిగినా
హ్యాండ్‌లూమ్స్ అందించే సౌకర్యానికి
నవతరం పెద్ద పీట వేస్తోంది.
2025 ఫ్యాషన్ రంగంలో ప్రధానంగా
కనిపించే పాత - కొత్తల కలయిక.





ఫ్యాషైన్ : 2025
హిస్టరీ రిపీట్స్

ఫ్యాబ్రిక్ అనేది మన మనస్తత్వాన్ని ఎదుటివారికి పరిచయం చేస్తుంది. డిగ్నిఫైడ్ లుక్‌తో పాటు మేనికి సౌకర్యాన్నిచ్చే సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్‌ని నిన్నటి తరమే కాదు నేటి తరమూ ఆసక్తి చూపుతుంది. సస్టెయినబిలిటీ ఫ్యాబ్రిక్, పేస్టల్ కలర్స్, హెరిటేజ్ డిజైన్స్ ముందు వరసలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్త ఫ్యాషన్ షోల లోనూ వీటి హవానే కనిపిస్తోంది. హైదరాబాద్ వాసి, ఫ్యాషన్ డిజైనర్ హేమంత్ సిరి ఈ విషయం గురించి మరిన్ని వివరాలు ఇలా మన ముందుంచారు.



నాణ్యమైన ఫ్యాబ్రిక్

మెటీరియల్ నాణ్యత పెరిగే కొద్దీ ధర కూడా ఎక్కువ చెల్లించాల్సి వస్తుంది. అయినా మేనికి హాయినిచ్చే ఫ్యాబ్రిక్‌నే ప్రపంచమంతా ఇష్టపడుతున్నారు. ఉదాహరణకు.. కలంకారీ డిజైన్స్ తీసుకుందాం. ఈ డిజైన్స్‌లో చాలా రెప్లికాస్ వచ్చాయి. ఔట్‌లైన్ కలంకారీ అయినా, డిజైన్ మొత్తం కెమికల్ ప్రింట్ ఇస్తున్నారు. ఇలాంటప్పుడు ఖర్చు తగ్గవచ్చు. కానీ, ఒరిజనల కలంకారీ ఫాబ్రిక్‌కి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ఇక .. కంచి, గద్వాల్, పైఠానీ వంటి హ్యాండ్లూమ్స్‌లోనూ ఇమిటేషన్ పవర్‌లూమ్స్ వచ్చి, ఖర్చు తగ్గవచ్చు. కానీ, ఒరిజనల్ హ్యాండ్లూమ్ వైభవం ఎప్పటికీ తగ్గదు. పైగా, అలాంటి వాటిని తమ వార్డ్రోబ్‌లోకి తెచ్చుకోవడానికి మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆర్గానిక్ కలర్స్ ఇష్టపడుతున్నారు. మన దేశీయ ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడం, పెంచడం వంటి వాటి వల్ల ధరల్లోనూ మార్పులు వస్తాయి. డిమాండ్ పెరుగుతుంటే ఉత్పత్తి కూడా పెరుగుతుంది.

చేతితో ఎంబ్రాయిడరీ చేసిన మందార పువ్వులు, మిర్రర్ వర్క్‌లతో నిండిన ముల్ చందేరీ డ్రెస్, ఫెదర్‌లైట్ వైట్ కేప్ మొత్తం రూపాన్ని అందంగా మార్చేస్తుంది.

లేలేత రంగులు

ఫ్యాబ్రిక్‌పై వాడే రసాయనాల ముదురు రంగులు తగ్గిపోనున్నాయి. ఇప్పటికే చాలా పెళ్ళిళ్లలోనూ చూస్తుంటాం. లేత రంగులు, నేచురల్ కలర్స్‌కి వచ్చేశారు. పేస్టల్ కలర్స్‌లో ఉండే గొప్పతనం 'రిచ్'గా, ప్రత్యేకంగా చూపుతుంది. అందుకే నవతరం పేస్టల్ కలర్స్‌వైపు మొగ్గుచూపుతుంది. ఈ ఆలోచనలు నిన్నటితరాన్నీ ఆకట్టుకుంటున్నాయి.

మెరుస్తున్న ఐవరీ చందేరీపై అప్లిక్ పూల వర్క్‌తో ప్రిన్సెస్ దయానా డ్రెస్‌లో నాటి రోజులను ముందుకు తీసుకు వస్తుంది.



హేమంత్ సిరి

ఆర్గానిక్ ముల్ చందేరీ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన డ్రెస్ రొమాంటిక్ ఫినిషింగ్ టచ్‌ను జోడిస్తుంది.

ఫ్యాషన్ ప్రపంచంలో లేత రంగులు గొప్పగా వెలిగిపోనున్నాయి.

హ్యాండ్ ఎంబ్రాయిడరీ

బామ్మలనాటి సంప్రదాయ ఎంబ్రాయిడరీ వర్క్స్ మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. అంతే కాదు హ్యాండ్ పెయింట్, గాడీగా లేని ఎంబ్రాయిడరీని ఇష్టపడుతున్నారు. కొన్ని రకాల ప్రింటెడ్ ఫ్యాబ్రిక్‌ను కూడా తమ డ్రెస్ డిజైన్స్‌లలో చూపుతున్నారు.

తేలికగా ఉండేలా..

ఏ డ్రెస్ అయినా సరే కంఫర్టబుల్‌గా, సులువుగా ధరించే వీలు ఉండే డ్రెస్‌ల మీద ఫోకస్ పెరుగుతోంది. పెళ్లి వంటి గ్రాండ్ అకేషన్స్ అయినా లైట్‌వెయిట్‌ను ఇష్టపడతున్నారు. ఫ్యాషనబుల్‌గా కనిపించాలనుకున్నా సస్టైయినబుల్ ఫ్యాబ్రిక్‌ని ఇష్టపడుతున్నారు.

వింటేజ్ స్టైల్

రిసెప్షన్, ఫ్యాషన్ షో వంటి వేడుకలలో హైలైట్ కావడానికి డ్రెస్సుల 'కట్స్' మీద ఎక్కువ ఫోకస్ చేస్తున్నారు. దీని వల్ల జ్యువెలరీ తక్కువ వాడుతున్నారు. ఇందులో భాగంగా హెరిటేజ్ కాన్సెప్ట్, రెట్రో స్టైయిల్ ముందుకు వస్తోంది.

అందెల రవళికి స్వర్ణోత్సవం

నేటి నుంచి జరగబోయే పతాక స్వర్ణోత్సవాలకు కూచిపూడి సిద్ధమైంది.
సిద్ధేంద్రయోగి అడుగు జాడలతో కూచిపూడి వెలిగిపోనుంది.



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎంతోమంది కూచిపూడి అభిమానులు, నాట్యకారులను అమితంగా ఆకర్షిస్తున్న మాట... కూచిపూడి స్వర్ణోత్సవ పతాకం. 'కూచిపూడి' పుట్టిన కూచన్నపూడి గ్రామం పేరు కూచిపూడిగా మారింది. దేశానికి జాతీయ జెండా ఉన్నట్లుగానే కూచిపూడి వైభవాన్ని ప్రతిబింబించే పతాకం ఒకటి ఉండాలని వేదాంతం పార్వతీశం సంకల్పించారు. చెరకుగడ, జడ, కర్ర గుర్తులతో 1974లో పతాకాన్ని రూపొందించారు. ఆ రూపకల్పన జరిగి యాభైఏళ్ల పూర్తయిన సందర్భంగా పతాక స్వర్ణోత్సవాలకు ముస్తాబైంది కూచిపూడి. కూచిపూడి కళా పీఠం దగ్గర 50 అడుగుల ఎత్తులో నిర్మించిన స్థూప పతాకాన్ని నేడు ఆవిష్కరించనున్నారు. మూడు రోజులపాటు కూచిపూడి గురువులు, కళాకారులు, కళాభిమానుల మధ్య రకరకాల కార్యక్రమాలు జరగనున్నాయి. పతాక స్వర్ణోత్సావాల నేపథ్యంలో చివరిరోజు రెండు వేల మందికి పైగా కళాకారులతో ప్రదర్శన ఇచ్చేందుకు కూచిపూడి సిద్ధం అయింది. ప్రదర్శనలకు ముందు అంబాపరాకు పాట పాడడం సంప్రదాయంగా వస్తోంది

'అందెల రవమిది పదములదా... అంబరమంటిన హృదయముదా' అంటూ కూచిపూడి స్వర్ణోత్సవ పతాకం తన సంబరాన్ని అంబరంతో పంచుకునే దృశ్యం కనుల విందు చేయనుంది.

– ఎస్.పి యూసుఫ్, సాక్షి, మచిలీపట్నం
ఫోటోలు: పవన్, సాక్షి, విజయవాడ

గత వైభవం ఘనంగా...



మన సంప్రదాయ కళను భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే నా లక్ష్యం. పతాక స్వర్ణోత్సవాలలాంటి కార్యక్రమాల ద్వారా గత వైభవాన్ని మళ్లీ ఘనంగా గుర్తుకు తెచ్చుకోవచ్చు. ఆ ఉత్సాహంతో మన నాట్యకళ మరింత శక్తిమంతమై మరింతగా జనాల్లోకి వెళుతుంది.

– జి. శ్రీవత్సల, రాజమహేంద్రవరం

దిశానిర్దేశం చేసే పతాకం



కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలు ప్రపంచం నలుమూలలలో ఉన్న కూచిపూడి కళాకారులకు పండగలాంటివి. అంతెత్తున ఎగరబోయే జెండా కూచిపూడి నృత్యానికి సంబంధించి మౌనంగానే దిశానిర్దేశం చేయనుంది.

– జల్లూరి శరణ్య, మచిలీపట్నం

నవతరానికి స్ఫూర్తిని ఇచ్చేలా...



అమ్మ సలహా మేరకు నేర్చుకున్న కూచిపూడి ఇప్పుడు నాకు మరో అమ్మ. కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల గురించి తెలుసుకున్నప్పుడు చాలా సంతోషించాను. దేశవిదేశాల నుంచి నాట్యకారులు పాల్గొనే ఈ కార్యక్రమాలతో ఆ గడ్డపై గత వైభవం మరోసారి పునరావిష్కృతం అవుతుంది. నవతరానికి స్ఫూర్తిని ఇస్తుంది.

– ఎం. వసుధ, హైదరాబాదు

కెనడాలో కూచిపూడి



యాభై ఏళ్ల పూర్తయిన సందర్భంగా కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలు నిర్వహిస్తునందుకు సంతోషంగా ఉంది. కెనడాలో కూచిపూడి అకాడమీ ఏర్పాటు చేశాను. ఆసక్తి ఉన్న వారికి నేర్పించడంతో పాటు ప్రదర్శనలు ఇస్తున్నాను. కూచిపూడి నాట్య వ్యాప్తి కోసం నా వంతుగా కృషి చేస్తున్నాను.

– డాక్టర్ వేదాంతం వెంకట నాగ చలపతి రావు, కెనడా

ఆ జెండా రెప రెపలలో...



కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల సందడి ఆ ప్రాంతానికి మాత్రమే పరిమితమైనది కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతో మంది కూచిపూడి కళాకారులకు సంతోషాన్ని కలిగించే విషయం. ఆ జెండా రెపరెపలలో కూచిపూడి కళ మరింతగా వెలిగిపోవాలని కోరుకుంటున్నాను.

– లంక సుస్మిత, విజయవాడ

పేద పిల్లలకు అండగా...



ప్రతి ఏటా ఆర్థిక స్థోమత లేని ఇద్దరు చిన్నారులకు సొంత ఖర్చుతో కూచిపూడిలో శిక్షణ ఇప్పిస్తున్నాను. ఇప్పటికి 40 మందికి నేర్పించా. ఇక్కడ నేర్చుకున్న ఎంతోమంది నాట్య పాఠశాలలు మొదలుపెట్టి ఆసక్తి ఉన్న వారికి కూచిపూడి నేర్పిస్తున్నారు.

– డా. రవి బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్, కూచిపూడి కళాక్షేత్రం, కూచిపూడి

కాలం ముందుకు సాగుతూనే ఉంటుంది. 24 గంటలకో రోజు పుడుతుంది.
కలకాలం గుర్తుండే పని చేసిన వాళ్లతో రోజుకో కొత్త చరిత్ర పుడుతుంది.
చరిత్ర సృష్టించిన స్త్రీశక్తిని సాక్షి ఫ్యామిలీ నిరంతరం పట్టిచూపుతోంది.
ఈ ఏడాది సాక్షి గౌరవించిన మహిళామణుల్లో మరికొన్ని ఆణిముత్యాలు.

ఆమే ఆకాశమై



ఎస్తేర్ రాణి

మండే కండలు

గుంటూరు జిల్లా, వేమూరుకి చెందిన ఎస్తేర్‌రాణికి తల్లిదండ్రులు లేరు. అండదండలు లేవు. నానమ్మ ఆకుకూరలు అమ్ముతుంది. ఇవేవీ ఆమెను పెద్ద కల కనకుండా ఆపలేకపోయాయి. బాడీ బిల్డర్ కావాలనే ఆకాంక్ష ఆమెతోపాటు పెరిగి పెద్దదైంది. హైదరాబాద్‌లో జిమ్‌లో ట్రైనర్‌గా ఉద్యోగం చేస్తూ బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొంటోంది. చెన్నైలో జరిగిన మిస్టర్ అండ్ మిసెస్ హిందుస్తానీ పోటీలో పాల్గొని మెడల్ సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో బాడీ బిల్డింగ్ చేసిన మహిళలు లేరు. ఆ రికార్డును తాను సాధించాలనే పట్టుదల ఆమెను విజేతను చేసింది.

శవాల గదిలో ఉద్యోగమా?!



రామ్ ప్రసన్న

పుట్టిన ప్రతి ఒక్కరూ మరణించక తప్పదు. ప్రాణం పోవడం ఒక వేదన అయితే మార్చురీ నుంచి తన వాళ్ల పార్థివ దేహాన్ని తీసుకువెళ్లే వాళ్ల దుఃఖానికి అంతే ఉండదు. మార్చురీలో ఉద్యోగం చేయడం అంటే రోజుకు ఐదారుసార్లు గుండెను చిక్కబట్టుకోవాల్సిందే. అలాంటిది రామ్ ప్రసన్న అనే మహిళ మార్చురీలో ఉద్యోగం చేస్తోంది. తెనాలి ప్రభుత్వ ఆసుపత్రితో పోస్ట్‌మార్టమ్ అసిస్టెంట్‌గా పని చేస్తోందామె. 'ఆడవాళ్లు ఈ ఉద్యోగం చేయడమేమిటి' అనే వెక్కిరింతలను పట్టించుకోలేదామె. 'చేయడానికి నీకు ఈ ఉద్యోగమే దొరికిందా' అనే మాటలకు వెనక్కి తగ్గలేదు. వృత్తిమీద గౌరవాన్ని తగ్గించుకోనూలేదు.



దళవాయి శివమ్మ

అమ్మ గీసిన బొమ్మ

ఆంధ్రప్రదేశ్, సత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం, నిమ్మలకుంట గ్రామానికి చెందిన దళవాయి శివమ్మ తోలుబొమ్మల చిత్రకారిణి. తోలు మీద అపురూపమైన చిత్రాలను గీస్తారు. ఆమె ఈ ఏడాది 'శిల్పగురు' జాతీయ పురస్కారం అందుకున్నారు. ఇది వందల ఏళ్ల నుంచి పరంపరగా వస్తున్న ప్రాచీన కళ. తోలు బొమ్మలాటలు తగ్గిపోయాయి. కానీ బొమ్మలను చిత్రించేకళ కొత్త రూపు సంతరించుకుంది. రామాయణఘట్టాలు, శ్రీకృష్ణలీలల చిత్రాలను ల్యాంప్‌సెట్‌లు, వాల్ పెయింటింగ్స్, డోర్ హ్యాంగర్స్ మీద చిత్రిస్తూ అనేక రాష్ట్రాల్లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌లలో ప్రదర్శిస్తున్నారు. యూరప్, అమెరికా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ కళ అంతరించిపోకూడదనే ఆకాంక్షతో కొత్త తరానికి శిక్షణనిస్తున్నారు శివమ్మ.

యాంటీ రెడ్ ఐ



అడపా వరలక్ష్మి

అది ఆగస్టు 29. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్‌లో లేడీస్ హాస్టల్ బాత్రూమ్‌లో హిడెన్ కెమెరా పట్టుబడింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అసాంఘిక కార్యకలాపాల కోసం దుర్వినియోగం చేస్తున్నది విద్యావంతులే. సభ్యసమాజం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇలాంటి దారుణాలను అరికట్టడానికి పోలీస్ డిపార్ట్‌మెంట్, షీ టీమ్స్, భరోసా టీమ్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఉమెన్ క్యాడెట్‌లు విద్యాసంస్థల్లో వర్క్‌షాపులు నిర్వహించాలి. షాపింగ్ మాల్స్, హోటళ్లు, సినిమా థియేటర్‌లలో తనిఖీలు జరగాలి. అలాగే స్పై కెమెరాల కొనుగోళ్ల మీద నిఘా ఉంచాలని సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్నారు యాంటీ రెడ్ ఐ యాక్టివిస్ట్ అడపా వరలక్ష్మి.



గంధం క్వీనీ విక్టోరియా

కిడ్స్‌కు పాఠం క్వీన్ స్విమ్మర్

గంధం క్వీనీ విక్టోరియా ఆరేళ్ల కిందటి వరకు సాధారణ గృహిణి. లండన్‌లోని ఇంగ్లిష్ చానెల్ ఈది రికార్డు సాధించారు. పిల్లలు స్విమ్మింగ్ క్లాసులకు సరిగ్గా వెళ్లక పోవడం, 'స్విమ్మింగ్ చేస్తే తెలుస్తుంది' అని నిష్ఠూరంగా మాట్లాడడంతో ఈదడం అంత కష్టమా అనుకున్నారామె. 'అంత కష్టమా! సరే చూద్దాం పదండి' అని తల్లిగా పిల్లల ప్రశ్నలకు సమాధానం వెతకడంలో కోసం నీటిలో దిగారు. రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తూ తన పిల్లలకే కాదు మహిళాలోకానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నారు.

తెలుగు నేల మీద తుళు అడుగులు



మైత్రీరావు

హైదరాబాదులో నివసిస్తున్న మైత్రీరావుది దక్షిణ కర్నాటకలోని ధర్మస్థల. మాతృభాష తుళు. ఆమె ఇన్ఫర్మేషన్ సైన్స్ గ్రాడ్యుయేట్. నోకియా కంపెనీలో ఉద్యోగం చేశారు. నాట్యం మీద అభిరుచితో భరతనాట్యం, కలరిపయట్టు, అట్టక్కలరి, వ్యాలికవర్ నాట్యరీతులను సాధన చేశారు. నాట్యం ఇతివృత్తంగా ఆమె చిత్రీకరించిన రెండు సినిమాలకు అంతర్జాతీయ పురస్కారం లభించింది. శాస్త్రీయ నాట్యం అంటే పౌరాణిక ఇతిహాసాల ప్రదర్శన అనే పరిధిని చెరిపివేశారామె. స్త్రీ శక్తిని సమాజానికి చాటి చెప్పడానికి తాను ఎంచుకున్న మాధ్యమం నాట్యమే అంటారు స్త్రీశక్తి పురస్కార గ్రహీత, ప్రముఖ నాట్యకారిణి మైత్రీరావు.

కథల అమ్మమ్మ



కోరుపోలు కళావతి

కోరుపోలు కళావతి రచయిత్రి. ఆమెది విజయనగరం జిల్లా. నాగరకత ముసుగులో ఆదివాసీ బిడ్డలకు పెట్టే పరీక్షలు, అడవి బిడ్డల చుట్టూ ఊహకందని ప్రమాదాలు, పల్లెపదాలు, జానపద జావళులకు అక్షరం ఆమె. అలాగే అమెరికా ప్రకృతి అందాలు, అక్కడ మనవాళ్ల ప్రగతి సుమగంధాలకు అక్షరరూపమిచ్చారామె. ఆధునిక సమాజంలో పిల్లలకు కథలు చెప్పే అమ్మమ్మలు, నానమ్మలు కరవయ్యారని గ్రహించిన కళావతి కథల పుస్తకాలు రాస్తూ కథల అమ్మమ్మ అయ్యారు.

సరళ వైద్యం... ఇంటింటా డాక్టర్



డాక్టర్ సరళ

డాక్టర్ సరళది కాకినాడ. ఆమె హోమియో డాక్టర్. ప్రతి ఇంట్లో ఒక డాక్టర్ కూడా ఉండాలంటారు. తల్లే ఆ డాక్టర్ అయితే ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉంటారని నమ్ముతారామె. ఇందుకోసం వారం రోజుల హోమియో కోర్సులు నిర్వహిస్తున్నారు. కోర్సులో భాగంగా సాధారణంగా వచ్చే 24 రకాల అనారోగ్యాల గురించి, వాటికి ప్రాథమికంగా తీసుకోవాల్సిన ఔషధాలగురించి శిక్షణనిచ్చి హెల్త్ అడ్వైజర్‌లను తయారు చేస్తున్నారు. ఆమె స్వయంగా 76 రుగ్మతలకు మందులు కనుక్కున్నారు. డాక్టర్లు ఆరోగ్యవంతమైన సమాజం కోసం తమ వంతు బాధ్యతగా పనిచేయాలన్నారు డాక్టర్ సరళ. ఇప్పటికీ గ్రామాల్లో తగినంత మంది డాక్టర్లు అందుబాటులో లేని గ్యాప్‌ను ఇలా భర్తీ చేస్తున్నారామె.

స్వావలంబనకు చుక్కాని



రుబీనా నఫీస్ ఫాతిమా

హైదరాబాద్. దారుల్‌షిఫాలో మహిళలు, బాలికల సంక్షేమం కోసం స్వచ్ఛందసేవ అందిస్తున్నారు రుబీనా నఫీస్ ఫాతిమా. మిలిటరీ కుటుంబంలో పుట్టిన రుబీనా అభ్యుదయపథంలో పెరిగారు. మహిళలు చదువుకోవాలని, ఎవరి మీదా ఆధారపడకూడదని నమ్మిన కుటుంబం కావడంతో ఉన్నత చదువులు చదువుకున్నారు. ఆమె బాడ్మింటన్‌ప్లేయర్ కూడా. పెళ్లి తర్వాత భర్తతోపాటు సౌదీ అరేబియాకు వెళ్లి అక్కడ మంత్రిత్వశాఖలో ఉద్యోగం చేశారు. ఇండియాకి తిరిగి వచ్చిన తర్వాత జీవితాన్ని సమాజసేవకి అంకితం చేశారు. సఫా సంస్థ ద్వారా 2008 నుంచి ముస్లిం మహిళల ఆర్థిక సామాజిక పురోగతి కోసం పని చేస్తున్నారు. అభివృద్ధి అనేది పరిపూర్ణంగా ఉండాలని, ఆడపిల్లలకు చదువుతోపాటు ఆటలు కూడా అవసరమంటారామె. అయితే ఆడపిల్లలను ఆటలకు పంపించడానికి కూడా నిషేధం ఉన్న కుటుంబాల్లో తల్లిదండ్రులను చైతన్యవంతం చేసి, బాల్‌షెట్టీ ఖేత్ గ్రౌండ్‌లో ఆడపిల్లలు ఆడుకోవడానికి ఒక టైమ్ స్లాట్ కేటాయించి క్రీడలను ప్రోత్సహిస్తున్నారు రుబీనా నఫీస్ ఫాతిమా.

యర్రంపల్లి నుంచి దిల్లీకి



శ్రీచరణి

మహిళల ప్రీమియర్ లీగ్ 2025 కోసం నిర్వహించిన మినీ వేలంలో శ్రీ చరణిని ఎంపిక చేసుకోవడానికి ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. దిల్లీ క్యాపిటల్స్ 55 లక్షలతో శ్రీ చరణిని ఎంపిక చేసుకుంది. కడప జిల్లా యర్రంపల్లి గ్రామానికి చెందిన శ్రీచరణి సామాన్య కుటుంబంలో పుట్టింది. జిల్లాలోని వీరనాయుని పల్లెలోని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చేస్తున్న శ్రీచరణి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆటల్లో రాణిస్తోంది. 2021లో అండర్ 19 చాలెంజర్స్ ట్రోఫీలో ఇండియా– సి జట్టుకి ప్రాతినిధ్యం వహించిన శ్రీ చరణి నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర వహించింది. ఉమెన్ టీ ట్వంటీలో ఆంధ్రాజట్టుకు ప్రాతినిధ్యం వహించి తన బౌలింగ్ తీరుతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించింది.

యూత్ అంటే ఎంజాయ్ మాత్రమే కాదు టెక్నాలజీ కూడా. మరి ఆ టెక్నాలజీ 2025లో ఎలా ఉండబోతుంది? సైన్స్, ఫిక్షన్‌ల మధ్య ఉన్న రేఖ కొత్త సంవత్సరంలో మరింతగా చెరిగిపోనున్నది. 'సాధ్యమేనా!' అని సందేహించినవి 'అక్షరాలా సాధ్యమే' అని నిరూపించనుంది. మన డిజిటల్ భవిష్యత్తును తీర్చిదిద్దే 2025లో రానున్న కొన్ని ప్రాడక్ట్స్ గురించి తెలుసుకుందాం.....



రెడీ టు టెక్ ఆఫ్

విజన్ ప్రో 2



నెక్స్ లెవెల్ ఆగ్మెంటెడ్ రియాలిటీ(ఏఆర్)ని 'విజన్ ప్రో2' రూపంలో తీసుకు వస్తోంది టెక్ దిగ్గజం యాపిల్. తేలికైన, సౌకర్యవంతమైన హెడ్ సెట్, ఆకట్టుకునే డిజైన్, మెరుగైన ప్రాసెసింగ్ దీని సొంతం. అధిక రిజల్యూషన్‌తో అబ్బుర పరుస్తుంది.

క్వెస్ట్ 4



'మునుపెన్నడూ లేని విధంగా' అంటూ వీఆర్ లైనప్ 'క్వెస్ట్4'తో ముందుకు రానుంది మెటా. ఈ నెక్స్ట్-జెన్ వీఆర్ హెడ్‌సెట్ అద్భుతమైన గ్రాఫిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌లా నిలవనుంది. హైయర్ రిఫ్రెష్ రేట్, వైడర్ ఫీల్డ్ ఆఫ్ వ్యూలో మెరుగైన పనితీరును ప్రదర్శించనుంది. హ్యాండ్ ట్రాకింగ్, ఫేసియల్ ఎక్స్‌ప్రెషన్ రికగ్నైజేషన్, కంటెంట్ లైబ్రరీకి సంబంధించి కొత్త ద్వారాలు తెరవనుంది.

మరింత ఇస్మార్ట్‌గా... జెడ్ ఫోల్డ్ 7



గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7తో ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ టెక్నాలజీని మెరుగుపరచనుంది శాంసంగ్. మల్టీ టాస్కింగ్‌ను మరింత ఆహ్లాదకరం చేయనుంది. మెరుగైన ప్రాసెసింగ్ పవర్, బ్యాటరీ లైఫ్‌తో 'ఫోల్డబుల్ స్మార్ట్ ఫోన్ డిజైన్'కు అద్భుత ఉదాహరణగా నిలవనుంది.

ఏసర్ ఐ..... ఐ లవ్ యూ అనేలా...



'ఏసర్ స్పేషియల్‌ల్యాబ్స్ ఐ' కంటెంట్ క్రియేటర్స్, ప్రొఫెషనల్స్ కోసం వస్తున్న ప్రాడక్ట్. ఉపయోగించడానికి సులభమైన కెమెరాతో 3డీ కంటెంట్ క్రియేట్ చేయవచ్చు. కంటెంట్ క్రియేషనే కాదు యూట్యూబ్‌లాంటి ప్లాట్‌ఫామ్‌లలో 3డీ కంటెంట్‌ను స్ట్రీమ్ చేయడానికి ఉపయోగపడుతుంది. జూమ్, టీమ్స్‌లాంటి ప్లాట్‌ఫామ్‌లలో 3డీ వీడియో కాల్స్‌కు ఉపయోగపడుతుంది.



వర్చువల్ ప్రపంచంలో వండర్

'గేమింగ్ ఇన్ ది నెక్స్ట్ డైమెన్షన్' నినాదంతో వస్తున్న 'సోనీ ప్లే స్టేషన్ వీఆర్ 3' గేమింగ్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళ్లనుంది. అల్ట్రా-హై-డెఫినిషన్ విజువల్స్, మెరుగైన హాప్టిక్ ఫీడ్‌బ్యాక్, అధునాతన మోషన్ ట్రాకింగ్‌తో పీఎస్ వీఆర్3 అద్భుతమైన అనుభవాన్ని అందించనుంది. వర్చువల్ ప్రపంచంలో సంచరించే, సినిమాటిక్ వీఆర్ అనుభవాన్ని ఆస్వాదించాలనుకునే, వర్చువల్ ఫీల్డ్‌లో చురుగ్గా ఉండాలనుకునే గేమర్స్ దగ్గర 'పీఎస్ వీఆర్ 3' ఉండవలసిన గ్యాడ్జెట్.




ఏ దేశం వెళ్లినా...ఆ భాష ఇట్టే అర్థమైపోతుంది



కొత్త ప్రదేశాలలో లాంగ్వేజ్ కమ్యూనికేషన్‌కు సంబంధించిన సమస్యలకు సులభ పరిష్కారాలు కొత్త సంవత్సరంలో కనిపించనున్నాయి. భాష తెలియని వారితో కమ్యూనికేట్ చేయడం మరింత సులభం అవుతుంది. ఇయర్ బడ్స్, స్మార్ట్ గ్లాసెస్, వాచ్‌ల ద్వారా 'పోక్‌టాక్'లాంటి ట్రాన్స్‌లేషన్ డివైజ్‌లు అందుబాటులోకి రానున్నాయి. సంభాషించడం నుంచి ఆటలు ఆడడం వరకు మనకు ఉపయోగపడే 'సోషల్ రోబోట్'ల హవా పెరగనుంది. 'పోయ్' (బెడ్‌టైమ్-స్టోరీ టెల్లింగ్ బేర్) చక్కగా కథలు కూడా వినిపిస్తుంది. ఏఐ సాంకేతికతను స్నేహితులు, గురువులుగా మలుచుకునే అవకాశాలు పెరుగుతాయి.

కాగితం కాని కాగితం.... రీమార్కబుల్ పేపర్ ప్రో



కొందరికి ల్యాప్‌టాప్, కంప్యూటర్‌లలో టైప్ చేయడం అలసటగా అనిపిస్తుంది. కాగితంపై రాయడమే హాయిగా ఉంటుంది. అలాంటి వారికి 'రీమార్కబుల్ పేపర్ ప్రో' ఉపయోగపడుతుంది. ఆలోచనలను ఒక కొలిక్కి తెచ్చి అక్షర రూపంలో ఇవ్వడంలో ఉపకరిస్తుంది. డెస్క్‌పై కాగితాలు లేకుండానే కాగితంపై రాసిన అనుభూతిని కలిగించే నోట్‌బుక్ ఇది. ఈ అల్ట్రా-స్లిమ్ ఫోల్డబుల్ పరికరం 11.8 అంగుళాల కలర్ డిస్‌ప్లేతో రానుంది.

అరచేతిలో ఇమిడిపోయే అద్భుతం

కెనాన్ తన 'పవర్ షాట్ గోల్ఫ్ డిజిటల్ లేజర్ రేంజ్ ఫైండర్'తో రానుంది. అరచేతిలో ఇమిడిపోయే ఈ గ్యాడ్జెట్ సరియైన నిర్ణయాలను తీసుకోవడంలో గోల్ఫర్స్‌కు ఉపకరిస్తుంది. 6ఎక్స్ టు 12 ఎక్స్ డిజిటల్ జూమ్ ఈ ఎలక్ట్రానిక్ వ్యూఫైండర్ ప్రత్యేకత, టార్గెట్‌కు సంబంధించి బెటర్ వ్యూను అందించడంలో మెరుగ్గా పనిచేస్తుంది.



హైటెక్ స్మార్ట్ ఐ మాస్క్... సుఖనిద్ర



రాత్రిపూట ప్రయాణాలలో నిద్ర పట్టాలంటే కాస్త కష్టమే. దీని కోసం స్లీప్ మాస్క్‌పై కూడా ఆధారపడుతుంటాం. అయితే చాలా సందర్భాలలో అవి పెద్దగా ఫలితం ఇచ్చినట్లు కనిపించదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'ఆరా స్లీప్ మాస్క్'ను డిజైన్ చేశారు. ఈ హైటెక్ స్మార్ట్ ఐ మాస్క్ తేలికగా ఉంటుంది. గంటల తరబడి ధరించడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. సాధారణ బ్లూటూత్ ఆడియో డివైజ్‌లా పనిచేస్తుంది. స్పాటిఫై లేదా యాపిల్ మ్యూజిక్ నుంచి 'కామ్'లాంటి మెడిటేషన్ యాప్‌లను ప్లే చేయడానికి అనుమతిస్తుంది.


ప్రతిరోజు చిత్రాల చినుకులలో....



ఇప్పుడు మన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్‌లు కెమెరాలు అయ్యాయి. కాబట్టి సందర్భాన్ని బట్టి ఫొటోలు తీస్తుంటాం. అయితే అలా తీసిన వాటి గురించి ఆ తరువాత మరిచిపోతుంటాం. ఎప్పుడెప్పుడో తీసిన ఫొటోలైనా సరే రోజూ మన కళ్ల ముందు కనిపించడానికి యున్‌క్యూడీర్ డిజిటల్ పిక్చర్ ఫ్రేమ్ ఉపయోగపడుతుంది. 10.1 అంగుళాల ఈ వైఫై డిజిటల్ ఫ్రేమ్ ప్రతిరోజూ డజన్‌ల కొద్ది ఫొటోలను ప్రదర్శిస్తుంది.

సినిమా

ఆస్కార్ మ్యూజియంలో ఐశ్వర్యా రాయ్ లెహెంగా


ఐశ్వర్యా రాయ్


ప్రముఖ నటి, మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యా రాయ్ 'జోధా అక్బర్' సినిమా కోసం ధరించిన లెహెంగాకు ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ మ్యూజియంలో చోటు దక్కింది. హృతిక్ రోషన్, ఐశ్వర్యా రాయ్ జోడీగా అశుతోష్ గోవారీకర్ దర్శకత్వం వహించిన బాలీవుడ్ చిత్రం 'జోధా అక్బర్'. హిస్టారికల్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం 2008 ఫిబ్రవరి 15న విడుదలై హిట్ అయ్యింది. జోధా రాణిగా ఐశ్వర్య నటించారు. ఈ సినిమాలో పెళ్లి కోసం ఆమె ధరించిన డిజైనర్ రెడ్ అండ్ ఎల్లో కలర్ లెహెంగా ఆకర్షించింది. ఆ లెహెంగాకి తాజాగా ఆస్కార్ మ్యూజియంలో చోటు దక్కింది. ఈ విషయాన్ని ఆస్కార్ అకాడమీ అధికారికంగా ప్రకటించింది. ''సిల్వర్ స్క్రీన్ రాణికి (ఐశ్వర్యా రాయ్ జోధా రాణి పాత్రని ఉద్దేశించి) ఈ లెహెంగా కరెక్ట్‌గా ఫిట్ అయ్యింది. 'జోధా అక్బర్'లో ఐశ్వర్యా రాయ్ రెడ్ వెడ్డింగ్ లెహెంగా వెండితెరపై కనువిందు చేసింది. శక్తిమంతమైన జర్దోసీ ఎంబ్రాయిడరీ, శతాబ్దాల నాటి హస్తకళ, అరుదైన రత్నం ఆ డ్రెస్‌లో పొదిగించారు. అలాగే భారత జాతీయ పక్షి నెమలి చిహ్నంతో ప్రత్యేకంగా తయారు చేసిన ఆభరణాలతో భారతీయ చరిత్ర తెలిసేలా డిజైనర్ నీతా లుల్లా ఈ లెహెంగాను ప్రత్యేకంగా డిజైన్ చేశారు'' అంటూ ఆస్కార్ అవార్డ్ అకాడమీ పోస్ట్ చేసింది. ఆస్కార్ అకాడమీ మ్యూజియంలో కనిపించనున్న మొదటి భారతీయ డ్రెస్ ఇదే కావడం విశేషం. కాగా ఐశ్వర్యా రాయ్ లెహెంగాకి ఆస్కార్ మ్యూజియంలో చోటు దక్కడంతో ఆమె అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

పాటతో పండగ


వెంకటేశ్

హీరో వెంకటేశ్ మరోసారి సింగర్‌గా మారారు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' కోసం పాట పాడారాయన. సుధ కొంగర దర్శకత్వంలో హీరోగా నటించిన 'గురు' (2017) సినిమా కోసం వెంకటేశ్ పాడిన 'జింగిడి జింగిడి..' పాటకి మంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా కోసం సంక్రాంతి నేపథ్యంలో సాగే ప్రత్యేక పాటని పాడారు వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ''సంక్రాంతికి వస్తున్నాం'లోని స్పెషల్ ఫెస్టివల్ ట్రాక్ కోసం బాలీవుడ్ సింగర్‌ని తీసుకు రావాలని అనిల్ రావిపూడి ప్లాన్ చేశారు. అయితే ఆ పాటని తానే పాడతానని వెంకటేశ్ కోరడంతో అనిల్ రావిపూడి అంగీకరించారు. ఈ పాట చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సాంగ్‌కి భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి.

ఫిబ్రవరిలో శబ్దం


ఆది పినిశెట్టి

'ఈరమ్' (2009) (తెలుగులో 'వైశాలి'గా 2011లో రిలీజ్ అయింది) వంటి విజయవంతమైన చిత్రం తర్వాత హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'శబ్దం'. 7జీ ఫిల్మ్స్, ఆల్ఫా ఫ్రేమ్స్ పతాకాలపై 7జీ శివ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఫిబ్రవరి 28న రిలీజ్ చేయనున్నట్లుగా ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ముంబై, మున్నార్, చెన్నైలోని పలు లొకేషన్స్‌లో ఈ సినిమాను చిత్రీకరించాం. కేవలం ఇంట్రవెల్ సీక్వెన్స్ కోసమే 2 కోట్ల రూపాయల బడ్జెట్‌తో 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్‌ను రెడీ చేశాం. ఈ సినిమా కోసం ప్రత్యేకమైన సౌండ్ ఎఫెక్ట్స్, ఆర్ఆర్ చేయడానికి హంగేరీకి వెళ్లాలని ఈ చిత్ర సంగీత దర్శకుడు తమన్ ప్లాన్ చేస్తున్నారు'' అని చిత్ర బృందం పేర్కొంది.

ఒక రాజు


నవీన్ పొలిశెట్టి, మీనాక్షీ చౌదరి

నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'. ఈ చిత్రం ద్వారా మారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. కాగా గురువారం (డిసెంబరు 26) నవీన్ పొలిశెట్టి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలోని ప్రీ వెడ్డింగ్ వీడియో టీజర్‌ను విడుదల చేశారు నిర్మాతలు. ఇక 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రం తర్వాత నవీన్ పొలిశెట్టి ఓ ప్రమాదంలో గాయపడి, ఏడాది పాటు నటనకు దూరమయ్యారు. ఇప్పుడు పూర్తిగా కోలుకున్న ఆయన 'అనగనగా ఒక రాజు' మూవీ చేస్తున్నారు. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు. 2025లో ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు ప్రీ వెడ్డింగ్ వీడియో టీజర్‌లో ప్రకటించారు మేకర్స్.

శివరాత్రికి...


అయ్యప్ప పి. శర్మ

శ్రీరామ్, కమల్ కామరాజు, కారుణ్య చౌదరి, అయ్యప్ప పి. శర్మ, బాల నటి సాయి తేజస్విని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఎర్రచీర: ది బిగినింగ్'. ఈ సినిమాలో ఓ చిన్న రోల్ చేయడంతో పాటు దర్శకత్వం వహించారు సుమన్ బాబు. బేబి డమరి సమర్పణలో ఎన్‌వీవీ సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రకటించారు. ''మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాలతో ఈ చిత్రం తెరకెక్కింది. డిసెంబరు 27న సినిమాను రిలీజ్ చేద్దామనుకున్నాం. కానీ ఈ సినిమాకు బిజినెస్ షోలు వేశాం. డిస్ట్రిబ్యూటర్స్ కొందరు సినిమా బాగుందని, శివరాత్రి సీజన్‌లో రిలీజ్ చేస్తే బాగుంటుందని సూచించారు'' అన్నారు సుమన్ బాబు.

దూరదర్శిని కలిపింది

సువిక్షిత్ బొజ్జ, గీతికా రతన్ జంటగా నటించిన చిత్రం 'దూరదర్శిని'. 'కలిపింది ఇద్దరిని' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో బి. సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''ఈ సినిమా అందర్నీ 90వ దశకంలోకి తీసుకెళుతుంది. అందరికీ వాళ్ల ప్రేమ కథలు కూడా గుర్తుకొస్తాయి'' అన్నారు. సువిక్షిత్ మాట్లాడుతూ- ''ఈ సినిమాకి భావోద్వేగాలు ప్లస్ పాయింట్'' అన్నారు. ''వాణి, హరిల ప్రేమను దూరదర్శిని ఎలా కలిపింది? అనేది ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు గీతికా రతన్.


సువిక్షిత్, గీతిక

చీకటి రాత్రి..


పూర్ణ

హీరోయిన్ పూర్ణ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'డార్క్ నైట్'. జీఆర్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విధార్థ్, త్రిగుణ్ (అదిత్ అరుణ్), సుభాశ్రీ రాయగురు, రమ ఇతర పాత్రలు పోషించారు. పటోళ్ల వెంకట్ రెడ్డి సమర్పణలో సురేష్ రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ప్రస్తుతం ఈ సినిమా డబ్బింగ్ జరుపుకుంటోంది. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి కొవ్వూరి మాట్లాడుతూ- ''అవును, అవును 2' చిత్రాల్లో పూర్ణ నటన చాలా బాగుంటుంది. ఆ చిత్రాల్లాగానే 'డార్క్ నైట్'లో ఆమె నటన హైలెట్‌గా నిలుస్తుంది. అతీంద్రియ అంశాలతో కూడిన ఊహించని ట్విస్ట్‌లతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేలా ఈ చిత్రాన్ని మలిచాడు ఆదిత్య. నాలుగు ప్రధాన పాత్రల మధ్య కథనాన్ని ఉత్కంఠగా తెరకెక్కించారాయన'' అని తెలిపారు.

ఫ్యామిలీ డ్రామా


రామ్, పవిత్ర

రామ్ మిట్టకంటి, కప్పి, పవిత్ర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చిట్టి పొట్టి'. ఈ సినిమా ద్వారా భాస్కర్ యాదవ్ దాసరి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. బిజిమ్ స్టూడియో బ్యానర్‌పై ఆయనే స్వయంగా నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. భాస్కర్ యాదవ్ దాసరి మాట్లాడుతూ- ''ఒక మంచి సిస్టర్ సెంటిమెంట్, ఎమోషనల్, ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన చిత్రం 'చిట్టి పొట్టి'. మా మూవీ ట్రైలర్‌కి విశేష స్పందన లభించింది. సినిమా కూడా అదే తరహాలోనే ఉంటుంది. శ్రీ వెంకట్ సంగీతంలోని పాటలన్నీ వినసొంపుగా ఉంటాయి. ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ సినిమా ఇది'' అన్నారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

జీవితం అర్థం చెప్పే ప్రేమకథ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం కథా ఇన్నువరే ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ప్రేమ... ఈ భావం మనిషికి... మనసుకి ఓ మధురానుభూతి. మనిషి పుట్టుక నుండి గిట్టే వరకు ఈ ప్రేమ ప్రతి దశలోనూ ఉంటుంది. ఆ మహత్తరమైన ప్రేమను వెండి తెరకు తీసుకురావడానికి తరతరాలుగా ఎంతో మంది దర్శకులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆ ప్రయత్నంలో భాగంగానే దర్శకుడు విష్ణు మోహన్ ఓ చక్కటి ప్రేమ పంథాను 'కథా ఇన్నువరే' సినిమా కోసం ఎంచుకున్నారు. మలయాళ దర్శకుడు విష్ణు మోహన్ సినిమాలన్నీ చాలా వరకు సున్నితమైన భావావేశాలతోనే ఉంటాయి. అటువంటి కోవలోనే 'కథా ఇన్నువరే'ని తీశారు. ఓ నాలుగు ప్రేమ కథలు ఒకే కథగా 'కథా ఇన్నువరే...' (ఇప్పటివరకు కథ) సినిమాలో చూపించడానికి ప్రయత్నించారు. 2018లో ప్రముఖ హీరో రానా నిర్మించిన తెలుగు 'కంచరపాలెం' విమర్శకుల ప్రశంసలతో పాటు ఆ ఏడాది న్యూయార్క్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నామినేట్ అయింది. ఈ సినిమా రీమేకే 'కథా ఇన్నువరే'. కథ విషయానికొస్తే... కొంచెం లేటు వయసులో ఉన్న రామచంద్ర తాను ప్యూనుగా పని చేస్తున్న ఆఫీసులో ఆఫీసరైన జానకితో ప్రేమలో పడతాడు. ఇంకో పక్క కాలేజీలో చదువుకునే ఉమ కమ్యూనిస్ట్ ఉద్యమం కోసం పని చేసే జోసెఫ్‌ని ఇష్టపడుతుంది. ఉమ తండ్రికి ఈ విషయం అస్సలు నచ్చదు. మరో పక్క నసీమా అనే వేశ్యను లిక్కర్ షాపులో పని చేసే రామచంద్రన్ ప్రేమిస్తాడు. ఈ మూడు కథలతో పాటు బొమ్మలు తయారు చేసే ఓ శిల్పి కొడుకు స్కూల్‌లో మరో అమ్మాయిని ఇష్టపడుతూ ఉంటాడు. ఈ నాలుగు ప్రేమ కథలకు ఒకదానికొకటి సంబంధం ఉండదు. అయితే వాటిని లింక్ చేసేది మాత్రం ప్రేమే. అలాగే ఆఖర్లో వచ్చే ట్విస్ట్ సినిమాకే హైలైట్. మామూలుగా ప్రేమకథలను చూసి అనుభూతి పొందుతాం. కానీ ఈ సినిమాలో ప్రేమ మాత్రం జీవితానికి అర్థం చెబుతుంది. ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా 'కథా ఇన్నువరే' స్ట్రీమ్ అవుతోంది. వర్త్‌ఫుల్ మూవీ ఫర్ ఎ ఫీల్ గుడ్ వ్యూవర్స్.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్	0	78,473
నిఫ్టీ ▲	23	23,750

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	20,009	▼ 22
డోజోన్స్	43,272	▼ 25
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,197 (మంగళవారం ముగింపు)	
డాక్స్	19,849 (సోమవారం ముగింపు)	
షాంఘై	3,394	▲ 42
నికాయ్	39,037	▼ 124

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)	75,650
బంగారం (22 క్యారెట్)	72,050
వెండి (కిలో)	91,600

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.43	87.11
£	బ్రిటన్ పౌండ్		104.17	109.15
€	యూరో		86.47	90.96
¥	జపాన్ ఎన్ (100)		42.00	65.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		50.64	55.51
S$	సింగపూర్ డాలర్		63.36	65.04
SAR	సౌదీ రియాల్		21.84	23.39
UAE D	యూఏఈ దిర్హామ్		22.32	24.11
¥	చైనా యువాన్		10.81	12.63

హేయర్ ఇండియాపై దిగ్గజాల కన్ను

51 శాతం వాటా కొనుగోలుకు పోటీ

- జాబితాలో భారతీ ఎంటర్‌ప్రైజెస్
- దాల్మియా భారత్, వెల్‌స్పన్ గ్రూప్
- రేసులో గ్లోబల్ పీఈ దిగ్గజాలు సైతం



ముంబై: చైనీస్ కన్జూమర్ అప్లయెన్సెస్ కంపెనీ హేయర్ దేశీ కార్యకలాపాలపై పలు కార్పొరేట్, పీఈ దిగ్గజాలు కన్నేసినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. హేయర్ అప్లయెన్సెస్ ఇండియాలో 51 శాతం వాటా కొనుగోలు చేయాలని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఇందుకు పలు పీఈ దిగ్గజాలు, దేశీ కార్పొరేట్లతో చేతులు కలిపాయి. వార్‌బర్గ్ పింకస్.. భారతీ ఎంటర్‌ప్రైజెస్‌తో, బెయిన్ క్యాపిటల్ దాల్మియా భారత్ గ్రూప్‌తో జట్టు కట్టాయి. ఈ రేసులో వెల్‌స్పన్ గ్రూప్‌తోపాటు.. ఇతర పీఈ దిగ్గజాలు టీపీజీ క్యాపిటల్, గోల్డ్‌మన్ శాక్స్, జీఐసీ(సింగపూర్) పోటీ పడుతున్నాయి.

ఎలక్ట్రానిక్ అప్లయెన్సెస్ చైనీస్ దిగ్గజం హేయర్ ఇండియా దేశీయంగా హోమ్ అప్లయెన్సెస్‌లో మూడో పెద్ద కంపెనీగా నిలుస్తోంది. రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, ఏసీ, టీవీల విక్రయాలలో కొరియన్ దిగ్గజాలు ఎల్‌జీ, శామ్‌సంగ్‌తో పోటీ పడుతోంది. అయితే హేయర్ ఇండియాలో నియంత్రిత వాటా (51 శాతం) కొనుగోలు చేసేందుకు దేశీ కార్పొరేట్లతోపాటు.. గ్లోబల్ పీఈ సంస్థలు సైతం దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. వివరాలు చూద్దాం..

ఇప్పటికే ఆఫర్లు

హేయర్ ఇండియాలో నియంత్రిత వాటా కొనుగోలుకి కొన్ని సంస్థలు ఇప్పటికే నాన్‌బైండింగ్ బిడ్స్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు ఆసక్తిని చూపుతున్న ఇతర దేశీ కార్పొరేట్లలో మణిపాల్ గ్రూప్, డాబర్ గ్రూప్, ముంజాల్ కుటుంబం ఉన్నట్లు సమాచారం. కంపెనీతో చర్చలు చేపట్టిన పీఈ దిగ్గజాలలో బ్లాక్‌స్టోన్, సీవీసీ క్యాపిటల్ పార్ట్‌నర్స్, ఈక్వొటీ, టీపీ అసోసియేట్స్ సైతం ఉన్నాయి. లిస్టెడ్ కంపెనీల ద్వారా కాకుండా ప్రమోటర్లు, గ్రూప్ ప్రయివేట్ సంస్థల నుంచి ఆసక్తిని వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

స్థానికతకు ప్రాధాన్యం

దేశీ నియంత్రణ సంస్థల నిశిత పరీక్షల నేపథ్యంలో హేయర్ ఇండియా కార్యకలాపాలలో స్థానికతను పెంచుకునే వ్యూహాల్లో ఉంది. దీనిలో భాగంగా దేశీ భాగస్వామి కోసం చూస్తోంది. 20–49 శాతం వరకూ వాటాను సైతం ఆఫర్ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే 51 శాతం వాటాకు స్థానిక సంస్థలు డిమాండ్ చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తద్వారా చైనాయేతర సంస్థలు మెజారిటీ వాటాను కలిగి ఉండటం ద్వారా యాజమాన్య నిర్వహణకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిపాయి. ఆపై స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు వీలుగా ఒప్పందం కుదుర్చుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.

భారీ వృద్ధిపై దృష్టి

ఈ క్యాలెండర్ ఏడాది(2024)లో బిలియన్ డాలర్లకుపైగా(రూ. 8,900 కోట్లు) ఆదాయ మైలురాయిని అధిగమించే లక్ష్యంలో సాగుతున్నట్లు హేయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీష్ వెల్లడించారు. ఇందుకు పండుగలు, వేసవి సీజన్, ప్రీమియం ధరలు సహకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ బాటలో 2025లో రూ. 11,500 కోట్ల ఆదాయాన్ని అందుకోవాలని భావిస్తున్నట్లు తెలియజేశారు. వెరసి 2024లో 35 శాతం వృద్ధి సాధించడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించనున్నట్లు వివరించారు. ప్రధానంగా లెడ్, వాషింగ్ మెషీన్ల విభాగం పటిష్ట పురోగతిని అందుకుంటున్నట్లు వెల్లడించారు. కాగా.. ఇప్పటికే దేశీయంగా రూ. 2,500 కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎలక్ట్రానిక్స్, కన్జూమర్ కంపెనీ మూడో తయారీ కేంద్రాన్ని దక్షిణాదిలో ఏర్పాటు చేసే సన్నాహాల్లో ఉంది. 2026 లేదా 2027కల్లా కార్యకలాపాలను ప్రారంభించే ప్రణాళికల్లో ఉంది. ప్రస్తుతం పుణే, గ్రేటర్ నోయిడాలలో తయారీ ప్లాంట్లను కలిగి ఉంది. కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది.

భారీగా బ్యాంకింగ్ మోసాలు..

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో బ్యాంకింగ్ మోసాల సంఖ్య గణనీయంగా పెరిగింది. దాదాపు రూ. 21,367 కోట్ల విలువ చేసే మొత్తానికి సంబంధించి 18,461 కేసులు నమోదయ్యాయి. విలువపరంగా చూస్తే మోసాల పరిమాణం ఏకంగా ఎనిమిది రెట్లు పెరిగింది. దేశీయంగా బ్యాంకింగ్ తీరుతెన్నుల గురించి రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఇందులో 2023-24 ఆర్థిక సంవత్సరం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రథమార్ధం వరకు ధోరణులను పొందుపర్చారు. దీని ప్రకారం

ప్రథమార్ధంలో 18,461 కేసులు • రూ. 21,367 కోట్ల విలువ • ఎనిమిది రెట్లు అప్



ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కాలంలో రూ. 21,367 కోట్ల మొత్తానికి సంబంధించి 18,461 కేసులు నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో రూ. 2,623 కోట్లకు సంబంధించి 14,480 కేసులు వచ్చాయి. వ్యాపారాలకు రిస్కులు మొదలుకుని కస్టమర్ల నమ్మకం దెబ్బతినడం వరకు ఈ మోసాల వల్ల వివిధ సవాళ్లు ఉంటున్నాయని నివేదిక పేర్కొంది. ఆర్థిక స్థిరత్వంపై వీటి ప్రభావం గణనీయంగా ఉంటుందని వివరించింది.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- దశాబ్దకాలంలోనే అత్యంత తక్కువగా 2023–24లో ఫ్రాడ్ కేసులు వచ్చాయి. సగటు విలువ 16 ఏళ్ల కనిష్ఠ స్థాయిలో నమోదైంది. ఇక ఇంటర్నెట్, కార్డ్ ఫ్రాడ్‌ల విషయానికొస్తే.. విలువ పరంగా చూస్తే 44.7 శాతంగా ఉండగా, కేసులపరంగా చూసినప్పుడు 85.3 శాతంగా ఉంది.
- 2023–24లో మొత్తం ఫ్రాడ్ కేసుల్లో ప్రైవేట్ రంగ బ్యాంకుల వాటా 67.1 శాతంగా ఉంది. అయితే, విలువపరంగా చూస్తే మాత్రం ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా అత్యధికంగా నమోదైంది. విదేశీ బ్యాంకులు, చిన్న ఫైనాన్స్ బ్యాంకులు మినహా అన్ని నియంత్రిత సంస్థలపై విధించిన పెనాల్టీలు రెట్టింపై రూ. 86.1 కోట్లకు చేరాయి. సహకార బ్యాంకులపై జరిమానాల పరిమాణం తగ్గింది.
- బ్యాంకుల లాభదాయకత వరుసగా ఆరో ఏడాది 2023-24లోనూ మెరుగుపడింది. స్థూల మొండిబాకీలు 13 ఏళ్ల కనిష్టమైన 2.7 శాతానికి తగ్గాయి. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల నికర లాభం గత ఆర్థిక సంవత్సరం 32.8 శాతం పెరిగి రూ. 3,59,603 కోట్లకు చేరింది.

ఏఐ వినియోగంపై ప్రత్యేక కమిటీ

ఆర్థిక రంగంలో బాధ్యతాయుతంగా, నైతికంగా కృత్రిమ మేధను (ఏఐ) వినియోగించుకునేందుకు విధానాల రూపకల్పన కోసం రిజర్వ్ బ్యాంక్ ఎనిమిది సభ్యులతో ప్రత్యేక కమిటీని ప్రకటించింది. దీనికి ఐఐటీ బాంబే ప్రొఫెసర్ పుష్పక్ భట్టాచార్య సారథ్యం వహిస్తారు. తొలి సమావేశం అనంతరం ఆరు నెలల వ్యవధిలో కమిటీ తన నివేదికను సమర్పిస్తుందని ఆర్‌బీఐ పేర్కొంది.


30 క్రెడిట్ కార్డు బకాయిపై సుప్రీం ఓకే



న్యూఢిల్లీ: క్రెడిట్ కార్డు బకాయిలపై 30 శాతానికి మించి వడ్డీ రేటు వసూలు చేసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ అంశానికి సంబంధించి 16 ఏళ్ల క్రితం నాటి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) ఇచ్చిన తీర్పును కొట్టేసింది. జస్టిస్ బేల ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పు చెప్పింది. క్రెడిట్ కార్డులపై 30 శాతానికి మించి వడ్డీ రేటు వసూలు అన్నది అనుచిత వాణిజ్య విధానమన్న ఎన్‌సీడీఆర్‌సీ అభిప్రాయం చట్టవిరుద్ధమని, ఆర్‌బీఐ అధికారాల్లో జోక్యం చేసుకోవడమేనని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. బ్యాంక్‌లు, క్రెడిట్ కార్డు దారులు పరస్పర అంగీకారంతో కుదుర్చుకున్న కాంట్రాక్టు నియమాలను పునర్‌నిర్వచించే అధికార పరిధి ఎన్‌సీడీఆర్‌సీకి లేదని స్పష్టం చేసింది. క్రెడిట్ కార్డు బకాయిలపై 36 శాతం నుంచి 49 శాతం వార్షిక వడ్డీ రేటు చాలా ఎక్కువని, రుణ గ్రహీతలను దోచుకోవడమంటూ 2008 జూలై 7న నాటి తీర్పును సిటీ బ్యాంక్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, హెచ్‌ఎస్‌బీసీ, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ సుప్రీం కోర్టులో సవాలు చేయడంతో ఈ తీర్పు వెలువడింది.

టీడీఎస్ వ్యవస్థ రద్దుకు సుప్రీంలో పిటిషన్

రాజ్యాంగ ఉల్లంఘనలు ఉన్నాయని వాదనలు



న్యూఢిల్లీ: ట్యాక్స్ డిడక్షన్ యట్ సోర్స్ (టీడీఎస్) వ్యవస్థను ''ఏకపక్షం, అసంబద్ధమైనదిగా' పేర్కొంటూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం(పిల్) దాఖలైంది. సమానత్వంసహా వివిధ ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా పేర్కొంటూ టీడీఎస్‌ను రద్దు చేయాలని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. చెల్లించే సమయంలోనే పన్నును మినహాయించడం, ఆదాయపు పన్ను శాఖలో డిపాజిట్ చేయడం తగిన విధానం కాదని వివరించింది. అశ్విని ఉపాధ్యాయ్ అనే లాయర్, అడ్వొకేట్ అశ్వనీ దూబే ద్వారా దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో కేంద్రం, న్యాయ మంత్రిత్వ శాఖ, లా కమిషన్, నీతి ఆయోగ్‌లు ప్రతివాదులుగా ఉన్నారు.

రాజ్యాంగంలోని 14 (సమానత్వపు హక్కు), 19 (వృత్తి చేసే హక్కు), 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ) ఆర్టికల్స్‌కు వ్యతిరేకంగా టీడీఎస్ ఉందని, ఈ వ్యవస్థ ఏకపక్షంగా, అసంబద్ధంగా ఉందని ప్రకటించాలని సుప్రీంను పిల్ కోరింది.

మార్కెట్లు అక్కడక్కడే



- సెన్సెక్స్ యథాతథం
- నిఫ్టీకి 23 పాయింట్ల లాభం

ముంబై: రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు గురువారం ఫ్లాటుగా ముగిశాయి. సెన్సెక్స్ ఎలాంటి మార్పు లేకుండా బుధవారం ముగింపు 78,473 వద్దే స్థిరపడింది. నిఫ్టీ 23 పాయింట్లు పెరిగి 23,750 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలో లాభాల దిశగా కదలాయి. ఒక దశలో సెన్సెక్స్ 426 పాయింట్లు పెరిగి 78,898 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు బలపడి 23,854 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో పాటు నెలవారీ ఎఫ్అండ్ఓ (డెరివేటివ్స్) గడువు ముగింపు రోజు కావడంతో ఇన్వెస్టర్లు వెంటనే అమ్మకాలకు పాల్పడ్డారు.

పాతాళానికి రూపాయి



ముంబై: డాలరు విలువతో రూపాయి పతనం కొనసాగుతోంది. గురువారం డాలర్ మారకంలో 12 పైసలు బలహీనపడి జీవితకాల కనిష్ఠ స్థాయి 85.27 వద్ద ముగిసింది. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 85.23 వద్ద ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో 13 పైసలు పతనమై 85.28 సరికొత్త పతనాన్ని నమోదు చేసింది. నెలాఖరు, సంవత్సరాంతం కావడంతో దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. డొనాల్డ్ ట్రంప్ పాలనా బాధ్యతలు చేపట్టిన తర్వాత దిగుమతులపై భారీ సుంకాలు విధించవచ్చనే భయాలూ నెలకొన్నాయి. మరోవైపు క్రూడాయిల్ ధరలు పుంజుకోవడం రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత్‌కు 'తయారీ' స్వర్ణయుగం: ఎన్ చంద్రశేఖరన్ / ఈప్యాక్‌లో హైసెన్స్‌కు చోటు



మెల్‌బోర్న్@87,242

'బాక్సింగ్ డే' టెస్టు తొలి రోజు ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు 87,242 మంది అభిమానులు హాజరయ్యారు. ఇరు జట్ల మధ్య టెస్టు మ్యాచ్‌కు హాజరైన అభిమానుల సంఖ్య ఇదే అత్యధికం. మెల్‌బోర్న్ టెస్టు ఆరంభానికి రెండు వారాల ముందే టికెట్లన్నీ అమ్ముడుపోగా... రికార్డు స్థాయిలో ప్రేక్షకులు మైదానానికి తరలివచ్చారు.



కోన్‌స్టాస్‌తో 'ఢీ'... కోహ్లికి జరిమానా

తొలి రోజు ఆటలో ఓ అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 10వ ఓవర్‌లో కోన్‌స్టాస్ కొట్టిన బంతి కోహ్లి వద్దకు వెళ్లగా... దానిని తీసుకొని నాన్ స్ట్రయికర్ ఎండ్‌వైపు వస్తున్న కోహ్లి ఆసీస్ ఓపెనర్ కోన్‌స్టాస్‌ను 'ఢీ' కొట్టాడు. కోహ్లి ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశాడని పలువురు మాజీలు ఆరోపించగా... దీనిపై స్పందించిన మ్యాచ్ రిఫరీ రీప్లేలు పరిశీలించి కోహ్లికి జరిమానా విధించారు. ఐసీసీ నియమావళి లెవల్–1 తప్పిదంగా పరిగణించి కోహ్లి మ్యాచ్ ఫీజులో 20 శాతం (రూ. 3 లక్షలు) కోత విధించడంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. కోహ్లి భుజం కోన్‌స్టాస్‌కు తాకిన సమయంలో అతడు ఏదో అనగా... దానికి విరాట్ దీటుగా బదులిచ్చాడు. దీంతో ఖ్వాజా, అంపైర్లు కలగజేసుకొని ఇద్దరినీ వెనక్కి పంపారు. మ్యాచ్ అనంతరం కోన్‌స్టాస్ దీనిపై స్పందించాడు. 'మేమిద్దరం కాస్త భావోద్వేగానికి గురయ్యామనుకుంటున్నా. నేను గ్లవ్స్ సరి చేసుకుంటుండగా... కోహ్లి వచ్చేది గమనించలేదు. ఆటలో అప్పుడప్పుడూ ఇవి సహజం. ఇదేం పెద్ద సమస్య కాదని భావిస్తున్నా' అని అన్నాడు. ఈ ఘటన జరిగిన సమయంలో వ్యాఖ్యానం చేస్తున్న రికీ పాంటింగ్, మైకెల్ వాన్ వంటి వారితో పాటు భారత దిగ్గజాలు సునీల్ గావస్కర్, రవిశాస్త్రి కూడా మైదానంలో ఇలా జరిగి ఉండాల్సింది కాదని అభిప్రాయపడ్డారు.

బుమ్రా...ఒకే ఓవర్లో 18 పరుగులు

భారత పేసర్ బుమ్రా తన టెస్టు కెరీర్‌లో ఒకే ఓవర్‌లో అత్యధికంగా 18 పరుగులు సమర్పించుకున్నాడు. 2020లో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లోనే ఒక ఓవర్‌లో బుమ్రా 16 పరుగులు ఇచ్చాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో బుమ్రా 4,484 బంతుల తర్వాత సిక్స్ ఇచ్చుకున్నాడు. 2021 సిడ్నీ టెస్టులో చివరిసారిగా బుమ్రా బౌలింగ్‌లో కామెరూన్ గ్రీన్ సిక్స్ కొట్టగా... మూడేళ్ల తర్వాత మెల్‌బోర్న్ టెస్టులో కోన్‌స్టాస్ రివర్స్ స్కూప్ ద్వారా సిక్స్ బాదాడు.

టాప్-4 తడాఖా

ఆస్ట్రేలియా ప్రయోగించిన కొత్త అస్త్రం ఫలించింది. మెక్‌స్వీనీని తప్పించి ఎంపిక చేసిన 19 ఏళ్ల కుర్రాడు స్యామ్ కోన్‌స్టాస్ మెల్‌బోర్న్‌లో మెరిపించాడు. ప్రపంచ అత్యుత్తమ పేసర్‌గా మన్ననలు అందుకుంటున్న బుమ్రా బౌలింగ్‌లో... టి20ల తరహాలో పరుగులు రాబట్టి ఆతిథ్య జట్టులో ఆత్మవిశ్వాసం నింపాడు. అతడి స్ఫూర్తితో టాప్–4 ఆటగాళ్లు హాఫ్ సెంచరీలతో విజృంభించారు. వెరసి 'బాక్సింగ్ డే' టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఆఖర్లో బుమ్రా చెలరేగకపోయుంటే పరిస్థితి మరింత దిగజారేదే! ఇప్పటికైతే టీమిండియా పోటీలోనే ఉన్నా... పేస్‌కు సహకరిస్తున్న పిచ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తారనేది ఆసక్తికరం!

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 311/6

- అరంగేట్రంలో కోన్‌స్టాస్ రికార్డు 'ఫిఫ్టీ'
- ఖ్వాజా, లబుషేన్, స్మిత్ అర్ధ శతకాలు
- 3 వికెట్లతో మెరిసిన బుమ్రా

మెల్‌బోర్న్: టాపార్డర్ రాణించడంతో 'బాక్సింగ్ డే' టెస్టులో ఆస్ట్రేలియాకు మంచి ఆరంభం లభించింది. టాప్–4 బ్యాటర్లు అర్ధశతకాలతో అదరగొట్టారు. ఫలితంగా 'బోర్డర్–గావస్కర్' ట్రోఫీలో భాగంగా భారత్‌తో గురువారం మొదలైన నాలుగో టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు తొలిరోజే మంచి స్థితిలో నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. అరంగేట్ర ఆటగాడు సామ్ కోన్‌స్టాస్ (65 బంతుల్లో 60; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఉస్మాన్ ఖ్వాజా (121 బంతుల్లో 57; 6 ఫోర్లు), లబుషేన్ (145 బంతుల్లో 72; 7 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (111 బంతుల్లో 68 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. ఒకదశలో ఆసీస్ జోరు చూస్తుంటే 400 స్కోరు ఖాయమే అనిపించినా... మేటి పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (3/75) టీమిండియాను తిరిగి పోటీలోకి తెచ్చాడు. భారత బౌలర్లలో ఆకాశ్‌దీప్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ఒక్కో వికెట్ పడగొట్టారు. స్మిత్‌తో పాటు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

కోన్‌స్టాస్ ల్యాప్ స్కూప్ సిక్సర్

రికార్డు స్థాయి అభిమానుల హర్షధ్వానాల మధ్య జాతీయ జట్టు తరఫున తొలి టెస్టు ఆడేందుకు బరిలోకి దిగిన టీనేజర్ కోన్‌స్టాస్ మొదటి మ్యాచ్‌లోనే గుర్తుండిపోయే ప్రదర్శనతో కట్టిపడేశాడు. బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు మహామహా బ్యాటర్లే తడబడుతున్న తరుణంలో సంప్రదాయ శైలిని పక్కనపెట్టి ఎదురుదాడి లక్ష్యంగా పరుగులు రాబట్టడంలో సఫలమయ్యాడు. పట్టుమని పది ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల అనుభవం కూడా లేని 19 ఏళ్ల కోన్‌స్టాస్... బుమ్రా బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు బాదడం విశేషం. ఏడో ఓవర్‌లో అతడు ల్యాప్ స్కూప్ ద్వారా కొట్టిన సిక్స్ మ్యాచ్‌కే హైలైట్. కోహ్లి వంటి దిగ్గజ ఆటగాడితో మాటల యుద్ధం జరిగిన తర్వాత కూడా ఈ టీనేజ్ కుర్రాడు సంయమనం కోల్పోకుండా పరిణతి ప్రదర్శించాడు. ఈ క్రమంలో 52 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న కోన్‌స్టాస్ కాసేపటికే జడేజా బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు.


ఖ్వాజా


లబుషేన్

స్మిత్, లబుషేన్ నిలకడ

గత మూడు టెస్టుల్లో నిలకడ కనబర్చలేకపోయిన ఆసీస్ టాపార్డర్... కోన్‌స్టాస్ ఇన్నింగ్స్ స్ఫూర్తితో చెలరేగడంతో తొలి రోజు కంగారూలదే పైచేయి అయింది. లయ దొరకబుచ్చుకునేందుకు ఇబ్బంది పడుతున్న ఖ్వాజా 101 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకోగా... లబుషేన్ నింపాదిగా ఆడాడు. ఎలాంటి తొందరపాటుకు అవకాశం ఇవ్వకుండా ఒక్కో పరుగు జోడిస్తూ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. రెండో వికెట్ లబుషేన్‌తో కలిసి 65 పరుగులు జోడించిన అనంతరం ఖ్వాజా అవుటయ్యాడు. లబుషేన్, స్మిత్ జట్టు బాధ్యతలను భుజానెత్తుకున్నారు. దాంతో ఆసీస్ ఒకదశలో 237/2తో పటిష్ట స్థితిలో కనిపించింది. బుమ్రా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయగా... సిరాజ్, జడేజా ఆ తీవ్రత కొనసాగించలేకపోవడంతో ఆసీస్ ప్లేయర్లు సులువుగా పరుగులు రాబట్టారు. ఎట్టకేలకు మూడో వికెట్‌కు 83 పరుగులు జోడించిన తర్వాత లబుషేన్‌ను సుందర్ అవుట్ చేశాడు.


స్మిత్


బుమ్రా

బుమ్రా బ్రేక్

ఈ సిరీస్‌లో అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్న బుమ్రా మూడో సెషన్‌లో తన తడాఖా చూపాడు. వరుస సెంచరీలతో జోరు మీదున్న ట్రావిస్ హెడ్ (0)ను ఓ చక్కటి బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. బుమ్రా సంధించిన బుల్లెట్ లాంటి లెంత్ బాల్ హెడ్ ఆఫ్ స్టంప్ బెయిల్‌ను గిరాటేసిన తీరు ముచ్చట గొలిపింది. ఏం జరిగిందో ఆలోచించుకునే లోపే హెడ్ బెయిల్ గాల్లోకి ఎగరగా... స్టేడియం మొత్తం 'బూమ్.. బూమ్.. బుమ్రా' అనే నినాదాలతో హోరెత్తింది. మరుసటి ఓవర్‌లో మార్ష్ (4)ను బుమ్రా వెనక్కి పంపాడు. అలెక్స్ కేరీ (41 బంతుల్లో 31; 1 సిక్స్) చివర్లో వేగంగా పరుగులు సాధించగా... స్మిత్ అజేయంగా నిలిచాడు. రెండో రోజు కమిన్స్‌తో కలిసి స్మిత్ మరెన్ని పరుగులు జోడిస్తాడనే దానిపైనే ఈ మ్యాచ్ భవితవ్యం ఆధారపడి ఉంది.



కోన్‌స్టాస్

1 అరంగేట్రం టెస్టులోనే భారత్‌పై అర్ధశతకం సాధించిన పిన్న వయసు (19 ఏళ్ల 85 రోజులు) ఆసీస్ ప్లేయర్‌గా కోన్‌స్టాస్ రికార్డుల్లోకెక్కాడు. ఓవరాల్‌గా ఆసీస్ తరఫున పిన్నవయసులో అర్ధశతకం చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ఇయాన్ క్రెయిగ్ (17 ఏళ్ల 240 రోజులు: 1953లో దక్షిణాఫ్రికాపై) తొలి స్థానంలో ఉన్నాడు.

3 ఆస్ట్రేలియా తరఫున అరంగేట్రం టెస్టులో వేగవంతమైన అర్ధశతకం సాధించిన మూడో ప్లేయర్‌గా కోన్‌స్టాస్ (52 బంతుల్లో) నిలిచాడు. గిల్‌క్రిస్ట్ (46 బంతుల్లో; 1999లో పాకిస్తాన్‌పై), ఆగర్ (50 బంతుల్లో; 2013లో ఇంగ్లండ్‌పై) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: కోన్‌స్టాస్ (ఎల్బీ) (బి) జడేజా 60; ఖ్వాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 57; లబుషేన్ (సి) కోహ్లి (బి) సుందర్ 72; స్మిత్ (బ్యాటింగ్) 68; హెడ్ (బి) బుమ్రా 0; మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 4; కేరీ (సి) పంత్ (బి) ఆకాశ్‌దీప్ 31; కమిన్స్ (బ్యాటింగ్) 8; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (86 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి) 311. **వికెట్ల పతనం:** 1–89, 2–154, 3–237, 4–240, 5–246, 6–299. **బౌలింగ్:** బుమ్రా 21–7–75–3; సిరాజ్ 15–2–69–0; ఆకాశ్‌దీప్ 19–5–59–1; జడేజా 14–2–54–1; నితీశ్ రెడ్డి 5–0–10–0; సుందర్ 12–2–37–1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

ఆ 10 రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు
టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి


ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఏఈవో వెంకయ్య చౌదరి


తిరుమల: ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వైకుంఠ ఏకాదశి నుంచి వైకుంఠ ద్వార దర్శనం కల్పించే 10 రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై ఆయన సీవీఎస్వో శ్రీధర్‌తో కలిసి గురువారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ విభాగాధిపతులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే అనుమతించాలన్నారు. కేటాయించిన దర్శన తేదీ రోజున మాత్రమే భక్తులను తిరుమలకు అనుమతించాలన్నారు. చంటి బిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, రక్షణ, ఎన్ఆర్ఐ, మొదలగు వారికి విశేష దర్శనాలను ఆ పది రోజులూ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. గోవింద మాల భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు ఉండవని స్పష్టం చేశారు. వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో గదుల అడ్వాన్స్ రిజర్వేషన్ రద్దు చేస్తారని తెలిపారు. కాగా, టీటీడీ డయల్ యువర్ ఈవో'కార్యక్రమం ఈ నెల 28న శనివారం ఉదయం 9–10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగుతుందని టీటీడీ అధికారులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో శ్యామలరావుకు ఫోన్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఇందుకుగాను 0877–2263261 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారిపై పెద్దపులి
కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) రేంజ్‌లో సంచారం

సిర్పూర్(టి)/బెజ్జూర్ (సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దపులుల సంచారం ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా గురువారం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని సిర్పూర్(టి) రేంజ్‌లో పులి అంతర్రాష్ట్ర రహదారిపైకి వచ్చింది. మాకిడి–అంతర్గాం గ్రామాల మధ్య ఉన్న పత్తి చేను నుంచి వస్తున్న పెద్దపులిని గమనించిన రైతులు వాహనదారులను అప్రమత్తం చేశారు. వారందరూ చూస్తుండగానే పులి అంతర్గాం సమీపంలో సిర్పూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారిపైకి రావడంతో సెల్‌ఫోన్లతో వీడియోలు తీశారు.

బెజ్జూర్ రేంజ్‌లో మరోపులి ఆనవాళ్లు.. బెజ్జూర్ రేంజ్ పరిధిలోని మత్తడి స్ప్రింగ్ ఆనకట్ట వద్ద మరో పెద్దపులి సంచరించిన ఆనవాళ్లను గురువారం మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామస్తులు కొందరు గుర్తించారు. వన్య ప్రాణుల కోసం ఏర్పాటు చేసిన నీటికుంట వద్దకు నీళ్లు తాగేందుకు పులి వెళ్లినట్లు పాద ముద్రలు కనిపించడంతో గ్రామస్తులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. బెజ్జూర్ రేంజ్ ఫారెస్టు అధికారి మునవీర్‌ను 'సాక్షి' సంప్రదించగా.. రేంజ్ పరిధిలో కే 8 పెద్దపులి ఉందని, కొత్తపులి ఇప్పటివరకు ఈ రేంజ్ పరిధిలోకి రాలేదని తెలిపారు.

మే తొలి వారంలో ఇంజనీరింగ్ సెట్



వారం రోజుల్లో తేదీలు ఖరారయ్యే అవకాశం

ప్రశ్నపత్రం రూపకల్పనపై కసరత్తు షురూ

ఎంపిక చేసిన అధ్యాపకులపై నిరంతర నిఘా

రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీసెట్) నిర్వహణకు సంబంధించిన కసరత్తు పూర్తయినట్టు ఉన్నత విద్యా మండలి వర్గాలు చెబుతున్నాయి. వారం రోజుల్లో సెట్ తేదీలనూ వెల్లడించే వీలుందని తెలుస్తోంది. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం.. మే మొదటి వారంలో ఈఏపీసెట్ నిర్వహిస్తారు. జాతీయ స్థాయి అర్హత పరీక్షలను పరిగణనలోకి తీసుకుని ఈ సెట్ తేదీలను ఖరారు చేయడం ఆనవాయితీ. ఈ బాధ్యతను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారీ టాటా కన్సల్టెన్సీ సర్వీస్‌కు అప్పగించారు. టీసీఎస్‌తో రెండుసార్లు సమావేశమైన ఉన్నతాధికారులు పరీక్ష తేదీలపై స్పష్టతకు వచ్చారు.

- సాక్షి, హైదరాబాద్

ప్రశ్నపత్రం ఇలా.. సెట్ నిర్వహణ బాధ్యతను ఈసారి కూడా జేఎన్‌టీయూహెచ్‌కే అప్పగించారు. వర్సిటీ ప్రొఫెసర్ దీన్‌కుమార్‌ను కన్వీనర్‌గా ఎంపిక చేశారు. ఇదే వర్సిటీకి ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఇన్‌చార్జి వీసీగా ఉన్నారు. వీరి నేతృత్వంలో ప్రశ్నపత్రం రూపకల్పనపై కసరత్తు జరుగుతోంది. ఈఏపీసెట్ 160 మార్కులకు ఉంటుంది. మ్యాథ్స్ 80 మార్కులు, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 40 మార్కులకు ఉంటుంది. సైన్స్ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ .. ప్రతి సబ్జెక్టుకు 40 మార్కుల చొప్పున పేపర్ రూపొందించాల్సి ఉంటుంది. దీనికోసం నిపుణుల నుంచి ముందుగా కొన్ని వేల ప్రశ్నలను క్రోడీకరించాల్సి ఉంటుంది. ఇందులోంచి దశలవారీగా ప్రశ్నలను తీసుకుని ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తారు. ఒక సెషన్‌లో వచ్చిన ప్రశ్న మరే ఇతర సెషన్‌లో రాకుండా జాగ్రత్త పడాల్సి ఉంటుంది.

120 మంది నిష్ణాతులతో..

ప్రశ్నపత్రం రూపకల్పనలో అత్యంత గోప్యత పాటించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వ కాలేజీల్లో పనిచేస్తున్న 120 మంది నిష్ణాతులను ఎంపిక చేశారు. వారి వ్యక్తిగత వివరాలు, ట్రాక్ రికార్డును సేకరించారు. ఏ కోచింగ్ కేంద్రంలోనూ పనిచేయడం లేదని, ప్రైవేటు కాలేజీలతో సంబంధం లేదనే డిక్లరేషన్ వీరినుంచి తీసుకున్నారు. సంబంధిత నిర్దిష్ట సబ్జెక్టును కనీసం పదేళ్ళుగా బోధిస్తూ ఉండాలి. వీరి పిల్లలు కానీ, బంధువులు కానీ సెట్ రాయకూడదు. కాగా క్వశ్చన్ బ్యాంకు రూపొందించే పనిలో కొంతమంది ఉంటారు. ఆ తర్వాత వాటిల్లోంచి కొన్నింటిని గుర్తించే పనిలో మరికొంతమంది ఉంటారు. తర్వాత దశలో వడపోత (వెట్టింగ్) విధానంలో పనిచేయడానికి మరికొంతమంది ఉంటారు. ఎవరికైనా కేవలం ఒకే దశలో పనిచేసే అవకాశం ఉంటుంది. యావత్ ప్రక్రియపై పటిష్టమైన నిఘా కొనసాగుతుంది. ఎంపిక చేసిన ప్రశ్నలను అంతిమంగా కంప్యూటర్‌కు అనుసంధానిస్తారు. తేలికపాటి ప్రశ్నలు, కాస్త కఠినమైనవి, కఠిన ప్రశ్నల నిష్పత్తిని కంప్యూటర్ విభజిస్తుంది. దీనికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను ప్రత్యేకంగా రూపొందించారు.

అలుగు పెంకు.. అంతా ఉత్తదే

అడవి అలుగుకు రూ.కోటిన్నర అన్న ప్రచారం అబద్ధం

దాని పెంకులను ఏ మందుల్లోనూ వాడరు

స్మగ్లర్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దు

అటవీ శాఖ అధికారుల సూచన

భూపతిపూర్ అడవుల్లో స్మగ్లర్ నుంచి అలుగు స్వాధీనం


అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇండియన్ పాంగోలిన్

ఏటూరునాగారం: అంతరించిపోయే జంతువుల జాబితాలో ఉన్న అడవి అలుగు (ఇండియన్ పాంగోలిన్)కు అంతర్జాతీయ మార్కెట్లో రూ.1.5 కోట్ల ధర ఉందన్న ప్రచారం అంతా అబద్ధమని అటవీశాఖ అధికారులు కొట్టిపారేశారు. కొందరు జంతు స్మగ్లర్లు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పుకార్లు పుట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని సూచించారు. అరుదైన ఈ జంతువును వేటాడినా, స్మగ్లింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

వేటగాళ్లకు ఆశచూపి..: భూపాలపల్లికి చెందిన చిదం రవి అనే వ్యక్తి ఇటీవల అడవి అలుగుకు అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.1.5 కోట్ల ధర పలుకుతుందని, చైనాలో మందుల తయారీలో దీని పెంకులు వాడుతారని ప్రచారం చేశాడు. అడవి అలుగును వేటాడి తీసుకొస్తే భారీగా డబ్బు ఇస్తానని భూపతిపూర్‌కు చెందిన కోరం నాగయ్య, కోరం పెంటయ్య, కోరం కృష్ణమూర్తి అనే వేటగాళ్లకు ఆశ చూపాడు. దీంతో భూపతిపూర్ అడవుల్లో ఆ జంతువును పట్టుకొన్న వారు.. రవికి అందజేశారు. ఈ నెల 20వ తేదీన దానిని భూపాలపల్లికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా.. ఏటూరునాగారం నార్త్ అటవీశాఖ అధికారులు పట్టుకొన్నారు. అడవి ఎలుగుతో చిదం రవి పట్టుబడ్డాడు.

జీవితకాలం 20 ఏళ్లు

అంతరించిపోతున్న అరుదైన జీవి ఇండియన్ పాంగోలిన్. దీని జీవితకాలం 20 ఏళ్లు. సింహం కూడా తినలేనంత గట్టిగా అలుగు పెంకులు ఉంటాయి. అత్యధిక వర్షపాతం, పురుగులు, చీమల పుట్టలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఇవి జీవిస్తుంటాయి. ఎడారి అడవుల్లోనూ ఉంటాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ జంతువు పెంకులను చైనాలో మందుల తయారీలో వాడుతారని స్మగ్లర్లు ప్రచారం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మధ్యవర్తులకు భారీ ధరకు విక్రయిస్తున్నారు.

అలుగు పెంకులు ఏ మందుల్లోనూ వాడరు



అడవి అలుగు పెంకులను ఎలాంటి మందుల తయారీకి వాడరు. అదంతా అపోహ మాత్రమే. స్మగ్లర్లు సొమ్ము చేసుకునేందుకే అమాయకులకు ఇలా మాయమాటలు చెబుతున్నారు.

- అబ్దుల్ రెహమాన్, సౌత్ రేంజ్ అధికారి, ఏటూరునాగారం.

సునామీలను గుర్తించడంలో ఇన్‌కాయిస్ పాత్ర కీలకం

కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్



దుండిగల్: సముద్ర గర్భంలో ఏర్పడే సునామీలని ముందస్తుగా గుర్తించడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేసి వారి ప్రాణాలను కాపాడటంలో ఇన్‌కాయిస్ కీలకపాత్ర పోషిస్తోందని కేంద్ర ఎర్త్ అండ్ సైన్స్ శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ అన్నారు. హిందూ మహాసముద్రంలో సునామీ వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మేడ్చల్ జిల్లా ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిస్‌లో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ప్రసంగించారు. ఇన్‌కాయిస్ చేస్తున్న సేవ భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న వికసిత్ భారత్–2047కు ఎంతగానో దోహదపడుతుందన్నారు. యునెస్కో– ఐవోసీ సర్టిఫికెట్‌ను మంత్రి ఒడిశా స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీకి అందజేశారు. ఇన్‌కాయిస్ నూతనంగా అందిస్తున్న అగ్నిపర్వతాల ద్వారా ఉత్పన్నమయ్యే సునామీలకు ప్రామాణిక ఆపరేటింగ్ విధాన సేవలను ప్రారంభించారు. అదే విధంగా ఇన్‌కాయిస్‌లో ఉన్న సినర్జిస్టిక్స్, అబ్జర్వేషన్స్, ప్రిడిక్షన్స్ అండ్ సర్వీసెస్ ప్రయోగశాలలను మంత్రి సందర్శించారు. కార్యక్రమంలో కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ సెన్స్ కార్యదర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్, ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎం. బాలకృష్ణన్ నాయర్, ఓఎస్‌డీఎంఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కమల్ లోచన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

నేను నిందితుడిని మాత్రమే: కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్



మణికొండ (హైదరాబాద్): 'నాపై వస్తున్న ఆరోపణల నుంచి నేను క్లీన్ చిట్‌గా బయటకు వస్తాను.. అప్పుడు ఏం జరిగిందనే విషయం నాకు, నా అంతరాత్మకు మాత్రమే తెలుసు.. న్యాయస్థానంపై నాకు నమ్మకం ఉంది' అని సినిమా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అన్నారు. జానీ మాస్టర్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్టు సెప్టెంబర్ 15న అతని సహాయకురాలు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో వారు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న అతన్ని అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. అక్టోబర్ 25న ఆయన చంచల్‌గూడ జైలు నుంచి విడుదల అయ్యారు. ఇటీవల అతనిపై నార్సింగి పోలీసులు చార్జిషీట్ వేశారని, అతను మహిళా కొరియోగ్రాఫర్‌ను అత్యాచారం చేసినట్టుగా కొన్ని మీడియాలలో వార్తలు రావటంతో జానీ సోషల్ మీడియాలో గురువారం స్పందించారు. అందులో తను ఎలాంటి తప్పు చేయలేదని, న్యాయస్థానంలో తను క్లీన్‌చిట్‌తో బయటకు వస్తానని అన్నారు. అయితే కోర్టులో చార్జిషీట్ వేసిన విషయాన్ని నార్సింగి పోలీసులు నిర్ధారించలేదు.

ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా సీహెచ్ శ్రీనివాసరావు



సాక్షి, హైదరాబాద్: రాజేంద్రనగర్‌లోని నార్మ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్ శ్రీనివాసరావు న్యూఢిల్లీలోని ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కృష్ణా జిల్లాకు చెందిన ఆయన గత ఎనిమిదేళ్లుగా రాజేంద్రనగర్‌లోని నార్మ్ డైరెక్టర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఐసీఏఆర్‌లో అంతర్భాగమైన ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. నార్మ్ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించే రామ సుబ్రహ్మణ్యం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా కొనసాగుతారని నార్మ్ ప్రజాసంబంధాల అధికారి గుత్తికొండ అనీజ ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణలో ముగిసిన ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ పర్యటన

ఎయిర్‌పోర్టులో గవర్నర్ జిష్ణుదేవ్ వీడ్కోలు



ఉపరాష్ట్రపతి దంపతులకు వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శంషాబాద్: తెలంగాణలో భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రెండు రోజుల పర్యటన ముగియడంతో గురువారం ఆయన ఇక్కడి నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి దంపతులకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రొటోకాల్ ముఖ్య కార్యదర్శి వెంకట్‌రావు, రాష్ట్ర డీజీపీ జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి వీడ్కోలు పలికారు. మంత్రి జూపల్లి ధన్‌ఖడ్‌ను శాలువాతో సత్కరించడంతోపాటు చార్మినార్ ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాజ్‌ను మించిన అయోధ్య

ఇప్పటివరకు పర్యాటకుల సంఖ్యలో అగ్రస్థానంలో ఉన్న ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను అయోధ్య రామ మందిరం వెనక్కి నెట్టి, మొదటి స్థానంలోకి వచ్చింది. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు అత్యధికంగా పర్యాటకులు సందర్శించిన నగరంగా అయోధ్య రికార్డులకు ఎక్కింది. ఈ 9 నెలల్లో ఆగ్రాను 12.51 కోట్ల మంది సందర్శించగా.. అయోధ్యను 13.55 కోట్ల మంది సందర్శించినట్లు పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ ఏడాది జనవరి 22న ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా అట్టహాసంగా ప్రారంభమై అయోధ్య రామ మందిరం దేశీయ ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా చేరింది. విదేశీయులు 3,153 మంది మాత్రమే అయోధ్య రామ మందిరాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక పర్యాటకంలో అయోధ్య దూసుకుపోతోందని ట్రావెల్ ప్లానర్స్ చెబుతున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకుల్లో 70 శాతం మంది రామమందిరం, సరయు నది అందాలను తిలకిస్తూ పరవశించిపోతున్నారని చెబుతున్నారు.

- సాక్షి, అమరావతి


పర్యాటకుల ఆకర్షణలో ఆగ్రాను అధిగమించిన అయోధ్య

- జనవరి నుంచి సెప్టెంబర్ వరకు అయోధ్యకు 13.55 కోట్ల మంది పర్యాటకులు
- తాజ్‌మహల్‌ను సందర్శించిన వారు 12.51 కోట్ల మంది
- అయోధ్యకు 3,153 మంది విదేశీయులు రాక
- తాజ్‌మహల్‌కు పెరిగిన విదేశీ పర్యాటకులు, తగ్గిన దేశీయ పర్యాటకులు
- అయోధ్య కంటే వారణాసి, మధురపై విదేశీయుల ఆసక్తి



ఆగ్రా తర్వాత వారణాసిపై విదేశీయుల ఆసక్తి

2024లో దేశీయ పర్యాటకుల ఆలోచన మారిందని, దేశంలో ఆధ్యాత్మిక పర్యాటకం వేగంగా అభివృద్ధి చెందుతోందని ట్రావెల్ ప్లానర్స్ తెలిపారు. గతేడాది ఉత్తరప్రదేశ్‌ను 48 కోట్ల మంది సందర్శిస్తే.. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికే 47.61 కోట్ల మంది వచ్చారని చెబుతున్నారు. అయోధ్య రామమందిరం వచ్చిన తర్వాత ఆగ్రాకు వచ్చే దేశీయ పర్యాటకుల సంఖ్య తగ్గింది. గతేడాదితో పోలిస్తే ఆగ్రాను సందర్శించిన దేశీయ పర్యాటకుల సంఖ్య ఈ ఏడాది 1.93 లక్షలు తగ్గింది. ఆగ్రా తర్వాత విదేశీయులు అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి, మధుర, ప్రయాగ్‌రాజ్‌లను సందర్శిస్తున్నారు. ఈ ఏడాది వారణాసిని 6.2 కోట్ల మంది దేశీయ పర్యాటకులు, 1.84 లక్షల మంది విదేశీ పర్యాటకులు సందర్శించారు. శ్రీకృష్ణుడి జన్మస్థలం మధురను మొత్తం 6.8 కోట్ల మంది సందర్శిస్తే.. అందులో 87,229 మంది విదేశీ పర్యాటకులున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



క్షీణిస్తున్న అడవులు..తగ్గుతున్న చెట్ల విస్తీర్ణం, పచ్చదనం

అంతరించేదశలో ఇండియన్ పంగోలిన్, మౌస్‌డీర్స్, గ్రేట్ ఇండియన్ బస్టర్డ్

బయోడైవర్సిటీ లాస్!

పక్షులు, జంతువుల సహజ ఆవాసాల తగ్గుదల... క్షీణిస్తున్న అడవులు, తగ్గుతున్న చెట్ల విస్తీర్ణం, పచ్చదనం... ఇంకా లోతుగా విశ్లేషిస్తే ప్రపంచవ్యాప్తంగా వేగంగా సంభవిస్తున్న వాతావరణ మార్పుల ప్రభావంతో జీవవైవిధ్యం దెబ్బతింటోంది. దీంతో వన్యప్రాణులు, పక్షి, జంతు, వృక్ష... ఇలా విభిన్న రకాల జాతులు క్రమంగా తగ్గిపోతున్నాయి. భారీ ప్రాజెక్టులు, అధిక విస్తీర్ణంలో వివిధరూపాల్లో పర్యావరణంపై, ఇతర రూపాల్లో ప్రభావం చూపేలా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అవసరానికి మించి సహజ వనరుల వినియోగం, గాలి, నీరు కాలుష్య బారినపడడం వంటి వాటి వల్ల జీవవైవిధ్యంపై ప్రభావం చూపడంతో పర్యావరణ వ్యవస్థలు దెబ్బతింటున్నాయని పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 'వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) లివింగ్ ప్లానెట్ రిపోర్ట్–2024'నివేదిక ప్రకారం చూస్తే... ప్రపంచవ్యాప్తంగా 50 ఏళ్లలో వన్యప్రాణుల జనాభా సగటు సైజ్ అనేది 73 శాతం మేర తగ్గిపోయింది. జూలాజిక్ సొసైటీ ఆఫ్ లండన్ (జెడ్ఎస్ఎల్) రూపొందించిన 'ద లివింగ్ ప్లానెట్ ఇండక్స్' నివేదికను గమనిస్తే...1970–2020 మధ్యలో వివిధ జంతు, పక్షు జాతుల్లో 85 శాతం ఫ్రెష్ వాటర్ పాపులేషన్, టెరస్ట్రియల్ పాపులేషన్ 69 శాతం, మెరైన్ పాపులేషన్ 56 శాతం తగ్గినట్టుగా తేలింది. జీవవైవిధ్యమనేది భూమి, విభిన్న రకాల మొక్కలు, వృక్షజాతులు, జంతు, పక్షి జాతులు, వివిధ రకాల సూక్ష్మజీవులు (మైక్రో ఆర్గనిజమ్స్) తదితరాలతో కూడుకుని ఉంటుంది.

– సాక్షి, హైదరాబాద్

తెలంగాణలో చూస్తే..

వివిధ రూపాల్లో వెల్లడైన వివరాలు, సమాచారం మేరకు చూస్తే తెలంగాణలో జీవవైవిధ్యానికి వాటిల్లిన నష్టానికి ప్రధానంగా అడవులకు వాటిల్లుతున్న నష్టం, తగ్గిపోతున్న అటవీ విస్తీర్ణం, అంతర్ గ్రహ మొక్కలు (ఇన్వెసివ్ ఎలియన్ స్పీషీస్) విపరీతంగా పెరుగుదల, మత్స్య రంగ అతి వినియోగం, కాలుష్య స్థాయిల పెరుగుదల, వాతావరణ మార్పులతో చోటుచేసుకుంటున్న పరిణామాలు వంటివి కారణమవుతున్నాయి.

- 2023 జూన్ గణాంకాల ప్రకారం తెలంగాణలో 2 వేల మొక్కలు, వృక్షాల రకాలు, 5,757 జంతురకాలు ఉన్నట్టుగా తేలింది. సాధారణంగా జెనిటిక్ డైవర్సిటీ, స్పీషీస్ డైవర్సిటీ, ఎకోసిస్టమ్ డైవర్సిటీల ద్వారా జీవ వైవిధ్యాన్ని పరిశీలిస్తారు.
- 2023లో తెలంగాణలో 646 హెక్టార్ల సహజ అటవీ ప్రాంతం కోల్పోవాల్సి వచ్చింది. ఇండియన్ పంగోలిన్, మౌస్‌డీర్స్, మలబార్ పైడ్ హార్న్‌బిల్, బ్లాక్‌నెక్డ్ స్టోర్క్, రుడ్డి మంగ్యూస్, గ్రేట్ ఇండియన్ బస్టర్డ్, సంద్‌కోల్ కార్ప్ వంటి జంతు, పక్షి రకాలు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. స్లోత్‌బేర్, ఇండియన్ బైసన్, ఇండియన్ స్కిమ్మర్ బర్డ్ జాతులు క్రమంగా తగ్గిపోతున్నాయి.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జీవవైవిధ్యం ఏ స్థాయిలో ఉంది, ఎదురవుతున్న సమస్యలు, అందుకు కారణాలు ఏమిటి? తదితర అంశాలపై పర్యావరణ విశ్లేషకులు, పబ్లిక్ పాలసీ అనలిస్ట్ డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా స్టేట్ డైరెక్టర్ ఫరీదా తంపాల్ తమ అభిప్రాయాలు, విశ్లేషణలను 'సాక్షి'తో పంచుకున్నారు. ముఖ్యాంశాలు వారి మాటల్లోనే...

రాష్ట్రంలో దిగజారుతున్న జీవ వైవిధ్యం

కొంతకాలంగా రాష్ట్రంలో జీవవైవిధ్యం అనేది దిగజారుతోంది. అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. కొన్ని చెట్లు, మొక్కల రకాలు కూడా అంతరిస్తున్నాయి. ఊర పిచ్చుకలు, బోరుగ పిచ్చుకలు దాదాపుగా కనబడకుండాపోగా, కాకులు, ఇతర పక్షుల సంఖ్య కూడా క్షీణిస్తోంది. కప్పలు, కొన్నిరకాల చేపలు కూడా తగ్గిపోతున్నాయి. అడవుల తగ్గుదల ప్రభావం, చెట్లు, పచ్చదనం తగ్గిపోవడం వంటి కారణాల వల్ల జంతువులు, పక్షుల ఆవాసాలు, నివసించే ప్రదేశాలు కుచించుకుపోతున్నాయి. వాటికి సరైన ఆహారం దొరకడం లేదు. పక్షులు, ఇతర జంతువులు తాగేనీరే తక్కువ కాగా, అది అంతగా లభించడం లేదు. నగరం, పట్టణాల చుట్టుపక్కల పైపులైన్లతోనే ఇళ్లకు నీటి సరఫరా, ఉపరితలంపై ఉన్న నీరు కలుషితం కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పక్షులు, జంతువులు వంటి వాటికి నీరు, ఆహారం దొరక్క ఆవాస ప్రాంతాలు, గుడ్లు, సంతానం పెంపొందించుకునే అవకాశం లేకపోవడంతో పక్షి, జంతుజాతులు తగ్గిపోతున్నాయి. ప్రధానంగా అభివృద్ధి పేరిట విచ్చలవిడిగా ప్రాజెక్టులు, ఇతర రూపాల్లో నిర్మాణాలు పెరిగిపోవడం, అవసరానికి మించి సహజవనరుల అతి వినియోగం, గణనీయంగా పెరిగిన రోడ్ల విస్తరణ, వాహనాల రాకపోకలు పెరగడం, ఆన్‌రోడ్డు వెహికిల్సే కాకుండా ఇసుక, మైనింగ్, ఇతర అవసరాల కోసం నీరు, ఇతర ప్రదేశాల్లోకి వాహనాల ప్రవేశం నష్టం చేస్తోంది. 2012లో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ కాప్ సదస్సు తర్వాత జీవవైవిధ్య పరిరక్షణ, అటవీ సంరక్షణ చట్టాలను నీరుగార్చారు. పిచ్చుకలు, ఇతర తగ్గిపోతున్న పక్షి, జంతుజాతులను ఎలా సంరక్షించాలనే దానిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

- డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి, పర్యావరణరంగ విశ్లేషకులు, పబ్లిక్ పాలసీ అనలిస్ట్

గ్రీన్‌కవర్ పెంచడమే బయో డైవర్సిటీ కాదు

జీవవైవిధ్యం అంటే ఏమిటనేది అందరూ అర్థం చేసుకోవాలి. కేవలం గ్రీన్‌కవర్ పెంచడమే బయో డైవర్సిటీ కాదు అని గుర్తించాలి. విధాన నిర్ణేతలు, ప్రజాప్రతినిధులు కూడా గడ్డిభూములు, బీడుభూములు వంటివి కూడా పర్యావరణవ్యవస్థల పరిధిలోకి వస్తాయని గుర్తించాలి. చెట్లు అనేవి జీవవైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని మనమంతా గుర్తించాలి. భారీ ప్రాజెక్టులు, అధిక విస్తీర్ణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల వల్ల పెద్దసంఖ్యలో చెట్ల తొలగింపు, గ్రీన్‌కవర్ తగ్గినప్పుడు జీవవైవిధ్యానికి నష్టం జరుగుతుంది. నగరాల్లోనూ రోడ్ల విస్తరణ, నిర్మాణపరమైన ప్రాజెక్టులు మొదలుపెట్టినప్పుడు వెంటనే ట్రీకవర్ తగ్గిపోయిన ప్రభావం తప్పకుండా జీవవైవిధ్యంపై పడుతుంది. పచ్చదనం పెంచేందుకు చేపట్టే కార్యక్రమాల సందర్భంగా గడ్డి మైదానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఈ విషయంపై తెలంగాణలో పెద్దగా దృష్టి సారిస్తున్న పరిస్థితులు అంతగా కనిపించడం లేదు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో తగినంత స్థాయిలో గడ్డిమైదాన ప్రాంతాలున్నాయి. వాటిని యుద్ధప్రాతిపదికన సంరక్షించాలి. అమ్రాబాద్, కవ్వాల్ పులుల అభయారణ్యాల్లో మంచి స్థాయిలో జీవవైవిధ్యమనేది అలరారుతోంది. ఇదే పద్ధతిలో రాష్ట్రంలోని జాతీయపార్కులు, శాంక్చురీలలోనూ జీవవైవిధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్‌లో దాదాపు పది, పన్నెండేళ్ల క్రితం నిర్వహించిన కాప్ సదస్సు తర్వాత జీవవైవిధ్యం కొంతమేర మెరుగైంది. రాష్ట్రంలో ఎంత మేర జీవవైవిధ్యాన్ని నష్టం జరిగింది, ఏ ఏ పక్షి, చెట్లు, జంతువుల రకాలు తగ్గిపోయాయనే దానిపై పూర్తిస్థాయిలో శాస్త్రీయ పరిశీలన, అధ్యయనమేదీ జరగలేదు. అందువల్ల ఎంతమేర నష్టం జరిగింది, ఏఏ జాతులు కనుమరుగు అవుతున్నాయనే దానిపై సాధికారికంగా వ్యాఖ్యానించేందుకు అవకాశం లేదు.

–ఫరీదా తంపాల్, స్టేట్ డైరెక్టర్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఫర్ నేచర్–ఇండియా

ఏకచక్రపురం.. నవనాథపురం

ఘనచరిత్రను ఇముడ్చుకున్న ఇందూరు చుట్టుపక్కల ప్రాంతాలు

పౌరాణిక ప్రాశస్త్యం, చారిత్రక నేపథ్యంతో బోధన్‌గా రూపాంతరం చెందిన ఏకచక్రపురం

నవసిద్ధుల నేపథ్యం నుంచి ఆర్మూర్‌గా మారిన నవనాథపురం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అశ్మక రాష్ట్రంగా ప్రస్థానాన్ని ప్రారంభించి.. ఇందూరు వరకు నామాంతరం చెందిన నిజామాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలు పౌరాణిక, ప్రాచీన చారిత్రక నేపథ్యాన్ని ఇముడ్చుకున్నాయి. మంజీర, గోదావరి పరీవాహకంలో ఉండి ప్రాచీన కాలంలో ఏకచక్రపురంగా, బహుధాన్యపురంగా విరజిల్లి, ప్రస్తుతం సాధారణ పట్టణంగా ఉన్న బోధన్ ఎనలేని ప్రాచీన చరిత్రను కలిగి ఉంది. అయితే దీని చరిత్ర నిరంతరం బయటపడుతూనే ఉంది. తవ్వకాలు చేయడంలో నిర్లక్ష్యం కారణంగా దీని చరిత్ర ఆశించిన స్థాయిలో వెలుగు చూడటం లేదనేది చరిత్రకారుల అభిప్రాయం. ఇక్కడ ఎన్ని తవ్వకాలు జరిపితే అంత చరిత్ర బయటపడే అవకాశముంది. ఈ విషయంలో పాలకులు అంతగా దృష్టి సారించకపోవడంతో.. పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల ఘనమైన చరిత్ర బయటకు రావడం లేదని పలువురి వాదన. పౌరాణిక నేపథ్యం ప్రకారం ఈ ప్రాంతాన్ని పరశురాముడు తన చక్రంతో రక్షించడంతో పాటు చక్రతీర్థమనే చెరువును నిర్మించడంతో ఏకచక్రపురంగా పేరుపొందినట్లు పలువురు చెబుతున్నారు. పౌరాణిక సాహిత్యంలో, జైన సాహిత్యంలో, బౌద్ధ సాహిత్యంలో బోధన్ ప్రాశస్త్యం ఉంది. మహాభారతంలో వసుమతి, పద్మపురం నామాలతో, జైన సాహిత్యంలో పోదనపురం నామంతో, బౌద్ధ సాహిత్యంలో పోదన నామంతో పేరొందింది. ఇక ప్రాచీన, మధ్యయుగాల్లో ఈ ప్రాంతం ధన సంపదలతో తులతూగడంతో.. బహుధాన్యపురం పేరుతో పిలిచినట్లు చరిత్ర చెబుతోంది. గొప్ప వర్తక కేంద్రంగా వర్ధిల్లినట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి అనేక శాసనాలు, పాత్రలు, శిల్పాలు, నాణేలు లభించాయి.




బోధన్‌లో శిథిలమైన ఇంద్రనారాయణ ఆలయం

అశ్మకుడనే రాజు పాలనలో..

ఈ ప్రాంతాన్ని అశ్మకుడనే రాజు పరిపాలించినట్లు మహాభారతంలో ప్రస్తావన ఉందని పలువురు చెబుతున్నారు. ఇక ఈ ప్రాంతాన్ని శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, వాకాటకులు, బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, కాకతీయులు, విజయనగర రాజులు, మరాఠా రాజులు, బహమనీ సుల్తానులు, గోల్కొండ రాజులు, మొఘలులు పరిపాలించారు. ఏకచక్రపురంగా, బహుధాన్యపురంగా చాలాకాలం పేరొందిన ఈ పట్టణం ప్రస్తుతం బోధన్ పేరుతో స్థిరపడింది. ఈ ప్రాంతం గురించి ఎంత శోధిస్తే అంత చరిత్ర బయటపడే అవకాశముందని చరిత్రకారులు స్పష్టం చేస్తున్నారు.

నాటి నవనాథపురం.. నేటి ఆర్మూర్



ఆర్మూర్ సిద్ధులగుట్ట

ప్రస్తుతం పసుపు పంట అత్యధికంగా పండించే ప్రాంతంగా ఉన్న ఆర్మూర్ ప్రాంతం సైతం ఘనమైన చరిత్రను కలిగి ఉంది. నవనాథపురంగా ప్రసిద్ధి చెందిన ఈ పట్టణం.. నేడు ఆర్మూర్ నామాంతరంతో స్థిరపడింది. ఆర్మూర్ పట్టణానికి దక్షిణ నైరుతి భాగంలో కొన్ని కిలోమీటర్ల మేర సిద్ధులగుట్ట విస్తరించి ఉంది. ఈ గుట్టపై నవనాథ సిద్ధులు తపస్సు చేశారు. దీంతో గుట్ట చుట్టూ ఉన్న ప్రాంతానికి నవనాథపురంగా పేరు వచ్చింది. కాలక్రమంలో నవనాథపురం నుంచి ఆర్మూర్‌గా నామాంతరం చెందింది. వందల ఏళ్ల క్రితం దేశం నలుమూలల నుంచి నవనాథులైన గోరఖ్‌నాథ్, జలంధర్‌నా, చరఫట్‌నా, అపభంగనా, కానీషనా, మఛీంద్రనాథ్, చౌరంగీనాథ్ రేవనా, బర్తరినాథ్ తదితరులు ఇక్కడికి వచ్చారు. నల్లని రాళ్ల పేర్చినట్లున్న ఈ గుట్టపైనఒక ఇరుకైన గుహలో తమ ఇష్టదైవమైన సిద్ధేశ్వరుడిని ప్రతిష్ఠించి పూజలు చేశారని ప్రతీతి. వారి పేరిట గుట్టకు నవనాథ సిద్ధుల గుట్టగా పేరు వచ్చింది. దీంతో గుట్టను ఆనుకున్న గ్రామానికి నవనాథపురంగా నామకరణం చేసుకున్నారు. కాలక్రమంలో ఈ తొమ్మిది మంది సాధువుల్లో ఆరుగురు ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. మిగిలిన ముగ్గురు సాధువులు ఇక్కడే ఉండి పూజలు చేయడంతో ఆరు.. మూరు.. అంటూ కాలక్రమంలో ఆర్మూర్‌గా పేరు స్థిరపడింది. మరికొందరు చరిత్రకారులు ఆర్మూర్ అనే పదం.. ఆరావం అనే పదం నుంచి వచ్చిందని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సిద్ధుల గుట్ట ఆధ్యాత్మికతకు చిరునామాగా మారింది.

పొలాల్లో వానర దండు



సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ శివారులోని పొలాల్లో వందలాది వానరాలు తిష్టవేశాయి. చాలా సేపటికి కోతుల దండు పంటపొలాల నుంచి దుబ్బాక పట్టణంలోకి రోడ్డుపై వెళ్తుండగా వాహనాలు నిలిచిపోయాయి. కోతులు పెద్ద సంఖ్యలో ఇళ్లపై తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

- దుబ్బాక

చుట్టూ పచ్చదనం.. పల్లెటూరు రమణీయం

చుట్టూ పచ్చదనం.. మధ్యలో పల్లెటూరు.. ప్రకృతి రమణీయ దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది. నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని పెద్దగుట్ట (దర్గా) కింద ఏర్పడిన ఈ గ్రామాన్ని పెద్దగుట్ట గ్రామంగా పిలుస్తారు. చుట్టూ దట్టమైన అడవి ఉంది. పెద్దగుట్టకు వెళ్లే భక్తులు ఇక్కడి ప్రకృతిని ఆస్వాదిస్తారు.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



మంచు కురిసింది.. కొండ మురిసింది.!

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సరికొత్త ప్రకృతి అందాలను సంతరించుకుంది. నింగినుంచి మేఘాలు కొండపైకి దిగి కమ్ముకోవడం, చలి పెరగడం సహజంగా సందర్శకులు ఆస్వాదిస్తుంటారు. అయితే ఇటీవల దీనికి భిన్నంగా ప్రకృతి పులకించింది. తెల్లవారుజాము నుంచి దట్టమైన మేఘాలు నింగిని వీడి కొండను కౌగిలించుకున్నట్టుగా అతుక్కుపోతున్నాయి. ఆ మేఘాల నుంచి తుంపర్లు లాంటి జల్లులు పడుతుంటే ప్రకృతికి కొత్త అందాలు అద్దినట్టుగా పరవశిస్తోంది. పగలే చీకటిగా మారిపోవడంతో అతిథి గృహాల వద్ద లైట్లు వెలిగించారు. – బి.కొత్తకోట


గాలిబండను కమ్మేసిన దట్టమైన మేఘాలు


మంచు జల్లులకు తడవకుండా గొడుగులతో సంచరిస్తున్న పర్యాటకులు


అటవీశాఖ అతిథి గృహంపై పగలే లైట్లు

‘చిల్లర’ కనుమరుగు..!



ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సు ఉన్న వారికి పరక, అణ, బేడ, కానీల మనుగడ తెలుసు. అణా అంటే ఆరుపైసలు. బేడ అంటే 12 పైసలు లెక్క పెట్టేవారు. ఏవైనా వస్తువులు కొనుగోలు చేసేందుకు షావుకారు వద్దకు వెళ్తే పరక, అణ, బేడ అని వస్తువుల ధరలు చెప్పేవారు. ఆ ప్రకారం చిల్లర నాణాలను వారికి ఇచ్చి వస్తువులను కొనుగోలుచేసేవారు. ప్రస్తుతం 45 ఏళ్ల వయస్సు వారికి ఐదు, పది, 20 పైసలు, పావ లా, అర్ధరూపాయి కాయిన్‌ల చలామణి తెలుసు. రూపాయి చిల్లర మార్చితే చేతినిండా కాయిన్‌లు వచ్చేవి. ఇప్పటి వారికి ఆ పైసలు సంగతే తెలియదు. డిజిటల్ యుగం వచ్చాక ఆన్‌లైన్ చెల్లింపులతో చిల్లర సమస్య లేకుండా పోతోంది. ‘చిల్లర’ వ్యవహారాలు క్రమేపీ తగ్గిపోతున్నాయి.

– బలిజిపేట

క్లుప్తంగా...

ఆటో నుంచి జారిపడి విద్యార్థి దుర్మరణం



చీపురుపల్లి: విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామానికి చెందిన చిన్నారి గూనాన భార్గవ సాయి (9) ఆటోపై నుంచి జారిపడి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భార్గవసాయి చీపురుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే గురువారం ఉదయం గ్రామానికి చెందిన ఆటోలో చెల్లి సుష్మప్రియతో కలిసి పాఠశాలకు బయిలుదేరాడు. వీరిద్దరినీ తండ్రి ఈశ్వరరావు దగ్గరుండి ఆటో ఎక్కించాడు. మెట్టపల్లి నుంచి బయలుదేరిన 15 నిమిషాల్లోనే అలజంగి సమీపంలోని మలుపు వద్ద ఆటోలో ఉన్న భార్గవసాయి ప్రమాదవశాత్తూ ఆటో నుంచి జారి పడ్డాడు. ఆటో డ్రైవర్ గమనించే లోపే భార్గవసాయి తలపైనుంచి ఆటో వెనుక చక్రం వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు ఈశ్వరరావు, గౌరి బోరున విలపించారు.

పర్యాటకానికి ప్రాధాన్యత రంగం హోదా ఇవ్వండి
ఆర్‌బీఐనీ కోరిన ఏపీ చాంబర్స్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్న వికసిత్ భారత్ – 2047 లక్ష్యాలు చేరుకోవడంలో కీలకపాత్ర పోషించే పర్యాటక రంగానికి ప్రాధాన్యత రంగం హోదా ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఏపీ చాంబర్స్ కోరింది. ఆ హోదా కింద బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం ద్వారా అత్యధిక మందికి ఉపాధి కల్పించేలా పర్యాటక రంగం పరుగులు పెడుతుందని, తద్వారా దేశ స్థూల ఉత్పత్తి పెరగడంతో పాటు విదేశీ మారక నిల్వలు పెరుగుతాయని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు పేర్కొన్నారు. తద్వారా పర్యాటక రంగం ద్వారా సుస్థిరాభివృద్ధిలో పాలు పంచుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.

మైనర్ మీడియం స్కూల్ కాంప్లెక్స్‌లు కొనసాగించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మైనర్ మీడియం (ఒరియా, తమిళం, కన్నడ, ఉర్దూ) స్కూల్ కాంప్లెక్స్‌లను కొనసాగించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు గురువారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటి దాకా ప్రత్యేకంగా మైనర్ మీడియం ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్‌లను రద్దు చేసి పునర్వ్యవస్థీకరణలో భాగంగా మైనర్ మీడియం ఉపాధ్యాయులను వివిధ తెలుగు స్కూల్ కాంప్లెక్స్‌ల్లో విలీనం చేయడంపై మైనర్ మీడియం ఉపాధ్యాయులు ఆందోళన చేందుతున్నారన్నారు. మైనర్ మీడియంలో ప్రథమ భాషతో పాటు ఇతర సబ్జెక్టులు అవే మాధ్యమంలో బోధిస్తారని, వారిని తెలుగు మాధ్యమం కాంప్లెక్స్‌ల్లో విలీనం చేస్తే నిర్దుష్టమైన విద్యా లక్ష్యాలు నెరవేరవని తెలిపారు.

మెడికల్ పీజీ ఇన్ సర్వీస్ కోటా షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: మెడికల్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం షెడ్యూల్ ప్రకటించింది. ఇన్ సర్వీస్ అభ్యర్థులు కాంపీటెంట్ కోటా కింద ఈనెల 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్టీఆర్, తిరుపతి స్విమ్స్ యూనివర్సిటీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, నాన్–మైనారిటీ, మైనారిటీ వైద్య కళాశాలల్లో ఉన్న సీట్లకు 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు ప్రకటించారు.

జాతీయ పోటీలకు 18 మంది విద్యార్థులు

సాక్షి, అమరావతి: జనవరి ఒకటి నుంచి 8 వరకు భోపాల్‌లో జరిగే జాతీయ కళా ఉత్సవ్–2024–25కు రాష్ట్రం నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 8, 9 తేదీల్లో విజయవాడలో వివిధ జిల్లాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. గాత్రం, వాద్యం, నాట్యం, డ్రామా, సంప్రదాయ కథ, 2డీ, 3డీ, బొమ్మల తయారీ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో ఉత్తమంగా నిలిచిన 18 మందిని భోపాల్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్టు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి తెలిపారు.

ఇదెక్కడి న్యాయం!



- ఇంట్లో సామగ్రి బయటపడేసి నడి వీధిలోకి గెంటేసిన వారివైపే పోలీస్ మొగ్గు
- అధికార పార్టీ నేతలు చెబితేనే కేసులు
- లేకపోతే ఎఫ్ఐఆర్ కూడా కట్టని పోలీసులు
- 3 నెలల క్రితం మాజీ మంత్రి విడదల రజిని ఫిర్యాదు
- ఈ నెలలో ఐదు ఫిర్యాదులు చేసిన మాజీ మంత్రి అంబటి
- కేసులు నమోదు చేయని పట్టాభిపురం పోలీసులు
- ప్రశ్నించిన నేతలపై ఎదురు కేసులు
- టీడీపీ నేతల చేతుల్లో పోలీసుల బందీ

బాధితులపైనా అవే సెక్షన్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. నేరం చేసిన వారిపైన, బాధితులపైన ఒకే తరహా కేసులు నమోదు చేయడం పట్టాభిపురం పోలీసులకే చెల్లింది. పట్టపగలు 50 మంది ఓ ఇంటిపై దాడిచేసి ఇంట్లోని సామగ్రి బయటపడేసి ఓ కుటుంబాన్ని రోడ్డుపాలు చేసి ఆ ఇంటిని ఆక్రమించుకుంటే.. పోలీసులు మొక్కుబడిగా ఇంట్లోకి అక్రమ ప్రవేశం, గాయపరచడం, నేరపూరిత బెదిరింపు వంటి బెయిలబుల్ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. బాధితులపై కూడా ఇదే సెక్షన్లు పెట్టి ×సమ×న్యాయం చూపించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌పరిధిలోని సాయిబాబా రోడ్డు శాంతినగర్ 2వ లైన్‌లో నగర డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ తాడికొండ ఇన్‌చార్జి వనమాల వజ్రబాబు (డైమండ్ బాబు) సోదరి వజ్రకుమారి ఇంట్లోకి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌కిరణ్ ఆదివారం మధ్యాహ్నం సుమారు 50 మంది అనుచరులతో దౌర్జన్యంగా ప్రవేశించిన విషయం విదితమే. వజ్రకుమారి ఇంట్లోని సామగ్రిని బయటపడేయడంతో పాటు ఆ ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళతోపాటు, పసిపిల్లలను కూడా బయటకు తోసేశారు. ఆ తరువాత టీడీపీ నేతలు, వారివెంట వచ్చిన అనుచరులు ఆ ఇంట్లోకి వెళ్లి తాళాలు వేసుకున్నారు. ఈ స్థలం విషయంలో 1978 నుంచి ఇరువురి మధ్య వివాదం నడుస్తోంది. స్వాధీనం అగ్రిమెంట్‌పై అమ్మిన వ్యక్తి, తర్వాత రేటు పెరిగిందని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో కొన్నేళ్లుగా కోర్టులలో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. ఈ వ్యవహారంతో ఏ మాత్రం సంబంధం లేని టీడీపీ నేత దౌర్జన్యానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న డైమండ్‌బాబు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేసి సాయంత్రం 4 నుంచి 6గంటల వరకూ ఉన్నా కింది స్థాయి సిబ్బందిని పంపిన సీఐ మాత్రం ఘటనా స్థలానికి రాలేదు. డైమండ్‌బాబు ఘటనా స్థలానికి వచ్చిన తర్వాత అక్కడికి చేరుకున్న సీఐ వీరేంద్రబాబు టీడీపీ నాయకులకు వత్తాసు పలికారు. దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టి డైమండ్‌బాబును బలవంతంగా పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. అయితే, విజయ్‌కిరణ్ స్టేషన్‌లో తమ అదుపులో ఉన్నాడని, ఇంట్లో ఉన్నవారిని రెవెన్యూ అధికారుల సమక్షంలో బయటకు పిలిపిస్తామని సీఐ మీడియాతో చెప్పారు. అయితే.. విజయ్‌కిరణ్ అ సమయంలో ఘటనా స్థలంలోనే ఉండటం గమనార్హం. ముందుగా పోలీసులతో మాట్లాడుకున్న తర్వాతే విజయ్‌కిరణ్ ఈ దౌర్జన్యానికి పాల్పడినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.

సోషల్ మీడియా కేసుల్లోనూ ఇదే తీరు

సోషల్ మీడియాలో పోస్టుల విషయంలో కూడా పట్టాభిపురం పోలీసులు వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. వైఎస్సార్‌సీపీ నేతలైతే ఒక లెక్క.. అధికార పార్టీ నేతలైతే మరో లెక్క అన్నట్టుగా పోలీసుల వ్యవహారశైలి ఉంది. టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసారని 2018లో పోస్ట్ చేసిన వారిని ఒకే కేసులో ఒకే విషయంపై పలుచోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతున్నారు.

ఐ–టీడీపీ పోస్టులపై స్పందించని పోలీసులు

మాజీ మంత్రులు విడదల రజిని, మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఆయన సతీమణి, కుమార్తెలపై ఐ–టీడీపీ సోషల్ మీడియాలో అత్యంత దారుణంగా పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదు చేసినా పోలీసులు బుట్టదాఖలా చేస్తున్నారు. విడదల రజిని జిల్లా ఎస్పీతో పాటు డీజీపీకి ఫిర్యాదు చేసి 55 రోజులైనా ఇప్పటివరకూ కేసు కూడా నమోదు చేయలేదు. మరో మాజీ మంత్రి అంబటి రాంబాబు నవంబర్ 19న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, తన కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలంతో ఐ–టీడీపీ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ ఆధారాలతో సహా ఐదు అంశాలపై పట్టాభిపురం పోలీసు స్టేషన్‌తో పాటు జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదులు ఇచ్చారు. ఈ ఫిర్యాదుల గురించి ఆయనే స్వయంగా పట్టాభిపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన ఫిర్యాదు ఎక్కడివరకు వచ్చిందని అడిగినా పోలీసుల నుంచి సమాధానం రాని పరిస్థితి ఉంది. దీంతో గడచిన మంగళవారం అయన పట్టాభిపురం స్టేషన్‌కు వెళ్లి అక్కడ సరైన సమాధానం రాకపోవడంతో స్టేషన్ ఎదుట భైఠాయించాల్సి వచ్చింది. వైఎస్సార్‌సీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేయని పోలీసులు స్టేషన్ ముందు నిరసన తెలిపిన నేతలపై మళ్లీ ఎదురు కేసు నమోదు చేశారు. తాజాగా డైమండ్‌బాబు విషయంలో కూడా ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడి ప్రమేయంతో స్థానిక సీఐ వారికి అండగా నిలబడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సీఐ వ్యవహార శైలిపై జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేసేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు సన్నద్ధం అవుతున్నారు.

సై బర్.. రన్..!



పెరుగుతున్న సాంకేతికతతో పాటు సైబర్ నేరాలు సైతం పెచ్చుమీరుతున్నాయి. రోజుకొక మోసంతో కేటుగాళ్లు కోట్లలో కొల్లగొడుతున్నారు. ఒకరికి ఒకరు కనిపించకుండా, ముఖ పరిచయం లేకపోయినా లింక్ సిస్టమ్‌లా వీళ్లు పనిచేస్తున్నారు. సామాన్యుల నుంచి సంపన్న వర్గాలు, యువతీ, యువకుల నుంచి వృద్ధుల వరకు అమాయక ప్రజలంతా వీరి బాధితులే. సెల్‌లో లింకే కదా అని క్లిక్ చేస్తే మిమ్మల్ని బుక్ చేస్తారు. ఇలాంటి మోసాలతో రూ.లక్షలు పోగొట్టుకుని పరువు సమస్యతో పోలీసులకు ఫిర్యాదులివ్వలేక అనేకమంది సతమతం అవుతున్నారు. ఈ సైబర్ నేరాలపై అవగాహనకు శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. – శ్రీకాకుళం క్రైమ్

- పెరుగుతున్న సైబర్ నేరాలు
- వెలుగులోకి రోజుకొక సరికొత్త మోసం
- కేవైసీ లింక్‌తో దోచేస్తారు
- అందాలను ఎరవేస్తారు

• క్లిక్ చేస్తే బుక్ చేస్తారు

అందమైన వల.. చిక్కారో విలవిల

మనుషులను కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేసే పద్ధతి ఎక్స్‌టార్షన్. అలాగే అందమైన అమ్మాయిలను ఎరవేసి, తర్వాత బెదిరించి డబ్బులు దోచుకోవడం సెక్స్‌టార్షన్. వాట్సాప్, ఫేస్‌బుక్, టిండర్ (డేటింగ్ యాప్), ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియా యాప్‌ల ద్వారా మనలో ఉండే బలహీనతలను క్యాష్ చేసుకుని సైబర్ నేరగాళ్లు సెక్స్‌టార్షన్ పద్ధతిలో మోసాలు చేస్తుంటారు. వీరు బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి నెట్‌వర్క్ నడుపుతున్నట్లు దర్యాప్తు విభాగాలు చెబుతున్నాయి. సంపన్న వర్గాలకు చెందిన వృద్ధులు, యువత అధికంగా ఈ మాయలో పడుతుండటం విశేషం. వీరితో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయవేత్తలు సైతం వందల సంఖ్యలో మోసపోతున్నారు.

ఎలా చేస్తారంటే..

సైబర్ కేటుగాళ్లు అమ్మాయి పేరుతో ఉన్న నకిలీ ఫేస్‌బుక్ (ఇతర యాప్స్) ఐడీని క్రియేట్ చేసి సెలెక్ట్ చేసుకున్న వ్యక్తికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడతారు. యాక్సెప్ట్ చేయగానే ముందుగా చాటింగ్.. అలా నంబర్లు ఇచ్చిపుచ్చుకోవడం.. ఆ తర్వాత వాట్సాప్‌లో వ్యక్తిగత సమాచారం (వ్యక్తిది) తెలుసుకుని అడల్ట్ కంటెంట్, న్యూడ్ చాట్ చేసుకునేవరకు కథ తీసుకెళ్తారు. అనంతరం చాట్ నుంచి వీడియో కాల్స్‌లోకి లాగి అవతలివైపు నుంచి రికార్డ్ చేసిన ఓ న్యూడ్ వీడియోను వాట్సాప్ కాల్‌లో లైవ్‌లాగా చిత్రీకరించి ఎదుటి వ్యక్తిని న్యూడ్‌చాట్‌లోకి తీసుకొస్తారు. వెంటనే మొత్తం కాల్ రికార్డ్ చేసి అదే వ్యక్తి వాట్సాప్‌కు వీడియోను షేర్ చేసి డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేస్తారు. లేదంటే యూట్యూబ్‌లో పెడతామని బెదిరిస్తారు.


అప్రమత్తతే ఆయుధం

- సైబర్ మోసానికి గురయ్యేవారు గోల్డెన్ అవర్‌లో తక్షణమే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.
- www.cybercrime.gov.in పోర్టల్‌లో ఆన్‌లైన్ ఫిర్యాదివ్వాలి. సంబంధిత బ్యాంకు ప్రతినిధులను సంప్రదించి ఖాతాలను ఫ్రీజ్ చేయించాలి. పరిధి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి.
- ఎవరైనా బ్యాంకులో మ్యూల్ ఖాతా తమకు తెలియకుండా వేరే వ్యక్తులు తెరవాలనుకుంటే వెంటనే 1930 సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలి. అంతేకాక ఆర్టీజీఎస్ ద్వారా రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తాన్ని సేవింగ్స్ అకౌంట్ నుంచి కరెంట్ అకౌంట్‌కు బదిలీ చేస్తే ఖాతాదారులను అప్రమత్తం చేయాలి.

ఈ మోసాలు పరిశీలిస్తే..

- శ్రీకాకుళం జిల్లాలో ఓ ప్రముఖ కుటుంబానికి చెందిన వ్యక్తి తనకున్న బలహీనతతో ఫేస్‌బుక్‌లో అమ్మా యి పరిచయం కాగానే మాటామాటా కలిపాడు. ఆమె కూడా వీడియో కాల్ మాట్లాడటం, న్యూడ్ గా కనిపించడంతో తనూ న్యూడ్‌గా మారి కొంతకాలం ఆనందం పొందాడు. అక్కడికి కొద్దిరోజులకు ఆ అమ్మాయి న్యూడ్ వీడియోలు బయటపెడతానంటూ భయపెట్టి రూ.5 లక్షలు కావా లని బ్లాక్ మెయిల్ చేసింది. బయట తెలిస్తే పరు వు పోతుందని చేసేదేమీలేక డబ్బులు వేసేశాడు.
- జిల్లాలోని ఒక ప్రముఖ వైద్యుడు తెలియని లింక్ క్లిక్ చేయడంతో హాయ్ అని ఓ అమ్మాయి వాట్సాప్ మెసేజ్ పెట్టింది. రిప్లయ్ ఇవ్వడంతో న్యూడ్ వీడియో కాల్స్ తరచూ చేసేది. అక్కడికి కొద్దిరోజులకు వీడియోలు బయటపెడతామంటూ, డిజిటల్ అరెస్టు అవుతావంటూ ఢిల్లీ పోలీస్ సెటప్‌తో కొందరు వ్యక్తులు స్కైప్‌కాల్‌లో దర్శనమవ్వడంతో వాళ్లడిగిన రూ.18.50 లక్షలు చదివించేశారు.
- శ్రీకాకుళం రూరల్ మండలంలో సంపన్న వర్గానికి చెందిన ఓ వృద్ధుడు అశ్లీల వీడియోలు చూసే అలవాటుండడంతో అందులో ఓ మెసేజ్ రావడంతో ఆన్సర్ చేశాడు. ఓ ఇద్దరు యువతుల ముఖాలతో ఉన్న పురుషులు వీడియో కాల్‌లో కనిపించి వృద్ధునికి మత్తెక్కే మాటలతో మైమరిపించగా వృద్ధుడు న్యూడ్‌గా మారాడు. తక్షణమే ఆ వీడియోలు వృద్ధునికి పంపించి రూ.10 లక్షలు డిమాండ్ చేయగా. రూ.6 లక్షల వరకు సమర్పించేశాడు.
- ఇదే తరహాలో ఏఐ సాయంతో జిల్లాలో ఓ మహిళా అధికారికి మోసం చేసే క్రమంలో ఆమె అప్రమత్తం అవ్వడంతో త్రుటిలో సైబర్ ఉచ్చునుంచి తప్పించుకున్నారు.

జాగ్రత్తగా ఉండాలి



ఏ బ్యాంకు కూడా ఆన్‌లైన్ కేవైసీ వివరాలు అడగదు. అపరిచితులు పంపే లింక్‌లు ఓపెన్ చేయరాదు. వాళ్లు మన ఫోన్‌ను హ్యాక్ చేసే సమయంలో మన అకౌంట్‌లో డబ్బులు ఎంత ఉంటే అంత మాయం చేస్తారు. డబ్బులు లేకపోతే ఏమీ చేయలేరు. ఎప్పటికప్పుడు మన ఖాతాను పరిశీలిస్తుండాలి. సెక్స్‌టార్షన్‌కు గురయ్యేవారు తామేదో తప్పు చేసినట్లు భావించి భయపడి పరువు సమస్యతో ఫిర్యాదు చేయకపోతే సైబర్ నేరగాళ్లకు మీరే బలమైన ఆయుధాన్ని ఇచ్చిన వారవుతారు. తక్షణమే ఫిర్యాదు చేస్తే ఆపద నుంచి బయటపడవచ్చు.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం జిల్లా

సమీకృత వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: వాతావరణ ఆటుపోట్లతో ఆర్థికంగా నష్టపోతున్న రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సమీకృత వ్యవసాయ విధానానికి మొగ్గు చూపేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు అధికారులకు సూచించారు. ఇళ్ల వద్ద పుట్టగొడుగులు, గిరి, వన రాజా కోళ్ల పెంపకం వంటి ప్రత్యామ్నాయ ఆదాయ వనరులిచ్చే మార్గాలపై రైతులు దృష్టి సారించాలన్నారు. గుంటూరు లాంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం సందర్శించారు. కేవీకేలోని పందుల పెంపకం క్షేత్రంతో పాటు, నేపియర్ గడ్డి విత్తన కటింగ్, వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేసే విధానాలను పరిశీలించారు. రబీ సీజన్‌లో శనగలు విత్తే విధానాన్ని పరీక్షించారు. సమీకృత వ్యవసాయ విధానానికి లాం కేవీకే ప్రదర్శన క్షేత్రం ఓ నమూనాగా ఉందన్నారు. రైతుల స్థాయిలో పట్టు పురుగుల పెంపకం ఓ కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేయాలన్నారు. వాటి పెంపకంలో మేలైన పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. లాం కేవీకేలో మాత్రమే పశు సంవర్ధక, అనుబంధ పరిశోధనలపై అవగాహన పెంపొందించుకునేందుకు ప్రదర్శన క్షేత్రాలను సందర్శించుకునే అవకాశం కల్పిస్తున్నామని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ తెలిపారు.ఈ సందర్భంగా అధిక గడ్డి దిగుబడులను ఇచ్చే నేపియర్ గడ్డి జాతి విత్తన కట్టింగ్స్‌ను రైతులకు అందించారు.

నీటి పంపిణీ బాధ్యత కృష్ణా బోర్డుదే

కేంద్ర జల్ శక్తి శాఖ స్పష్టీకరణ

- ఏటా రెండు రాష్ట్రాల సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకోవాలని దిశానిర్దేశం



సాక్షి, అమరావతి: కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2 అవార్డు అమల్లోకి వచ్చేవరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు కృష్ణా నదీ జలాలు పంపిణీ చేసే బాధ్యత కృష్ణా బోర్డుదేనని కేంద్ర జల్ శక్తి శాఖ స్పష్టం చేసింది. నీటి పంపకాల్లో అపెక్స్ కౌన్సిల్ జోక్యం చేసుకోబోదని బోర్డుకు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాలకు నీటి పంపిణీపై జనవరి 21న నిర్వహించే 19వ సర్వసభ్య సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది. కృష్ణా నదిలో 75 శాతం లభ్యత ఆధారంగా 811 టీఎంసీలను ఉమ్మడి ఏపీకి కేడబ్ల్యూడీటీ–1 కేటాయించింది. విభజన నేపథ్యంలో కృష్ణా నదీ జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తకుండా చూసేందుకు 2014 మే 28న కేంద్రం కృష్ణా బోర్డును ఏర్పాటుచేసింది. కేడబ్ల్యూడీటీ–1 ప్రాజెక్టుల వారీగా చేసిన నీటి కేటాయింపుల ఆధారంగా 2015–16 నీటి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు 512.06, తెలంగాణకు 298.94 టీఎంసీలను పంపిణీ చేస్తూ 2015 జూలై 18–19న కేంద్ర జల్ శక్తి తాత్కాలిక సర్దుబాటు ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో 2016 సెప్టెంబర్ 21న అపెక్స్ కౌన్సిల్ తొలి సమావేశంలో 2016–17 సంవత్సరంలోనూ తాత్కాలిక సర్దుబాటు ప్రకారమే నీటిని పంపిణీ చేసుకోవడానికి రెండు రాష్ట్రాలు అంగీకరించాయి.


అపెక్స్ కౌన్సిల్ అజెండాలో చేర్చాలని..

రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపకాల అంశాన్ని అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి.. తుది నిర్ణయం తీసుకునేలా అజెండాలో చేర్చాలని కేంద్ర జల్ శక్తి శాఖకు కృష్ణా బోర్డు విజ్ఞప్తి చేసింది. కృష్ణా బోర్డు పనితీరుపై 2024 జనవరి 9న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో కృష్ణా జలాల పంపకం అంశాన్ని కృష్ణా బోర్డు అధికారులు లేవనెత్తారు. కృష్ణా జలాల పంపకం జోలికి అపెక్స్ కౌన్సిల్ వెళ్లబోదని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి తేల్చిచెప్పారు. కేడబ్ల్యూడీటీ–2 అవార్డు అమల్లోకి వచ్చే వరకూ ఇప్పటిలానే రెండు రాష్ట్రాలతో ఏటా సంప్రదింపులు జరిపి.. నీటిని పంపిణీ చేసే బాధ్యత కృష్ణా బోర్డుదేనని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

66:34 నిష్పత్తిలో పంపిణీ

ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో లభ్యత గల జలాల్లో ఏపీ 66 శాతం, తెలంగాణ 34 శాతం వాడుకునేలా 2017–18 నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. 2018–19, 2019–20, 2020–21, 2021–22, 2022–23 సంవత్సరాల్లో బోర్డు సర్వసభ్య సమావేశాల్లో రెండు రాష్ట్రాలతో చర్చించి అదే పద్ధతి ప్రకారం కృష్ణా బోర్డు నీటిని పంపిణీ చేసింది. కానీ.. 2023–24 నీటి సంవత్సరానికి సంబంధించి నీటి పంపకాలపై 2023 మే 10న నిర్వహించిన కృష్ణా బోర్డు సమావేశంలో తమకు 50 శాతం వాటా కావాలని తెలంగాణ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. దీన్ని ఏపీ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి తోసిపుచ్చారు. దాంతో కృష్ణా జలాల లభ్యత, అవసరాలపై ఎప్పటికప్పుడు చర్చించి, కేటాయింపులు చేసే బాధ్యతను త్రిసభ్య కమిటీకి కృష్ణా బోర్డు అప్పగించింది. దీనిపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. పాత పద్ధతి ప్రకారమే ఉమ్మడి ప్రాజెక్టుల్లో 66 శాతం ఏపీ, తెలంగాణకు 34 శాతం పంపిణీ చేస్తూ కృష్ణా బోర్డు తుది నిర్ణయం తీసుకుంది.





ఈ బాలీవుడ్‌కి ఏమైంది?

- టాప్ ఫైవ్‌లో 'పుష్ప: ది రూల్, కల్కి 2898 ఏడీ'
- కనిపించని ఖాన్ త్రయం
- మీడియమ్ స్టార్స్... హారర్ చిత్రాలదే హవా

ఈ బాలీవుడ్‌కి ఏమైంది... దాదాపు రెండు మూడేళ్లుగా బాలీవుడ్ బాక్సాఫీస్ వసూళ్లు అంత ఆశాజనకంగా లేవు. అసలు ఈ ఏడాది ఖాన్ త్రయం (సల్మాన్, ఆమిర్, షారుక్) వెండితెరపై కనిపించనే లేదు. విడుదలైన చిత్రాల్లో మీడియమ్ స్టార్స్ చిత్రాలు ఫర్వాలేదనిపించుకున్నాయి. అయితే బాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురిపించింది మాత్రం హిందీలోకి అనువాదమైన తెలుగు చిత్రాలు 'కల్కి 2898 ఏడీ, పుష్ప: ది రూల్' కావడం విశేషం. ఇక ఈ ఏడాది బాలీవుడ్ బాక్సాఫీస్ ఎలా సాగిందో తెలుసుకుందాం.

హిందీ చిత్ర పరిశ్రమకు ఈ ఏడాది అంత అచ్చొచ్చినట్లుగా లేదు. బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించే హిందీ సినిమాల సంఖ్య తక్కువైపోయింది. కాస్తో కూస్తో ఈ ఏడాది బాలీవుడ్ బాక్సాఫీస్‌ను కాపాడింది హారర్ చిత్రాలనే చెప్పుకోవచ్చు. ఈ ఏడాది విడుదలైన హిందీ చిత్రాల్లో హారర్ 'స్త్రీ 2' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అమర్ కౌశిక్ దర్శకత్వంలో శ్రద్ధా కపూర్, రాజ్ కుమార్ రావ్ లీడ్ రోల్‌లో నటించిన 'స్త్రీ' 2018లో విడుదలై, రూ. వంద కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించి, అప్పట్లోనే సంచలనాలు సృష్టించింది. ఓ ఉమెన్ సెంట్రిక్ హారర్ ఫిల్మ్ వందకోట్ల రూపాయల గ్రాస్‌ను సాధించడం బాలీవుడ్‌లో అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. దీంతో 'స్త్రీ 2' వస్తుందనగానే ఈ సినిమాపై బాలీవుడ్‌లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఆ అంచనాలను వమ్ము చేయకుండా 'స్త్రీ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది. శ్రద్ధాకపూర్, రాజ్‌కుమార్ రావ్ లీడ్ రోల్స్‌లో అక్షయ్ కుమార్, వరుణ్ ధావన్ గెస్ట్ రోల్స్‌లో నటించిన 'స్త్రీ 2' సినిమా ఈ ఏడాది ఆగస్టులో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా దాదాపు రూ. 850 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. రూ.650 గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించి, ఇండియాలో అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రంగా నిలిచి, రికార్డు సృష్టించింది. హిందీ ఆడియన్స్ 'స్త్రీ 2' హారర్ హ్యాంగోవర్లో ఉన్నారేమో కానీ ఆ వెంటనే వచ్చిన మరో హారర్ హిందీ చిత్రం 'భూల్ భూలయ్యా 3' సినిమానూ విశేషంగా ఆదరించారు. కార్తీక్ ఆర్యన్, త్రిప్తీ దిమ్రీ హీరోయిన్లుగా నటించిన ఈ హారర్ మూవీకి అనీస్ బాజ్మీ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో మాధురీ దీక్షిత్, విద్యాబాలన్ ఇతర రోల్స్ చేశారు. ఈ ఏడాది నవంబరు 1న విడుదలైన ఈ మూవీ దాదాపు రూ.300 కోట్ల వసూళ్లను రాబట్టి, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇక ఇదే కోవలో అంటే... హారర్ నేపథ్యంలోనే వచ్చిన 'సైతాన్' చిత్రం హిందీ ఆడియన్స్‌ను థియేటర్స్‌కు రాబట్టుకోగలిగింది. వికాస్ బాల్ డైరెక్షన్‌లోని ఈ మూవీలో అజయ్ దేవగన్, మాధవన్, జ్యోతిక లీడ్ రోల్స్‌లో నటించారు. 'సైతాన్' సినిమాలో విలన్‌గా మాధవన్, మరో లీడ్ రోల్‌లో నటించిన మరాఠీ నటి జాంకీలు ఈ సినిమాలో మేజర్ హైలైట్‌గా నిలిచారు. ఈ సినిమా రూ.200 కోట్లకు పైగా కలెక్షన్స్‌ను రాబట్టి, సూపర్ హిట్‌గా నిలిచింది. ఇక సినిమాలో కంటెంట్ ఉంటే అదీ చిన్న సినిమానా? పెద్ద సినిమానా? అని ఆడియన్స్ పట్టించుకోరని ఇప్పటికే చాలాసార్లు నిరూపితమైంది. ఈ ఏడాది మరోసారి ప్రూవ్ అయింది. హిందీ ఆడియన్స్‌ను మెప్పించిన హారర్ మూవీ 'ముంజ్యా'. యువ తారలు అభయ్ వర్మ, శర్వారీ హీరో హీరోయిన్లుగా, సత్యరాజ్, మోనా సింగ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ హారర్ ఫిల్మ్‌కు ఆదిత్య సర్పోత్థార్ దర్శకత్వం వహించారు. అంచనాలు లేకుండా జూన్‌లో విడుదలైన ఈ మూవీ రూ. 120 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించి, బాలీవుడ్ ఆడియన్స్‌లో హారర్ జానర పట్ల ఉన్న మక్కువను మరోసారి నిరూపించింది. అలాగే 2018లో విడుదలైన హారర్ మూవీ 'తుంబాడ్' ఈ ఏడాది సెప్టెంబరులో రీ-రిలీజై హిట్ మూవీగా నిలిచింది.

కథానాయికల జోరు

హారర్ తర్వాత బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సూపర్‌హిట్స్‌గా నిలిచిన చిత్రాలు హీరోయిన్స్ మెయిన్ లీడ్ రోల్స్‌లో నటించినవి కావడం ఈ ఏడాది విశేషం. ముందుగా ఈ ఏడాది దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన 'లాపతా లేడీస్' సినిమా గురించి ప్రస్తావించుకోవాలి. కొంత గ్యాప్ తర్వాత కిరణ్ రావ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ మార్చి 1న థియేటర్స్‌లో రిలీజైంది. ఎలాంటి అంచనాలు లేని ఈ చిత్రానికి విడుదల తర్వాత హిందీ చిత్ర పరిశ్రమలో ఆడియన్స్ నుంచి సూపర్ డూపర్ రెస్పాన్స్ లభించింది. ప్రతిభ రంతా, నితాన్షి గోయెల్, స్పర్శ్ శ్రీవాత్సవ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ మూవీలో రవికిషన్, ఛాయా కందమ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సూపర్‌హిట్‌గా నిలవడమే కాకుండా, విమర్శకుల ప్రసంసలను దక్కించుకుంది. అంతేకాదు... 2025 మార్చిలో జరగనున్న 97వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో 'లాపతా లేడీస్' సినిమాను, ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అఫీషియల్ ఇండియన్ ఎంట్రీ మూవీగా పంపారు. ఇలా 'లాపతా లేడీస్' చిత్రం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కానీ 97వ ఆస్కార్ షార్ట్‌లిస్ట్ జాబితాలో ఈ సినిమాకు చోటు దక్కకపోవడం ఇండియన్ ఆడియన్స్‌కు కాస్త బాధ కలిగే అంశమనే చెప్పాలి. ఇదే నెలలో అంటే... ఫిబ్రవరి 23న విడుదలైన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఆర్టికల్ 370'. యామీ గౌతమ్, ప్రియమణి లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు విశేష ప్రేక్షకాదరణ దక్కింది. ఆదిత్యా సుహాస్ డైరెక్షన్‌లోని ఈ మూవీ రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌తో హిట్‌గా నిలిచింది. అలాగే టబు, కరీనా కపూర్, కృతీ సనన్ నటించిన ఉమెన్ మల్టీ స్టారర్ మూవీ 'క్రూ' కూడా ప్రేక్షకుల మెప్పు పొంది, ఈ ఏడాది సూపర్‌హిట్ మూవీస్‌లో చోటు దక్కించుకోగలిగింది. రాజేశ్ ఏ క్రిష్ణన్ దర్శకత్వం వహించిన ఈ థ్రిల్లింగ్ డ్రామా రూ.150 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. ఇక 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' మూవీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పాయలల్ కపాడియా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ ఏడాది జరిగిన 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఎంతో ప్రతిష్టాత్మకమైన గ్రాండ్ ప్రీ అవార్డును సైతం గెలుచుకుంది. అంతేనా... మరి కొన్ని అంతర్జాతీయ అవార్డులను కూడా ఈ చిత్రం గెలుచుకుంది. కనికా కస్రూతి, దివ్య ప్రభ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాలో ఛాయా కందమ్ మరో లీడ్ రోల్‌లో నటించారు. ఈ చిత్రం హిందీ భాషలో (మలయాళ, మరాఠీ భాషల్లో కూడా విడుదలైంది) సెప్టెంబరులో ఇండియాలో విడులైంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్త ప్రేక్షకుల అటెన్షన్‌ను గ్రాబ్ చేసింది.

హిట్ యాక్షన్

బాలీవుడ్‌లో బడా మల్టీస్టారర్ మూవీగా రూపొందిన చిత్రం 'సింగమ్ ఎగైన్'. దర్శకుడు రోహిత్ శెట్టి 'సింగమ్' ఫ్రాంచైజీ నుంచి వచ్చిన ఈ చిత్రంలో అజయ్ దేవగన్, కరీనా కపూర్ హీరో హీరోయిన్లుగా నటించగా, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఇంతటి భారీ క్యాస్టింగ్‌తో, భారీ అంచనాల మధ్య విడుదలైన 'సింగమ్ ఎగైన్' ఓ మోస్తరు హిట్‌ను మాత్రమే సొంతం చేసుకోగలిగింది. బాలీవుడ్ ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. అయితే 'సింగమ్ ఎగైన్' రిలీజైన రోజునే... అంటే... నవంబరు 1నే, 'భూల్ భూలయ్యా 3' చిత్రం కూడా థియేటర్స్‌లోకి వచ్చింది. 'సింగమ్ ఎగైన్' సినిమా వసూళ్లపై కొంత ఎఫెక్ట్ పడటానికి ఈ సినిమా ఓ కారణం అని బాలీవుడ్ ట్రేడ్ వర్గీయులు చెప్పుకున్నారు. ఇక హృతిక్ రోషన్ 'ఫైటర్' సినిమా కూడా సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలోని ఈ మూవీలో తొలిసారిగా హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ కలిసి నటించారు. జనవరి 25న విడులైన ఈ చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. ఇంకా షాహిద్ కపూర్ రోబో లవ్‌స్టోరీ 'తేరీ బోతో మే ఐసా ఉల్జా జియా', విక్కీ కౌశల్ కామెడీ డ్రామా 'బ్యాడ్ న్యూజ్' వంటి చిత్రాలకు ప్రేక్షకులు హిట్ స్టేటస్ ఇచ్చారు.


- ముసిమి శివాంజనేయులు

టాప్ లేపిన పుష్ప రాజ్


ఈ ఏడాది హిందీ బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపిన చిత్రం 'పుష్ప: ది రూల్'. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ డైరెక్షన్‌లో రూపొందిన 'పుష్ప: ది రూల్' సినిమా హిందీ వెర్షన్ రూ.700 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించి, హిందీ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ ఏడాది బాలీవుడ్ స్ట్రయిట్ హిందీ బ్లాక్‌బస్టర్ హిట్ ఫిల్మ్ 'స్త్రీ 2' కలెక్షన్స్‌ను సైతం అధిగమించి, 'పుష్ప: ది రూల్' సినిమా రికార్డు సృష్టించింది. ఇలా ఇండియాలో అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రంగా 'పుష్ప: ది రూల్' నిలిచింది. ఈ సినిమా ఇంకా ప్రదర్శితమవుతున్న సంగతి తెలిసిందే. అలాగే ప్రపంచ వ్యాప్తంగా 'పుష్ప: ది రూల్' సినిమా ఇప్పటికే రూ.1700 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించినట్లుగా, మేకర్స్ వెల్లడించారు. 'పుష్ప: ది రూల్' మూవీ ఈ ఏడాది డిసెంబరు 5న థియేటర్స్‌లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ ఏడాది ప్రభాస్ చేసిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ మూవీ 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాలీవుడ్ ఆడియన్స్‌తో హిట్ ఫిల్మ్ అనిపించుకుంది. ప్రభాస్ హీరోగా, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ మూవీకి నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. జూన్ 27న థియేటర్స్‌లోకి వచ్చిన 'కల్కి 2898ఏడీ' మూవీ హిందీలో దాదాపు రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. ఇలా ఈ ఏడాది హిందీ బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు సాధించిన టాప్ ఫైవ్‌లో చోటు దక్కించుకుంది. అలాగే ఈ ఏడాది సెప్టెంబరులో విడుదలైన ఎన్టీఆర్ 'దేవర' చిత్రం కూడా హిందీ ఆడియన్స్‌ను మెప్పించింది. ఈ సినిమాకు కొరటాల శివ దర్శకత్వం వహించారు.

కనిపించని ఖాన్ త్రయం

'సింగమ్ ఎగైన్, బేబీ జాన్' చిత్రాల్లో సల్మాన్ ఖాన్ గెస్ట్‌గా కనిపించారు. కానీ ఆయన హీరోగా నటించిన సినిమా ఏదీ ఈ ఏడాది థియేటర్స్‌లోకి రాలేదు. అలాగే అమిర్ ఖాన్, షారుక్ ఖాన్ హీరోలుగా నటించిన చిత్రాలు కూడా థియేటర్స్‌లోకి రాలేదు. ఇంకా రణ్‌బీర్ కపూర్, రణ్‌వీర్ సింగ్ (సింగమ్ ఎగైన్ మూవీలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించలేదు)... ఇలా బాలీవుడ్ అగ్రశ్రేణి హీరోల సినిమాలు థియేటర్స్‌లోకి రాకపోవడం కూడా హిందీ బాక్సాఫీస్‌కి ఓ మైనస్ అని చెప్పాలి.








గమనిక: వసూళ్ల వివరాలు ప్రచారంలో ఉన్న విధంగా...



రెండోసారి జోడీ?


• శ్రుతిహాసన్

హీరో ధనుష్, హీరోయిన్ శ్రుతీహాసన్ రెండోసారి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ చిత్ర వర్గాలు. ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వం వహించిన '3' (2012) సినిమాలో తొలిసారి జంటగా నటించారు ధనుష్, శ్రుతి. ఆ చిత్రం విడుదలైన 12 ఏళ్లకి మరోసారి ఈ జోడీ రిపీట్ కానుందని టాక్. శివ కార్తికేయన్ నటించిన 'అమరన్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న డైరెక్టర్ రాజ్‌కుమార్ పెరియసామి తాజాగా ధనుష్‌తో ఓ చిత్రం తెరకెక్కించనున్నారు. వాస్తవ ఘటనల నేపథ్యంలో ఈ మూవీ రూపొందనుందని టాక్. ఈ మూవీలో ధనుష్‌కి జంటగా శ్రుతీహాసన్ నటించనున్నట్లు తెలుస్తోంది. పైగా డైరెక్టర్‌పై ఉన్న నమ్మకంతో తన పాత్ర ఏంటి? అని అడగకుండానే ఓకే చెప్పారట ఆమె. తన కెరీర్‌లో ఇప్పటి వరకూ చేయని ఓ వైవిధ్యమైన పాత్ర శ్రుతీహాసన్‌ది అని టాక్. '3' మూవీతో హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న ధనుష్-శ్రుతీహాసన్ రెండోసారి జంటగా నటించనుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో క్రేజ్ నెలకొంది. ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'కూలీ' సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు శ్రుతి. ఆ మూవీ పూర్తయ్యాక ధనుష్ చిత్రంలో పాల్గొంటారని కోలీవుడ్ టాక్.


• ధనుష్

టచ్‌లో ఉండు..

యాంకర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ మాచిరాజు '30 రోజుల్లో ప్రేమించటం ఎలా?' సినిమాతో హీరోగా మారిన సంగతి తెలిసిందే. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ద్వితీయ చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. డుయో నితిన్, భరత్ ద్వయం దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో దీపికా పిల్లి కథానాయికగా నటిస్తున్నారు. మాంక్స్-మంకీస్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సినిమా నుంచి క్రిస్మస్ సందర్భంగా 'టచ్‌లో ఉండు..' అంటూ సాగే ద్వితీయ పాటని రిలీజ్ చేశారు. రధన్ ఈ మూవీకి సంగీతం అందించారు. టచ్‌లో ఉండు..' పాటకి చంద్రబోస్ సాహిత్యం అందించగా, లక్ష్మీ దాస, పి. రఘు పాడారు. ''యునిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ప్రదీప్, చంద్రికా రవిలపై చిత్రీకరించిన 'టచ్‌లో ఉండు..' మాస్ సాంగ్ ఆకట్టుకుంటుంది'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఎమ్ఎన్ బాలరెడ్డి.


• ప్రదీప్ మాచిరాజు, చంద్రికా రవి

ఎల్లమ్మగా సాయి పల్లవి?

వెండితెరపై ఎల్లమ్మగా సాయి పల్లవి కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. నితిన్ హీరోగా 'బలగం' ఫేమ్ వేణు ఎల్దండి దర్శకత్వంలో 'ఎల్లమ్మ' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. తెలంగాణ రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం ఉంటుందని సమాచారం. ఈ చిత్రాన్ని 'దిల్' రాజు నిర్మిస్తారు. వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఈ సినిమా చిత్రీకరణను మొదలు పెట్టాలనుకుంటున్నారు. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు సాయి పల్లవిని అనుకుంటున్నారట. ఆల్రెడీ తెలంగాణ నేటివిటీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఫిదా, విరాటపర్వం' చిత్రాల్లో సాయి పల్లవి నటిగా మెప్పించారు. మరి... తెలంగాణ నేపథ్యంలో సాగే 'ఎల్లమ్మ'లోనూ సాయి పల్లవి భాగం అవుతారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.


• నితిన్


• సాయిపల్లవి

రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్

సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీ కపూర్ జంటగా రూపుదిద్దుకోనున్న రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్ మూవీకి 'పరమ్ సుందరి' అనే టైటిల్ ఖరారైంది. 'దస్వి' ఫేమ్ తుషార్ జలోటి ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రంలో పరమ్ పాత్రలో సిద్ధార్థ్ మల్హోత్రా, సుందరి పాత్రలో జాన్వీకపూర్ కనిపిస్తారు. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. రెండు విభిన్న సాంప్రదాయాల అమ్మాయి, అబ్బాయి ప్రేమించుకుంటే ఏం జరుగుతుంది? అనే పాయింట్ ఆఫ్ వ్యూలో ఈ సినిమా కథనం ఉంటుందని బీ టౌన్ టాక్ వినిపిస్తోంది. 'పరమ్‌సుందరి' సినిమా వచ్చే ఏడాది జూలై 27న రిలీజ్ కానుంది. మరోవైపు ప్రస్తుతం జాన్వీకపూర్ తెలుగులో రామ్‌చరణ్‌తో 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాలో హీరోయిన్‌గా చేస్తున్నారు. అలాగే హిందీలో వరుణ్ ధావన్‌తో మరో మూవీ చేస్తున్నారు. మరో రెండు హిందీ ప్రాజెక్ట్స్‌లోనూ జాన్వీ హీరోయిన్‌గా చాన్స్ దక్కించుకున్నారట.


• సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీ కపూర్

బిజినెస్ రీల్

ట్యాక్సీ సేవల యాప్స్‌పై విచారణకు ఆదేశం..



న్యూఢిల్లీ: ట్యాక్సీ, ఆటో సేవల యాప్‌లు చార్జీల విషయంలో ఒక్కో రకంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలపై విచారణ జరపాలంటూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ సీసీపీఏను ఆదేశించినట్లు కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషి తెలిపారు. ఆండ్రాయిడ్, యాపిల్ డివైజ్‌లపై ఒకే తరహా రైడ్‌కి సంబంధించి వేర్వేరు రేట్లు చూపిస్తుండటం అసమంజసమైన వాణిజ్య విధానమే అవుతుందని వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి అయిన జోషి పేర్కొన్నారు. ఇది వినియోగదారులకు లభించాల్సిన పారదర్శకత హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలోనే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఫుడ్ డెలివరీ, టికెట్ బుకింగ్ యాప్స్ తదితర రంగాలకు కూడా దీని పరిధిని విస్తరించనున్నట్లు వివరించారు.

2026లో కియా సీరోస్ ఈవీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ కియా ఇండియా 2026 ప్రారంభంలో సీరోస్ ఎలక్ట్రిక్ వర్షన్‌ను పరిచయం చేయనుంది. ఇటీవలే కాంపాక్ట్ ఎస్‌యూవీ సీరోస్ పెట్రోల్, డీజిల్ మోడళ్లను కంపెనీ భారత్ వేదికగా అంతర్జాతీయంగా ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. సామర్థ్యం పరంగా కియా మాతృ సంస్థ హ్యుండై తయారీ ఇన్‌స్టర్ ఈవీని ఇది పోలి ఉంటుందని సమాచారం. నికెల్ మాంగనీస్ కోబాల్ట్ బ్యాటరీతో 42, 49 కిలోవాట్ అవర్ సామర్థ్యంతో ఇన్‌స్టర్ ఈవీ తయారైంది. ఒకసారి చార్జింగ్‌తో బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి 300–355 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. రూపంలో సీరోస్ పెట్రోల్, డీజిల్ మోడళ్ల మాదిరిగానే సీరోస్ ఈవీ ఉంటుంది. లెవెల్–2 అడాస్, 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ సన్‌రూఫ్ వంటి ఫీచర్లు జోడించనున్నారు. ధర రూ.15–20 లక్షల మధ్య ఉండే అవకాశం ఉంది. కరెన్స్ ఈవీ, సీరోస్ ఈవీ సంయుక్తంగా 2026లో సంస్థకు 50–60 వేల యూనిట్ల స్థాయిలో అమ్మకాలను తెచ్చి పెడతాయని కియా ఇండియా ఆశాభావంతో ఉంది. కాగా, కాంపాక్ట్ ఎస్‌యూవీ సీరోస్ బుకింగ్స్ 2025 జనవరి 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి మొదటి వారం నుంచి డెలివరీలు మొదలవుతాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-12-2024

విశాఖ	600–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600–00
విజయవాడ	600–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	585–00
వరంగల్	587–00
రిటైల్ ధర	6.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,243.95	5.22
M&M	2,984.20	1.9
SBILIFE	1,410.00	1.66
MARUTI	10,911.80	1.63
SHRIRAMFIN	2,928.00	1.56

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,314.00	-1.17
ASIANPAINT	2,261.50	-0.99
TATACONSUM	900	-0.8
JSWSTEEL	914.5	-0.8
GRASIM	2,485.15	-0.67

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,628
ఎన్ఎస్ఈ	82,062
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,47,750
ఎఫ్ఐఐ	- 2,378
డీఐఐ	+ 3,336

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.89	$ 70.01
బ్రెంట్	72.92	$ 73.17

భారత్‌కు 'తయారీ' స్వర్ణయుగం

సిబ్బందికి టాటా సన్స్ చీఫ్ ఎన్ చంద్రశేఖరన్ కొత్త సంవత్సర సందేశం



న్యూఢిల్లీ: తయారీ రంగానికి దేశ ఆర్థిక వ్యవస్థను మార్చగల సామర్థ్యం ఉందని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ గురువారం అన్నారు. ప్రపంచ సరఫరాల చైన్ భారతదేశానికి అనుకూలంగా మారుతుండడం ఇక్కడ సానుకూల అంశమని పేర్కొన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద వ్యాపారాలు సవాళ్లను తట్టుకుంటూ, స్థిరీకరణ సాధిస్తున్నాయని తద్వారా ఈ రెండింట మధ్య (సవాళ్లు–స్థిరీకరణ) కొత్త సమతౌల్యతను సంస్థలు సాధిస్తాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రూప్ కంపెనీల సిబ్బందికి చంద్రశేఖరన్ 2025 నూతన సంవత్సర శుభాకాంక్షల సందేశాన్ని పంపారు. ఇందులో కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

- భారతదేశం ఇప్పుడు తయారీ స్వర్ణయుగంలో ఉంది. 2024 తర్వాత 2025కోసం ఆశావాదంతో ఎదురు చూస్తున్నాను. టాటా గ్రూప్ చైర్మన్ ఎమెరిటస్ రతన్ టాటాను కోల్పోవడంతో ఈ సంవత్సరం గ్రూప్‌కు ఒక విచారకరమైన ఏడాదిగా నిలిచింది.
- ఆరోగ్య సంరక్షణ, మొబిలిటీ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేతృత్వంలోని కీలక చొరవలు జరుగుతాయని, ఇవి మొత్తం మానవాళికి సహాయపడతాయని భావిస్తున్నాం.
- తయారీకి భారతదేశంలో మన ఆర్థిక వ్యవస్థను మార్చగల సామర్థ్యం ఉంది.
- మహమ్మారి స్వల్పకాలిక నష్టాన్ని కలిగించినా ఆన్‌లైన్, ఏఐ వినియోగం వ్యవస్థలో శాశ్వత ప్రయోజనాలను అందించే స్థాయికి ఎగశాయి.
- టాటా గ్రూప్ 5 లక్షల తయారీ ఉద్యోగాలను సృష్టించే ప్రణాళికలతో ముందుకు వెళుతోంది.
- బ్యాటరీలు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ పరికరాలు, హార్డ్‌వేర్ ప్రాజెక్టుల్లో దేశం నేటి పెట్టుబడులు రేపటి ఆర్థిక వ్యవస్థలో మున్ముందు ప్రధాన పాత్ర పోషించనున్నాయి.
- గుజరాత్ ధొలేరాలో భారతదేశపు మొట్టమొదటి సెమీకండక్టర్ ఫ్యాబ్, అస్సాంలోని సరికొత్త సెమీకండక్టర్– ఓఎస్ఏటీప్లాంట్ సహా ఏడు కొత్త ఉత్పాదక కర్మాగారాలకు భూమిపూజలు, నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. కర్ణాటకలోని నరసపురలో ఎలక్ట్రానిక్స్ అసెంబ్లీ ప్లాంట్, తమిళనాడులోని పనపాక్కంలో ఆటోమోటివ్ ప్లాంట్, కర్ణాటకలోని బెంగళూరులో కొత్త ఎంఆర్‌ఓ చొరవలను కూడా ఇక్కడ ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. మనం గుజరాత్‌లోని సనంద్‌లో అలాగే బ్రిటన్‌లోని సోమర్‌సెట్‌లో కొత్త బ్యాటరీ సెల్ తయారీ కర్మాగారాలను కూడా కలిగి ఉన్నాము. అలాగే గుజరాత్‌లోని వడోదరలో సీ295 ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్)ను ప్రారంభించాము. తమిళనాడులోని తిరునెల్వేలిలో సోలార్ మాడ్యూల్ ఉత్పత్తిని ప్రారంభించాము. కొత్తగా ఐదు లక్షల కొత్త ఉద్యోగాలతో పాటు, రిటైల్, టెక్ సర్వీసెస్, ఎయిర్‌లైన్స్, హాస్పిటాలిటీ, ఇతర రంగాలలో అనేక సేవల ఉద్యోగాలను అదనంగా గ్రూప్ కల్పించనుంది.
- ఇటువంటి వృద్ధి చొరవలు గ్రూప్‌నకు అలాగే భారతదేశానికి ఉత్తేజకరమైనవి. ప్రతి నెలా గ్రూప్ వర్క్‌ఫోర్స్‌లోకి ప్రవేశించే 10 లక్షల మంది యువకులకు ఈ చొరవలు ఆశావాదన్ని కలిగిస్తాయి.
- సెమీకండక్టర్ తయారీ వంటి రంగాల నుండి పరోక్ష ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి.
- ఉక్రెయిన్, గాజా, సూడాన్‌లలో సైనిక ఘర్షణలు చూస్తున్నాం. యూరప్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికాలో మానవతా సంక్షోభాలు తీవ్రం అయ్యాయి. బంగ్లాదేశ్, దక్షిణ కొరియాలో పౌరుల నేతృత్వంలోని ఉద్యమాలను కూడా చూశాము. ఆయా అంశాలు దేశీయ, విదేశీ విధాన కల్పనలపై తీవ్ర ప్రభావితం చూపుతాయి. ప్రత్యేకించి ఇమ్మిగ్రేషన్, సాంకేతికత ఇక్కడ ప్రస్తావనాంశాలు. ప్రపంచ వాణిజ్యానికి సంబంధించి టారిఫ్‌లు మరోసారి నాయకుల మనస్సుల్లో ఉన్నాయి. వీటిపై అనిశ్చితి వాతావరణం ఉంటుంది. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, గ్రూప్ పురోగతి స్థిరంగా కొనసాగింది.

ఐపీవోకు శ్రీ లోటస్ డెవలపర్స్

- సెబీకి తాజాగా ప్రాస్పెక్టస్ దాఖలు
- పెట్టుబడులకు బాలీవుడ్ నటుల క్యూ
- జాబితాలో అమితాబ్, షారుఖ్, కచోలియా



న్యూఢిల్లీ: బాలీవుడ్ నటులతోపాటు, సుప్రసిద్ధ ఇన్వెస్టర్ ఆశిష్ కచోలియాకు పెట్టుబడులున్న శ్రీ లోటస్ డెవలపర్స్ అండ్ రియల్టీ పబ్లిక్ ఇష్యూవైపు దృష్టి పెట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 792 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 550 కోట్లు అనుబంధ సంస్థలు రిచ్‌ఫీల్ రియల్టీ, ధ్యాన్ ప్రాజెక్ట్స్, ట్రిక్షా రియల్టీలో పెట్టుబడులకు వెచ్చించనుంది. వెరసి ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న అమల్ఫి, ఆర్కేడియన్, వరుణ్ ప్రాజెక్టుల అభివృద్ధికి వినియోగించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. కాగా.. ఈ నెల మొదట్లో కంపెనీ ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌కింద 2.66 కోట్ల షేర్లను జారీ చేయడం ద్వారా రూ. 407 కోట్లు సమకూర్చుకుంది. దీనిలో భాగంగా బాలీవుడ్ స్టార్స్ అమితాబ్ బచ్చన్ 6.7 లక్షల షేర్లు, షారుఖ్ ఖాన్ కుటుంబ ట్రస్ట్ 6.75 లక్షల షేర్లు సొంతం చేసుకున్నారు. ఇందుకు విడిగా రూ. 10 కోట్లు చొప్పున వెచ్చించారు.

ఈప్యాక్‌లో హైసెన్స్‌కు చోటు

- శ్రీ సిటీ ప్లాంటులో పెట్టుబడులు
- 15–26 శాతం వాటా కొనుగోలు!



కోల్‌కతా: కన్జూమర్ అప్లయెన్సెస్ కంపెనీ ఈప్యాక్ డ్యూరబుల్స్ ఏర్పాటు చేయనున్న ప్లాంటులో చైనా సంస్థ హైసెన్స్ గ్రూప్ ఇన్వెస్ట్ చేయనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సిటీలో ఏసీలు, వాషింగ్ మెషీన్ల తయారీకి ఈప్యాక్ కొత్తగా ప్లాంటును నెలకొల్పుతోంది. ఈ ప్లాంటులో టీవీలు, అప్లయెన్సెస్ తయారీ చైనా కంపెనీ హైసెన్స్ గ్రూప్ 15 నుంచి 26 శాతం వాటా కొనుగోలు చేసే ప్రణాళికల్లో ఉంది. అయితే భారత ప్రభుత్వ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి నిబంధనలపై ఆధారపడి పెట్టుబడులకు వీలున్నట్లు హైసెన్స్ ఇండియా ఎండీ స్టీవెన్ లి తెలియజేశారు. ఈప్యాక్ ప్లాంటులో కనీసం 15 శాతం, గరిష్టంగా 26 శాతం వాటా కొనుగోలుకి అవకాశమున్నట్లు వివరించారు. నిబంధనలు అనుమతిస్తే భారత్‌లో పెట్టుబడులకు తమ గ్రూప్ కట్టుబడి ఉంటుందని తెలియజేశారు. కంపెనీ దేశీయంగా తొలిసారి 120 అంగుళాల లేజర్ టీవీని ఇక్కడ విడుదల చేసింది. ఈ సందర్భంగా లి ప్రసంగిస్తూ వచ్చే వేసవిలో కొత్త శ్రేణిలో ఏసీలను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్న ప్లాంటులో ఈప్యాక్ డ్యురబుల్స్ ఏసీలు, వాషింగ్ మెషీన్లను తయారు చేయనున్నట్లు కంపెనీ అధికారి ఒకరు తెలియజేశారు. తొలి దశలో రూ. 250 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించారు. కాగా.. ఈప్యాక్ మ్యాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీస్ పేరుతో ఏర్పాటు చేసిన ఎస్‌పీవీ ద్వారా ప్లాంటు నిర్వహణ ఉంటుందని 2025 అక్టోబర్‌కల్లా ఉత్పత్తి ప్రారంభమవుతుందని లి వెల్లడించారు. భవిష్యత్‌లో దక్షిణాసియా, మెక్సికో మార్కెట్లకు హైసెన్స్ ద్వారా ఎగుమతులకు సైతం ప్లాంటు ఉపయోగపడనున్నట్లు తెలియజేశారు.

వెన్ను తడితే బోలెడు అవకాశాలు

- రూ.750 కోట్ల నిధి కేటాయించండి
- రూ.2.12 లక్షల కోట్ల ఎగుమతులు చేయొచ్చు
- చైనాపై సుంకాల బాదుడుతో మనకు అవకాశాలు
- ఆర్థిక శాఖను కోరిన ఎఫ్ఐఈవో



న్యూఢిల్లీ: చైనా వస్తువులపై అధిక సుంకాలు వేస్తానంటూ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరిక, భారత్ ఎగుమతులకు అనుకూలమని భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) అభిప్రాయపడింది. ఏటా రూ.250 కోట్ల చొప్పున మూడేళ్ల పాటు మొత్తం రూ.750 కోట్ల సాయాన్ని ప్రకటించడం ద్వారా.. 25 బిలియన్ డాలర్ల విలువ మేర ఎగుమతులను (రూ.2.12 లక్షల కోట్లు) అదనంగా పెంచుకోవచ్చంటూ కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లింది. 2025–26 బడ్జెట్‌కు సంబంధించి తమ డిమాండ్లను ఆర్థిక శాఖతో భేటీ సందర్భంగా ఎఫ్ఐఈవో తెలియజేసింది. ఐదు శాతం ఇంటరెస్ట్ ఈక్వలైజేషన్ స్కీమ్‌ను (రాయితీ వడ్డీ రేటు) సైతం కొనసాగించాలని ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ అశ్విని కుమార్ డిమాండ్ చేశారు. చైనా గతంలో ఆధిపత్యం ఎక్కువగా ఉన్న రంగాల్లో భారత్ గణనీయంగా ఎగుమతులు పెంచుకునేందుకు ఆ దేశంపై అమెరికా టారిఫ్‌లు వీలు కల్పిస్తాయని చెప్పారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, టోయ్స్, కెమికల్స్, ఆటో విడిభాగాలు, పాదరక్షలు, ఫర్నిచర్, హోమ్ డెకరేటివ్ ఉత్పత్తుల విభాగంలో చైనా స్థానాన్ని భారత్ ఆక్రమించగలదని ఎఫ్ఐఈవో నిర్వహించిన ఒక అధ్యయనం స్పష్టం చేస్తోంది. వ్యూహాత్మక భాగస్వామ్యంతో యూఎస్‌కు ఎగుమతి చేయతగిన కీలక రంగాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఎఫ్ఐఈవో ఈ భేటీలో భాగంగా కోరింది.

రుణ వ్యయాలను తగ్గించాలి..

రాయితీ వడ్డీ రేటు పథకం గడువు 2024 డిసెంబర్ 31 వరకే ఉందని, అది కూడా రూ.50 లక్షలకు మించిన ఆదాయం ఉన్న ఎంఎస్ఎంఈకే వర్తిస్తున్నట్టు కుమార్ చెప్పారు. ఇతర దేశాలతో పోల్చితే భారత ఎగుమతిదారులు రుణాలపై అధిక వడ్డీ రేట్లను ఎదుర్కొంటున్నట్టు ఆర్థిక శాఖ దృష్టికి ఎఫ్ఐఈవో తీసుకెళ్లింది. దీంతో భారత ఎగుమతిదారులపై రుణ వ్యయాలు అధికంగా ఉంటున్నట్టు తెలిపింది. ఐఈఎస్ పథకాన్ని మరికొంత కాలం పాటు కొనసాగించడం వల్ల ఎగుమతి దారులు తక్కువ రేటుకే రుణాలు పొందే వెసులుబాటు లభిస్తుందని, దీంతో అంతర్జాతీయంగా పోటీ పడొచ్చని వివరించింది. పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) వ్యయాలపై పన్ను ప్రయోజనాలు, ప్రైవేటు రంగ షిప్పింగ్ సామర్థ్యాల పెంపునకు వీలుగా మూలధన వ్యయాలు అధికం చేయాలన్న డిమాండ్లను సైతం ఎఫ్ఐఈవో ఆర్థిక శాఖ ముందుంచింది. ఏటా షిప్పింగ్, రవాణా చార్జీలకే 100 బిలియన్ డాలర్లు ఖర్చు చేయాల్సి వస్తున్నట్టు తెలిపింది.

హైదరాబాద్‌లో ఇళ్ల విక్రయాలు డీలా

- ఈ ఏడాది అమ్మకాలు 58,540 యూనిట్లు
- గతేడాది కంటే 5 శాతం తక్కువ
- ప్రధాన నగరాల్లో 4 శాతం క్షీణత
- అనరాక్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: హైదరాబాద్ ఇళ్ల మార్కెట్ నీరసించింది. ఈ ఏడాది మొత్తం మీద ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాది కంటే 5 శాతం తక్కువగా నమోదు కావొచ్చంటూ రియల్‌ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ తెలిపింది. 58,540 యూనిట్ల అమ్మకాలు ఉంటాయని అంచనా వేసింది. క్రితం ఏడాది విక్రయాలు 61,715 యూనిట్లుగా ఉన్నాయి. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో ఈ ఏడాది ఇళ్ల అమ్మకాలు 4 శాతం తగ్గి రూ.4.6 లక్షల యూనిట్లుగా ఉండొచ్చంటూ.. 2024 ఏడాదిపై అంచనాలతో అనరాక్ నివేదిక విడుదల చేసింది. గతేడాది ఇవే నగరాల్లో 4,76,530 యూనిట్లు అమ్ముడయ్యాయి. కాకపోతే గతేడాదితో పోల్చితే ఇళ్ల అమ్మకాల విలువ ఈ ఏడాది 16 శాతం పెరిగి రూ.5.68 లక్షల కోట్లుగా ఉంది. ఒక ఇల్లు సగటు విక్రయ ధర ఈ ఏడాది 21 శాతం పెరిగింది. భూముల ధరలు, కార్మికుల వేతనాలు, ముడి సరుకుల ధరలు పెరగడం ఇందుకు కారణాలుగా ఉన్నాయి. అలాగే, సాధారణ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో నియంత్రణ పరమైన అనుమతుల్లో జాప్యంతో కొత్త హౌసింగ్ ప్రాజెక్టుల ప్రారంభం నిదానించడాన్ని కూడా కారణంగా పేర్కొంది. ఇళ్ల ధరలు పెరగడంతో అమ్మకాల విలువ గతేడాది కంటే అధికంగా ఉన్నట్టు వివరించింది. ''భారత హౌసింగ్ రంగానికి 2024 మిశ్రమంగా ఉంది. సాధారణ ఎన్నికలకుతోడు, నిర్మాణ అనుమతుల్లో జాప్యం నెలకొంది. నూతన ఇళ్ల సరఫరాపై దీని ప్రభావం పడింది. గతేడాదితో పోల్చితే ఇళ్ల అమ్మకాలు సంఖ్యా పరంగా తగ్గినప్పటికీ, ధరల పెరుగుదలతో అమ్మకాల విలువ 16 శాతం పెరిగింది''అని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి తెలిపారు.

సరఫరాలో క్షీణత

- తాజా ఇళ్ల సరఫరా ఏడు ప్రధాన నగరాల్లో ఈ ఏడాది 7 శాతం తగ్గి, 4,12,520 యూనిట్లుగా ఉండొచ్చు.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఈ ఏడాది ఇళ్ల అమ్మకాలు గతేడాదితో పోల్చితే 6 శాతం తగ్గి 61,900 యూనిట్లుగా ఉంటాయి. గతేడాది 65,625 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో అమ్మకాలు ఒక శాతం పెరిగి 1,55,335 యూనిట్లకు చేరొచ్చు.
- బెంగళూరులో ఇళ్ల అమ్మకాలు 2 శాతం వృద్ధితో 65,230 యూనిట్లుగా ఉండొచ్చని అంచనా.
- పుణెలో 6 శాతం తక్కువగా 81,090 యూనిట్ల విక్రయాలు నమోదు అవుతాయి.
- కోల్‌కతాలో 20 శాతం క్షీణతతో 18,335 యూనిట్లకు అమ్మకాలు పరిమితం కావొచ్చు.
- చెన్నైలో 11 శాతం తగ్గి 19,220 యూనిట్లుగా ఉంటాయని అనరాక్ నివేదిక అంచనా వేసింది.

అక్టోబర్‌లో 13.41 లక్షల మందికి ఉపాధి

- ఈపీఎఫ్‌వోలో పెరిగిన సభ్యుల సంఖ్య
- ఐదు రాష్ట్రాల నుంచే 61 శాతం మంది



న్యూఢిల్లీ: సంఘటిత రంగంలో అక్టోబర్‌లో 13.41 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో)లో ఈ మేరకు కొత్తగా పేర్లను నమోదు చేసుకున్నారు. కేంద్ర కార్మిక శాఖ అక్టోబర్ నెలకు సంబంధించి గణాంకాలను విడుదల చేసింది. ఈ నివేదిక ఆధారంగా చూస్తే.. ఈపీఎఫ్‌వోలో అక్టోబర్‌లో చేరిన నికర కొత్త సభ్యులు 7.50 లక్షలుగా ఉన్నారు. అంటే మిగిలిన వారు ఒక సంస్థలో మానేసి, మరో సంస్థలో ఉపాధి అవకాశాలు పొందిన వారు. ఉపాధి అవకాశాల వృద్ధిని, ఉద్యోగుల ప్రయోజనాలపై పెరుగుతున్న అవగాహనను ఈ గణాంకాలు తెలియజేస్తున్నట్టు కార్మిక శాఖ తెలిపింది.

58 శాతం యువతే..

- అక్టోబర్‌లో కొత్త సభ్యుల్లో 58 శాతం 18–25 ఏళ్ల వయసులోని వారే. అంటే సంఘటిత రంగంలో వీరు కొత్తగా ఉపాధి అవకాశాలు సొంతం చేసుకున్నట్టు తెలుస్తోంది.
- సుమారు 12.90 లక్షల మంది అక్టోబర్‌లో ఒక సంస్థను వీడి మరో సంస్థలో చేరారు. 2023 అక్టోబర్ గణాంకాలతో పోల్చితే 16 శాతం పెరుగుదల కనిపించింది. ఈపీఎఫ్‌వో ఖాతాను పాత సంస్థ నుంచి కొత్త సంస్థకు ఆన్‌లైన్‌లోనే సులభంగా బదిలీ చేసుకోవచ్చని తెలిసిందే.
- కొత్త సభ్యుల్లో 2.09 లక్షల మంది మహిళా సభ్యులు కావడం గమనార్హం. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చితే 2 శాతం పెరిగింది.
- కొత్త సభ్యుల్లో 61 శాతం మంది ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఉన్నారు.
- మహారాష్ట్ర నుంచి 22 శాతం మంది చేరగా, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, హర్యానా, తెలంగాణ, గుజరాత్ నుంచి (విడిగా) 5 శాతానికి పైగా సభ్యుల చేరిక ఉంది.
- రోడ్డు మోటారు రవాణా, ఎలక్ట్రానిక్ మీడియా కంపెనీలు, బ్యాంక్‌లు (జాతీయ బ్యాంక్‌లు కాకుండా) అక్టోబర్‌లో ఎక్కువ మందికి ఉపాధి కల్పించాయి.

బ్రాండెడ్ హోటల్స్‌కు భలే డిమాండ్

- ఆదాయంలో 13–14 శాతం వృద్ధి
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా



ముంబై: బ్రాండెడ్ హోటల్స్‌లో విడిది చేసేందుకు వినియోగదారులు మొగ్గు చూపిస్తున్నారు. డిమాండ్ బలంగా ఉండడంతో బ్రాండెడ్ హోటల్స్ పరిశ్రమ ఆదాయం క్రితం ఆర్థిక సంవత్సరం కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024–25) 11–12 శాతం మేర అధికంగా నమోదవుతుందని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక తెలిపింది. దేశీయంగా విహార, వ్యాపార ప్రయాణాలు ప్రధానంగా బ్రాండెడ్ హోటళ్ల డిమాండ్‌ను పెంచుతున్నాయని, ఇక ఎంఐసీ విభాగంలో (సమావేశాలు, సదస్సులు, ప్రదర్శనలు) వృద్ధి, విదేశీ పర్యాటకుల సందర్శనలు పుంజుకోవడం పరిశ్రమ ఆదాయానికి మద్దతునివ్వనున్నట్టు వివరించింది. బ్రాండెడ్ హోటల్స్ ఆదాయం గత ఆర్థిక సంవత్సరం సైతం 17 శాతం మేర వృద్ధిని నమోదు చేయడాన్ని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక ప్రస్తావించింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా గత ఆర్థిక సంవత్సరం నుంచి హోటళ్లలో రూమ్‌ల పెరుగుదల వేగాన్ని అందుకున్నట్టు తెలిపింది. అస్సెట్ లైట్ (సొంతంగా కాకుండా లీజు విధానంలో) నమూనాలో ఇక ముందూ కొత్త గదుల చేరిక వేగాన్ని అందుకుంటుందని అంచనా వేసింది. దీంతో ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొత్తం మీద కొత్త గదుల లభ్యత 20 శాతం మించుతుందని అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8–9 శాతం, వచ్చే ఆర్థిక సంవత్సరాలో 11–12 శాతం మేర కొత్త గదులు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. బ్రాండెడ్ హోటళ్ల నిర్వహణ మార్జిన్ 100–150 బేసిస్ పాయింట్లు (బీబీఎస్) మేర ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో మెరుగుపడుతుందని అంచనా వేసింది. బలమైన నగదు ప్రవాహాలు, అస్సెట్ లైట్ నమూనాలో విస్తరణ, తగినంత మూలధనం సమీకరణతో బ్రాండెడ్ హోటళ్ల రుణ భారం నియంత్రిత స్థాయిలోనే కొనసాగుతుందని పేర్కొంది. ఇది ఆయా హోటళ్ల రుణ పరపతిని బలోపేతం చేస్తుందని తెలిపింది.

రూమ్ రేట్లకు రెక్కలు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్రాండెడ్ హోటళ్ల సగటు రూమ్ రేట్లు (ఏఆర్ఆర్) 6–7 శాతం మేర పెరుగుతాయని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. కాకపోతే వచ్చే ఏడాది 3–4 శాతం పెరుగుదలకు పరిమితం అవుతుందని పేర్కొంది. పెద్ద సంఖ్యలో అదనపు గదులు అందుబాటులోకి రావడం ఇందుకు కారణంగా తెలిపింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 13–14 శాతం మేర, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 11–12 శాతం చొప్పున ఆదాయంలో వృద్ధి ఉంటుందని అంచనా వేసింది. విహార, వ్యాపార పర్యటనల్లో ఏడు ప్రధాన నగరాలు 25 శాతం వాటా ఆక్రమిస్తాయని.. మిగిలిన మేర ఆధ్యాత్మిక పర్యాటక రూపంలో ఉంటుందని తెలిపింది. ''నాన్ మెట్రోల్లో, విహార గమ్యస్థానాల్లో హోటల్ పరిశ్రమ కార్యకలాపాలు ఎక్కువగా విస్తరణకు నోచుకుంటున్నాయి. దీంతో కొత్త గదుల చేరికలో 60–65 శాతం మేర ఇక్కడే ఉండనుంది. అది కూడా అస్సెట్ లైట్ నమూనాలో కావడంతో, పెద్ద ఎత్తున పెట్టుబడుల అవసరం కూడా ఉండదు''అని క్రిసిల్ రేటింగ్స్ అసోసియేట్ డైరెక్టర్ పల్లవి సింఘ్ తెలిపారు. పెద్ద మొత్తంలో కొత్త గదులు అందుబాటులోకి వస్తున్నప్పటికీ, అదే సమయంలో ఆక్యుపెన్సీ (రూముల వినియోగం) వచ్చే ఆర్థిక సంవత్సరంలో 74–75 శాతం స్థాయిలో ఉండొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. ఈ ఏడాది కంటే 1–1.5% తక్కువగా ఉంటుందని పేర్కొంది. వ్యయాలను సమర్థవంతంగా నియంత్రించడం, టెక్నాలజీ, మానవ వనరుల మెరుగైన వినియోగం, అస్సెట్ లైట్ విధానం ఫలితంగా పరిశ్రమ ఎబిటా మార్జిన్ 1–1.5% పెరిగి 2024–25లో 33–34 శాతానికి చేరవచ్చన్నది క్రిసిల్ అంచనా.

వృద్ధిపై ఎల్అండ్‌టీ విశ్వాసం

- నిర్మాణం, మైనింగ్ మెషినరీపై సానుకూలం
- కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కె.గార్గ్



న్యూఢిల్లీ: ఎల్అండ్‌టీ తన నిర్మాణం, మైనింగ్ మెషినరీ వ్యాపార వృద్ధిపై ఆశావహంగా ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 20 శాతం వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేస్తోంది. వచ్చే ఐదేళ్లలో అమ్మకాలను రెట్టింపు చేసుకోవాలన్న లక్ష్యంతో ఉన్నట్టు కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అరవింద్ కె.గార్గ్ తెలిపారు. ''లాభాలతో సమానంగా ఆదాయాలను రెట్టింపు చేసుకునే లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉన్నాం. ఇందుకోసం సేవలు, సామర్థ్యాలపై పెట్టుబడులు పెట్టనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మినీ ఎక్స్‌కవేటర్ కొమాట్సు పీసీ 35ను విడుదల చేశాం. ఇది వృద్ధికి మద్దతునిస్తుంది''అని గార్గ్ వివరించారు. నిర్మాణ రంగ ఎక్విప్‌మెంట్‌లో కొమాట్సు, ఎల్అండ్‌టీ 1998లో జాయింట్ వెంచర్ ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. ఈ భాగస్వామ్యంలో భాగంగా కొమాట్సు తయారు చేస్తోందని, తాము విక్రయాలు, విక్రయానంతర సేవలు చూసుకుంటున్నామని గార్గ్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగంలో 15 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నట్టు చెప్పారు.

క్లీన్‌స్వీప్ ఖాయమేనా!



నేడు వెస్టిండీస్‌తో భారత్ ఆఖరి వన్డే

అసాధారణ ఫామ్‌లో హర్మన్ బృందం ● పరువు కోసం కరీబియన్ పోరాటం

ఉదయం గం. 9:30 నుంచి 'స్పోర్ట్స్18', జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

వడోదర: అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థిని చిత్తు చేస్తున్న భారత మహిళల జట్టు ఇప్పుడు క్లీన్‌స్వీప్ లక్ష్యంగా ఆఖరి పోరుకు సిద్ధమైంది. అచ్చొచ్చిన వడోదర పిచ్‌పై నేడు జరిగే మూడో వన్డేలో వెస్టిండీస్‌ను 'ఢీ'కొట్టేందుకు సిద్ధమైంది. హర్మన్‌ప్రీత్ బృందం ఉన్న ప్రస్తుత ఫామ్ దృష్ట్యా 3-0తో సిరీస్‌ను ముగించడం ఏమంత కష్టం కానేకాదు. 217/4, 314/9, 358/5... ఆఖరి టి20 సహా, గత రెండు వన్డేల స్కోర్లివి. దుర్భేద్యమైన టాపార్డర్ బ్యాటింగ్ లైనప్, నిప్పులు చెరుగుతున్న బౌలింగ్ కరీబియన్‌కు కష్టాలనే మిగిలిస్తున్నాయి. మరోవైపు రెండు పరిమిత ఓవర్ల సిరీస్‌లను సమర్పించుకున్న వెస్టిండీస్ ఇప్పుడు పరువు కోసం పాకులాడుతోంది. పర్యటనలో ఆఖరి పోరులో గెలిచి స్వదేశానికి విజయంతో పయనం కావాలని భావిస్తోంది. కానీ ఇదంతా సులభం కాదు.

స్మృతిని ఆపేదెవరు?

భారత ఓపెనర్ స్మృతి మంధాన జోరే జట్టుకు కొండంత బలంగా మారింది. గత ఐదు ఇన్నింగ్స్‌లలో వరుసగా 54, 62, 77, 91, 53... అర్ధసెంచరీలను అవలీలగా బాదేసింది. అసాధారణ ఫామ్‌లో ఉన్న స్మృతికి ఇప్పుడు టాపార్డర్‌లో ప్రతీక రావల్, హర్లీన్ డియోల్ జతవ్వడంతో విండీస్ బౌలింగ్ అదేపనిగా కుదేలవుతోంది. వీళ్లకు అడ్డుకట్ట వేయడం ఎలాగో తెలియక కరీబియన్ జట్టు సతమతమవుతోంది. అలాగని జెమీమా రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్‌లు ఉన్న మిడిలార్డర్ తక్కువేం కాదు. 'టాప్' శుభారంభాల్ని భారీస్కోర్లుగా మలిచేయడంలో మిడిలార్డర్ పాత్ర చాలావుంది. ఇక బౌలింగ్ దళం కరీబియన్ల పాలిట సింహస్వప్నమవుతోంది. పేస్‌లో రేణుక, దీప్తిశర్మ, స్పిన్‌లో ప్రియా మిశ్రా నిలకడగా విండీస్ బ్యాటర్లకు ముందరికాళ్లకు ముందే బంధమేస్తున్నారు. ఇలాంటి ఆతిథ్య జట్టుకు చివరి వన్డేలో గెలుపు సాధ్యమే!

కష్టాల్లో కరీబియన్ టీమ్

భారత పర్యటనకు వచ్చిన వెస్టిండీస్ మహిళల జట్టుకు వరుసగా తీవ్ర నిరాశ ఎదురవుతూనే ఉంది. టి20 సిరీస్‌లో ఒక మ్యాచ్ అయినా నెగ్గింది. ఇప్పుడు వన్డే సిరీస్‌లో ఆ ఫలితం కోసం పెద్ద పోరాటం చేసినా కూడా... ప్రస్తుత పరిస్థితుల్లో ఓదార్పు కష్టంగానే కనబడుతోంది. తొలివన్డేలో అయితే ఘోరంగా కుప్పకూలిన విండీస్ సేన గత మ్యాచ్‌లో మాత్రం భారత బౌలర్లను కాస్త ఢీకొట్టగలిగింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్, షెమైన్ క్యాంప్‌బెల్, జైదా జేమ్స్, అఫీ ఫ్లెచర్ నిలకడను ప్రదర్శించారు. అయితే ప్రత్యర్థి 300 పైచిలుకు చేసే స్కోర్లను కట్టడి చేసే బౌలర్లయితే లేరు. రెండు మ్యాచ్‌ల్ని పరిశీలిస్తే కాస్తో... కూస్తో... ప్రభావం చూపిన బౌలర్ దాదాపు లేదనే చెప్పొచ్చు. ఇలాంటి స్థితిలో ఉన్న హేలీ మాథ్యూస్ సేన 0-3ని తప్పించుకొని 1-2తో ముగించడం పెద్ద సవాలే!

తుది జట్లు (అంచనా)

భారత జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతీక, హర్లీన్ డియోల్, జెమీమా, రిచా ఘోష్, దీప్తిశర్మ, టిటాస్ సాధు, రేణుక, ప్రియా మిశ్రా, సైమా ఠాకూర్.

వెస్టిండీస్ జట్టు: హేలీ మాథ్యూస్ (కెప్టెన్), క్వియాన, నెరిస్సా క్రాఫ్టన్, రషద విలియమ్స్, డియాండ్రా, షెమైన్, ఆలియా, జైదా జేమ్స్, అఫీ ఫ్లెచర్, కరిష్మా, షమీలియా కానెల్.





సెమీస్‌లో యూపీ యోధాస్, పట్నా పైరేట్స్

ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో ఓడిన మాజీ చాంపియన్స్ జైపూర్ పింక్ పాంథర్స్, యు ముంబా

పుణే: గత ఏడాది ప్రొ కబడ్డీ లీగ్‌లో 11వ స్థానంతో సరిపెట్టుకున్న యూపీ యోధాస్ ఈసారి మాత్రం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన తొలి ఎలిమినేటర్ మ్యాచ్‌లో యూపీ యోధాస్ 46-18 పాయింట్ల తేడా మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ జట్టును చిత్తుగా ఓడించింది. రెయిడర్ భవానీ రాజ్‌పుత్ 12 పాయింట్లతో మెరిసి యూపీ యోధాస్‌ను సెమీఫైనల్‌కు చేర్చాడు. హితేశ్ 6 పాయింట్లు రాబట్టగా... గగన్ గౌడ, సుమిత్ 5 పాయింట్ల చొప్పున సాధించారు. భవానీ రాజ్‌పుత్ 14 సార్లు రెయిడింగ్‌కు వెళ్లాడు. 9 సార్లు పాయింట్లతో తిరిగి వచ్చాడు. రెండుసార్లు దొరికిపోగా, మూడుసార్లు పాయింట్ సాధించకుండానే వెనక్కి వచ్చాడు. మరోవైపు పింక్ పాంథర్స్ జట్టు సమష్టిగా విఫలమైంది. ఆ జట్టు రెయిడర్లుగానీ, డిఫెండర్లుగానీ ఆకట్టుకోలేకపోయారు. డిఫెండర్ రెజా మీర్‌బాఘేరి ఐదు పాయింట్లతో సరిపెట్టుకున్నాడు. భారీ ఆశలు పెట్టుకున్న కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ కేవలం రెండు రెయిడింగ్ పాయింట్లు సాధించి నిరాశపరిచాడు. రెండో ఎలిమినేటర్ మ్యాచ్‌లో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్ 31-23 పాయింట్ల తేడాతో మాజీ విజేత యు ముంబా జట్టును ఓడించి ఎనిమిదోసారి సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. పట్నా పైరేట్స్ స్టార్ రెయిడర్లు దేవాంక్ 8 పాయింట్లు, అయాన్ 10 పాయింట్లు స్కోరు చేసి తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆల్‌రౌండర్ గుర్‌దీప్ ఐదు పాయింట్లతో రాణించాడు. యు ముంబా తరఫున అమీర్ మొహమ్మద్ 7 పాయింట్లు... అజిత్ చౌహాన్ 5 పాయింట్లు సాధించారు.

నేడు జరిగే సెమీఫైనల్స్‌లో హరియాణా స్టీలర్స్‌తో యూపీ యోధాస్ (రాత్రి 8 గంటల నుంచి), దబంగ్ ఢిల్లీతో పట్నా పైరేట్స్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి. మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్-2 చానెల్‌లో, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

వన్డేలో 407 'ఛే'దంచేశారు'

విదర్భపై ఉత్తరప్రదేశ్ రికార్డు ఛేజింగ్

- సమీర్ రిజ్వీ రెండో 'డబుల్' సెంచరీ
- 105 బంతుల్లో 10 ఫోర్లు, 18 సిక్స్‌లతో 202 నాటౌట్


సమీర్ రిజ్వీ

వడోదర: భారత దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్‌లో రికార్డు లక్ష్యఛేదన నమోదైంది. పురుషుల అండర్-23 వన్డే టోర్నమెంట్‌లో సూపర్ 'డబుల్' ఫామ్‌లో ఉత్తరప్రదేశ్ (యూపీ) బ్యాటర్ సమీర్ రిజ్వీ (105 బంతుల్లో 202 నాటౌట్; 10 ఫోర్లు, 18 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. వరుస మ్యాచ్‌ల్లో రెండో అ'ద్వితీయ' సెంచరీ సాధించడంతో యూపీ 407 పరుగుల లక్ష్యాన్ని 41.2 ఓవర్లలోనే ఛేదించి దేశవాళీ క్రికెట్ పుటలకెక్కింది. జీఎస్ఎఫ్‌సీ మైదానంలో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట సొంతగడ్డపై విదర్భ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 406 పరుగుల భారీస్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్ దనిశ్ మాలేవర్ (123 బంతుల్లో 142; 16 ఫోర్లు, 4 సిక్స్‌లు), మిడిలార్డర్‌లో కెప్టెన్ ఫయాజ్ (62 బంతుల్లో 100; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) 'శత'క్కొట్టారు. మూడో వికెట్‌కు వీరిద్దరు 197 పరుగులు జోడించారు. తర్వాత జగ్‌జోత్ (26 బంతుల్లో 61; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధాటిగా అర్ధసెంచరీ సాధించడంతో విదర్భ 400 పైచిలుకు భారీ స్కోరు చేసింది. అయితే ఈ సంతోషం ప్రత్యర్థి లక్ష్యఛేదనకు దిగడంతోనే ఆవిరైంది. ఓపెనర్లు శౌర్య సింగ్ (42 బంతుల్లో 62; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), స్వస్తిక్ (28 బంతుల్లో 41; 1 ఫోర్, 4 సిక్స్‌లు) 10.4 ఓవర్లలోనే 106 పరుగులు చకచకా జతచేశారు. ఈ మెరుపు శుభారంభం రికార్డు ఛేజింగ్‌కు బాటవేసింది. వన్‌డౌన్ బ్యాటర్ షోయబ్ సిద్దిఖీ (73 బంతుల్లో 96 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రిజ్వీ అబేధ్యమైన మూడో వికెట్‌కు కేవలం 173 బంతుల్లోనే 296 పరుగులు ధనాధన్‌గా జతచేయడంతో ఉత్తర ప్రదేశ్ జట్టు 41.2 ఓవర్లలోనే 2 వికెట్ల నష్టానికి 409 పరుగులు చేసి గెలిచింది. ఈ టోర్నీలో సమీర్ గత మ్యాచ్‌లో త్రిపురపై కూడా (93 బంతుల్లో 201 నాటౌట్) డబుల్ సెంచరీతో కదంతొక్కాడు. ఈ రెండు సందర్భాల్లోనూ అతను అవుట్ కాకుండా అజేయంగా నిలవడం విశేషం.


ప్యాటర్సన్

పాకిస్తాన్ 211 ఆలౌట్

- నిప్పులు చెరిగిన ప్యాటర్సన్, బాష్
- తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 82/3

సెంచూరియన్: అరంగేట్రం చేసిన 'బాక్సింగ్ డే' టెస్టును దక్షిణాఫ్రికా సీమర్ కార్బిన్ బాష్ (4/63) చిరస్మరణీయం చేసుకున్నాడు. సహచర పేసర్ డేన్ పాటర్సన్ (5/61)తో కలిసి పాకిస్తాన్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. తొలి టెస్టు మొదలైన రోజే ముందుగా బ్యాటింగ్ చేసిన పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 57.3 ఓవర్లలో 211 పరుగుల వద్ద ఆలౌటైంది. మిడిలార్డర్ బ్యాటర్ కమ్రాన్ గులామ్ (54; 8 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే రాణించి సఫారీ బౌలర్లను ఎదుర్కొని అర్ధసెంచరీ సాధించాడు. మిగిలిన వారిలో అమీర్ జమాల్ (28; 4 ఫోర్లు, 1 సిక్స్), రిజ్వాన్ (27; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఆతిథ్య దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి 22 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది. జోర్జి (2), రికెల్టన్ (8), స్టబ్స్ (9) సింగిల్ డిజిట్‌కే నిష్క్రమించినా... ఓపెనర్ మార్క్‌రమ్ (47 బ్యాటింగ్; 9 ఫోర్లు) పాక్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. అతనితో పాటు కెప్టెన్ బవుమా (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.



సీన్ విలియమ్స్ అజేయ సెంచరీ

- జింబాబ్వే 363/4
- అఫ్గానిస్తాన్‌తో తొలి టెస్టు

బులవాయో: జింబాబ్వే పర్యటనకు వచ్చిన అఫ్గానిస్తాన్‌కు తొలి టెస్టులో ఆతిథ్య బ్యాటర్ల నుంచి సవాళ్లు ఎదురయ్యాయి. గురువారం మొదలైన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 4 వికెట్లకు 363 పరుగులు చేసింది. ఓపెనర్ బెన్ కరన్ (74 బంతుల్లో 68; 11 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ కై టానో (115 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్) రెండో వికెట్‌కు 49 పరుగులు జత చేశారు. కరన్ నిష్క్రమించాక వచ్చిన సీన్ విలియమ్స్ (161 బంతుల్లో 145 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అఫ్గాన్ బౌలర్లపై వన్డేను తలపించే ఇన్నింగ్స్ ఆడాడు. విలువైన భాగస్వామ్యాలతో జట్టు భారీస్కోరుకు బాటలు వేశాడు. కైటానోతో కలిసి మూడో వికెట్‌కు 78 పరుగులు, అనంతరం మైయెర్స్ (27; 3 ఫోర్లు)తో నాలుగో వికెట్‌కు 50 పరుగులు జోడించారు. తర్వాత విలియమ్స్, కెప్టెన్ ఇర్విన్ (94 బంతుల్లో 56 బ్యాటింగ్; 6 ఫోర్లు)తో కలిసి జట్టు స్కోరును 300 పరుగులు దాటించాడు. ఈ క్రమంలో 115 బంతుల్లోనే విలియమ్స్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు ఇర్విన్ కూడా అర్ధ సెంచరీ సాధించడంతో ఇద్దరు అబేధ్యమైన ఐదో వికెట్‌కు 143 పరుగులు జోడించారు. అఫ్గాన్ బౌలర్లలో ఘజన్‌ఫర్ 2, నవీద్ జద్రాన్, జహీర్ ఖాన్ చెరో వికెట్ తీశారు.

ఆంధ్ర ఆల్‌రౌండ్ షో

- సిక్కింపై ఘనవిజయం
- రాణించిన రికీ భుయ్


రికీ భుయ్

ముంబై: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆంధ్ర జట్టు విజయ్ హజారే ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నీలో రెండో విజయం ఖాతాలో వేసుకుంది. గ్రూప్ 'బి'లో భాగంగా గురువారం జరిగిన పోరులో ఆంధ్ర జట్టు 8 వికెట్ల తేడాతో సిక్కిం జట్టును ఓడించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన సిక్కిం 32.2 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. రోనిత్ మోరె (19) టాప్‌స్కోరర్ కాగా... తక్కిన వాళ్లంతా విఫలమయ్యారు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు 3 వికెట్లు పడగొట్టగా... చీపురుపల్లి స్టీఫెన్, సాయి రాహుల్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనలో ఆంధ్రజట్టు 20.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. రికీ భుయ్ (36 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడగా... కెప్టెన్ శ్రీకర్ భరత్ (21; 5 ఫోర్లు), అశ్విన్ హెబర్ (27; 5 ఫోర్లు), మహీప్ కుమార్ (23 నాటౌట్; 2 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. సిక్కిం బౌలర్లలో మొహమ్మద్ తాలిమ్ రెండు వికెట్లు పడగొట్టాడు. టోర్నీ తొలి మ్యాచ్‌లో రైల్వేస్‌పై విజయం సాధించిన ఆంధ్ర జట్టు... రెండో మ్యాచ్‌లో రాజస్తాన్ చేతిలో ఓడింది. తాజా ఫలితంతో 8 పాయింట్లు ఖాతాలో వేసుకొని గ్రూప్‌లో రెండో స్థానంలో ఉంది. సత్యనారాయణ రాజుకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'అవార్డు దక్కింది. తదుపరి మ్యాచ్‌లో శనివారం సర్వీసెస్‌తో ఆంధ్ర ఆడనుంది.

హైదరాబాద్‌కు మరో ఓటమి


తిలక్ వర్మ

తిలక్ వర్మ, అవనీశ్ అర్ధ సెంచరీలు వృథా

అహ్మదాబాద్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో పరాజయం పాలైంది. గ్రూప్ 'సి'లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో సౌరాష్ట్ర చేతిలో ఓడింది. ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లాడిన హైదరాబాద్ తొలి మ్యాచ్‌లో విజయం తర్వాత... రెండు పరాజయాలతో 4 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానంలో ఉంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్ వర్మ (81 బంతుల్లో 57; 3 ఫోర్లు, 1 సిక్స్), అవనీశ్ రావు (56 బంతుల్లో 52; 6 ఫోర్లు) అర్ధశతకాలు సాధించారు. తన్మయ్ అగర్వాల్ (33; 5 ఫోర్లు), తనయ్ త్యాగరాజన్ (31; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. సౌరాష్ట్ర బౌలర్లలో చిరాగ్ జానీ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సౌరాష్ట్ర జట్టు 42.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 248 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ హార్విక్ దేశాయ్ (129 బంతుల్లో 125 నాటౌట్; 19 ఫోర్లు) అజేయ శతకంతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించగా... జాయ్ గోహిల్ (68 బంతుల్లో 60; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించాడు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ 2... చామా మిలింద్, వరుణ్ గౌడ్ చెరో వికెట్ తీశారు. హార్విక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తదుపరి మ్యాచ్‌లో శనివారం పుదుచ్చేరితో హైదరాబాద్ తలపడుతుంది.


బెంగాల్ ఆటగాళ్ల సంబరం

52వసారి సెమీస్‌లో పశ్చిమ బెంగాల్

సాక్షి, హైదరాబాద్: సంతోష్ ట్రోఫీ జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మాజీ చాంపియన్ పశ్చిమ బెంగాల్ జట్టు 52వసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. డెక్కన్ ఎరీనాలో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో పశ్చిమ బెంగాల్ 3-1 గోల్స్ తేడాతో ఒడిశా జట్టును ఓడించింది. 25వ నిమిషంలో రాకేశ్ ఓరమ్ గోల్‌తో ఒడిశా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 45+2వ నిమిషంలో నరోహరి శ్రేష్ట గోల్‌తో బెంగాల్ స్కోరును 1-1తో సమం చేసింది. 77వ నిమిషంలో రోబీ హన్స్‌దా గోల్‌తో బెంగాల్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. 90+2వ నిమిషంలో మనోతోస్ గోల్‌తో బెంగాల్ 3-1తో విజయాన్ని ఖరారు చేసుకుంది. మరో క్వార్టర్ ఫైనల్లో మణిపూర్ 5-2 గోల్స్ తేడాతో ఢిల్లీ జట్టును ఓడించి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. నేడు జరిగే మిగతా రెండు క్వార్టర్ ఫైనల్స్‌లో జమ్మూ కశ్మీర్‌తో కేరళ; మేఘాలయాతో సర్వీసెస్ తలపడతాయి.

శ్రావ్య శివాని జోడీ పరాజయం



అహ్మదాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి చిలకలపూడి శ్రావ్య శివాని పోరాటం ముగిసింది. డబుల్స్ విభాగంలో శ్రావ్య శివాని-మధురిమ సావంత్ (భారత్) ద్వయం క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. వైష్ణవి అడ్కర్-పూజా ఇంగాలె (భారత్) జోడీతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రావ్య శివాని-మధురిమ జంట 2-6, 3-6తో పరాజయం పాలైంది. మరో క్వార్టర్ ఫైనల్లో సోహా సాదిక్-ఆకాంక్ష (భారత్) జోడీ 6-4, 6-2తో సేజల్-ఖుషాలీ (భారత్) జంటపై గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

ఆధునిక సాంకేతికతతో యువతను సన్నద్ధం చేయాలి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- యువతకు ప్రోత్సాహకరంగా ప్రభుత్వ విధానాలని వెల్లడి
- రాష్ట్రీయ బాల్ పురస్కార్ గ్రహీతలతో ప్రధాని ముచ్చట

న్యూఢిల్లీ: దేశ పురోగతిలో యువత ఎంతో కీలకభూమిక పోషించాల్సి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. యువతలో నైపుణ్యాలను గుర్తించి, వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుదని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు మారుతుతున్న కృత్రిమ మేధ(ఏఐ), మెషీన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికత నైపుణ్యంతో వారిని సన్నద్ధం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. వివిధ రంగాల్లో వేగంగా సంభవించే మార్పులు, సవాళ్లకు అనుగుణంగా యువత మారాల్సిన అవసరముందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాల్లో యువతకు ఇస్తున్న ప్రాధాన్యం, నూతన విద్యా విధానానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. సర్వజన శ్రేయస్సు అనే మన పూర్వీకుల బోధనలకు అనుగుణంగానే రాజ్యాంగం మనకు సమానత్వ ఆవశ్యతను తెలియజేస్తోందన్నారు. మన దేశంలో ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అనే బేధం లేదు. రాజ్యాంగం దృష్టిలో అందరూ సమానులేనని స్పష్టం చేశారు. గురు గోవింద్ సింగ్ కుమారులు 'సాహిబ్‌జాదాస్'ప్రాణత్యాగం చేసిన వీర్ బాల్ దివస్ సందర్భంగా గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

సాహిబ్‌జాదాస్ నుంచి ప్రేరణ

దేశం కోసం మనం చేసే ప్రతి పనీ సాహసమే. మొఘల్ చక్రవర్తి అణచివేతకు లొంగడం కంటే ధైర్యం, ఆత్మగౌరవంతో పోరాటమే మేలని సాహిబ్‌జాదాస్ ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు. విపత్కర పరిస్థితులెన్ని ఎదురైనా దేశం కంటే మిన్న మరేదీ లేదని వారు మనకు తెలియజెప్పారు. 300 ఏళ్ల క్రితం ఇదే డిసెంబర్ 26వ తేదీన ఎంతో చిన్న వాళ్లయిన సాహిబ్‌జాదాస్, మొక్కవోని ధైర్యసాహసాలను, త్యాగనిరతిని ప్రదర్శించారు. మొఘల్ పాలకులు ఎన్ని ప్రలోభాలు చూపినా లొంగలేదు. తీవ్రమైన హింసను భరించారు. వారి దృష్టిలో దేశమే అత్యున్నతం. వారి వారసత్వం నుంచి మనం ప్రేరణ పొందాలి. సాహిబ్‌జాదాస్ వంటి వారి త్యాగాలు, ధైర్య సాహసాలపైనే భారత ప్రజాస్వామ్య సౌధం దృఢంగా నిర్మితమైంది.

యువత రాజకీయాల్లోకి రావాలి

దేశం మరింత ఐకమత్యంగా ముందుకు సాగేందుకు ధైర్యం, సేవానిరతిని కలిగి ఆవిష్కరణలపై దృష్టి సారించాలి. దేశంలో రాజకీయ నేపథ్యం లేని కుటుంబాలకు చెందిన లక్ష మంది యువత రాజకీయాల్లో ప్రవేశించాలి. దీనిద్వారా వచ్చే 25 ఏళ్లలో కొత్త తరానికి రాజకీయాలను పరిచయం చేయాలన్నదే నా ఉద్దేశం. వచ్చే ఏడాది స్వామి వివేకానందుని జయంతి నాడు 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్'ను నిర్వహిస్తాంచనున్నాం. దేశంలోని గ్రామాలు, పట్టణాలు, నగరాలకు చెందిన యువత పాల్గొని అభివృద్ధి చెందిన భారత్ అనే విజన్‌కు రోడ్‌మ్యాప్‌పై జరిగే చర్చలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ గ్రహీతలతో ముచ్చటించారు. విజేతలైన 17 మందికి ప్రధాని అభినందనలు తెలిపారు. భారతీయ యువత ఏదైనా సాధించగలదని వీరు నిరూపించి చూపారని ప్రశంసించారు. కళలు, సంస్కృతి, సాహసం, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, క్రీడలు, పర్యావరణ, ఆవిష్కరణ రంగాల్లో అసాధారణ కృషి చేసినందుకు వీరిని బాల్ పురస్కార్‌కు ఎంపిక చేశారు. అదేవిధంగా, చురుకైన కమ్యూనిటీ భాగస్వామ్యం ద్వారా పోషకాహార ఫలితాలను మెరుగుపరచడానికి ఉద్దేశించిన 'సుపోషిత్ గ్రామ్ పంచాయత్ అభియాన్'అనే దేశవ్యాప్త కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు.



బాలపురస్కార్ అవార్డు గ్రహీతలతో ప్రధాని మోదీ

ఇది ఏఐ యుగం

ఇది యంత్ర యుగం కాదు, అంతకు మించి మెషీన్ లెర్నింగ్ యుగం. కృత్రిమ మేధ(ఏఐ) ఇప్పుడు అన్నిటికీ కేంద్రంగా మారింది. సంప్రదాయ సాఫ్ట్‌వేర్ స్థానాన్ని ఏఐ భర్తీ చేస్తుండటం మనమిప్పుడు చూస్తున్నాం. ముమ్ముందు ఎదురయ్యే ఇటువంటి సవాళ్లకు మన యువతను సన్నద్ధం చేయాల్సిన అవసరముంది. రైల్వేలు.. సెమీ కండక్టర్లు..ట్రావెల్, ఆస్ట్రానమీ..ఇలా రంగమేదైనా యువత తమకు నచ్చిన అంశంపై పట్టు సాధించేందుకు కృషి చేయాలి. సైన్స్, క్రీడల నుంచి వ్యాపార రంగం వరకు స్టార్టప్‌లతో నూతన పరివర్తన శకం మొదలైంది. యువతకు మరింత చేయూతనిచ్చేలా మన విధానాలు రూపొందాయి. స్టార్టప్ అనుకూల విధానాలు, అంతరిక్ష ఆర్థిక రంగం, క్రీడలు, ఫిట్‌నెస్..ఇలా ప్రతిదీ యువతకు లాభం కలిగించేవే.



నమోదైన ఓటర్లు 97.97 కోట్లు

- వీరిలో 47.63 కోట్ల మంది మహిళలు
- 2019తో పోలిస్తే 7.43% ఓటర్ల పెరుగుదల
- సార్వత్రిక ఎన్నికల గణాంకాలను విడుదల చేసిన ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: 2024 సార్వత్రిక ఎన్నికల సమయానికి దేశంలో 97.97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) తెలిపింది. 2019 లోక్‌సభ ఎన్నికలప్పుడున్న 91.19 కోట్ల మందితో పోలిస్తే ఇది 7.43% ఎక్కువని పేర్కొంది. 2019లో 61.4 కోట్ల ఓట్లు పోలవగా 2024లో 64.64 కోట్ల ఓట్లు పోలయ్యాయని ఇందులో 64.21 కోట్లు ఈవీఎంలలో నమోదైనట్లు వివరించింది. ఇందులో 32.93 కోట్ల పురుషులు, 31.27 కోట్ల మహిళలు, 13 వేల మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా, సార్వత్రిక ఎన్నికల్లో 42.81 లక్షల పోస్టల్ బ్యాలెట్లు నమోదయ్యాయి. అస్సాంలోని ధుబ్రి నియోజకవర్గంలో అత్యధికంగా 92.3% ఓట్లు పోల్ కాగా... అత్యల్పంగా శ్రీనగర్‌లో 38.7% పోలింగ్ నమోదైంది. అయితే 2019లో శ్రీనగర్‌లో ఇది 14.4% మాత్రమేనని ఈసీ గుర్తు చేసింది. దేశవ్యాప్తంగా 2024లో నోటాకు 63.71 లక్షల ఓట్లు పడ్డాయని కూడా వివరించింది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో జరిగిన ప్రపంచంలోని అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ విస్తృత గణాంకాలను సీఈసీ గురువారం విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 2024లో 10.52 లక్షల పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 2019 కంటే ఇది 14,816 ఎక్కువ. 2019లో 540 చోట్ల రీపోలింగ్ జరగ్గా ఈ ఏడాది కేవలం 40 పోలింగ్ స్టేషన్లలోనే రీపోలింగ్ అయ్యింది. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 1.62 లక్షల పోలింగ్ స్టేషన్లు ఉండగా...2019తో పోలిస్తే 2024లో బిహార్‌లో అత్యధికంగా 4,739 పోలింగ్ స్టేషన్లు పెరిగాయి.

తీవ్ర ప్రమాదంలో రాజ్యాంగం

- అంబేడ్కర్‌ను అవమానించిన షా వైదొలగాల్సిందే
- లో జరిగిన సీడబ్ల్యూసీ భేటీ తీర్మానం
- 2025లో సంస్థాగతంగా సమూలమార్పులు: ఖర్గే



బెళగావిలో సీడబ్ల్యూసీ భేటీకి ర్యాలీగా వెళుతున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఖర్గే, రాహుల్‌గాంధీ, డీకే శివకుమార్ తదితరులు

బెళగావి: మన రాజ్యాంగం మునుపెన్నడూ ఎదుర్కోనంతటి తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడం హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేసింది. దేశ ప్రజలకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం డిమాండ్ చేసింది. అమిత్ షా చర్య రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీలు దశాబ్దాలుగా సాగిస్తున్న కుట్రలో భాగమేనని మండిపడింది. సీడబ్ల్యూసీ సమావేశం గురువారం కర్ణాటకలోని బెళగావిలో జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ చీఫ్ ఖర్గే మాట్లాడారు. పెరుగుతున్న ధరలు, అవినీతి, రాజ్యాంగంపై దాడి వంటి వాటిపై పాదయాత్రలు వంటి రాజకీయ ప్రచార కార్యక్రమాలను 13 నెలలపాటు చేపడతామన్నారు. జవాబుదారీతనం, సమర్థత ప్రాతిపదికగా పార్టీలో భారీగా సంస్థాగత ప్రక్షాళన చేపడతామని చెప్పారు. అసత్యాలను వ్యాప్తి చేసే వారిపై పోరాటానికి పార్టీకి 2025 సంస్థాగత సాధికారిత వత్సరంగా ఉంటుందని ఖర్గే తెలిపారు. ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకు ప్రాంతీయ, నూతన నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అమలు చేసి ఏఐసీసీ నుంచి బూత్ స్థాయి వరకు ఎన్నికలు జరుపుతామన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు గౌరవం కల్పించేందుకు పార్టీ పోరాడుతుందన్నారు. ఖర్గేతోపాటు పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శులు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్న 'నవ సత్యాగ్రహ బైఠక్'ఈ మేరకు రెండు రాజకీయ తీర్మానాలను చేసింది. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'వంటి విధానాలను తీసుకురావడం ద్వారా సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. న్యాయవ్యవస్థ, ఎన్నిక కమిషన్, మీడియాలను తీవ్ర ఒత్తిడులకు గురిచేసి అనుకూలంగా మార్చుకుంటోంది. ఇటీవలి పార్లమెంట్ సమావేశాలకు పాలక పక్షం తీవ్ర అవరోధాలు కలిగించింది. పోలింగ్ పత్రాలను ప్రజలకు అందుబాటులో లేకుండా చేసేలా ఎన్నికల నిబంధనావళిని మార్చుకుంటోంది'అంటూ సీడబ్ల్యూసీ మండిపడింది. హరియాణా, మహారాష్ట్రలలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సమగ్రత దెబ్బతిందని ఆరోపించింది. మైనారిటీ వర్గం లక్ష్యంగా విద్వేషం, హింసను ప్రభుత్వమే ప్రేరేపించడంపై ఆందోళన వ్యక్తం చేసింది. కుల గణనను సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని కేంద్రాన్ని కోరింది. ఆర్థిక పురోగతి మందగించిందని, అత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని తెలిపింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధులివ్వాలని కోరింది.

మహాత్ముని ఆశయాలకు భంగం: సోనియా గాంధీ

మహాత్మా గాంధీయే స్ఫూర్తిగా తమ పార్టీ ఇకపైనా కొనసాగుతుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీ స్పష్టం చేశారు. మహాత్ముని ఆశయాలు, సిద్ధాంతాలు, సంస్థలకు కేంద్రంలో అధికారంలో ఉన్న వారి నుంచి ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీజీ హత్యకు దారి తీసిన విషపూరిత వాతావరణాన్ని సృష్టించిన శక్తులైన మోదీ ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్‌లతో పోరాడాలంటూ ఆమె కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం సోనియా ఈ మేరకు సీడబ్ల్యూసీకి పంపిన సందేశాన్ని చదివి వినిపించారు.

కెనడా కొలువులు కష్టమే

ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ సిస్టమ్‌లో మార్పులు

- భారతీయులపై మరింత ప్రభావం



ఒట్టావా: మెరుగైన ఉద్యోగావకాశాల కోసం కెనడా వలస వెళ్లాలనుకునే భారతీయ నిపుణులకు కొత్త సవాళ్లు ఎదురు కానున్నాయి. కెనడా తన ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ ఇమిగ్రేషన్ విధానంలో భారీ మార్పులు ప్రకటించింది. పర్మినెంట్ ఇమిగ్రేషన్ ప్రోగ్రాంకు అభ్యర్థి అర్హతను పర్యవేక్షించే కీలకమైన కాంప్రెహెన్సివ్ ర్యాంకింగ్ సిస్టం (సీఆర్ఎస్)లో మార్పులు చేశారు. కెనడా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ప్రకటన ప్రకారం అభ్యర్థులు ఇకపై ఉద్యోగ ఆఫర్‌పై అదనపు పాయింట్లు పొందరు. ఈ మార్పులన్నీ 2025 నుంచి అమల్లోకి వస్తాయి. అప్పటికే పూల్‌లో ఉన్న ఉద్యోగార్థులతో పాటు అందులోకి కొత్తగా ప్రవేశించే అభ్యర్థులందరికీ ఇది వర్తిస్తుందని కెనడా ప్రకటించింది.

మోసాలను తగ్గించడానికే

తాజా చర్యలపై కెనడా ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్, సిటిజన్‌షిప్ మంత్రి మార్క్ మిల్లర్ మాట్లాడారు. తమ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నిపుణులైన ప్రతిభావంతులను శాశ్వత నివాసులుగా కెనడా వచ్చేలా ప్రోత్సహిస్తూనే మోసాలను తగ్గించడమే వాటి లక్ష్యమని తెలిపారు. ''వలసలు కెనడా విజయానికి మూలస్తంభంగా ఉన్నాయి. సమర్థులు, తెలివైన వారిని కెనడాకు స్వాగతించడానికి కట్టుబడి ఉన్నాం. దీనివల్ల ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉద్యోగాలు, గృహాలతో పాటు వారి అభివృద్ధికి అవసరమైన ప్రోత్సాహం లభిస్తుంది''అన్నారు.

ఏమిటీ 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ'?

ఇది ఫెడరల్ స్కిల్డ్ వర్కర్ ప్రోగ్రాం. కెనడాలోని పలు సంస్థలు స్థానికంగా సరైన అభ్యర్థి దొరక్కపోతే విదేశీ ఉద్యోగులను నియమించుకుంటారు. ఈ లేబర్ మార్కెట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఎస్ఎంఐఏ) ఆధారంగా ఉద్యోగం పొంది శాశ్వత నివాసానికి దరఖాస్తు చేసుకునే ఐటీ ఉద్యోగులకు అదనపు పాయింట్లు అందుతాయి. సీఎస్ఆర్ స్కోర్‌లో అదనంగా 50 నుంచి 200 పాయింట్లు పొందుతారు. ఈ విధానంలో అర్హులైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ ప్రొఫైల్స్ క్రియేట్ చేసుకుని పూల్లోకి ప్రవేశించవచ్చు. రౌండ్లలో ఎక్కువ పాయింట్లు సాధించిన వారిని కెనడా ప్రభుత్వం ఆహ్వానిస్తుంది. దరఖాస్తు అందాక శాశ్వత నివాసం (పీఆర్) ప్రోగ్రాంకు దరఖాస్తు చేసుకోవాలి. దాన్ని ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. కొత్త మార్పుల ప్రకారం ఇకపై ఈ అదనపు పాయింట్లుండవు. వయసు, విద్య, భాషా నైపుణ్యం, ఇతర ప్రమాణాల ఆధారంగా మాత్రమే మూల్యాంకనం చేస్తారు. అంటే అభ్యర్థుల మధ్య పోటీ పెరుగుతుంది.

ప్రభావం ఎవరిపై?: జాబ్ ఆఫర్‌పై అదనపు సీఆర్ఎస్ పాయింట్లను తొలగించడం వల్ల ప్రస్తుతం కెనడాలో తాత్కాలికంగా పనిచేస్తున్న వారిపై ప్రభావం పడుతుంది. ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ సిస్టం ద్వారా శాశ్వత నివాసాన్ని కోరుకునే వారిపైనా ఈ మార్పులు ప్రభావం చూపుతాయి. ఇప్పటికే శాశ్వత నివాసం (పీఆర్) కోసం దరఖాస్తు చే సుకోవడానికి ఆహ్వానించిన అభ్యర్థులను మా త్రం కొత్త నిబంధనలు ప్రభావితం చేయవు. ప్రస్తుతం ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ) కింద పీఆర్ కోసం దరఖాస్తు సమర్పించిన వారికీ వర్తించవు.

ఫ్లాగ్‌పోలింగ్‌పై నిషేధం: కెనడాలోని తాత్కాలిక నివాసితులు ఇకపై దేశం వీడి మళ్లీ తిరిగి రావడానికి కూడా ఇకపై అనుమతి ఉండదు. ఇమిగ్రేషన్ స్థితిని మార్చడానికి సరిహద్దు వద్ద నిర్వహించే ఫ్లాగ్‌పోలింగ్‌ను కెనడా నిషేధించింది. ఇమిగ్రేషన్ పత్రా ల రద్దు, సవరణకు సంబంధిత అధికారులకు అధికారమిచ్చారు. ఈ మార్పులు కూడా 2025 నుంచి అమల్లోకి వస్తాయి.



తగ్గిన పులుల మరణాలు

- గత ఏడాది మరణాలు 182.. ఈ ఏడాది 122 మరణాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పులుల మరణాలు గణనీయంగా తగ్గాయని నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) వెల్లడించింది. పులుల సంరక్షణ చర్యలు పటిష్టం చేయడం, వణ్యప్రాణి చట్టాల కఠిన అమలు, అభయారణ్యాలలో వేటగాళ్ల కట్టడి చర్యల ఫలితంగా మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని పేర్కొంది. గత ఏడాదిలో మొత్తం మరణాల సంఖ్య 182గా ఉండగా, ఈ ఏడాది కేవలం 122 మరణాలే సంభవించినట్లు తెలిపింది. ఈ ఏడాది సంభవించిన మరణాల్లో అధికంగా మధ్యప్రదేశ్‌లో 44, తర్వాతి స్థానంలో మహారాష్ట్రలో 21 పులుల మరణాలు సంభవించాయి. తెలంగాణలో ఈ ఏడాది జనవరిలో కవ్వాల్ రిజర్వ్ ప్రాంతంలో రెండు పులులు మృతి చెందినట్లు నివేదిక పేర్కొంది. దేశ వ్యాప్తంగా 2012 నుంచి 2024 డిసెంబర్ 25 వరకు దేశ వ్యాప్తంగా మొత్తంగా 1,366 పులులు మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 2020లో 106, 2021లో 127, 2022లో 122, 2023లో 182 పులులు మరణించాయి. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 355, మహారాష్ట్రంలో 261, కర్ణాటకలో 179 పులులు మరణించగా, ఆంధ్రప్రదేశ్‌లో 14, తెలంగాణలో 11 మరణాలు సంభవించాయి. వణ్యప్రాణి సంరక్షణ ప్రాంతాల పరిధిలో జరిగిన మరణాలు 50శాతం వరకు ఉండగా, వెలుపల జరిగిన మరణాలు 42 శాతంగా ఉండగా, మరో 8 శాతం వేటగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న సందర్భాలున్నాయి. ఆహారం, నీటి కోసం తమ భూభాగాలను విడిచిపెట్టి బయటికి రావడం, ఆహారం కోసం పులుల మధ్య ఘర్షణలు జరగడం, ఇతర జంతువులతోనే వేటకై పోటీ ఉండటంతో మరణాలు జరుగుతునట్లు నివేదిక తెలిపింది. అయితే గత ఏడాది ప్రాజెక్ట్ టైగర్‌లో బాగంగా గ్రీన్ కవర్ పెంచడం, బఫర్ జోన్‌లలో నిర్మాణాల కట్టడి, అటవీ భూముల బదలాయింపుల నిలుపుదల, వేటగాళ్లపై నిరంతర నిఘా, రాత్రి వేళల్లో సఫారీల నిలుపుదల, టైగర్ రిజర్వ్‌లో నిర్మాణ కార్యకలాపాల కట్టడి వంటి చర్యలతో పులుల మరణాలు తగ్గాయని అంచనా వేసింది.

అసద్ భార్యకు లుకేమియా

సిరియా తాజా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ భార్య అస్మా లుకేమియా (బ్లక్ క్యాన్సర్)తో పోరాడుతున్నారు. వ్యాధి తీవ్రత దృష్ట్యా ఆమె బతికే అవకాశాలు సగమేనని సమాచారం. ఇన్ఫెక్షన్ ముప్పును తగ్గించేందుకు ఆమెను ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అస్మా 2019లో రొమ్ము కేన్సర్ బారిన పడ్డారు. వ్యాధి నుంచి పూర్తిగా బయట పడ్డట్టు ఏడాది చికిత్స తరువాత ప్రకటించారు. కానీ కొంతకాలానికే ఆమెకు బ్లడ్ కేన్సర్ ఉన్నట్టు తేలింది. అస్మా తల్లిదండ్రులు సిరియావాసులు. ఆమె 1975లో లండన్‌లో జన్మించారు. ఆమెకు బ్రిటిష్-సిరియా పౌరసత్వముంది. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, ఫ్రెంచ్ సాహిత్యం చదివారు. 2000 డిసెంబర్‌లో బషర్‌ను పెళ్లాడారు. వారికి ముగ్గురు పిల్లలు సిరియాలో తిరుగుబాటు మొదలైనప్పటి నుంచే అస్మా తన పిల్లలతో కలిసి లండన్ వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. ఇటీవల తిరుగుబాటు సేనలు దేశాన్ని ఆక్రమించుకోవడంతో అసద్ పదవీచ్యుతుడవడం తెలిసిందే. కుటుంబంతో సహా ఆయన రష్యాలో దలదాచుకుంటున్నారు. అయితే మాస్కో జీవితంపై అస్మా అసంతృప్తితో ఉన్నట్టు చెబుతున్నారు. దేశం వీడి వెళ్లేందుకు ప్రత్యేక అనుమతి కోరుతూ రష్యా కోర్టుకు ఆమె పెట్టుకున్న దరఖాస్తును అధికారులు పరిశీలిస్తున్నారు. అసద్ నుంచి విడాకుల కోసం కూడా అస్మా దరఖాస్తు చేసుకున్నట్లు వార్తలొచ్చినా వాటిని రష్యా ఖండించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

మొజాంబిక్‌లో జైల్ బ్రేక్

6,000 మంది తప్పించుకున్న వైనం

పోలీసుల కాల్పుల్లో 33 మంది మృతి

మపుటో: మొజాంబిక్‌లో ఎన్నికల అనంతర హింస చల్లారడం లేదు. రాజధాని మపుటో శివార్లలోని అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో కూడిన సెంట్రల్ జైల్లో బుధవారం అల్లర్లు చెలరేగాయి. పోలీసు సిబ్బంది నుంచి కొందరు ఖైదీలు ఆయుధాలు లాక్కుని తోటివారిని విడిపించడం మొదలు పెట్టారు. అల్లర్లు, తిరుగుబాటును అణిచేందుకు భద్రతా దళాలు వెంటనే రంగంలోకి దిగారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణలో 33 మంది మృతి చెందారు. 15 మందికి పైగా గాయపడ్డట్టు ప్రాథమిక సమాచారం. ఆ క్రమంలో జైలు గోడ కూలిపోవడంతో ఏకంగా 6,000 మందికి పైగా జైలు నుంచి తప్పించుకున్నట్టు దేశ పోలీసు జనరల్ కమాండర్ బెర్నార్డినో రఫెల్ తెలిపారు. వారిలో 150 మందిని పట్టుకున్నామన్నారు. ''నేరారోపణలు రుజువైన 29 మంది కరడుగట్టిన ఉగ్రవాదులను కూడా ఖైదీలు విడిపించుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరో రెండు జైళ్లలోనూ ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి''అని వివరించారు. ఖైదీలు



జైలు నుంచి పారిపోతున్న వీడియోలు వైరల్‌గా మారాయి.

అధికార పార్టీకి వ్యతిరేకంగా

గత అక్టోబర్లో జరిగిన ఎన్నికల్లో దీర్ఘకాలంగా అధికారంలో ఉన్న ఫ్రెలిమో పార్టీ విజయం సాధించింది. ఫలితాలను నిరసిస్తూ అప్పట్నుంచే దేశమంతటా ఆందోళనలు జరుగుతున్నాయి. అధికార పార్టీ విజయాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సోమవారం ధ్రువీకరించింది. దాంతో ఒక్కసారిగా అల్లర్లు తీవ్రతరమయ్యాయి. వాటిలో ఒక్క రోజే కనీసం 21 మంది మరణించినట్టు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది.

అమెరికా జాతీయ పక్షిగా బాల్డ్ ఈగల్

దశాబ్దాల చిహ్నానికి అధికారిక హోదా



వాషింగ్టన్: అమెరికా జాతీయ పక్షిగా బట్టతల డేగ (బాల్డ్ ఈగల్)ను అధ్యక్షుడు జో బైడెన్ అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు కాంగ్రెస్ ఆమోదించిన బిల్లుపై సంతకం చేశారు. ఈ పక్షిని దశాబ్దాలుగా అమెరికా అధికార చిహ్నంగా వాడుతోంది. 1782 నుంచీ యూఎస్ గ్రేట్ సీల్‌పై, డాక్యుమెంట్లలో దీన్ని ఉపయోగిస్తున్నారు. దేశ రాజముద్రపైనా ఇది ఉంది. అయినప్పటికీ అధికారికంగా హోదా మాత్రం కల్పించలేదు. తర్వాత అనేకసార్లు దీన్ని మార్చడానికి విఫల యత్నాలు జరిగాయి. తెల్లటి తల, పసుపు పచ్చ ముక్కు, గోధుమ రంగు శరీరంతో కూడిన బాల్డ్ ఈగల్‌ను జాతీయ పక్షిగా ప్రతిపాదిస్తూ మిన్నెసోటా సభ్యుడు అమీ క్లోబౌచెర్ డిసెంబర్ 16న సెనెట్‌లో బిల్లు ప్రవేశ పెట్టారు. దాన్ని సభ సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బైడెన్ ఆమోదముద్రతో 240 ఏళ్ల తరవాత బాల్డ్ ఈగల్‌కు జాతీయ పక్షి హోదా దక్కింది.

తొలిసారి రాగి సెంటుపై

బాల్డ్ ఈగల్ ఉత్తర అమెరికాకు చెందిన పక్షి. మొట్టమొదట 1776లో మసాచుసెట్స్ రాగి సెంటుపై ఇది అమెరికా చిహ్నంగా కనిపించింది. తర్వాత వెండి డాలర్, హాఫ్ డాలర్, క్వార్టర్ తదితర యూఎస్ నాణేల వెనుక భాగంలో చోటుచేసుకుంది. బంగారు నాణేలకు ఈగల్, హాఫ్ ఈగల్, క్వార్టర్ ఈగల్, డబుల్ ఈగల్ అని నామకరణమూ చేశారు. 1940 జాతీయ చిహ్న చట్టం కింద బాల్డ్ ఈగల్ రక్షిత పక్షి. దాన్ని క్రయ విక్రయాలు చట్టవిరుద్ధం. ''బాల్డ్ ఈగల్‌ను 250 ఏళ్లుగా జాతీయ చిహ్నంగా ఉపయోగిస్తూ వస్తున్నాం. దాన్నిప్పుడు అధికారికంగా ప్రకటించుకున్నాం''అని నేషనల్ ఈగల్ సెంటర్ నేషనల్ బర్డ్ ఇనిషియేటివ్ కో చైర్మన్ జాక్ డేవిస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అర్హత మరే పక్షికీ లేదన్నారు.

సిపాయిల తిరుగుబాటుకు కారణాలివే!

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



1857 సిపాయిల తిరుగుబాటు

దేశానికి స్వాతంత్ర్యం రావడానికి 90 ఏళ్ల ముందే సిపాయిల తిరుగుబాటు మీరట్‌లో ప్రారంభమైంది. ఆ సమయంలో లార్డ్ కానింగ్ గవర్నర్ జనరల్‌గా వ్యవహరించారు. సిపాయిల తిరుగుబాటు కాలంలో ఢిల్లీ సైనికులు మొగల్ చక్రవర్తి రెండో బహదూర్‌షాను పాదుషాగా ప్రకటించారు. సిపాయిల తిరుగుబాటు సమయంలో ఢిల్లీ ముట్టడిలో ఆంగ్లేయులు సాగించిన దారుణ హింసాకాండను గాలిబ్ అనే ఉర్దూ కవి వర్ణించాడు. సిపాయిల తిరుగుబాటుకు అయోధ్యలో హజ్రత్ బేగం నేతృత్వం వహించగా, ఝాన్సీలో లక్ష్మీబాయి, మధ్య భారతదేశంలో తాంతియా తోపే నాయకత్వం వహించారు. ఈ తిరుగుబాటును అణచి వేయడంలో ప్రముఖపాత్ర వహించిన బ్రిటిష్ సేనానులు సర్‌జేమ్స్, అవుట్రామ్, హలావ్‌లాక్, నికల్‌సన్, నెయిల్ లారెన్స్, కాంప్‌బెల్, సర్ రోజ్‌వుడ్.

తిరుగుబాటుకు కారణాలు

డల్హౌసీ అనుసరించిన దురాక్రమణ విధానం రాజకీయ కారణం కాగా, బ్రిటిషర్ల నూతన ఆర్థిక విధానం ఆర్థిక కారణమైంది. హైందవ సాంఘిక వ్యవస్థను ఖండించటం సాంఘిక కారణమైతే భారత్, ఐరోపా సైనికుల మధ్య ఉన్న తారతమ్యం సైనిక కారణమైంది.

రాజకీయ కారణాలు

తిరుగుబాటుకు ప్రధాన కారకుడు గవర్నర్ జనరల్ లార్డ్ డల్హౌసీ. ఈయన రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, జైపూర్, సంబాల్‌పూర్, ఝాన్సీ తదితర రాజ్యాలు ఆక్రమించుకున్నాడు. అస్తవ్యస్త పాలన సాకుతో అవధ్ (యూపీ)ను కూడా ఆక్రమించాడు. పీష్వా రెండో బాజీరావు దత్త పుత్రుడు నానాసాహెబ్ (దొండు పంత్). డల్హౌసీ ఇతడి పెన్షన్‌ను నిలిపివేశాడు. నానాసాహెబ్‌కు మద్దతుగా అతడి సోదరుడు రావు సాహెబ్ పోరాడాడు. బ్రిటిషర్లు మొగల్ చక్రవర్తి బిరుదును రద్దుచేశారు. చక్రవర్తి కుటుంబీకులు ఎర్రకోటను వదలి వెళ్లాలన్న బ్రిటిష్ కంపెనీ ఆజ్ఞలు భారతీయ ముస్లింలకు బాధ కలిగించాయి. డల్హౌసీ అయోధ్యను ఆక్రమించడంతో అనేక మంది ప్రభువులు, అధికారులు, సైనికులు, నిరుద్యోగులయ్యారు. బ్రిటిషర్లు వారికి ఉపాధి కల్పించలేదు. జమీందార్లు, తాలుక్‌దార్ల భూములను బ్రిటిషర్లు ఆక్రమించారు. ఇది అయోధ్యలో అన్ని వర్గాల ప్రజలకు అసంతృప్తి కలిగించింది. సంస్థానాధీశుల కొలువు నుంచి బ్రిటిషర్లు సైనికులను తొలగించారు. దీంతో వారు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడే అవకాశం కోసం ఎదురు చూశారు.

ఆర్థిక కారణాలు

ప్రజల్లో బ్రిటిష్ పరిపాలన పట్ల వ్యతిరేకతకు వారు అనుసరించిన ఆర్థిక దోపిడీ విధానమే ప్రధాన కారణం. బ్రిటిషర్లు తమ దేశ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి భారతదేశ సంపదను కొల్లగొట్టారు. మనదేశం నుంచి ముడి సరకులను ఇంగ్లండ్‌కు చేరవేశారు. ఇక్కడ తయారైన పట్టు, నూలు వస్త్రాలు విదేశాలకు ఎగుమతి చేయకుండా అడ్డుకున్నారు. వాటిపై సుంకాలు విధించారు. దీంతో స్వదేశీ పరిశ్రమలు మూతపడ్డాయి. పేదరికం ప్రబలి, దేశం కరవు కాటకాలకు నిలయమైంది. సాధారణ ప్రజలు తమ పరిస్థితులను మెరుగుపర్చుకొనే ఉద్దేశంతో తిరుగుబాటుదారులతో చేతులు కలిపారు. సంస్థానాలను బ్రిటిషర్లు ఆక్రమించడం అనేక అనర్థాలకు దారితీసింది. రాజుల అధికారం చేజారింది. వారి సైన్యాలు రద్దయ్యాయి. దీంతో సైనికులు జీవనాధారం కోల్పోయారు. బ్రిటిషర్లు మాత్రం ఉన్నత పదవుల్లో నియమితులయ్యారు. విద్యావంతులైన భారతీయులను కూడా ఉన్నతోద్యోగాలకు అర్హులుగా భావించలేదు. ఉన్నత పదవులకు భారతీయులు అనర్హులని బహిరంగంగా బ్రిటిషర్లు చాటి చెప్పారు. వారి ఆర్థిక విధానం భారతీయ రైతాంగాన్ని, చేతిపని వారిని, స్థానిక ప్రభువులను.. అందరినీ కుంగదీసింది.

సాంఘిక కారణాలు

బ్రిటిషర్లు భారతీయులను తక్కువ జాతివారిగా పరిగణించేవారు. సాంఘికంగా భారతీయులంటే వారికి చిన్నచూపు. భారతీయ స్త్రీలను అగౌరవపర్చడం, భౌతిక హింసలకు గురి చేయడం, అవి కొన్నిసార్లు మరణాలకు దారి తీయడం లాంటి సంఘటనలు సర్వసాధారణం. మొదటి తరగతి రైల్వే బోగీల్లో భారతీయులు ప్రయాణించడానికి అనుమతించేవారు కాదు. సాంఘిక సమావేశాల్లో ఆంగ్లేయులతో కలవకుండా భారతీయులను దూరంగా ఉంచేవారు. యూరోపియన్లు నడిపే హోటళ్లు, క్లబ్బుల్లో భారతీయులకు ప్రవేశం లేదు. ఆగ్రాలో మెజిస్ట్రేట్ ప్రకటించిన రెగ్యులేషన్ భారతీయుల పట్ల బ్రిటిషర్ల వైఖరికి అద్దం పట్టింది. ఈ రెగ్యులేషన్ పాటించనందుకు గొప్ప సంస్కర్త అయిన రాజా రామ్మోహన్‌రాయ్ కూడా అవమానానికి గురయ్యాడు. ఈ రకమైన వేధింపులకు గురైన భారతీయులకు చాలా సందర్భాల్లో బ్రిటిష్ న్యాయమూర్తులు న్యాయం చేయలేదు.

మత కారణాలు

బ్రిటిషర్లకు హిందూమతం పట్ల ఉన్న అభిప్రాయం భారతీయుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. భారతీయులను క్రైస్తవంలోకి మార్చడానికి ప్రయత్నిస్తున్నారని భయాందోళనలకు గురయ్యారు. 1813 చార్టర్ చట్టానికి ముందు క్రైస్తవ మిషనరీలను దేశంలోకి అనుమతించేవారు కాదు. 1813 చార్టర్ చట్టంతో ఈ నిబంధన ఎత్తివేశారు. దీంతో అనేక మిషనరీలు భారతదేశానికి రావడం ప్రారంభమైంది. మిషనరీలు దేశంలో, ముఖ్యంగా అనేక వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా సంస్థలను స్థాపించి, విద్యాబోధన చేసేవి. విద్యార్థులను క్రైస్తవ మతంలోకి మార్చడమే వీటి ధ్యేయం. మిషనరీలు స్థాపించిన పాఠశాలల్లో బైబిల్ పఠనం తప్పనిసరి. జైళ్లలో ఉన్న ఖైదీలు క్రైస్తవ మతాన్ని స్వీకరించేలా అనేక విధాలుగా ప్రలోభాలకు గురి చేసేవారు. వారికి క్రైస్తవ గ్రంథాలను బోధించేవారు. క్రైస్తవులుగా మారిన వారిని జైలు నుంచి విడుదల చేసేవారు.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ప్రకారం

1837 కరవు కాటకాల సమయంలో మిషనరీలు అనేక మంది అనాథలను క్రైస్తవ మతంలోకి మార్చాయి. మిషనరీలు క్రైస్తవాన్ని వ్యాప్తి చేయడానికి ధనాన్ని ఆశగా చూపేవి. ఆ మతంలోకి మారిన వారికి ఉద్యోగాలు ఇచ్చి, గౌరవ మర్యాదలు కల్పించారు. ప్రజల్లో అనుమానాలు సృష్టించేలా బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని చట్టాలు చేసింది. ఉపయోగపడే సాంఘిక చట్టాలనూ ప్రజలు అపార్థం చేసుకున్నారు. విలియం బెంటింగ్ 1829లో సతీ సహగమనాన్ని నిషేధించాడు. దీన్ని హిందూ ఉదారవాదులు సమర్థించారు. కానీ సాధారణ ప్రజలు ప్రభుత్వ ఉద్దేశాలను అనుమానించారు. 1832-50 మధ్య కాలంలో ఆస్తి వారసత్వానికి సంబంధించిన చట్టాలను కంపెనీ ప్రవేశపెట్టింది. 1856లో రిలిజియస్ డిజేబిలిటీస్ యాక్ట్, వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టాలతో ప్రభుత్వం తమ సాంఘిక, మత విషయాల్లో జోక్యం చేసుకుంటుందని ప్రజలు భావించారు.

సైనిక కారణాలు

భారతీయ సైనికుల్లో అసంతృప్తికి హిదాయత్ అలీ కింది కారణాలను పేర్కొన్నారు. బెంగాల్ సైన్యంలో ఎక్కువ మంది సైనికులు అయోధ్య ప్రాంతానికి చెందినవారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో అయోధ్యను కలపడంతో వీరు కోపోద్రిక్తులయ్యారు. పంజాబ్‌ను బ్రిటిష్ ఇండియాలో కలిపాక, సైన్యంలో చేరే సిక్కు, ముస్లిం సైనికులకు గడ్డం లేదా జుట్టు తీసివేసే షరతు పెట్టబోమన్నారు. కానీ తర్వాతి కాలంలో జుట్టు తొలగించాలని ఆజ్ఞాపించారు. ధిక్కరించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. బ్రిటిషర్లు 1856 సెప్టెంబర్‌లో ఒక ఆజ్ఞ జారీ చేశారు. దీని ప్రకారం కొత్తగా నియమితులయ్యే సైనికులు ఏ ప్రాంతానికైనా వెళ్లి యుద్ధం చేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. సముద్ర యానం చేస్తే కులభ్రష్టులవుతారనే నమ్మకం హిందువుల్లో ఉండేది. ఇది బ్రిటిషర్ల పట్ల సైనికుల అనుమానాలు బలపడేలా చేసింది.

తక్షణ కారణం

కొవ్వు పూసిన తూటాల వదంతి వ్యాపించింది. ఇది హిందూ, ముస్లిం సైనికుల మనోభావాలను దెబ్బ తీసింది. దాంతో సైనిక కవాతులో పాల్గొనరాదని 1857 ఫిబ్రవరి 20న బరంపూర్‌లోని పదాతిదళం నిర్ణయించింది. 1857 మార్చి 29న 34వ దేశీయ పటాలానికి చెందిన మంగళ్‌పాండే ఆంగ్లేయాధికారిపై కాల్పులు జరిపి తిరుగుబాటుకు అంకురార్పణ చేశాడు. తర్వాత అతడిపై విచారణ జరిపి ఏప్రిల్ 8న బహిరంగంగా ఉరితీశారు. దాన్ని తిరుగుబాటుగా భావించని కంపెనీ పాలకులు అదొక చిన్న సంఘటనగా, కేవలం హైందవ మేధావి వర్గ ఉద్యమమని భావించారు. త్వరలోనే సమసిపోతుందనుకున్నారు.

తిరుగుబాటు విఫలం కావడానికి కారణాలు

సిపాయిలు తిరుగుబాటు చేసే సమయానికి కంపెనీ సైన్యంలో ఏడుగురు సిపాయిలకు ఒక ఆంగ్ల సైనికుడు మాత్రమే ఉన్నాడు. ప్రజలు కూడా సిపాయిలకు మద్దతు ఇచ్చారు. తిరుగుబాటుదారులు విప్లవ ప్రారంభ దశలో ఢిల్లీని వశపర్చుకున్నారు. తర్వాత ఆగ్రా, కలకత్తాల మధ్య ఉన్న ప్రసార సాధనాలను ధ్వంసం చేశారు. తొలి దశలో వారు బ్రిటిషర్లను ఇబ్బందులకు గురి చేసినా, తర్వాత ఆంగ్లేయులు తిరుగుబాటుదార్లను ప్రతిఘటించారు. విప్లవం విఫలం కావడానికి అనేక కారణాలున్నాయి. తిరుగుబాటు కొద్ది ప్రాంతానికే పరిమితం కావడం, యావత్తు దక్షిణ భారతదేశం, పంజాబ్ ఉత్తర ప్రాంతం, పశ్చిమ రాజస్థాన్, గుజరాత్, మధ్యభారతం, బెంగాల్‌లో తిరుగుబాటు ప్రభావం లేదు. ఢిల్లీ, అయోధ్య, బిహార్, రోహిల్‌ఖండ్, దాని పరిసర ప్రాంతాలకే తిరుగుబాటు పరిమితమైంది. అందువల్ల విప్లవాన్ని అణచివేయడం ఆంగ్లేయులకు తేలికైంది. తిరుగుబాటుదారుల కంటే బ్రిటిషర్లకు మెరుగైన వనరులున్నాయి. క్రమేణా బ్రిటిషర్ల సైన్యం పెరిగింది. సుమారు 1.12 లక్షల బ్రిటిష్ సైన్యాన్ని ఇండియాకు తరలించారు. సుమారు 3.10 లక్షల మంది భారతీయులను కొత్తగా సైన్యంలో చేర్చుకున్నారు. తిరుగుబాటుదారులు సంప్రదాయ ఆయుధాలతో యుద్ధం చేస్తే, బ్రిటిష్ సైన్యం కొత్త గా ప్రవేశపెట్టిన రైఫిల్స్‌ను ఉపయోగించింది. టెలిగ్రాఫ్ సదుపాయం ఆంగ్లేయులకు చాలా ఉపయోగకరంగా మారింది. దీని వల్ల సిపాయిల వ్యూహాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలైంది.

అనేక మంది స్వదేశీ రాజులు బ్రిటిషర్లకు సహాయపడ్డారు. పాటియాల, సింధ్, గ్వాలియర్, హైదరాబాద్ మొదలైన సంస్థానాధీశులు ఆంగ్లేయులకు సహాయం చేశారు. నేపాల్ రాజు తన సైన్యాన్ని బ్రిటిషర్ల ఆధీనంలో ఉంచాడు.

తిరుగుబాటుదారుల్లో సమర్థవంతమైన నాయకత్వం కొరవడింది. బహదూర్‌షా వృద్ధుడు, అతడి కుమారులు నిష్ప్రయోజకులు. లక్ష్మీబాయి వీరవనిత అయినప్పటికీ, ఆంగ్లేయులతో పోరాడే శక్తియుక్తులు ఆమెకు లేవు. లారెన్స్, హ్యూరోస్, హల్‌రాక్, నికల్సన్ వంటి సుప్రసిద్ధ సేనానుల సేవలు లభించడంతో ఆంగ్లేయుల విజయం సులభమైంది. తిరుగుబాటుకు ఒక నిర్ణీత పథకం గానీ, నిర్దిష్ట కార్యక్రమం గానీ లేవు. తిరుగుబాటుదారుల ఆశయాలు వేరు, వారిలో ఐకమత్యం లేదు. పీష్వా పదవి కోసం నానాసాహెబ్, దత్తత అంగీకరించకపోవడం వల్ల లక్ష్మీబాయి తిరుగుబాటు చేశారు. తిరుగుబాటుదారుల్లో జాతీయాభిమానం, దేశాభిమానం ఉన్నా వారికి సరైన మార్గదర్శకత్వం లేదు. తిరుగుబాటుదారులంతా ఒకేసారి తిరుగుబాటు చేయలేదు. ఎవరికి వారు ఒంటరిగా పోరాడి ఓడిపోయారు. తిరుగుబాటు ఎక్కువ భాగం కొన్ని నగరాలకు మాత్రమే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తిరుగుబాటులో పాల్గొనలేదు. కాబట్టే ఇది ప్రజల ఉద్యమంగా రూపాంతరం చెందలేదు. బెంగాల్ సైనికులు పౌరుల పట్ల దూకుడు ప్రదర్శించేవారు. వారి ప్రవర్తన సరిగా ఉండేది కాదు. 1857లో ఇంగ్లండ్‌కు అంతర్జాతీయంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. క్రిమియా యుద్ధంలో గెలుపొందడంతో బ్రిటిషర్లకు రష్యా బెడద తొలగిపోయింది. పర్షియాతో యుద్ధం కూడా ముగిసింది. దీంతో బ్రిటన్ తన సైన్యాన్ని భారతదేశానికి మళ్లించగలిగింది. తిరుగుబాటుదారుల్లో వ్యక్తిగత అసూయలు చోటు చేసుకున్నాయి. ఈ అసూయలే తిరుగుబాటు విఫలమయ్యేందుకు దోహదం చేశాయి.

1857 తిరుగుబాటు స్వభావం

సిపాయిల తిరుగుబాటు స్వభావం మీద చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొంత మంది దీన్ని సిపాయిల పితూరీ అని, మరికొందరు క్రైస్తవుల మీద జరిగిన మత యుద్ధమని లేదా తెల్లవారికి, నల్లవారికి మధ్య జరిగిన యుద్ధమని, హిందూ, ముస్లింలు కలిసి బ్రిటిషర్ల మీద పన్నిన కుట్ర అని పేర్కొన్నారు. చాలా మంది ఆధునిక భారత చరిత్రకారులు దీన్ని 'భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం'గా అభివర్ణించారు.

సిపాయిల పితూరీ

సిపాయిలు తరచూ సొంత కారణాలతో తిరుగుబాటు చేయడం వల్ల సర్‌జాన్ లారెన్స్, సర్‌సీలే, స్మిత్, మార్ష్‌మన్ మొదలైన చరిత్రకారులు ఇది కేవలం సైనికుల తిరుగుబాటుగా భావించారు. అందుకే దీన్ని సిపాయిల పితూరీ లేదా సిపాయిల తిరుగుబాటుగా పిలిచారు. కానీ ఇది వాస్తవదూరం. అనేక మంది పౌరశాఖ ఉద్యోగులు, ప్రజలు కూడా తిరుగుబాటులో పాల్గొన్నారు. తిరుగుబాటుకు కేవలం సైనిక కారణాలే కాకుండా అనేక మత, సాంఘిక, ఆర్థిక కారణాలు కూడా దోహదం చేశాయి.

జాతి సంఘర్షణ

కొందరు చరిత్రకారులు ఈ తిరుగుబాటును తెల్లవారికి, నల్లవారికి మధ్య జరిగిన సంఘర్షణ అని అభిప్రాయపడ్డారు. ఈ దృక్పథం సరైంది కాదు. జె.బి. మోడ్లీ ప్రకారం ప్రతి తెల్ల జాతీయుడికి 20 మంది నల్ల జాతి సైనికులు ఉన్నారు. అనేక మంది భారతీయులు ఆంగ్లేయుల తరఫున పోరాడారు. భారతీయులంతా తిరుగుబాటులో పాల్గొనలేదు. టి.ఆర్. హోల్మస్ అనే చరిత్రకారుడు సిపాయిల తిరుగుబాటును 'నాగరికతకు, అనాగరికతకు మధ్య జరిగిన సంఘర్షణ' అని పేర్కొన్నాడు. కానీ ఈ ధోరణి సరికాదని, భారత సంస్కృతి మహోన్నతమైందని విమర్శకులు దీటుగా సమాధానమిచ్చారు.

తిరుగుబాటు ఫలితాలు

1857 తిరుగుబాటు విఫలం కావడంతో భారతదేశ దాస్య శృంఖలాలు మరింత బిగిసిపోయాయి. తిరుగుబాటు ఒక శకాన్ని ముగించి, మరొక శకారంభానికి పునాది వేసిందని చెప్పొచ్చు. సామ్రాజ్య విస్తరణ స్థానంలో ఆర్థిక దోపిడీకి నాంది పలికింది. జాతీయ తత్వాన్ని అలవర్చుకున్న ప్రగతిశీల శక్తుల స్వభావాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు సవాల్‌గా ఎదుర్కోవాల్సి వచ్చింది. తిరుగుబాటు ఫలితంగా కంపెనీ పాలన రద్దయింది. దాని స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రత్యక్ష పాలన ఆరంభమైంది. బ్రిటన్ రాణి విక్టోరియాను భారత సామ్రాజ్ఞిగా ప్రకటించారు. 1858 నవంబర్ 1న వెలువడిన ఈ ప్రకటనను లార్డ్ కానింగ్ అలహాబాద్‌లో చదివారు.

భారతీయ విద్యావిధానానికి మాగ్నా కార్టా ఏది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్

ఉపాధ్యాయ నియామక పరీక్ష రాసే అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర వహించే అంశం విద్యాదృక్పథాలు. ఈ విభాగంలో విద్య చరిత్రాత్మక అంశాలు, సమకాలిన అంశాలు, విద్యా విజ్ఞానానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. విద్యా దృక్పథాలు అనే అంశాన్ని సరళంగా ఎడ్యుకేషనల్ జి.కె.గా పేర్కొంటారు. ఈ విభాగంలో అధిక భారత్వం కలిగి, లోతైన అధ్యయనానికి అవకాశం ఉన్న అంశం విద్యా చరిత్ర. విద్యా చరిత్రలో ఒక కీలక అంశం బ్రిటిష్ విద్యావిధానంలో ముఖ్య అంశాలు, మాదిరి ప్రశ్నలు గురించి తెలుసుకుందాం.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) విద్య అనేది భారతీయులను మేధావులుగా తీర్చిదిద్దేలా ఉండాలి - మెకాలే ప్రతిపాదన
   బి) విద్య అనేది భారతీయులను గుమాస్తాలుగా తయారు చేసేదిగా ఉండాలి - వుడ్స్ ప్రతిపాదన.
   1) ఎ, బి రెండూ సరైనవే
   2) ఎ సరైంది, బి సరికాదు
   3) ఎ సరికాదు, బి సరైంది
   4) ఎ, బి రెండూ సరికావు

2. జతపరచండి.
   జాబితా - I
   i) అబ్జర్వేషన్స్
   ii) స్కూల్ అండ్ స్కూల్ బుక్ సొసైటీ
   iii) పుణె సంస్కృత కళాశాల
   iv) సెయింట్ ఆన్స్ పాఠశాల
   జాబితా - II
   a) కెప్టెన్ కెండీ
   b) ఫ్రాన్సిస్ జేవియర్
   c) ఎల్ఫిన్‌స్టన్
   d) చార్లెస్ గ్రాంట్
   1) i-b, ii-c, iii-d, iv-a
   2) i-d, ii-c, iii-b, iv-a
   3) i-d, ii-c, iii-a, iv-b
   4) i-d, ii-a, iii-c, iv-b

3. కింది వాటిలో సరికానిది ఏది?
   1) మనదేశంలో ఆంగ్ల విద్య ప్రవేశ పెట్టడానికి కారణం - మెకాలే మినట్స్
   2) యుద్ధానంతర విద్యా పథకం - శార్జెంట్ కమిషన్
   3) భారతీయ విద్యకు మాగ్నాకార్టా - వుడ్స్ నివేదిక
   4) తొలి భారతీయ కమిషన్ - హంటర్ కమిషన్

4. కింది వాటిలో వుడ్స్ నివేదికలోని అంశం కానిది ఏది?
   1) ప్రతి రాష్ట్రానికి ప్రజా విద్యా నిర్దేశక శాఖ ఏర్పాటు చేయాలి
   2) కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించాలి
   3) అథోముఖ వడపోత సిద్ధాంతం ద్వారా ఆంగ్ల విద్యను అందించాలి
   4) గ్రాంట్ - ఇన్- ఎయిడ్ విధానాన్ని రూపొందించాలి

5. జతపరచండి.
   జాబితా - I
   i) హలక్ బంధీ పాఠశాలలు
   ii) గాంధీజీ ప్రాతిపదిక విద్య
   iii) తొలి ఉపాధ్యాయ కళాశాల
   జాబితా - II
   a) వార్ధా b) ఆగ్రా
   c) ట్వింక్వీ బార్
   1) i-a, ii-b, iii-c
   2) i-b, ii-a, iii-c
   3) i-b, ii-c, iii-a
   4) i-c, ii-b, iii-a

6. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ప్రాథమిక విద్యావ్యాప్తిని స్థానిక సంస్థలకు అప్పగించాలి - హంటర్ కమిషన్ సూచన
   బి) ప్రజ్ఞ, నైతికత అభివృద్ధి చెందేదిగా విద్య ఉండాలి - వుడ్స్ ప్రతిపాదన
   సి) భారతీయ భాషల మాధ్యమంలోనే విద్యను అందించాలి - మెకాలే మినట్స్‌లో అంశం
   1) ఎ, బి మాత్రమే
   2) ఎ, బి, సి మూడూ సరైనవే
   3) ఎ, బి, సి మూడూ సరికావు
   4) ఎ, సి మాత్రమే

7. జతపరచండి.
   జాబితా - I
   i) వుడ్స్ నివేదిక
   ii) మెకాలే మినట్స్
   iii) హంటర్ కమిషన్
   iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
   జాబితా - II
   a) 1902 b) 1854
   c) 1835 d) 1882
   1) i-b, ii-c, iii-a, iv-d
   2) i-b, ii-c, iii-d, iv-a
   3) i-b, ii-a, iii-c, iv-d
   4) i-b, ii-d, iii-c, iv-a

8. నియామక సంవత్సరాలకు అనుగుణంగా కింది వాటిని అవరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ) శార్జెంట్ కమిషన్ బి) సార్జంట్ కమిటీ
   సి) ఎబాట్‌వుడ్ కమిటీ
   డి) హర్టాగ్ కమిటీ
   1) బి, డి, సి, ఎ 2) బి, డి, ఎ, సి
   3) డి, బి, సి, ఎ 4) బి, సి, డి, ఎ

9. కింది వాటిలో మెకాలే మినట్స్‌తో ఏకీభవించని భావన ఏది?
   1) భారతీయులు రక్తంలో, వర్ణంలో భారతీయులై, ఆలోచనలు, అభిరుచులు, అభిప్రాయాల్లో బ్రిటిషర్లుగా ఉండే విద్యను వారికి అందించాలి
   2) ఇండియా, అరేబియా, ఆసియా దేశాల సాహిత్యం మొత్తం ఇంగ్లిష్ గ్రంథాలయంలో ఒక సొరుగు పుస్తకాలతో కూడా సరితూగదు
   3) చౌక వేతనంతో గుమస్తాలను తయారు చేసేదిగా విద్య ఉండాలి
   4) ఏదీకాదు

10. జతపరచండి.
   జాబితా - I
   i) మెకాలే మినట్స్ ii) వుడ్స్ నివేదిక
   iii) హంటర్ కమిషన్
   iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
   జాబితా - II
   a) డల్హౌసి b) లార్డ్ రిప్పన్
   c) లార్డ్ కర్జన్ d) విలియం బెంటింక్
   1) i-d, ii-a, iii-b, iv-c
   2) i-d, ii-a, iii-c, iv-b
   3) i-d, ii-b, iii-a, iv-c
   4) i-d, ii-c, iii-b, iv-a

11. కింది అంశాలకు సంబంధించిన సంవత్సరాలకు అనుగుణంగా ఆరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ) బేసిక్ విద్యావిధానం
   బి) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
   సి) ప్రాథమిక విద్యకు గోఖలే తీర్మానం
   డి) స్వదేశీ విద్యా ఉద్యమం ప్రారంభం
   1) ఎ, బి, సి, డి 2) డి, సి, బి, ఎ
   3) సి, డి, బి, ఎ 4) బి, డి, సి, ఎ

12. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్‌ను ఎప్పుడు స్థాపించారు?
   1) 1921 2) 1917
   3) 1927 4) 1937

13. జతపరచండి.
   జాబితా - I
   i) శార్జెంట్ కమిషన్ ii) సార్జెంట్ కమిటీ
   iii) హర్టాగ్ కమిటీ
   iv) ఎబాట్‌వుడ్ కమిటీ
   జాబితా - II
   a) 1929 b) 1937
   c) 1917 d) 1944
   1) i-c, ii-d, iii-b, iv-a
   2) i-c, ii-d, iii-a, iv-b
   3) i-c, ii-b, iii-d, iv-a
   4) i-c, ii-a, iii-d, iv-b

14. జాకీర్ హుస్సేన్ కమిటీ దేనికి సంబంధించింది?
   1) వృథా, స్తబ్దతల నివారణ
   2) ప్రాతిపదిక విద్య 3) బాలికా విద్య
   4) వయోజన విద్య

15. కింది వాటిలో సరైన జత ఏది?
   i) భారతీయ విద్యా విధానానికి వుడ్స్ నివేదికను 'మాగ్నాకార్టా'గా అభిప్రాయ పడిన విద్యావేత్త - హెచ్.ఆర్. జేమ్స్
   ii) 6-10 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్న వారు - గోఖలే
   iii) భారతదేశ ఆధునిక విద్యా పితామహుడు - చార్లెస్ గ్రాంట్
   iv) ఆంగ్ల విద్య మాత్రమే నవీన విజ్ఞానానికి తాళంచెవి లాంటిది అని భావించిన వారు - మెకాలే
   1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
   3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు

16. కింది వాటిలో సరైన అంశం ఏది?
   ఎ) కలకత్తా విశ్వవిద్యాలయ సమస్యల పరిష్కారానికి నియమించింది - హర్టాగ్ కమిటీ
   బి) స్వయం పోషకంగా పాఠశాలల అభివృద్ధి చెందాలన్నదే ప్రాతిపదిక విద్య ప్రధాన ఉద్దేశం
   సి) వృథా, స్తబ్దతల నివారణకు నియమించింది - శార్జెంట్ కమిషన్
   డి) వయోజన విద్యా వ్యాప్తికి బ్రిటిషర్లు నియమించింది - ఎబాట్‌వుడ్ కమిటీ
   1) ఎ, బి మాత్రమే
   2) ఎ, బి, సి మాత్రమే
   3) సి మాత్రమే 4) బి మాత్రమే

17. జతపరచండి.
   జాబితా - I
   i) బేసిక్ విద్యావిధానం
   ii) గోఖలే విద్యాతీర్మానం
   iii) విశ్వవిద్యాలయాల చట్టం
   iv) జాతీయ విద్యావిధానం
   జాబితా - II
   a) 1913 b) 1904
   c) 1911 d) 1937
   1) i-d, ii-c, iii-b, iv-a
   2) i-d, ii-c, iii-a, iv-b
   3) i-d, ii-b, iii-c, iv-a
   4) i-d, ii-a, iii-b, iv-c

18. '6-14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి. దానిని 40 ఏళ్లలో అంటే 1984లోగా సాధించాలి' అని సూచించింది?
   1) హర్టాగ్ కమిటీ 2) శార్జెంట్ కమిషన్
   3) సార్జెంట్ ప్లాన్ 4) ఎబాట్‌వుడ్ కమిటీ

19. జతపరచండి.
   జాబితా - I
   i) సార్జెంట్ కమిటీ ii) ఎబాట్‌వుడ్ కమిటీ
   iii) హర్టాగ్ కమిటీ iv) శార్జెంట్ కమిషన్
   జాబితా - II
   a) ఉప కమిటీ
   b) వృత్తి విద్యా కమిటీ
   c) యుద్ధానంతర విద్యా పథకం
   d) విశ్వవిద్యాలయాల సంస్కరణలను సూచించింది
   1) i-c, ii-b, iii-d, iv-a
   2) i-c, ii-d, iii-b, iv-a
   3) i-c, ii-a, iii-d, iv-b
   4) i-c, ii-b, iii-a, iv-d

20. 'ప్రాక్-పశ్చిమ వివాదం' అంటే?
   1) పాశ్చాత్య విజ్ఞానానికి, భారతీయ విజ్ఞానానికి మధ్య వివాదం
   2) భారతీయ భాషలకు, ఇంగ్లిష్‌కు మధ్య వివాదం
   3) భారతీయ సంప్రదాయాలకు, యురోపియన్ సంప్రదాయానికి మధ్య వివాదం
   4) యురోపియన్ సంస్కృతికి, భారతీయ సంస్కృతికి మధ్య వివాదం

21. వివిధ అంశాలు, వాటి సంవత్సరాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) రాష్ట్ర విద్యా నిర్దేశక శాఖలు ఏర్పాటు - 1871
   బి) విశ్వవిద్యాలయాల్లో స్త్రీలకు ప్రవేశం - 1877
   సి) మద్రాస్, కలకత్తా, బొంబాయి విశ్వవిద్యాలయాల స్థాపన - 1857
   1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
   3) ఎ, బి, సి 4) ఎ, సి మాత్రమే

22. కింది వాటిలో సార్జెంట్ కమిటీ సూచన కానిది ఏది?
   1) ఎంప్లాయిమెంట్ బ్యూరోను స్థాపించాలి
   2) విశ్వవిద్యాలయాల విరాళాల కమిటీని ఏర్పాటు చేయాలి
   3) 6-14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి
   4) ఇంటర్మీడియట్‌ను రెండు సంవత్సరాలుగా నిర్వహించాలి

23. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) రాజా రామ్మోహన్‌రాయ్ హిందూ కాలేజీని స్థాపించారు - 1817
   బి) భారతీయుల విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఈస్టిండియా కంపెనీ ఏటా రూ. ఒక లక్ష కేటాయించాలని తీర్మానం - 1813
   సి) లార్డ్ హోర్డింగ్.. ఉద్యోగావకాశాలను కేవలం ఆంగ్ల భాషను అభ్యసించిన భారతీయులకు మాత్రమే ఇవ్వాలని ఆదేశించాడు - 1844
   1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
   3) ఎ, బి, సి 4) ఎ, సి మాత్రమే

24. కింది వారిలో విద్యాసంస్థల్లో తటస్థ మత విధానాన్ని సమర్థించిన వారు?
   ఎ) మెకాలే బి) చార్లెస్ వుడ్స్,
   సి) హంటర్
   1) బి మాత్రమే 2) బి, సి మాత్రమే
   3) ఎ మాత్రమే 4) ఎ, బి, సి

25. కింది వాటిలో హంటర్ కమిషన్ సూచన ఏది?
   1) నిత్యజీవితానికి పనికి వచ్చే భౌతికశాస్త్రం, వ్యవసాయం, క్షేత్ర గణితం లాంటి అంశాలను ప్రాథమిక విద్యాప్రణాళికలో చేర్చాలి
   2) విద్యాలయాల్లో ప్రవేశానికి అన్ని వర్గాల నుంచి ఫీజు వసూలు చేయాలి
   3) ప్రాథమిక పాఠశాలల స్థాపన బాధ్యతను ప్రజలే చేపట్టాలి
   4) ప్రాథమిక విద్యావ్యాప్తిని విశ్వవిద్యాలయాలు చేపట్టాలి

26. 'నిరక్షరాస్యులు, అమాయకులు ఉన్న జాతి సంపూర్ణమైన అభివృద్ధి సాధించ లేదు, పోటీ పడలేదు' అని వ్యాఖ్యానించిన వారు?
   1) హెచ్.ఆర్. జేమ్స్ 2) గోఖలే
   3) హోలెండ్ 4) సార్జెంట్

27. 10 + 2 + 3 విద్యా నమూనాను మొదటిసారిగా సూచించింది?
   1) హర్టాగ్ కమిటీ 2) సార్జెంట్ కమిటీ
   3) ఎబాట్‌వుడ్ కమిటీ
   4) శార్జెంట్ కమిషన్

28. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్ పునరుద్ధరణను సూచించిన కమిటీ ఏది?
   1) హర్టాగ్ కమిటీ 2) సార్జెంట్ కమిటీ
   3) ఎబాట్‌వుడ్ కమిటీ
   4) జాకీర్ హుస్సేన్ కమిటీ


సమాధానాలు

1) 4	2) 3	3) 2	4) 3
5) 2	6) 1	7) 2	8) 4
9) 4	10) 1	11) 4	12) 1
13) 2	14) 2	15) 3	16) 4
17) 1	18) 3	19) 4	20) 1
21) 3	22) 4	23) 3	24) 4
25) 1	26) 2	27) 4	28) 1

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సింకోనా చెట్టు బెరడు నుంచి సంగ్రహించే ఔషధం?

ఔషధాల వాడకానికి సంబంధించి 'సొంత వైద్యం' చాలా ప్రమాదకరమైంది. తప్పనిసరిగా వైద్యుడి సిఫారసు మేరకే మందులు వాడాలి. అంతేకాకుండా వైద్యుడు సూచించిన మోతాదు కంటే అధిక పరిమాణంలో ఔషధాలను వాడితే అవి విషతుల్యమయ్యే ప్రమాదం ఉంటుంది. 'సైడ్ ఎఫెక్ట్'లు కనిష్ట స్థాయిలో ఉండేవిధంగా ఔషధాలను రూపొందిస్తారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

ఔషధాలు (డ్రగ్స్)

మానవులు, జంతువుల్లో జీవక్రియలను ప్రభావితం చేసి, వ్యాధులను నయం చేయడానికి ఉపయోగించే రసాయన కారకాలనే ఔషధాలు అంటారు.సాధారణ పరిభాషలో వీటిని మందులు గానూ వ్యవహరిస్తారు. వ్యాధులను గుర్తించడానికి,నయం చేయడానికే కాకుండా నిరోధించడానికి ఉపయోగించేవాటిని కూడా ఔషధాలుగా పేర్కొంటారు. వ్యాధులు లేదా రోగాల చికిత్సకు రసాయన పదార్థాలను ఉపయోగించే ప్రక్రియను 'కెమోథెరపీ (Chemothe rapy)' అంటారు.

జీవిలోకి ప్రవేశించిన ఔషధాలు జీవాణువులైన కార్బోహైడ్రేట్లు, లిపిడ్‌లు, ప్రోటీన్లు, న్యూక్లియిక్ ఆమ్లాల లాంటి వాటితో చర్య జరుపుతాయి. ఈ జీవాణువులనే లక్ష్య అణువులు (Target Molecules) అంటారు. ఔషధాలు వరణాత్మకంగా (Selective).. అంటే కేవలం ఆశించిన లక్ష్య అణువులతో మాత్రమే చర్యలో పాల్గొంటాయి. ఇతర లక్ష్య అణువులను ప్రభావితం చేయవు. ఇవి ఆశించిన ప్రదేశంలోనే పనిచేస్తాయి.

వివిధ రకాల ఔషధాలు

బాధా నివారిణులు (Analgesics): ఏ విధమైన ఇతర రకాల నరాల వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలను కలిగించకుండా నొప్పిని లేదా బాధను మాత్రమే తగ్గించే ఔషధాలను ఎనాల్జెసిక్‌లు అంటారు. ఇవి రెండు రకాలు.

అవి:

1. నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు: దురలవాట్లకు (Addiction) లోను చేయని ఎనాల్జెసిక్‌లు. వీటినే నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు అంటారు.

ఉదా: ఐబూప్రోఫెన్, ఆస్పిరిన్, పారాసెటమాల్.

- ఎనాల్జెసిక్‌లకు జ్వర తీవ్రతను తగ్గించే గుణం ఉండటం వల్ల యాంటీ పైరెటిక్‌లుగా కూడా పని చేస్తాయి.
- ఆస్పిరిన్ (ఎసిటైల్ సాలిసిలికామ్లం) ప్రోస్టాగ్లాండిన్‌లు (కణజాలాల్లో వచ్చే మంటలు, తద్వారా వచ్చే నొప్పులకు కారణమైనవి) అనే రసాయన పదార్థాల ఉత్పత్తి వేగాన్ని తగ్గించి బాధా నివారిణిగా పనిచేస్తుంది. దీనికి రక్తాన్ని పలచన చేసే గుణం (Blood thinner) కూడా ఉంది. అందు వల్ల ఆస్పిరిన్ రక్తం గడ్డకట్టకుండా చూసి, గుండెపోటు నివారణకు దోహదపడుతుంది.

2. నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు: ఓపియమ్ పాపీ (నల్ల మందు) నుంచి గ్రహించే మార్ఫిన్ రకానికి చెందిన రసాయనాలు దురలవాట్లకు గురి చేసేవి (Addictive)గా ఉంటాయి. సాధారణంగా వీటిని శస్త్ర చికిత్సల అనంతరం కలిగే బాధలు, గుండెకు సంబంధించిన నొప్పి, కేన్సర్‌తో అవసాన దశలో ఉండే రోగికి కలిగే బాధలు, ప్రసవ సమయంలో నొప్పిని తగ్గించడానికి ఉపయోగిస్తారు. వీటిని ఔషధ మోతాదులో సేవిస్తే బాధను తగ్గించి, నిద్రను ప్రోత్సహిస్తాయి. అధిక మొత్తంలో సేవిస్తే మైకం, అపస్మారక స్థితి, మూర్ఛకు దారితీసి చివరికి మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంటుంది.

యాంటీ బయాటిక్‌లు: సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించేవి లేదా వాటిని నాశనం చేసే వాటిని యాంటీబయాటిక్‌లు అంటారు.

ఎరిత్రోమైసిన్, టెట్రాసైక్లిన్, క్లోరాంఫెనికాల్ లాంటివి సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధిస్తాయి. పెన్సిలిన్, ఆఫ్లోక్సాసిన్ మొదలైనవి సూక్ష్మజీవులను నాశనం చేస్తాయి.

ఆమ్ల విరోధులు (Antacids): హైడ్రోక్లోరికామ్లం ఉదరంలో ఆహారం జీర్ణమవడానికి తోడ్పడుతుంది. ఒక వేళ జీర్ణకోశంలో ఈ ఆమ్లం అధికంగా ఉత్పత్తి చెందితే అది ప్రకోపానికి (Irritation) లేదా నొప్పికి దారితీస్తుంది. ఇంకా తీవ్రస్థాయిలో జరిగితే జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. రానిటిడిన్, ఒమిప్రజోల్, పెంటాప్రజోల్ లాంటివి ఈ ఆమ్ల ఉత్పత్తిని నియంత్రిస్తాయి. ఉత్పత్తి అయిన ఆమ్లాన్ని తటస్థీకరించేవి - సోడియం బై కార్బోనేట్ (బేకింగ్ సోడా), మెగ్నీషియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ మొదలైనవి.

యాంటీ సెప్టిక్‌లు (చీము నిరోధులు): గాయాలు, కోతలు, అల్సర్‌లు అయినప్పుడు జీవ కణాలకు పూతగా పూసే పదార్థాలే యాంటీ సెప్టిక్‌లు. యాంటీ బయాటిక్‌ల మాదిరిగా వీటిని నోటితో మింగకూడదు.

ఉదా: అయోడిన్ టింక్చర్, స్పిరిట్ (ఇథైల్ ఆల్కహాల్), ఫినాల్ ద్రావణం, డెట్టాల్ (క్లోరోక్జైలినాల్, టెర్పినియోల్‌ల మిశ్రమం), బిథియోనాల్, క్లోరిన్ జలద్రావణం, అయొడోఫాం.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో నాడీ సంబంధమైన వ్యాధి కానిది?
   1) స్పృహ కోల్పోవడం
   2) మానసిక ఆందోళన
   3) పక్షవాతం
   4) జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు)
2. జీర్ణకోశంలో పెప్సిన్, హైడ్రోక్లోరికామ్లాల ఉత్పత్తిని ప్రేరేపించే రసాయనం?
   1) హిస్టమీన్ 2) రెనిటిడీన్
   3) ఎడ్రినలిన్ 4) మార్ఫిన్
3. అధిక ఆమ్ల వ్యాధి (Acidity) చికిత్సకు ఉపయోగించే ఔషధం?
   1) సిమెటిడిన్ 2) రెనిటిడిన్
   3) ఒమిప్రజోల్ 4) పైవన్నీ
4. కిందివాటిలో ఆమ్ల విరోధిగా పనిచేసేది ఏది?
   1) సోడియం బైకార్బోనేట్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   4) పైవన్నీ
5. చిన్న పిల్లలకు ఆమ్ల విరోధిగా ఉపయోగించే మిల్క్ ఆఫ్ మెగ్నీషియా అనేది?
   1) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) రానిటిడీన్ 4) ఒమీప్రజోల్
6. కిందివాటిలో యాంటీ హిస్టమీన్ ఏది?
   1) వేలియం 2) పారాసిటమాల్
   3) బ్రోమ్‌ఫెనిరమీన్ 4) ఆస్పిరిన్
7. నిద్ర తెప్పించే (హిప్నాటిక్) ఔషధం?
   1) సెరటోనిన్ 2) వేలియం
   3) క్లోరోడయజీపాక్సైడ్ 4) పైవన్నీ
8. కిందివాటిలో నార్కోటిక్ నొప్పి నివారిణి ఏది?
   1) మార్ఫిన్ 2) ఆస్పిరిన్
   3) పారాసెటమాల్ 4) పైవన్నీ
9. కిందివాటిలో ఎనాల్జెసిక్ ఏది?
   1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
   3) ఐబూప్రోఫెన్ 4) పైవన్నీ
10. రక్తాన్ని పలచన చేసే గుణం ఉన్న ఔషధం (Blood thinner) ఏది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) మార్ఫిన్ 4) కొడీన్
11. కెమోథెరపీ అంటే?
    1) కీళ్లు వాచేలా కొట్టడం
    2) ఔషధాలను ఉపయోగించి వ్యాధులు నయం చేయడం
    3) ఫిజియోథెరపీ
    4) యోగా ద్వారా వ్యాధులు నయం చేయడం
12. ఎసిటైల్ సాలిసిలికామ్లం అని దేన్నంటారు?
    1) ఆస్పిరిన్ 2) పారాసెటమాల్
    3) క్లోరోక్విన్ 4) పెన్సిలిన్
13. సింకోనా చెట్టు బెరడు నుంచి సంగ్రహించే ఔషధం?
    1) క్వినైన్ 2) మార్ఫిన్
    3) నికోటిన్ 4) కెఫీన్
14. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
    1) పారాసెటమాల్ అధిక మోతాదులో వాడితే కాలేయం దెబ్బతింటుంది
    2) ఆస్పిరిన్ అధికంగా వాడితే అల్సర్‌లు ఏర్పడతాయి
    3) మిథైల్ సాలిసిలేట్ మూత్రవర్ధకంగా పని చేస్తుంది
    4) పైవన్నీ సరైనవే
15. కిందివాటిలో బాధా నివారిణిగా పనిచేస్తూ జ్వరాన్ని తగ్గించే గుణం ఉన్న ఔషధం కానిది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) కెఫీన్ 4) మార్ఫిన్
16. ఎలర్జీని తగ్గించే గుణం ఉన్న ఔషధాలను ఏమంటారు?
    1) ఎనాల్జెసిక్‌లు 2) ట్రాంక్విలైజర్‌లు
    3) యాంటీ హిస్టమీన్‌లు
    4) యాంటీ బయాటిక్‌లు
17. హెరాయిన్ అనే మత్తుమందును దేన్ని ఎసిటైలేషన్ చేసి రూపొందిస్తారు?
    1) మార్ఫిన్ 2) కెఫీన్
    3) నికోటిన్ 4) సాలిసిలికామ్లం
18. కిందివాటిలో ఆల్కలాయిడ్ కుటుంబానికి చెందని డ్రగ్ ఏది?
    1) మార్ఫిన్ 2) ఆస్పిరిన్
    3) నికోటిన్ 4) కెఫీన్
19. కిందివాటిలో సరికాని జత?
    1) టీ - కెఫీన్ 2) పొగాకు - నికోటిన్
    3) సింకోనా - క్వినైన్
    4) పెన్సిలియం బూజు - క్లోరాంఫెనికాల్
20. కిందివాటిలో సరికాని జత?
    1) పెన్సిలిన్: యాంటీ బయాటిక్
    2) డెట్టాల్: యాంటీ సెప్టిక్
    3) వేలియం: ట్రాంక్విలైజర్
    4) క్లోరోక్విన్: ఎనాల్జెసిక్
21. క్షయ వ్యాధి నివారణకు ఉపయోగించే ఔషధం?
    1) టెట్రాసైక్లిన్ 2) పెన్సిలిన్
    3) క్లోరోక్విన్ 4) స్ట్రెప్టోమైసిన్
22. మలేరియా నివారణకు వాడే ఔషధం?
    1) క్లోరోక్విన్ 2) పెన్సిలిన్
    3) ఆస్పిరిన్ 4) వేలియం
23. మత్తు మందులకు అలవాటు పడిన వారు అవి దొరకకపోతే సేవించేది ఏది?
    1) డెట్టాల్ 2) పురుగులమందు
    3) దగ్గు మందు 4) ఎండ్రిన్
24. కిందివాటిలో గర్భ నిరోధక ఔషధం (యాంటీ ఫెర్టిలిటీ డ్రగ్) ఏది?
    ఎ. నారిథింధ్రోన్
    బి. ఇథైనైల్ ఈస్ట్రాడయోల్
    సి. క్లోరామ్‌ఫెనికాల్
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
25. కిందివాటిలో దోమల నియంత్రణకారి?
    1) డెట్టాల్ 2) పైరిథ్రిన్
    3) ఈథర్ 4) ఆలిటేమ్
26. కిందివాటిలో సరికాని జత ఏది?
    1) కనుపాప విస్ఫారణం: అట్రోపిన్
    2) స్థానిక మత్తు మందు: ఈథర్
    3) గుండె జబ్బు: నైట్రో గ్లిజరిన్
    4) మలేరియా: నికోటిన్
27. పెన్సిలిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
    2) ఖొరానా 3) సాల్వర్‌సన్
    4) సి.వి. రామన్

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 4; 5) 1; 6) 3; 7) 4; 8) 1; 9) 4; 10) 2; 11) 2; 12) 1; 13) 1; 14) 4; 15) 3; 16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 4; 21) 1; 22) 1; 23) 3; 24) 1; 25) 2; 26) 4; 27) 1.

Who is second to the left of A?

MODEL QUESTIONS


Following topics are some of the areas which are expected in the forthcoming SBI POs prelims examination.

1. SYLLOGISMS
2. SEATING ARRANGEMENT
3. PUZZLE TEST

Let us see some examples with solutions:

SYLLOGISMS


1. Statements:
All balls are round.
Some round are plates.
All plates are utensils.
Conclusions:
I. Some utensils being balls is a possibility.
II. Some plates being balls is a possibility.
Solution:




Both the possible conclusions follow as an alternate diagram can be drawn.

SHORT CUT: If all the given statements are affirmative (positive), then every positive possible conclusion is VALID on the given terms. Hence, both the conclusions follow.

2. Statements:
All fans are small.
All small are rats.
All rats are cows.
Conclusions:
I. Some cows are not small.
II. Some cows are not fans.
Solution:






As all the given statements are affirmative, there is a possibility of 'All cows are small' as well as "All cows are fans". Hence, both the conclusions do not follow.

SHORT CUT: If the given statements are positive then every negative definite conclusion is NOT VALID.

3. Statements:
No wall is roof.
All pens are walls.
All doors are roofs.
Conclusions:
I. No any door is wall.
II. No any roof is pen.
Solution:



'No any door is wall' means 'No door is wall'. Similarly, 'No any roof is pen' means 'No roof is pen'. Clearly, both the conclusions are valid and alternate diagram cannot be drawn.

SEATING ARRANGEMENT

A. Study the following information carefully and answer the questions:

A, B, C, D, E, F and G are sitting in straight line facing North.
B sits fourth to the left of A who is second to the left of C. D, who is not an immediate neighbour of A, sits to the immediate right of E. F sits second to the left of G.

4. Which of the following pairs sit at the extreme corners of the line?
   1) BC 2) EC 3) BG
   4) ED 5) None of these

BANK EXAMS
REASONING

5. How many persons sit between D and G?
   1) One 2) Two 3) Three
   4) None 5) None of these
6. Four of the following five are alike in a certain way based on their seating positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
   1) BD 2) EF 3) AC
   4) AD 5) FG

Solution: While solving seating arrangement questions we have to first of all focus on the definite information given. Step wise explanation is given below.

Step1: B sits fourth to the left of A who is second to the left of C.
B _ _ _ A _ C

Step2: D is not an immediate neighbour of A and D sits to the immediate right of E.
B E D _ A _ C

Step3: Now, the process can be completed in the following way
B E D F A G C

Answers: 4) 1 5) 2 6) 4


Explanation: In every option first person is second to the left of second person where as in the fourth option, first person is second to the right of second person (A is second to the right of D)

B. Study the following information carefully and answer the following questions:

There are eight friends A, B, C, D, E, F, G and H are seated in a circle facing the centre but not necessarily in the same order.
D is as far away from A as C is away from E.
AC, DG, HE and FB are seated adjacent to each other. A is also seated adjacent to H. B is second to the right of H and E is third to the right of C.

7. Who is second to the left of A?
   1) B 2) E 3) G
   4) D 5) None of these
8. If B and G interchange their places, who sits to the immediate right of E?
   1) B 2) C 3) G
   4) D 5) None of these
9. If all the persons are made to sit in alphabetical order starting from A in clockwise manner, the positions of how many will remain unchanged, other than A, as compared to the original seating positions
   1) One 2) Two 3) Three
   4) Four 5) None of these

Solution:
Firstly, focus on the definite information.
1. B is second to the right of H.
2. A is adjacent to H as well as C.
3. E is third to the right of C.
As C is third to the left of E, D must be third to the left of A. So, the arrangement can be properly constructed in the following way.



Answers:
7) 3 8) 3 9) 2

Explanation: 'D' and 'H' positions remain unchanged

PUZZLE TEST

Study the following information carefully and answer the following questions:

A, B, C, D, E and F are six persons in an organization who are of different heights. Each one has different colour of pens - black, white, blue, green, red and yellow.
The tallest person does not like blue or white.
The youngest person does not like black or red.
'C' likes yellow and only one person is taller than him.
'A' likes white colour and is taller than E but shorter than F. B likes black and is shorter than A but taller than E. D likes blue and E likes red.

10. How many persons are taller than D?
    1) One 2) Two 3) Three
    4) Four 5) None of these
11. The tallest among them prefers the pen of
    1) Red colour 2) Green colour
    3) White colour
    4) Cannot be determined
    5) None of these
12. Who is taller than only the shortest?
    1) B 2) E 3) D
    4) A 5) None of these

Solution: Let us focus on the definite points first
1. Only one person is taller than C. So, C is 2nd tallest.
2. A is taller than E but shorter than F → **F > A > E.**
3. B is shorter than A but taller than E. → **A > B > E**
4. Considering 2 & 3 → **F > A > B > E**
5. By considering 1 & 4 → **F > C > A > B > E**

Order of heights:
F > C > A > B > E > D

PERSON	COLOUR OF PEN	HEIGHT
A	WHITE	3rd tallest
B	BLACK	4th tallest
C	YELLOW	2nd tallest
D	BLUE	Shortest
E	RED	5th tallest
F	GREEN	Tallest

Answers:
10) 5 (Total 5 persons are taller than D)
11) 2
12) 2 (Taller than only the shortest means 'the person who is 2nd shortest. i.e. E')

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఈసీ లిమిటెడ్‌లో 74 పోస్టులు

రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఆర్ఈసీ)లోని వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 74.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్-08, జనరల్ మేనేజర్-03, చీఫ్ మేనేజర్-04, మేనేజర్-05, అసిస్టెంట్ మేనేజర్-09, ఆఫీసర్-36, డిప్యూటీ మేనేజర్-09.
» **విభాగాలు:** ఇంజనీరింగ్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, హెచ్ఆర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైర్ సేఫ్టీ, కంపెనీ సెక్రటేరియట్, కార్పొరేట్ కమ్యూనికేషన్, లా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, సెక్రటేరియల్, రాజ్‌భాష.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్/ఎల్ఎల్‌బీ, సీఏ/సీఎంఏ/ఎంఏ/ఎంసీఏ/ఎంఎస్సీ, ఎంబీఏ/పీజీ/పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **గరిష్ఠ వయో పరిమితి:** డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు 48 ఏళ్లు, జనరల్ మేనేజర్ పోస్టుకు 52 ఏళ్లు, చీఫ్ మేనేజర్ పోస్టుకు 45 ఏళ్లు, మేనేజర్‌కు 42 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 35 ఏళ్లు, ఆఫీసర్, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 39 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**31.12.2024
» **వెబ్‌సైట్:** https://recindia.nic.in

ఎన్ఏబీఎఫ్ఐడీ, ముంబైలో వివిధ ఉద్యోగాలు

ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్ఏబీఎఫ్ఐడీ).. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **పోస్టుల వివరాలు:** లెండింగ్ ఆపరేషన్స్-01, రిస్క్ మేనేజ్‌మెంట్-01, హ్యూమన్ రిసోర్సెస్-01, ఇంటర్నల్ ఆడిట్-01, కంప్లైన్స్-01, కార్పొరేట్ స్ట్రాటజీ, పార్టనర్‌షిప్-ఎకోసిస్టమ్ డెవలప్‌మెంట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, ఐసీడబ్ల్యూఏ/సీఎఫ్ఏ/సీఎంఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.10.2024 నాటికి 21 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**27.12.2024
» **వెబ్‌సైట్:** https://nabfid.org